

'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 15 | సంచిక: 260

SUNDAY Special | ఆదివారం 11-12-2022



మొ'రాకింగ్'

14 లో

ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన మొరాకో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. దోహాలో శనివారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో మొరాకో 1-0 గోల్ తేడాతో రొనాల్డో కెప్టెన్సీలోని పోర్చుగల్‌పై అద్భుత విజయం సాధించింది. ఆట 42వ నిమిషంలో యూసుఫ్ ఎన్ నెసిరి హెడర్ షాట్‌తో మొరాకో జట్టుకు గోల్ అందించాడు. 92 ఏళ్ల టోర్నీ చరిత్రలో సెమీస్ చేరిన తొలి ఆఫ్రికా దేశంగా మొరాకో రికార్డు నెలకొల్పింది.

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



హిమాచల్ సీఎంగా సుఖు

హిమాచల్‌ప్రదేశ్ సీఎంగా సుఖ్వందర్‌సింగ్ సుఖు, ఉప ముఖ్యమంత్రిగా ముకేశ్ అగ్నిహోత్రిని కాంగ్రెస్ అధిష్టానం ఎంపిక చేసింది.

వివరాలు 6లో ▸



రేపే భూపేంద్రకు పట్టం

గుజరాత్ ముఖ్యమంత్రిగా భూపేంద్ర పటేల్ వరుసగా రెండోసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

వివరాలు 6లో ▸



'ద్వి'షాన్ కిషన్

బంగ్లాదేశ్‌తో జరిగిన మూడో వన్డేలో ఇషాన్ కిషన్ చెలరేగాడు. 24 ఫోర్లు, 10 సిక్సర్లతో 131 బంతుల్లో 210 పరుగులు చేశాడు.

వివరాలు 14లో ▸

ఆ తీర్మానంతో ఉగ్ర సంస్థలకు లబ్ధి

ఐక్యరాజ్య సమితి ఆంక్షల నుంచి కొన్ని సహాయాలను మినహాయించాలన్న తీర్మానంపై ఓటింగ్‌కు భారత్ దూరంగా ఉంది.

వివరాలు 6లో ▸

ఏది నిజం?

పింఛన్లిచ్చే వారు గూఢచారులట?

- అవ్వాతాతల ఇళ్లకు వెళ్లటం రాజకీయ కార్యకలాపమా?
- వికలాంగులు, అనారోగ్య పీడితుల చెంతకు వెళ్లటం నిఘా పెట్టడమా?
- ఆరోగ్య సర్వేలు చేయటం వ్యక్తిగత గోప్యతకు భంగమా?
- మతిలేని రాతలతో చెలరేగిపోతున్న 'ఈనాడు', రామోజీ
- చంద్రబాబు ఆరోపణలకు మసాలా అద్ది మరీ బ్యానర్ స్టోరీలు.. రాష్ట్రంలో అర్హత ఉండి పథకాలకు దూరమైన వారు ఒక్కరూ లేరు
- వలంటీర్ల ఎంపికలో అర్హతా ప్రమాణాలకే పెద్దపీట

- వివరాలు 4లో

కుండపోత

నెల్లూరు, తిరుపతి జిల్లాలపై మాండూస్ తీవ్ర ప్రభావం

అన్నమయ్య, చిత్తూరు, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల్లో భారీ వర్షాలు

- తీవ్రమైన ఈదురు గాలులు.. విరిగిపడిన చెట్లు
- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు.. పలు ప్రాంతాల్లో రాకపోకలు బంద్.. జలాశయాల నుంచి నీటి విడుదల
- నాయుడుపేటలో ఏకంగా 28 సెంటీమీటర్ల వర్షం
- తిరుపతి, పరిసర ప్రాంతాల్లో మోకాలిలోతు వరద నీటి ప్రవాహం
- శుక్రవారం అర్ధరాత్రి తీరం దాటిన తుపాను
- సోమవారం వరకు వర్షాలు కురిసే అవకాశం
- ముందే అప్రమత్తమైన ప్రభుత్వం.. కొనసాగుతున్న సహాయక చర్యలు
- 33 సహాయక శిబిరాలు.. 708 మంది తరలింపు



చిత్తూరు జిల్లా పెద్ద పాండూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న రాళ్లవాగు

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: మాండూస్ తుపాను రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో తీవ్ర ప్రభావాన్ని చూపింది. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో కుండపోతగా.. అన్నమయ్య, చిత్తూరు, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల్లో భారీగా వర్షం కురుస్తోంది. మిగతా జిల్లాల్లోనూ మోస్తరు వర్షాలు పడుతున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న కుండపోత, భారీ వర్షాలకు ఆయా ప్రాంతాల్లోని పట్టణాలు, గ్రామాల్లో వర్షపు నీరు మోకాలి లోతున ప్రవహిస్తోంది. పలు ప్రాంతాల్లో చెట్లు

మిగతా 2వ పేజీలో ▶

తమిళనాట భారీ వర్షాలు

2 లో

ఎవరికీ ఏ ఇబ్బంది రాకూడదు

- తుపాన్‌పై సమీక్షలో అధికారులకు సీఎం వైఎస్ జగన్ ఆదేశం
- నిరంతరం అప్రమత్తంగా ఉంటూ తగిన చర్యలు తీసుకోండి
- అవసరమైన చోటల్లా పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయండి
- ఆయా ప్రాంతాల్లో పర్యటించండి: కలెక్టర్లకు సీఎస్ ఆదేశం

2లో

టీచర్ల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

- విద్యాశాఖ ఉత్తర్వులు
- రేపటి నుంచి బదిలీల ప్రక్రియ ప్రారంభం.. జనవరి 12న టీచర్లకు బదిలీ ఉత్తర్వులు
- హెచ్‌ఎంలకు ఐదేళ్లు, టీచర్లకు ఎనిమిదేళ్ల గరిష్ట సర్వీసు ఉంటే తప్పనిసరిగా బదిలీ
- బదిలీల దరఖాస్తుకు సర్వీసు నిబంధన లేదు
- జీఓలో విధివిధానాలు పొందుపరిచిన విద్యా శాఖ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న బదిలీల ప్రక్రియకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ శనివారం ఈ మేరకు జీఓ-187ను విడుదల చేశారు. ఈనెల 12 నుంచి బదిలీల ప్రక్రియ ప్రారంభం కానుంది. వివిధ దశల అనంతరం 2023 జనవరి 12న టీచర్లకు

మిగతా 3వ పేజీలో ▶

ఏపీ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

సీఎం వైఎస్ జగన్ ఉన్నత లక్ష్యాలతో పేదలకు ఎంతో మేలు

- రూ.16 వేల కోట్లతో వైద్య ఆరోగ్య రంగం బలోపేతం
- ఏపీలో ప్రతి 2 వేల జనాభాకు ఒక హెల్త్ క్లినిక్
- దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో 'ఫ్యామిలీ ఫిజిషియన్'
- ఆరోగ్యశ్రీతో నిజమైన హెల్త్ కవరేజీ సాధించాం
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రుల చర్చాగోష్టిలో మంత్రి రజిని
- కేంద్రం ప్రకటించిన 3 ప్రతిష్టాత్మక అవార్డుల్లో రెండు ఏపీకే..
- తొలిరోజు టెలీ కన్సల్టేషన్ అంశంలో అవార్డు అందుకున్న మంత్రి

- వివరాలు 2లో



కేంద్రమంత్రి మాండవీయ నుంచి అవార్డు అందుకుంటున్న మంత్రి రజిని, వైద్య శాఖ అధికారి కృష్ణబాబు

క్లుప్తంగా...

15న గోదావరి బోర్డు భేటీ

- అనుమతి లేని ప్రాజెక్టుల డీపీఆర్‌లపై సమీక్ష
- పెద్దవాగు ఆధునికీకరణ పనులపై చర్చ

సాక్షి, అమరావతి : అనుమతి లేని ప్రాజెక్టుల డీపీఆర్‌లను సమీక్షించడం, పెద్దవాగు ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు చేపట్టడమే అజెండాగా 15న గోదావరి బోర్డు సమావేశమవుతోంది. బోర్డు చైర్మన్ ఎమ్కే సిన్హా అధ్యక్షతన జరిగే ఈ భేటీలో రెండు రాష్ట్రాల జలవనరుల శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారు. గోదావరి బోర్డు పరిధిని నిర్దేశిస్తూ కేంద్ర జల్ శక్తి శాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌లో అనుమతి లేని ప్రాజెక్టులుగా గుర్తించిన ప్రాజెక్టుల సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లపై చర్చిస్తారు. రెండు రాష్ట్రాలు ఆమోదించిన ప్రాజెక్టుల డీపీఆర్‌లను సీడబ్ల్యూసీ(కేంద్ర జలసంఘం)కు బోర్డు పంపనుంది. వాటిని పరిశీలించి.. ఆ ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అనుమతి ఇవ్వనుంది. ఏకైక ఉమ్మడి ప్రాజెక్టు అయిన పెద్దవాగు ఆధునికీకరణ పనులు చేపట్టడానికి ఇప్పటికే రెండు రాష్ట్రాలు అంగీకరించిన నేపథ్యంలో.. ఆ పనులకు అయ్యే వ్యయంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.

నేడు, రేపు మోస్తరు వర్షాలు

సాక్షి, విశాఖపట్నం, అమరావతి : మాండూస్ తుపాన్ ప్రభావం వల్ల ఆది, సోమవారాల్లో ఉత్తర కోస్తాంధ్రలో ఒకట్రెండు చోట్ల, దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో కొన్ని చోట్ల తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శనివారం రాత్రి తెలిపింది. ఈ తుపాను శనివారం వేకువజామున తమిళనాడులోని మహాబలిపురం (మామల్లాపురం) సమీపంలో తీరం దాటడంతో రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఊరట కలిగింది. రాగల 48 గంటల్లో పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలకు ఆస్కారం ఉందని ఐఎండీ పేర్కొంది.

వరి కోతలు వాయిదా వేసుకోండి

తుపాను కారణంగా రాష్ట్రంలో వరి కోతలను రెండు మూడు రోజులు వాయిదా వేసుకోవాలని ప్రభుత్వం రైతులకు సూచిస్తోంది. ఇప్పటికే కుప్పలు నూర్చిన ధాన్యం తడవకుండా చర్యలు తీసుకుంటున్నామని, జిల్లాలో జాయింట్ కలెక్టర్లు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పరిస్థితులు సమీక్షిస్తున్నట్లు సివిల్ సప్లై కమిషనర్ హెచ్ అరుణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ పరిస్థితులను రైతులకు ఎప్పటికప్పుడు తెలియచేస్తున్నామని, నూర్చిన ధాన్యం తడవకుండా టార్పాలిన్‌తో రక్షణ కల్పించుకున్నారని తెలిపారు. ఇప్పటి వరకు ఆరబోసిన ధాన్యానికి నష్టం జరిగినట్లు జిల్లాల నుంచి ఎటువంటి సమాచారం రాలేదన్నారు. శనివారం 27,000 టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించామని తెలిపారు.

ఏపీ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆలోచనల ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో వైద్య రంగం అద్భుత ప్రగతి సాధించిందని ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా, భవిష్యత్‌లోనూ సాధ్యం కాదనేలా విప్లవాత్మక మార్పులు తెచ్చారని అన్నారు. ఆయన ఉన్నత లక్ష్యాలు పేదలకు ఎంతో మేలు చేస్తున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో యూనివర్సల్ హెల్త్ కవరేజీ డే వేడుకలను శనివారం వారణాసిలో ప్రారంభించారు. కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, పలు రాష్ట్రాల ఆరోగ్య శాఖ మంత్రులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూడు అంశాల్లో రాష్ట్రాలకు కేంద్రం అవార్డులు ప్రకటించగా రెండింటిని ఏపీ సాధించింది. వేడుకల్లో భాగంగా 'ప్రధాన మంత్రి అయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్-15వ ఆర్థిక సంఘం నిధులు' అంశంపై జరిగిన మంత్రుల చర్చా గోష్టిలో విడల రజిని ప్రసంగించారు. ఏపీలో వైద్య ఆరోగ్య రంగంలో అమలు చేస్తున్న సంస్కరణలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కేవలం మూడు విభాగాల్లో అవార్డులు ప్రకటించగా.., ఏకంగా రెండింటిని ఏపీ సాధించడం సీఎం వైఎస్ జగన్ చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. ఏపీ ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఎంతో కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో మెడికల్ కళాశాలల నిర్మాణం, క్యాన్సర్, కిడ్నీ వ్యాధికి చికిత్స అందించే విషయంలో కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని ఆకాంక్షించారు.

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రుల చర్చాగోష్టిలో మంత్రి రజిని



చర్చా గోష్టిలో ఏపీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రజిని, కేంద్ర మంత్రి మాండవీయ తదితరులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాయకత్వంలో ఏపీలో వైద్య, ఆరోగ్య రంగం అభివృద్ధికి రూ.16 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి 5 వేల మందికి ఒక సబ్ సెంటర్ ఉండాలని చెబితే, ఏపీలో ప్రతి 2 వేల జనాభాకు ఒక హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. గ్రామీణ వైద్య విభాగం బలోపేతానికి 10,032 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటి ద్వారా 14 రకాల వైద్య పరీక్షలు, 67 రకాల మందులను ప్రభుత్వమే గ్రామీణులకు ఉచితంగా అందిస్తోందన్నారు. టెలీ మెడిసిన్ ద్వారా పేదలకు ఉచితంగా స్పెషలిస్టు వైద్య సేవలను అందిస్తోందని, రోజూ 60 వేల కాల్స్ వస్తున్నాయని తెలిపారు. దేశ చరిత్రలో తొలిసారిగా ఫ్యామిలీ ఫిజిషియన్ విధానాన్ని రాష్ట్రంలో తెచ్చామని చెప్పారు. దీని ద్వారా గ్రామీణులకు స్థానికంగానే ఉచితంగా ఓపీ సేవలు, వైద్య పరీక్షలు, మందులు అందుతున్నాయని వివరించారు. ప్రాథమిక ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసేందుకు రూ.2,750 కోట్లు, సెకండరీ వైద్య విభాగానికి రూ.1,223 కోట్లు, టెర్షియరీ వైద్య విభాగం మెరుగుకు రూ.12,500 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు వివరించారు. 2007లోనే అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతిష్టాత్మకంగా ఆరోగ్యశ్రీ పథకాన్ని తెచ్చారని, సీఎం వైఎస్ జగన్ ఈ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ పథకం ద్వారా నిజమైన హెల్త్ కవరేజిని ఏపీ సాధించిందని తెలిపారు. ఆరోగ్య శ్రీ ద్వారా 3,255 చికిత్సలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం ఏపీనే అని చెప్పారు. నేడు అదే పథకాన్ని అన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కూడా ఆయుష్మాన్ భారత్- ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన పేరుతో అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఆరోగ్య ఆసరా పథకం ద్వారా ఆరోగ్యశ్రీలో వైద్యం చేయించుకున్న రోగులు కోలుకునే సమయంలో రోజుకు రూ.225 నుంచి నెలకు రూ.5 వేల వరకు సీఎం వైఎస్ జగన్ ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగంలోనే క్యాన్సర్‌కు ఆధునిక వైద్యం అందించేందుకు రూ.400 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు.

వైద్య రంగంలో ఏపీకి రెండు ప్రతిష్టాత్మక అవార్డులు

వైద్య రంగంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మూడు ప్రతిష్టాత్మక అవార్డుల్లో రెండు ఆంధ్రప్రదేశ్‌కే వచ్చాయి. టెలీ కన్సల్టేషన్, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల అంశాల్లో ఏపీ అవార్డులు పొందింది. శనివారం వారణాసిలో జరిగిన యూనివర్సల్ హెల్త్ కవరేజీ డే వేడుకల్లో కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ చేతుల మీదుగా టెలీ కన్సల్టేషన్ విభాగంలో వచ్చిన పురస్కారాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు అందుకున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల అంశానికి వచ్చిన మరో అవార్డును ఏపీ ప్రభుత్వం ఆదివారం అందుకోనుంది.

తమిళనాట భారీ వర్షాలు

- వణుకుతున్న చెన్నై, చెంగల్పట్టు, తిరువళ్లూరు, కాంచీపురం, విల్లుపురం జిల్లాలు
- విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు.. ఆరుగురి మృతి
- ప్రభావిత ప్రాంతాల్లో సీఎం స్టాలిన్ పర్యటన

సాక్షి, చెన్నై: మాండూస్ తుపాన్ తమిళనాడుపై తీవ్ర ప్రభావం చూపించింది. శుక్రవారం అర్ధరాత్రి 11.30 గంటల సమయంలో మహాబలిపురం వద్ద ఈ తుపాన్ తీరాన్ని తాకింది. ఈ సమయంలో చెన్నై, చెంగల్పట్టు, తిరువళ్లూరు, కాంచీపురం, విల్లుపురం జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఇతర జిల్లాల్లోనూ మోస్తరు వర్షం పడింది. 70 నుంచి 80 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచాయి. పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చెన్నై, నాగపట్నం, మైలాడుతురై ఫిషింగ్ హార్బర్‌లో 150 పడవలు ధ్వంసమయ్యాయి. పదుల సంఖ్యలో కార్లు, మోటారు సైకిళ్లు, ఆటోలపై చెట్లు విరిగిపడ్డాయి. ఈదురు గాలుల ధాటికి విద్యుత్ తీగలు తెగిపడి వేర్వేరు చోట్ల ఆరుగురు మరణించారు. శనివారం ఉదయం తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం స్టాలిన్, పలువురు మంత్రులు పర్యటించారు. తాము చేపట్టిన ముందస్తు చర్యల వల్ల చెన్నై శివారు ప్రాంతాల్లో పెను నష్టం ఎదురు కాలేదని సీఎం పేర్కొన్నారు. ఏ మేరకు నష్టం వాటిల్లిందో పూర్తి సమాచారం అందాక.. కేంద్రం సాయం కోరుతామన్నారు. బాధితులు అందరినీ ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కాగా, వర్షం తగ్గుముఖం పట్టిన ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం చేశారు.

సముద్రంలో చిక్కుకున్న మత్స్యకారులు క్షేమం

- 13 మందినీ రక్షించిన మెరైన్, సివిల్ ఎన్డీఆర్ఎఫ్, కోస్టుగార్డు సిబ్బంది

చీరాల టౌన్/సింగరాయకొండ: చీరాల మండలం వాడరేవు ప్రాంతం నుంచి వేటకు వెళ్లిన 13 మంది మత్స్యకారులు సముద్రంలో చిక్కుకుపోయారు.వీరిని మెరైన్, సివిల్ పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్, కోస్టుగార్డులు ప్రాణాలతో కాపాడి తీరానికి తీసుకొచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. వాడరేవు ప్రాంతానికి చెందిన 13 మంది మత్స్యకారులు రెండు బృందాలుగా వేటకు వెళ్లారు. రామాపురం గ్రామానికి చెందిన ఏడుగురు ఈ నెల నాలుగో తేదీ వేకువజామున సముద్రంలో వేటకు వెళ్లారు. మెరుగ ప్రసాద్ (బోటు డ్రైవర్), దాసరి పల్ప్‌జీ, కుక్కల రమేష్, గరికిన కృష్ణ, మెరుగ శివ, బంగిన మల్లి, మడత పోలు బోటులో శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లావైపు వెళ్లారు.ఈ లోగా తుఫాన్ హెచ్చరికలు చేయడంతో వారు స్వగ్రామానికి వెనుదిరిగారు. అలల ఉధృతి , సముద్రం అల్లకల్లోలంగా మారి సముద్రంలోనే ఇరుక్కుపోయారు. ఊళ్లపాలెం వద్ద లంగరు వేసి మెరైన్ హెల్ప్‌లైన్‌కు వారు మెసేజ్ పంపారు. కొత్తపట్నం మెరైన్, ఎన్డీఆర్ఎఫ్



గల్లంతైన మత్స్యకారులు.. చిత్రంలో డీఎల్‌పీవో వెంకటరావు తదితరులు

సిబ్బంది, నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలోని కోస్టు గార్డులు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్ఐ మహ్మద్ ఫిరోజ్ ఫాతిమా, రామాయపట్నం మెరైన్ సీఐ,సిబ్బంది విడివిడిగా సముద్రంలోకి వెళ్లారు. మత్స్యకారులు లంగరు వేసిన ఊళ్లపాలెం వద్దకు వెళ్లి వారిని రక్షించారు.

మరో ఆరుగురు క్షేమంగా ఇంటికి..

వాడరేవుకు చెందిన మరో ఆరుగురు మత్స్యకారులు గరికిన తాతారావు, గరికిన కృష్ణ, ఎం.మహేష్, జగన్నాధం, కోటయ్య, శివ శ్రీనుల బృందం బోటులో కొత్తపట్నం వైపు వేటకు వెళ్లారు. శనివారం ఉదయం పెదగంజాం సమీపానికి వచ్చేసరికి వీరి బోటు ఇంజన్ మరమ్మతులకు గురైంది. వారు తమ కుటుంబ సభ్యులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన డీఎల్‌పీవో వెంకటరావు, తహసీల్దార్ ప్రభాకరరావు, పంచాయతీ సెక్రటరీ చక్రవర్తి వాడరేవు నుంచి రెండు బోట్లలో మత్స్యకారులను చినగంజాం వైపు పంపించారు. వారిని వాడరేవుకు తీసుకొచ్చారు.

ఎవరికీ ఏ ఇబ్బంది రాకూడదు

- తుపాన్‌పై సమీక్షలో అధికారులకు సీఎం వైఎస్ జగన్ ఆదేశం



సాక్షి, అమరావతి : తుపాను ప్రభావిత, భారీ వర్ష సూచన ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. అక్కడి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. మాండూస్ తుపాను పరిస్థితులపై శనివారం ఉదయం ఆయన అధికారులతో సమీక్షించారు. వివిధ జిల్లాల్లో తుపాను ప్రభావం గురించి అధికారులు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయాలని, ప్రజలకు అన్ని రకాలుగా అండగా ఉండాలని చెప్పారు. కాగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్ రెడ్డి తుపాన్ పరిస్థితిపై తన క్యాంపు కార్యాలయం నుంచి సంబంధిత శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు శని, ఆదివారాలు.. రెండు రోజుల పాటు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలని ఆదేశించారు. వర్షపు నీరు తగ్గిన వెంటనే పంట నష్టం అంచనాలు చేపట్టాలని సూచించారు. తిరుపతిలో వర్షపు నీరు త్వరితగతిన దిగువకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో వెంటనే శానిటేషన్ పనులు చేపట్టాలని సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డా.పూనం మాలకొండయ్య కలెక్టర్లను ఆదేశించారు. తుపాన్ పరిస్థితిపై ఎప్పటికప్పుడు జిల్లాల కలెక్టర్లతో మాట్లాడుతూ, తగిన ఆదేశాలు ఇస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ తెలిపారు. అన్నమయ్య, చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, వైఎస్సార్ కడప జిల్లాల్లోని 109 ప్రాంతాల్లో గత 24 గంటల్లో సగటున 64.5 మిల్లీ మీటర్ల కంటే అధికంగా వర్షపాతం నమోదైందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సంచాలకులు డా.బీఆర్.అంబేద్కర్ చెప్పారు.

కుండపోత

▶ మొదటి పేజీ తరువాయి

విరిగిపడ్డాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. తిరుపతి, తిరుమలలో జనజీవనం స్తంభించింది. తిరుపతి జిల్లాలో నాయుడుపేట, బాలాయపల్లె, ఓజిలి, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, తిరుపతి, వాకాడు, చిల్లకూరు, నెల్లూరు జిల్లాలో ముత్తుకూరు, ఆత్మకూరు, కలువోయ, అనంతసాగరం, మర్రిపాడు, అనుమసముద్రంపేట, మనుబోలు, ముత్తుకూరు, వెంకటాచలం, తదితర ప్రాంతాల్లో జనం పూర్తిగా ఇళ్లకే పరిమితమయ్యారు. తుపాను ప్రభావంతో రాష్ట్రమంతటా చలి గాలులు వీస్తున్నాయి. భారీ వర్షాలకు ఇంటి గోడ కూలి వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో కే పద్మావతి అనే మహిళ మృతి చెందింది.

సురక్షిత ప్రాంతాలకు తరలింపు

ఆరు జిల్లాల్లోని 32 మండలాల్లో తుపాను తీవ్ర ప్రభావం చూపింది. ఈ జిల్లాల్లో ప్రమాదకరమైన లోతట్టు ప్రాంతాల నుంచి అధికార యంత్రాంగం 708 మందిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వర్షాల తీవ్రత ఎక్కువగా ఉన్న నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో 33 సహాయక శిబిరాలు ఏర్పాటు చేశారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి పూర్తి స్థాయిలో ఆహారపు ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్లు అందించారు. ఆయా జిల్లాల్లో 4 ఎస్డీఆర్ఎఫ్, 5 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో చిక్కుకుపోయిన వారిని సురక్షిత ప్రాంతాలకు చేర్చడంలో ఈ బృందాలు చురుగ్గా పని చేస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో కండలేరు, మానేరు, స్వర్ణముఖి నదులకు ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందనే హెచ్చరికలతో ప్రభుత్వం అప్రమత్తమైంది. నదీ తీర ప్రాంతాల్లో ముందస్తు సహాయక చర్యలు చేపట్టింది.

వాయుగుండంగా బలహీనపడిన తుపాను

మాండూస్ తుపాను శుక్రవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో తమిళనాడులోని మహబలిపురం సమీపంలో తీరం దాటింది. ఆ తర్వాత తమిళనాడులోని వెల్లూరు వైపు కదులుతూ తీవ్ర వాయుగుండంగా, శనివారం సాయంత్రానికి వాయుగుండంగా బలహీన పడింది. రాబోయే కొద్ది గంటల్లో ఇది క్రమేపీ బలహీనపడి అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. తుపాను తీరం దాటిన తర్వాత దాని ప్రభావంతో మన రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆది, సోమవారాల్లో కూడా పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. చలి గాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని పేర్కొంది.

శుక్రవారం ఉ.8.30 గంటల నుంచి శనివారం ఉ.8.30 వరకు వర్షపాతం

ప్రదేశం	సెంటీమీటర్లలో
నాయుడుపేట, తిరుపతి జిల్లా	28.1
హస్తకావేరి, తిరుపతి జిల్లా	24.1
కట్టవపల్లె, నెల్లూరు జిల్లా	23.8
అరిమనిపాడు, తిరుపతి జిల్లా	23.4
బ్రహ్మదేవం, నెల్లూరు జిల్లా	22.2
వెంకటాచలం, నెల్లూరు జిల్లా	21.5
శ్రీకాళహస్తి, తిరుపతి జిల్లా	21.3
పాలూరు, నెల్లూరు జిల్లా	21.2
విద్యానగర్, తిరుపతి జిల్లా	21
తొట్టంబేడు, తిరుపతి జిల్లా	20.9

శనివారం ఉ.8.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు నమోదైన వర్షపాతం

ప్రదేశం	సెంటీమీటర్లలో
భట్టేపాడు, నెల్లూరు జిల్లా	13.3
బల్లిపల్లి, ప్రకాశం జిల్లా	11.9
పెదచెర్లోపల్లి, ప్రకాశం జిల్లా	11.6
టీపినపి, నెల్లూరు జిల్లా	11.1
మోపిదేవి, కృష్ణా జిల్లా	9.4
ఆత్మకూరు, నెల్లూరు జిల్లా	8.9
రేవూరు, నెల్లూరు జిల్లా	8.8
వాసిలి, నెల్లూరు జిల్లా	8.8
మర్రిపాడు, నెల్లూరు జిల్లా	8.4
పాకల, ప్రకాశం జిల్లా	8.2

తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో స్తంభించిన రాకపోకలు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. జలాశయాలకు భారీగా నీరు చేరుతుండటంతో గేట్లు ఎత్తి నీటిని వదిలారు. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తిరుపతి నగరంలో లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. తిరుమలను పొగ మంచు



నారాయణవనం మండలంలో తిరువట్యం ప్రాజెక్ట్ మొరువ పారుతున్న అరుణానది



చెన్నైలో కూలిన భారీ వృక్షాన్ని తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చుట్టుముట్టింది. ఘాట్ రోడ్డులో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాకపోకలు స్తంభించాయి. అలిపిరి వద్ద భారీ ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. శ్రీవారిమెట్టు కాలినడక మార్గాన్ని అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. తిరుపతి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు భూమన కరుణాకర రెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కేవీబీ పురం మండల పరిధిలోని కాళంగి రిజర్వాయర్ పూర్తిగా నిండిపోవటంతో 16 గేట్లు ఎత్తి నీటిని విడిచిపెట్టారు. ఫలితంగా 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద ప్రవాహానికి పూడి, పోలినాయుడు కండ్రిగ, రాజులకండ్రిగ కాజ్‌వేలు కొట్టుకుపోయాయి. పిచ్చాటూరు పరిధిలోని అరణియార్ రిజర్వాయర్, పెనుమూరు మండల పరిధిలోని ఎన్టీఆర్ జలాశయానికి భారీగా నీరు చేరుతుండటంతో గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. స్వర్ణముఖి, కుశస్థలి, నీవా, అరుణానది, కై వల్యా, కాళంగి, బహుదా, కౌండిన్య, గార్గేయ నదులు, గొడ్డేరు వాగు, పాములకాలువ, నేరేడు కాలువ, ఉప్పుటేరు, అలపలేరు వాగు, బడబళ్ల వాగు, ఏటి చెరువు, పెద్దేరు పొంగి ప్రవహిస్తుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తుపాను తీవ్రతకు జిల్లాలో పది పశువులు మృతి చెందాయి. వందకుపైగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

రైల్వేకోడూరు–తిరుపతి రహదారిపైకి వరద నీరు

అన్నమయ్య జిల్లాలోని రైల్వేకోడూరు, పుల్లంపేట మండలాల పరిధిలో సుమారు 20 గ్రామాలకుపైగా రాకపోకలు స్తంభించాయి. అరటి, బొప్పాయి తోటల్లోకి నీరు చేరింది. రైల్వేకోడూరు–తిరుపతి ప్రధాన రహదారిపై వరద నీరు పోటెత్తింది. నిమ్మనపల్లె వద్ద ఉన్న బాహుదా ప్రాజెక్టుతోపాటు గాలివీడు పరిధిలోని వెలిగల్లు ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో గేట్లు ఎత్తి దిగువకు రెండు ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. వైఎస్సార్ జిల్లాలోనూ పలు చోట్ల పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం డ్యామ్‌కు 4 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మైలవరం డ్యామ్ నుంచి 3 వేల క్యూసెక్కులను పెన్నానదిలోకి వదిలారు. చిత్రవతి రిజర్వాయర్ నుంచి 2 గేట్లు ఎత్తి 2400 క్యూసెక్కుల నీటికి నదిలోకి వదులుతున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వ్యాప్తంగా ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది. అత్యధికంగా మనుబోలు మండలంలో 277 మి.మీ. వర్షం కురిసింది. బొగ్గేరు, పైడేరు, ఆల్పుర్తి, బీరాపేరులో నీటి ప్రవాహం పెరిగింది. సోమశిల ప్రాజెక్టుకు వరద నీరు పెద్ద ఎత్తున చేరుతోంది. దీంతో 35 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పలు ప్రాంతాల్లో పొలా నీట మునిగాయి. నెల్లూరులోని ఆర్టీసీ కాలనీ, వైఎస్సార్ నగర్, బుచ్చిరెడ్డిపాలెం తదితర ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది.

ప్రకాశం జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం పడుతోంది. ఐదు మండలాల పరిధిలో 57 గ్రామాల్లోని పొలాల్లో నీరు నిలిచింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదైంది. జడివానకు తోడు ఈదురు గాలులు జనాన్ని వణికించాయి. పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు లాంటి శుభాకార్యాలు ఎక్కువగా ఉండటంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. కాగా, రబీ సాగుకు ఈ వర్షాలు ఊరటనిస్తాయని చెబుతున్నారు.

రవాణాకు ఇబ్బంది కలగనివ్వం

మాండూస్ తుపాను వల్ల వివిధ జిల్లాల్లో పంచాయతీరాజ్ రోడ్లకు జరిగిన నష్టానికి సంబంధించిన వివరాలను ఎప్పడికప్పుడు తెలియజేయాలని పీఆర్ ఇంజనీర్ ఇన్ చీఫ్ బాలునాయక్ ఆదేశించారు. శనివారం కర్నూలు వచ్చిన ఆయన స్థానిక జెడ్పీ ప్రాంగణంలోని పీఆర్ ఎస్ఈ కార్యాలయం నుంచి చిత్తూరు, తిరుపతి, వైఎస్సార్, అన్నమయ్య, ప్రకాశం, నెల్లూరు, కృష్ణా, గుంటూరు జిల్లాల ఎస్ఈలతో వెబెక్సాన్ఫరెన్స్ నిర్వహించారు. రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో ప్రజల రవాణా సౌకర్యానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. తుపాను తగ్గిన అనంతరం జరిగిన నష్టానికి సంబంధించి పూర్తి స్థాయి నివేదికలను పంపాలన్నారు.

ఏ ఒక్క రైతునూ నష్టపోనివ్వం: మంత్రి కారుమూరి



తణుకు అర్బన్: మాండూస్ తుపాను కారణంగా పంట తడిసినా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైతాంగానికి ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని తక్షణమే ఆఫ్‌లైన్ ద్వారా సేకరిస్తామని స్పష్టం చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ప్రతి గింజనూ సత్వరమే కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని సిద్ధం చేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇప్పటికే రైతాంగానికి అనుకూలంగా అధికారులకు ఆదేశాలిచ్చారని చెప్పారు. ఏ ఒక్క రైతూ నష్టపోకుండా చూడాలనే తపనతో తమ ప్రభుత్వం ఉందని తెలిపారు.

ముందు జాగ్రత్తతో తగ్గిన నష్టం తీవ్రత

మాండూస్ తుపాను అల్పపీడనంగా బలహీన పడినా, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ముందస్తుగా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి ఎప్పటికప్పుడు ఆయా ప్రాంతాల్లో పరిస్థితిపై ఆరా తీస్తున్నాం. సంబంధిత జిల్లాల కలెక్టర్లకు తగిన సూచనలు ఇస్తున్నాం. అధికార యంత్రాంగం 24 గంటలు పని చేస్తూ సత్వరమే స్పందించేలా ఏర్పాట్లు చేశాం. ప్రమాదాలను స్పష్టంగా అంచనా వేస్తూ.. అందుకనుగుణంగా చర్యలు తీసుకుంటున్నాం. అందువల్లే నష్ట తీవ్రతను బాగా తగ్గించ గలిగాం. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులను వెనక్కి పిలిపించాం.

– జి సాయిప్రసాద్, రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి









పొగ మంచు కమ్మేసిన తిరుమల శ్రీవారి ఆలయ ప్రాంగణం, నెల్లూరు సండే మార్కెట్ వీధిలో మోకాలు లోతు నీరు, వెంకటగిరిలో మగ్గంగుంతలోకి నీరు చేరడంతో ఎత్తిపోస్తున్న నేత కార్మికురాలు, తిరుపతి పట్టణ శివారు ఓ ఇంట్లోకి వర్షం నీళ్లు చేరడంతో బాధితురాలిని ఓదారుస్తున్న ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డి

క్లుప్తంగా...

గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి 'నాసిన్'కు నీరు

టెండర్లను ఆహ్వానించిన ఏపీఐఐసీ

సాక్షి, అమరావతి: ఆలిండియా రెవెన్యూ సర్వీసెస్(ఐఆర్ఎస్) ఉద్యోగుల శిక్షణ కోసం శ్రీ సత్యసాయి జిల్లా పాలసముద్రం వద్ద చేపట్టిన నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్, నార్కోటిక్స్ (నాసిన్) నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. దీనికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి 35 కి.మీ. మేర పైప్‌లైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంకుల ద్వారా నాసిన్‌కు నీటిని తరలించనున్నారు. ఇందుకోసం రూ.10.33 కోట్ల విలువైన పనులకు ఏపీఐఐసీ టెండర్లను ఆహ్వానించింది. ఆసక్తిగల సంస్థలు ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోపు టెండర్లను దాఖలు చేయాల్సి ఉంటుంది. టెండర్‌ను దక్కించుకున్న సంస్థ తొమ్మిది నెలల్లోగా పనులు పూర్తిచేసి నాసిన్‌కు నీటి సరఫరా చేయాల్సి ఉంటుంది. సుమారు రూ.750 కోట్ల వ్యయంతో చేపట్టిన నాసిన్ నిర్మాణాన్ని వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2024 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభించనున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ ప్రాజెక్టును.. కేంద్రం ఉమ్మడి అనంతపురం జిల్లాకు కేటాయిస్తే గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసి వదిలేసింది. వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూ సేకరణతోపాటు అన్ని రకాల అనుమతులు తీసుకొచ్చి నిర్మాణ పనులను ప్రారంభించింది.

వ్యవసాయ రంగ వృద్ధిలో రికార్డులు సృష్టించా

టీడీపీ అధినేత చంద్రబాబు



సాక్షి, అమరావతి: తన హయాంలో వ్యవసాయ రంగ వృద్ధిలో రికార్డులు సృష్టించిన రాష్ట్రంలో ఇప్పుడు రైతుల ఆత్మహత్యలు పెరగడం ఆందోళనకరమని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మూడేళ్లలో 1,673 మంది రైతుల ఆత్మహత్యలతో రాష్ట్రం సూసైడ్స్ స్టేట్‌గా మారిపోయిందని విమర్శించారు. మద్దతు ధర లేకపోవడం, సబ్సిడీలు నిలిచిపోవడం వంటివి బలవన్మరణాలకు కారణమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ టెర్రరిజంతో ప్రజలపై వేధింపులు ఎక్కువయ్యాయని, నిస్పృహకు గురైన సామాన్యులు పెద్ద సంఖ్యలో ప్రాణాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులపై నోరెత్తకుండా మళ్లీ సమైక్య రాష్ట్రమంటూ ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని చంద్రబాబు విమర్శించారు.

విభజనలో ఏపీకి నష్టం వాస్తవమే: ఎంపీ జీవీఎల్

సాక్షి, అమరావతి/కొరిటెపాడు (గుంటూరు): విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్యాయం జరిగిన మాట వాస్తవమేనని బీజేపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు చెప్పారు. ఆయన శనివారం విజయవాడలో విలేకరులతో మాట్లాడుతూ తొలి నుంచి బీజేపీ రెండు రాష్ట్రాల విధానానికి కట్టుబడి ఉందని, ఇప్పుడు సమైక్య రాష్ట్రమంటూ వైసీపీ చెప్పడం వెనుక పెద్ద వ్యూహం దాగి ఉందన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో ఓడిపోతామనే సజ్జల కొత్త అంశాన్ని తెరమీదకు తీసుకువస్తున్నారని ఆరోపించారు. రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు లోపల ఒకరికొకరు సహకరించుకుంటున్నారని, ప్రజల విషయం వచ్చే సరికి డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. ప్రాంతీయ పార్టీల వల్ల రాష్ట్రాలకు పెట్టుబడులు రావడం లేదన్నారు. జాతీయ పార్టీల వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారనడానికి గుజరాత్ ఎన్నికలే నిదర్శనమన్నారు. బీజేపీ కొత్త పొత్తుల కోసం ప్రయత్నించడం లేదని, జనసేనతోనే పొత్తు ఉందని, కలిసి వెళుతున్నామని జీవీఎల్ చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ సంస్థాగతంగా బలోపేతం చేయడంపై దృష్టి పెట్టామని తెలిపారు.


ఎంపీ జీవీఎల్‌కు చేదు అనుభవం.. కాలితో తన్నిన గోవు



ఎంపీ జీవీఎల్ నరసింహారావుపై కాలు జాడిస్తున్న గోమాత

ఎంపీ జీవీఎల్ నరసింహారావుకు చేదు అనుభవం ఎదురైంది. గుంటూరు మిర్చి యార్డు ఆవరణలో మిరప ఎగుమతిదారుల సంఘ కార్యాలయ ప్రారంభోత్సవానికి శనివారం ఎంపీ జీవీఎల్ వచ్చారు. ఈ క్రమంలో ఆయన ముందుగా యార్డు ఆవరణలోని శ్రీ వరసిద్ధి వినాయక ఆలయంలో మార్కెట్ యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, యార్డు ప్రత్యేక కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, అసోసియేషన్ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోశాలకు వెళ్లారు. గోశాలలో ఓ గోవుని వెనుక వైపు నుంచి తాకి నమస్కరించేందుకు వెళ్లగా, అది కాలితో తన్నింది. అయితే, జీవీఎల్ వెంటనే అప్రమత్తమై పక్కకు తప్పుకోవడంతో గోవు కాలు తగిలినా ఎలాంటి గాయం కాకుండా తప్పించుకోగలిగారు. గోవుని సముదాయించిన నిర్వాహకులు జీవీఎల్‌ను మళ్లీ రమ్మని కోరగా ఆయన వద్దులే అంటూ వెళ్లిపోయారు.

బ్రెయిన్‌కూ 'జెండర్' ఉంది



విషయాలను అర్థం చేసుకోడంతోపాటు వివిధ అంశాలపై ప్రతిస్పందించే తీరులో మెదడుకూ లింగ భేదం (బ్రెయిన్ జెండర్) ఉందని తేలింది. విభిన్న రంగాలను, విషయాలను అర్థం చేసుకునే విషయంలో 'జెండర్' ప్రధాన అంశంగా ఉన్నట్టుగానే.. తాజాగా జరిగిన మెదడు అధ్యయనంపై కూడా 'జెండర్' ప్రధాన భూమిక పోషిస్తోందని తెలుస్తోంది. మెదడుకు సంబంధించిన పూర్తి విషయాలు ఇప్పటికీ తెలియనప్పటికీ 'జెండర్' కేంద్రంగా జరిగిన తాజా అధ్యయనాలు మాత్రం విచిత్రంగానూ, కొంచెం విభిన్నంగానూ ఉన్నాయి.

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం/ కేజీ రాఘవేంద్రారెడ్డి

మనిషి మెదడు.. ఓ అంతుచిక్కని వ్యవహారం. మనిషి మొత్తం బరువులో కేవలం 2 శాతం బరువు ఉండే మెదడు మనిషి ఉపయోగించే మొత్తం ఆక్సిజన్‌లో ఏకంగా 20 శాతం ఉపయోగించుకుంటుంది. అంటే ఏ స్థాయిలో మెదడు పనిచేస్తుందో ఇది తెలియజేస్తుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. అయితే, ఇప్పటికీ మెదడును ఏ మేరకు అర్థం చేసుకున్నామని అడిగితే.. 'మనం ఇంకా క్రిమికీటకాల మెదడునే అర్థం చేసుకోలేదు' అని అలెన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రెయిన్ సైన్సెస్ చీఫ్ సైంటిస్ట్ క్రిస్టోఫ్ కోచ్ చెబుతున్నారు. వాస్తవానికి మనిషి మెదడులో 86 బిలియన్ సెల్స్ ఉంటాయి. వీటికి 100 ట్రిలియన్ కనెక్షన్లు ఉంటాయని అంచనా. కానీ.. క్రిమికీటకాల మెదడులో కేవలం 302 సెల్స్ ఉంటాయి. అయినా పురుగు మెదడునే ఇంకా అధ్యయనం చేయలేకపోతున్నామని కోచ్ చెబుతున్నారంటే.. మనిషి మెదడును అధ్యయనం చేసేందుకు ఇంకా ఎంత సమయం పడుతుందో ఊహించడానికి కూడా కష్టమే. కాగా, ఇప్పటి వరకు జరిగిన పరిశోధనల్లో తాజాగా నిర్వహించిన పరిశోధన కాస్త విభిన్నంగా సాగింది. ఇది మగ/ఆడ (జెండర్) మెదళ్ల మధ్య వ్యత్యాసాలను తేటతెల్లం చేసింది.

భావోద్వేగ సంబంధాలకే ప్రాధాన్యం

పురుషులతో పోలిస్తే మహిళలు భావోద్వేగ సంబంధాలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తున్నారని మరికొందరు తమ అధ్యయనాల ద్వారా గుర్తించారు. ఇందుకోసం అప్పుడే పుట్టిన పిల్లలు తమ మొదటి 24 గంటల సమయాన్ని ఎవరు దేనికి ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చారో అధ్యయనం చేయడం ద్వారా నిర్ణయానికి వచ్చామని కేంబ్రిడ్జి శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఇందుకోసం మొబైల్ బొమ్మతో పాటు కొద్దిమంది వ్యక్తులను ఎదురుగా ఉంచి.. అప్పుడే పుట్టిన 102 మంది పిల్లలపై కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన సైమన్ బారన్, కోహెన్ శాస్త్రవేత్తలు అధ్యయనం చేశారు. పుట్టిన తర్వాత మొదటి 24 గంటలపాటు ఎంతసేపు మొబైల్ బొమ్మతోను, మనుషులతోను పిల్లలు సమయాన్ని వెచ్చిస్తున్నారో తెలుసుకునేందుకు దీనిని చేపట్టారు. విచిత్రంగా మగపిల్లలు ఎక్కువగా మొబైల్ బొమ్మను చూడటంపైనే దృష్టి కేంద్రీకరించారు. ఆడ పిల్లలు మాత్రం ఎక్కువగా మనుషులవైపే తమ దృష్టిని ఎక్కువ సమయం కేంద్రీకరించడం గమనార్హం. అంటే పుట్టుకతోనే అబ్బాయిలకు వస్తువులపైన, అమ్మాయిలకు బంధాలపై ఎక్కువ అటెన్షన్ ఉంటుందని తేల్చారు. అయితే, కేవలం ఈ ఒక్క అంశం ద్వారానే తుది నిర్ణయానికి రాలేమని మరి కొద్దిమంది శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా జెండర్ అంశం కేంద్రంగా మెదడు అధ్యయనాలు జరగడం ద్వారా కొత్త కొత్త విషయాలు వెలుగులోకి వస్తుండటాన్ని మాత్రం లింగభేదంతో సంబంధం లేకుండా అందరూ ఆహ్వానించాల్సిందే.

పురుషుల్లోనే భయం ఎక్కువ

సహజంగా శారీరక దారుఢ్యం మహిళల కంటే పురుషులకే కాస్త ఎక్కువనేది తిరుగులేని వాస్తవం. ఇందుకు జన్యుపరమైన అంశాలతో పాటు తరతరాలుగా జరిగిన పని విభజన కూడా ఒక కారణంగా చెబుతారు. కానీ.. మెదడు విషయానికి వస్తే శారీరక దారుఢ్యంతోపాటు మెదడు పరిమాణం కూడా స్త్రీలతో పోలిస్తే మగవారిలో కొంచెం ఎక్కువగానే ఉన్నట్టు తేలింది. లైజ్ ఎలియట్, అతని టీం సభ్యులు చేసిన అధ్యయనాల ప్రకారం.. పురుషుల మెదడు స్త్రీల మెదడు కంటే పరిమాణంలో 15 శాతం పెద్దగా ఉంటుందని తేలింది. ఇందుకు అనుగుణంగా అమిగ్డాలా (మనిషి భావోద్వేగంతో ముడిపడిన మెదడులోని ఒక భాగం) కూడా పరిమాణంలో పురుషుల్లోనే ఎక్కువ. పురుషుల్లోని అమిగ్డాలాను స్త్రీలలోని అమిగ్డాలాతో పోల్చి అధ్యయనం చేస్తే పురుషుల్లోనే ఎక్కువ భయం ఉంటుందని వీరి అధ్యయనాల్లో తేలింది.

స్త్రీలలోనే భావోద్వేగాలు అధికం

పురుషులు, మహిళల్లో ఎవరికి ఎక్కువ భావోద్వేగం ఉంటుందనే అంశంపైనా పరిశోధనలు జరిగాయి. జీవితంలో జరిగిన ఏదైనా ఘటన లేదా సామాజికంగా బాగా గుర్తుండిపోయేలా జరిగిన బాధాకరమైన ఘటనలను గుర్తుచేస్తే ఏం జరుగుతుందో పరిశీలించారు. పురుషుల కంటే ఎక్కువగా స్త్రీలకే అటువంటి భావోద్వేగ ఘటనలు గుర్తుకు వస్తున్నాయని తేలింది. పురుషులతో పోలిస్తే ఆ సంఘటన తాలూకు వివరాలను స్త్రీలు వెంటనే గుర్తుతెచ్చుకోవడంతో పాటు పురుషుల కంటే ఎక్కువగా ఆ ఘటనలకు సంబంధించిన విషయాలను కూడా పేర్కొనడాన్ని గమనించారు.

మెదడుపై 'జెండర్' అధ్యయనాల్లో కొన్ని..

జెండర్ కేంద్రంగా ఇప్పటికే వివిధ పరిశోధనలు జరిగాయి. 1991లో మొదలైన ఈ అధ్యయనాలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి.

- మొదటిసారిగా 1991లో అమెరికన్ సైకలాజికల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేసిన డయాన్ హాల్‌పెర్న్ 'సెక్స్ డిఫరెన్సెస్ ఇన్ కాగ్నిటివ్ ఎబిలిటీస్' అనే అంశంపై అధ్యయనం చేసి నివేదిక రూపొందించారు.
- 1995లో స్టాండ్‌ఫర్డ్ ప్రొఫెసర్ నైరోషా... స్త్రీ, పురుషుల మెదళ్లపై అధ్యయనం చేశారు.
- 2017లో జెండర్ కేంద్రంగా పలువురు రాసిన 70 ఆర్టికల్స్‌తో కూడిన 'జర్నల్ ఆఫ్ న్యూరోసైన్స్ రీసెర్చ్' ప్రత్యేక సంచికను ప్రొఫెసర్ లారి కాహిల్ వెలువరించారు.
- 2021లో బ్రిటన్‌లో 40 సంవత్సరాల వయసు పైబడిన 5 లక్షల మందికి చెందిన జెనటిక్, హెల్త్ డేటాపై ఆస్టన్ యూనివర్సిటీకి చెందిన గినా రిప్పన్ అనే న్యూరో బయాలజిస్టు అధ్యయనం చేశారు.

ఏకలవ్య జాతీయ క్రీడా పోటీలకు

చురుగ్గా ఏర్పాట్లు

- 22 రాష్ట్రాలు.. 22 ఈవెంట్లు
- అండర్–14, అండర్–19 కేటగిరీల్లో పోటీలు
- పాల్గొననున్న 4,500 మంది క్రీడాకారులు

సాక్షి, అమరావతి: విజయవాడ, గుంటూరు నగరాల్లో డిసెంబర్ 17 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల జాతీయ క్రీడా పోటీలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ పోటీలకు 22 రాష్ట్రాల నుంచి దాదాపు 4,500 క్రీడాకారులు హాజరవుతున్నారు. మొత్తం 22 క్రీడాంశాల్లో పోటీలు జరగబోతున్నాయి. వాటిలో 15 వ్యక్తిగత, 7 టీమ్ గేమ్స్ ఉండగా.. ఆయా ఈవెంట్లలో అండర్–14, అండర్–19 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించనున్నారు. పోటీలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. క్రీడాకారులు, అధికారులు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సీఎం ఆదేశాలతో ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర ఈ మెగా ఈవెంట్ నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ముస్తాబవుతున్న స్టేడియాలు

దేశంలోని గిరిజన విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించే విధంగా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ నేషనల్ గేమ్స్ నిర్వహిస్తున్నారు. ఈ పోటీలు నిర్వహించేందుకు వివిధ రాష్ట్రాలు ముందుకురాగా ఆంధ్రప్రదేశ్‌కే అవకాశం దక్కింది. పోటీలకు ప్రధాన వేదికలైన గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, విజయవాడలోని ఆంధ్రా లయోలా కాలేజీలో క్రీడా మైదానాలు సిద్ధమవుతున్నాయి. ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్‌తో పాటు హ్యాండ్‌బాల్, చెస్ వంటి క్రీడలకు నాగార్జున యూనివర్సిటీ ఆతిథ్యమిస్తుండగా.. హాకీ, ఫుట్ బాల్, బాక్సింగ్, జూడో, తైక్వాండో వంటి క్రీడలకు విజయవాడలోని లయోలా కళాశాల వేదిక కానుంది. టెన్నిస్ పోటీలకు ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం, స్విమ్మింగ్‌కు విజయవాడ గాంధీనగర్‌లోని వీఎంసీ జింఖానా స్విమ్మింగ్ పూల్, బ్యాడ్మింటన్‌కు విజయవాడ పటమటలోని సీహెచ్ఆర్‌కే ఇండోర్ స్టేడియం ఆతిథ్యమిస్తున్నాయి. ఏఎన్‌యూ, లయోలా కళాశాలల్లో విద్యార్థుల వసతి కోసం హాస్టళ్లను సిద్ధం చేస్తున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే క్రీడాకారులు, అధికారులు, సిబ్బందికి భోజన ఏర్పాట్లు కూడా సాగుతున్నాయి. గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ కుమారి. జాహ్నవి మేడిద, జీసీసీ ఎండీ సురేష్, ట్రైకార్ ఎండీ ఇ.రవీంద్రబాబు, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎస్.శ్రీనివాసరావు ఏర్పాట్లు చేస్తున్నారు.

టీచర్ల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్



▶ మొదటి పేజీ తరువాయి

బదిలీ ఉత్తర్వులు విడుదలవుతాయి. 2021–2022 విద్యా సంవత్సరం నాటికి ఒకే పాఠశాలలో ఐదేళ్ల సర్వీసును పూర్తిచేసిన ప్రధానోపాధ్యాయులు (గ్రేడ్–2) ఎనిమిది విద్యా సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన టీచర్లకు తప్పనిసరిగా బదిలీ ఉంటుంది.

విధివిధానాల్లోని ముఖ్యాంశాలు..

- 2024 ఆగస్టు 31 లేదా అంతకు రెండేళ్లలోపు పదవీ విరమణ చేయబోయే వారిని వారు కోరుకుంటే తప్ప బదిలీ చేయరు.
- బదిలీ దరఖాస్తుకు ఎలాంటి సర్వీసు నిబంధన లేదు.
- 2022 ఆగస్టు 31 నాటికి 50 ఏళ్లలోపు వయసున్న బాలికల హైస్కూల్లోని పురుష హెచ్ఎం టీచర్లకు బదిలీ తప్పనిసరి.
- బాలికల ఉన్నత పాఠశాలల్లో పనిచేయడానికి మహిళా ప్రధానోపాధ్యాయులు (గ్రేడ్–2), ఉపాధ్యాయులు అందుబాటులో లేకుంటే 50 ఏళ్లు దాటిన పురుష హెచ్ఎంలు, టీచర్లను పరిగణనలోకి తీసుకుంటారు.
- విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాలి.
- దృష్టిలోపం ఉన్న ఉపాధ్యాయులకు బదిలీల నుంచి మినహాయింపు ఉంది. 80 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న ఆర్థోపెడికల్లీ ఛాలెంజ్డ్ టీచర్లకు కూడా బదిలీల నుండి మినహాయింపు ఉంది. అయితే, అటువంటి ఉపాధ్యాయులు బదిలీని కోరుకుంటే దరఖాస్తు చేసుకోవచ్చు.
- పేరెంట్ మేనేజ్‌మెంట్‌కి వెళ్లాలని కోరుకునే వారు ఆ మేనేజ్‌మెంట్‌లో అందుబాటులో ఉన్న ఖాళీలకు మాత్రమే బదిలీని ఎంచుకోవాలి.
- ఏజెన్సీ మైదాన ప్రాంతాల వారికి బదిలీ అవకాశం ఉంటుంది. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు భర్తీకాకపోతే ఇతర ప్రాంతంలోని జూనియర్ మోస్ట్ మిగులు టీచర్లను బదిలీ కౌన్సెలింగ్ తర్వాత తాత్కాలికంగా నియమిస్తారు.

ఆన్‌లైన్‌లో బదిలీల కౌన్సెలింగ్

బదిలీలు ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా మాత్రమే జరుగుతాయి. గతంలో ఉన్న పాత జిల్లాలను జిల్లాగా పరిగణించాలి. ప్రతి జిల్లా, జోన్‌లో ఏర్పాటుచేసిన కమిటీల ఆమోదంతో విద్యాశాఖ బదిలీ ఉత్తర్వులు జారీచేస్తుంది. హెచ్ఎం, టీచర్ల వెబ్ ఆప్షన్ల ఆధారంగా బదిలీ పోస్టింగ్ ఆర్డర్లను జారీచేస్తారు. బదిలీల కోసం పాయింట్లను గణించేందుకు కమిటీ నివాసాల జాబితాను కొత్తగా ప్రకటిస్తుంది. మెరిట్, సర్వీసు, ప్రత్యేక పాయింట్ల కేటాయింపు, మినహాయింపు వంటి అంశాలను జీఓలో వివరంగా పొందుపరిచారు. అంతేకాక.. 2022 నవంబర్ 30 నాటికి అన్ని ఖాళీలను కౌన్సెలింగ్‌లోకి తీసుకుంటారు. నిర్బంధ బదిలీల కారణంగా ఏర్పడే అన్ని ఖాళీలు, కౌన్సెలింగ్ సమయంలో అయ్యే ఖాళీల్లోకి బదిలీలు ఉంటాయి. అడహక్ ప్రాతిపదికన పదోన్నతిపై కేటాయించిన హెచ్ఎంలు, టీచర్ల స్థానాలు ఖాళీగా చూపిస్తారు. ఏడాదికి పైగా అధికారికంగా లేదా అనధికారికంగా రాని వారి స్థానాలు ఖాళీలుగా పరిగణిస్తారు. ప్రసూతి సెలవులు, వైద్య సెలవులు లేదా సస్పెన్షన్‌లో ఉన్న వారి ఖాళీలను కౌన్సెలింగ్‌లో చూపించరు. నాలుగు వారాలకు మించి ఖాళీగా ఉంటే పని సర్దుబాటు ద్వారా వాటిని భర్తీచేయాలి. పూర్వపు జిల్లాల్లో మంజూరు పోస్టుల్లో భర్తీ అయినవి కాకుండా మిగిలిన పోస్టులను బ్లాక్ చేయాలని ఆదేశించారు. ఖాళీలు, సీనియారిటీ జాబితాలను కౌన్సెలింగ్ వెబ్‌సైట్‌లో సంబంధిత జిల్లాల వెబ్‌సైట్‌లో కూడా పొందుపరుస్తారు.

వెబ్ కౌన్సెలింగ్‌కు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు..

- ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నిర్దేశిత వెబ్‌సైట్ ద్వారా బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఇలా అందిన దరఖాస్తులను మాత్రమే బదిలీకి పరిగణిస్తారు.
- ఆన్‌లైన్ సమర్పించాక దరఖాస్తుదారులు నిర్దిష్ట వెబ్‌సైట్ నుండి అప్లికేషన్ ప్రింట్‌ను తీసుకోవాలి.
- వాటిపై సంతకంచేసి మండల విద్యాధికారి, హైస్కూల్ హెడ్‌మాస్టర్, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్‌లకు అందజేయాలి.
- దరఖాస్తుల స్వీకరణ తర్వాత, సంబంధిత అధికారులు తాత్కాలిక సీనియారిటీ జాబితాలను ప్రదర్శించాలి.
- అభ్యంతరాలుంటే వాటిని స్వీకరించాలి. అవి పరిష్కరించిన తర్వాత, అధికార వెబ్‌సైట్‌లో తుది సీనియారిటీని ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్లతో చూపించాలి.
- తప్పనిసరిగా బదిలీ అయ్యేవారు అన్ని ఆప్షన్లను ఎంచుకోవాలి. ఇలాంటి హెచ్ఎం, టీచర్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోకపోతే 3, 4 కేటగిరీల్లోని పాఠశాలల్లో ఉన్న ఖాళీలకు బదిలీచేస్తారు.
- దరఖాస్తు చేసి ఆపై వారికి సమర్పించకపోతే, క్రమశిక్షణా చర్యలు తీసుకుంటారు. ఆన్‌లైన్‌లో రూపొందించిన తుది జాబితాల ఆధారంగా సంబంధిత కమిటీల ఆమోదంతో బదిలీ ఉత్తర్వులు జారీ అవుతాయి.

తప్పుడు సమాచారమిస్తే చర్యలు

ఇక కమిటీ ఆమోదంతో బదిలీ ఉత్తర్వులు జారీచేసిన తర్వాత, కమిటీ కాంపిటెంట్ అథారిటీ ఆర్డర్లను సమీక్షించడం, సవరించడానికి వీల్లేదు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల ఫలితాలకు లోబడి ఉత్తర్వుల్లో షరతును చేర్చాలి. బదిలీ ఆర్డర్లు అందిన తర్వాత ప్రస్తుతం పనిచేస్తున్న ప్రదేశం నుండి తక్షణమే రిలీవ్ అవుతారు. తదుపరి తేదీన వారు కొత్త పాఠశాలలో చేరాలి. పాఠశాలలో ఒకే ఉపాధ్యాయుడు (సబ్జెక్ట్ టీచర్లతో సహా) పనిచేస్తూ బదిలీని పొందినట్లయితే, ప్రత్యామ్నాయం లేకుండా రిలీవ్ చేయరాదు. అలాగే, ఇతర స్థానాల విషయంలో కూడా ప్రత్యామ్నాయం తర్వాతే రిలీవ్ చేస్తారు. తప్పుడు సమాచారమిచ్చి, మార్గదర్శకాలు ఉల్లంఘిస్తే ప్రాసిక్యూషన్‌తో పాటు క్రమశిక్షణా చర్యలు తప్పవు. తప్పుడు సమాచారంపై సంతకం చేసిన హెచ్ఎం ఇతర అధికారులపైనా ఇవే చర్యలు ఉంటాయి. బదిలీ ఉత్తర్వులు అందిన అనంతరం ఎటువంటి ఆలస్యం లేకుండా పోస్టింగ్ స్థానంలో చేరాలి. అనధికారికంగా గైర్హాజరైతే మార్గదర్శకాల ప్రకారం క్రమశిక్షణా చర్యతో పాటు 'నో వర్క్ నో పే' నిబంధన వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బదిలీల షెడ్యూల్ ఇలా..

- ఖాళీల వివరాలు వెబ్‌సైట్‌లో ప్రదర్శన: డిసెంబర్ 12, 13
- బదిలీలకు దరఖాస్తు: డిసెంబర్ 14 నుండి 17 వరకు
- దరఖాస్తుల వెరిఫికేషన్: డిసెంబర్ 18, 19
- సీనియారిటీ జాబితాల ప్రదర్శన, అభ్యంతరాల అప్‌లోడ్: డిసెంబర్ 20 నుండి 22 వరకు
- అభ్యంతరాల పరిశీలన, ఫైనల్ చేయడం: డిసెంబర్ 23, 24
- ఫైనల్ సీనియారిటీ జాబితాల ప్రదర్శన: డిసెంబర్ 26
- వెబ్‌ఆప్షన్లు: డిసెంబర్ 27 నుండి జనవరి 1 వరకు
- బదిలీ కోరుకున్న వారికి పాఠశాలల కేటాయింపు: జనవరి 2 నుండి 10 వరకు
- కేటాయింపులో తేడాలుంటే అభ్యంతరాలు: జనవరి 11
- బదిలీ ఉత్తర్వులు డౌన్‌లోడ్ చేసుకోవడం: జనవరి 12

మూడో విడత టిడ్కో ఇళ్ల పంపిణీకి ఏర్పాట్లు

- వచ్చే వారం నుంచి లబ్ధిదారులకు 8,864 యూనిట్లు అందజేత
- షెడ్యూలు సిద్ధంచేస్తున్న అధికారులు
- రూ.1కే కేటాయించే 300 చ.అడుగుల ఇళ్లు 4,432
- మిగిలినవి 365, 430 చదరపు అడుగుల యూనిట్లు
- ఇప్పటికే 41,088 ఇళ్ల పంపిణీ పూర్తి



సాక్షి, అమరావతి: పట్టణ పేదలకు కేటాయించిన టిడ్కో ఇళ్ల మూడో విడత పంపిణీ కార్యక్రమానికి అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. ఈ మేరకు టిడ్కో ఉన్నతాధికారులు వివిధ పట్టణ స్థానిక సంస్థల పరిధిలో నిర్మాణంలో ఉన్న జీ+3 అపార్ట్‌మెంట్ల నిర్మాణ ప్రగతిని సమీక్షించారు. ఆరు మున్సిపాలిటీల పరిధిలో 8,864 యూనిట్లు అన్ని వసతులతో సిద్ధంగా ఉన్నాయని గుర్తించారు. వాటిని వచ్చేవారం నుంచి లబ్ధిదారులకు అందించాలని నిర్ణయించారు. ఇప్పటికే రెండు దశల్లో మొత్తం 41,088 యూనిట్లను అందజేయగా, ఇప్పుడు తాజాగా మరో 8,864 యూనిట్లు అందించనున్నారు. ఇందులో అమలాపురంలో 1,632 యూనిట్లు, రామచంద్రాపురంలో 1,088, శ్రీకాకుళం మున్సిపాలిటీలోని పాత్రునివలసలో 1,280 ఇళ్లు, చిలకలూరిపేటలో 2,512, పొన్నూరులో 1,008, గుంటూరు కార్పొరేషన్ పరిధిలోని అడవి తక్కెళ్లపాడులో 1,344 యూనిట్లు అందించనున్నారు. మూడో విడతలో పంపిణీ చేసే యూనిట్లలో పట్టణ నిరుపేదలకు ప్రభుత్వం రూ.1కే కేటాయించిన 300 చ.అడుగుల ఇళ్లు 4,432 ఉన్నాయి. ఇంకా 365 చ.అడుగుల విస్తీర్ణంగల ఇళ్లు 1,152 ఉండగా, 430 చ.అడుగుల విస్తీర్ణంలో 3,280 యూనిట్లు అందించనున్నారు.

రెండు విడతల్లో 41 వేల యూనిట్ల పంపిణీ

ఈ ఏడాది జూన్ 23న విజయనగరంలో ఇళ్ల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు రెండు విడతల్లో 41,088 యూనిట్లను పంపిణీ చేశారు. దాంతో ఎంతోకాలంగా సొంతిల్లు కోసం ఎదురుచూసిన పట్టణ ప్రాంత పేద, దిగువ మధ్య తరగతి ప్రజలకు అన్ని వసతులతో ఇల్లు లభించడంతో వారు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. అలాగే, టిడ్కో ఇళ్లను ఎప్పటికప్పుడు అందించాలని, నిర్మాణాలు పూర్తిచేసుకున్న చోట అన్ని వసతులు కల్పించి వెంటనే లబ్ధిదారులకు ఇవ్వాలని గతంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. దీంతో మొత్తం 88 పట్టణ స్థానిక సంస్థల్లో నిర్మాణం చేపట్టిన జీ+3 అపార్ట్‌మెంట్లలో మౌలిక వసతులు కల్పించిన వెంటనే లబ్ధిదారుల పేరిట ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి పంపిణీ చేస్తున్నారు. పంపిణీ ప్రాంగణంలోనే ఫ్లాట్ తాళాలతో పాటు, రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తుండడం విశేషం.

పంపిణీ చేయనున్న ప్రాంతాలు, ఇళ్లు

అమలాపురం 1,632	రామచంద్రాపురం 1,088
పాత్రునివలస 1,280	చిలకలూరిపేట 2,512
పొన్నూరు 1,008	అడవి తక్కెళ్లపాడు 1,344

ఏపీకి వచ్చిన తెలంగాణ వారికి స్థానికత పొడిగింపు

- మరో మూడేళ్లు పొడిగిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వుల్లో సవరణ
- ఉద్యోగ, విద్యా రంగాల్లో స్థానికత వర్తింపు

సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజన నేపథ్యంలో తెలంగాణ నుంచి తరలివచ్చి ఏపీలో స్థిర నివాసముంటున్న వారికి విద్య, ఉద్యోగాలకు సంబంధించి మరో మూడేళ్ల పాటు స్థానికత కల్పించేందుకు గత ఉత్తర్వుల్లో సవరణలు చేస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదేశాలు జారీచేశారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ నుంచి ఏపీకి తరలి వచ్చిన వారికి విద్య, ఉద్యోగాలకు సంబంధించి ఏడేళ్ల పాటు స్థానికత కల్పిస్తూ 2014లో రాష్ట్రపతి ఆదేశాలు జారీ చేశారు. ఆ ఏడేళ్ల గడువు ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం మరో మూడేళ్లు పొడిగించాల్సిందిగా విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి ఉత్తర్వుల్లో ఏడేళ్లకు బదులు పదేళ్లుగా సవరణలు చేస్తూ శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. విద్యా సంస్థల్లో ప్రవేశాలకు 1974 నాటి రాష్ట్రపతి ఉత్తర్వుల్లో సవరణ చేయగా.. ఉద్యోగుల స్థానికతకు సంబంధించి 1975నాటి రాష్ట్రపతి ఉత్తర్వుల్లో సవరణలు చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయిమెంట్(ఆర్గనైజేషన్ ఆఫ్ లోకల్ కేడర్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్)లో సవరణలు చేస్తూ తెలంగాణ నుంచి ఏపీకి వచ్చి స్థిరపడిన వారికి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లలో మరో మూడేళ్ల పాటు స్థానికత కల్పించారు. ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్(రెగ్యులేషన్ ఆఫ్ అడ్మిషన్లు)లో సవరణలు చేస్తూ.. విద్యా సంస్థల ప్రవేశాల్లో మరో మూడేళ్ల పాటు స్థానికత కల్పించారు.



విస్తారమైన మాటలలో దోషముండక మానదు.
తన పెదవులను మూసికొనువాడు బుద్ధిమంతుడు.
- క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, **తిథి:** బ.తదియ ప.1.31 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** పునర్వసు రా.6.45 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** రా.3.37 నుండి 5.22 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.08 నుండి 5.54 వరకు, **అమృతఘడియలు:** సా.4.06 నుండి 5.51 వరకు.

సూర్యోదయం : 6.24
సూర్యాస్తమయం : 5.23
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

జె.పి.నడ్డా (బీజేపీ అధ్యక్షుడు)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

రాజ్‌నాథ్‌సింగ్ ఇంకా ఏదో చెప్పబోతుంటే –

"ఏదీ మళ్లొకసారి చెప్పండి రాజ్‌నాథ్‌జీ.." అన్నారు అమిత్‌షా, రాజ్‌నాథ్ వైపు అయోమయంగా చూసి.

"ఢిల్లీలో బీజేపీ ఓటమి ఆప్ గెలుపు కాదు. హిమాచల్‌లో కాంగ్రెస్ గెలుపు బీజేపీ ఓటమి కాదు. గుజరాత్ ఆప్‌ది కాదు, కాంగ్రెస్‌ది కాదు.." అన్నారు రాజ్‌నాథ్.

"ఎందుకలా అంటున్నారు రాజ్‌నాథ్‌జీ?!" అని అమిత్‌షా అడిగారు.

నాకూ ఆ సందేహం వచ్చింది కానీ, అమిత్‌షా సందేహానికి రాజ్‌నాథ్ చెప్పే సమాధానమే నాకూ సమాధానం అవుతుంది కనుక నేను మౌనంగా ఉండిపోయాను.

"నేను అనడం కాదు అమిత్‌జీ. ఎవరో ఉండచుట్టి పడేసిన కాగితంలో రాసి ఉంటే చదువుతున్నాను.." అన్నారు రాజ్‌నాథ్! ఆ మాటకు మోదీజీ రాజ్‌నాథ్ వైపు చూశారు.

మోదీజీ, రాజ్‌నాథ్, అమిత్‌షా, నేను.. ఉన్నాం అక్కడ. నేను రాజ్‌నాథ్ పక్కన ఉన్నాను. ఆయన చేతిలోని కాగితం ఉండని నేనూ తీసుకుని చదివాను.



మోదీజీ ప్రధానమంత్రి, రాజ్‌నాథ్ రక్షణమంత్రి, అమిత్‌షా హోమ్‌మంత్రి కనుక ముగ్గురూ ఎప్పుడూ కలిసే కనిపించడంలో దేశ సౌభాగ్యం, దేశ సౌభ్రాతృత్వం, దేశ సుస్థిరత వెల్లివిరుస్తుంటాయి. మరి నన్నెందుకు రమ్మని పిలిచినట్లు?! పార్టీ అధ్యక్షుడిని అయివుండి, హిమాచల్‌ప్రదేశ్‌లో పార్టీని గెలిపించలేక పోవడంపై వివరణ అడిగేందుకా?

"ఏమై ఉంటుంది ఆ ఉండ చుట్టిన కాగితంలో రాసి ఉన్న మాటలకు అర్థం?!" అని అమిత్‌షా నా వైపు చూశారు.

అసలైతే ఆయన అలా చూడవలసింది రాజ్‌నాథ్ వైపు. కాగితం ఉండను తీసి చూసింది రాజ్‌నాథే కనుక! కానీ ఆ ఉండలో గెలుపు, ఓటమి అనే మాటలు రాసి ఉన్నాయి కాబట్టి ఆ గెలుపు ఓటములలో ఓటములకు నన్ను బాధ్యుడిని చేస్తూ అమిత్‌షా నా వైపు చూసి ఉంటారా!

"అసలు మీకు ఆ కాగితం ఉండను తీసి చూడాలని ఎందుకు అనిపించింది రాజ్‌నాథ్‌జీ.." అని మోదీజీ నవ్వుతూ అడిగారు.

ఆ మాటతో అమిత్‌షా చూపు నా మీద నుంచి రాజ్‌నాథ్ వైపు మళ్లింది.

"మోదీజీ! ఇక్కడికి వచ్చినప్పటి నుంచీ మీరు మౌనంగా ఉన్నారు. అమిత్‌జీ మౌనంగా ఉన్నారు. నడ్డాజీ మౌనంగా ఉన్నారు. గుజరాత్‌లో గెలిచినందుకు మీట్ అయ్యామా లేక ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్‌లలో ఓడినందుకు మీట్ అయ్యామా తెలియక నేనూ మౌనంగా ఉన్నాను. అప్పుడు నేలపై దొర్లుతూ కనిపించిందే ఈ కాగితం ఉండ! తీసి చూశాను. మౌనాన్ని బ్రేక్ చెయ్యడానికి పైకి చదివాను..." అన్నారు రాజ్‌నాథ్.

మళ్లీ కాసేపు మౌనం. ఈసారి ఆ మౌనాన్ని నేను బ్రేక్ చేయవలసి వచ్చింది.

"హిమాచల్‌ప్రదేశ్‌లో ఓటమికి నేను పూర్తి బాధ్యత వహిస్తున్నాను మోదీజీ..." అన్నాను.

మోదీజీ నవ్వారు.

"గెలుపునకు కారణాలు ఉంటాయి కానీ, ఓటమికి కారకులు ఉంటారా నడ్డాజీ? మీరు, ఎంపీ అనురాగ్ ఠాకూర్ – ఇద్దరూ హిమాచల్‌ప్రదేశ్ వాళ్లే అయినప్పటికీ అనురాగ్ సొంత జిల్లా హమీర్‌పూర్‌లో మొత్తం ఐదు సీట్లూ మనవి కాకుండా పోయాయి. మీ సొంత జిల్లా బిలాస్‌పూర్‌లో కాస్త నయం. నాలుగు సీట్లలో మూడు మనవే అయ్యాయి. అనురాగ్ ఓటమికి మీరు బాధ్యులా? మీ గెలుపునకు అనురాగ్ కారకులా?" అన్నారు మోదీజీ!

ఆయన నవ్వులో గెలుపు లేదు. ఓటమి లేదు. ఎప్పట్లాగే నవ్వూ లేదు.

"ఇదెలా ఉందో చూడండి.." అని మోదీజీ కాస్త ముందుకు వంగి, చిన్న కాగితం ముక్కను రాజ్‌నాథ్ చేతికి ఇచ్చారు.

'గెలవలేకపోవడం ఓటమి కాదు. ఓడిపోవడం గెలవనట్లు కాదు' – అని రాసి ఉంది ఆ కాగితం ముక్కలో!

ఉండలోని చేతిరాత, ముక్కలోని చేతిరాత ఒకేలా ఉన్నాయి!!

పింఛన్లిచ్చే వారు గూఢచారులట?

- కులమతాలు, పార్టీలకు అతీతంగా... నూరు శాతం అర్హులకు ప్రభుత్వ పథకాలు
- వలంటీర్ల ఎంపికలో అర్హతా ప్రమాణాలకే పెద్ద పీట
- రాజకీయ జోక్యానికి తావులేకుండా ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేస్తున్న అధికారులు
- నియామకాల్లో రిజర్వేషన్ల అమలు... అందుకే 55 శాతం మహిళలకే
- 96 శాతం వలంటీర్లు 35 ఏళ్ల లోపువారే... 68 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలే
- ఇదో అద్భుతమైన వ్యవస్థంటూ ప్రశంసించిన కేరళ, యూనిసెఫ్
- తమ రాష్ట్రంలోనూ ఆరంభించేందుకు కేరళ యోచన
- ఏపీలో తమ కార్యక్రమాల అమలుకు ఇప్పటికే యూనిసెఫ్ ఒప్పందం
- పథకాల అమల్లో మంచిపేరుతో 'ఈనాడు'కు కడుపు మంట
- వలంటీర్ల వ్యవస్థకు రాజకీయ మకిలి అంటించటం ద్వారా పబ్బం గడుపుకునే ప్రయత్నం







ఏది నిజం?

ఆసుపత్రిలో ఉన్న ఓ అవ్వకు...
1వ తేదీన ఠంచనుగా అక్కడికే వెళ్లి
పింఛను అందజేశాడు ఓ వలంటీరు.
జోరుగా వర్షం కురిసి రోడ్ల నిండా నీరు
నిండిపోయింది. తెల్లవారుఝామునే...
వర్షానికి తడుస్తూ ఆ నీట్లోనే వచ్చి ఓ తాతకు
పింఛను అందించింది మరో వలంటీరు.

మరి వీళ్లలో వైసీపీ వాళ్లెవరు? ఆ అవ్వ, తాత వైసీపీ నాయకులా? వాళ్లకు పింఛన్లివ్వటం వైఎస్సార్ సీపీకి సేవ చేయటమా? వాళ్లకు పింఛన్లందించిన వలంటీర్లు వైసీపీ వేగులా? ఇలా ఇవ్వటం గూఢచర్యమా? ఏ కొంచెం కూడా దుర్వినియోగానికి తావు లేకుండా ప్రభుత్వ పథకాలను ఇలా జనానికి చేరవేస్తుండటం రాజకీయ కార్యకలాపమా?


యావత్తు దేశాన్నీ కోవిడ్ మహమ్మారి చుట్టేసి... ఇళ్లలోంచి బయటకు రావటానికే జనం భయపడుతున్నపుడు... ధైర్యంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఎవరెవరికి అనారోగ్య లక్షణాలున్నాయో 'సర్వే' పేరిట తెలుసుకోవటం వ్యక్తిగత గోప్యతకు భంగమా? ప్రతి ఇంటికీ మాస్కులు, మందులతో పాటు పచారీ సామాన్లు కూడా అందించిన స్వచ్ఛంద సైన్యంపై ఎందుకింత కడుపుమంట? పథకాల దుర్వినియోగానికి ఏమాత్రం ఆస్కారం లేకుండా నూరుశాతం అర్హులకు చేరవేస్తున్న ప్రభుత్వ యంత్రాంగంపై ఎందుకీ విద్వేషం?

వృద్ధులు కానీండి... అనారోగ్యంతో తల్లడిల్లుతున్న వారు కానీండి... ఆఖరికి వికలాంగులు కానీండి. ఎవ్వరైనా పడుతూ లేస్తూనైనా తాము చెప్పిన చోటుకు వస్తేనే పింఛను. అక్కడికొచ్చి గంటలకొద్దీ వేచిచూస్తే... ఆ రోజు అదృష్టం బాగుంటే పింఛను దొరుకుతుంది. లేదంటే మరోరోజు రావాల్సిందే. అది ఎండైనా.. వానైనా. ఇదీ.. ఘనత వహించిన నారా చంద్రబాబు నాయుడి హయాంలో పింఛన్ల తంతు. కానీ 'ఈనాడు' దృష్టిలో అదే స్వర్ణయుగం. ఇప్పుడు ఆ పింఛనుదార్లకు గౌరవమిస్తూ... వారి వద్దకే వెళ్లి అందజేస్తున్న వలంటీర్లు మాత్రం వైసీపీ వేగులట!!. అలా ఇవ్వటం రాజకీయ కార్యకలాపమట. అది పార్టీ సేవ అట!!.

52 ఏళ్లు నిండిన 'ఈనాడు' బుద్ధి ఎక్కడికిపోయింది? వయసు మీద పడటంతో రామోజీరావుకు, చంద్రబాబుకు ఆలోచనలన్నీ అరికాళ్ల నుంచే పుట్టుకొస్తున్నట్టున్నాయి. ఏళ్లు పెరుగుతున్న కొద్దీ 'ఈనాడు' కూడా వీళ్లమాదిరే తయారవుతోందా? అక్షరమక్షరంలోనూ ఇంతటి విషాన్ని నింపుకున్న పత్రికలో ఏ ఒక్క వార్తయినా నిజమని నమ్మగలమా? ఎంత చంద్రబాబుకు అమ్ముడుపోతే మాత్రం మరీ ఇంతకు దిగజారిపోతారా రామోజీ? కేరళలాంటి రాష్ట్రాలు సైతం ఈ స్వచ్ఛంద సైన్యాన్ని చూసి తమ రాష్ట్రంలో కూడా నియమించాలని యోచిస్తున్నాయి. ఐక్యరాజ్య సమితి తరఫున అంతర్జాతీయంగా బాలల విద్య కోసం కృషి చేస్తున్న యూనిసెఫ్ కూడా రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థ అద్భుతమని ప్రశంసించింది. అంతేకాక రాష్ట్రంలో తమ కార్యక్రమాలను నిరుపేదలకు చేర్చడానికి ఈ వ్యవస్థతో కలిసి పనిచేసేలా ఒప్పందం కూడా చేసుకుంది. మరి ఇంత గొప్ప వ్యవస్థలో మీకు ఒక్క మంచి లక్షణం కూడా కనిపించలేదంటే మీ దుర్మార్గపు స్థాయిని అంచనా వేయడానికి ఏ కొలమానం సరిపోతుంది రామోజీరావు గారూ? ఇక హద్దులు లేవన్న రీతిలో నానాటికీ పతనమైపోతున్న మీ పాత్రికేయం ఇంకెన్నాళ్లు? ఇంతలా చంద్రబాబు మోహంలో పడిపోతే ఎలా? అసలు వలంటీర్ల వ్యవస్థ రాష్ట్రంలో ఎందరి జీవితాలను నిలబెడుతోందో తెలుసా? ఎంత అద్భుతంగా పనిచేస్తోందో తెలుసా?

అర్హులెవ్వరికైనా అన్యాయం జరిగిందా?

ప్రజల బతుకులు బాగు చేయటానికి... జనం జీవితాలు మెరుగుపడటానికి ప్రభుత్వం రకరకాల పథకాలను అమలు చేస్తోంది. ఈ పథకాలన్నిటి లక్ష్యం ఒక్కటే. ప్రజల్ని ఉన్న స్థాయి నుంచి ఉన్నత స్థాయికి తీసుకెళ్లటం. ప్రతి పథకానికీ ప్రభుత్వం కొన్ని అర్హతా ప్రమాణాలు నిర్ణయిస్తే... అర్హుల్లో ఒక్కరికి కూడా అన్యాయం జరగకుండా వాటిని చేరవేస్తోంది వలంటీర్ల వ్యవస్థ. ఈ వ్యవస్థ ఎంత సమర్థంగా పనిచేస్తోందో తెలియటానికి రామోజీరావుకు ఒక్కటే ప్రశ్న. తెలుగుదేశం పార్టీ వారన్న కారణంతోనో, వేరే కులానికి చెందిన వారన్న కారణంతోనో అర్హులైన ఏ ఒక్కరికైనా ఒక్క పథకమైనా అందకుండా పోయిందా? అలాంటి వాళ్లను చూపించగలరా? అదే కదా వలంటీర్ల వ్యవస్థకు గీటురాయి!. అదే కదా ప్రభుత్వ పనితీరుకు కొలమానం!. మరి చంద్రబాబు పాలననే తీసుకుందాం. ప్రభుత్వ పథకాలను జనానికి చేరవేయటానికి ఆయన నియమించుకున్నది జన్మభూమి కమిటీలను. అందులో ఉన్నదంతా తెలుగుదేశం పార్టీ వారే. వాళ్లను నియమించింది కూడా టీడీపీ ఎమ్మెల్యేలు, ఓడిపోయిన టీడీపీ ఇన్‌ఛార్జులు. నేరుగా నామినేట్ చేసేసేవాళ్లు. ఇక ఆ కమిటీలన్నీ తెలుగుదేశం వారి కోసమే పనిచేసేవి. అర్హత ప్రమాణాలన్నీ పేరుకే. ఏ పథకానికైనా అసలైన అర్హత తెలుగుదేశం పార్టీకి విధేయంగా ఉండటమే. ఆ గ్రామంలో ఉండే వ్యవస్థంతా జన్మభూమి కమిటీల సూచనల మేరకు పనిచేస్తే... జన్మభూమి కమిటీలన్నీ చంద్రబాబు సూచనల మేరకు పనిచేసేవి. మరి ఇప్పుడో..?



నియామకాలు చేస్తున్నది అధికారులే కదా?

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను చేర్చటమే ధ్యేయంగా 2,61,413 మంది వలంటీర్లను ప్రభుత్వమే నియమించింది. గౌరవ పారితోషికంతో స్వచ్ఛంద సేవ అందించే ఈ వలంటీర్ల నియామకంలో... రాజకీయ జోక్యానికి తావే లేదు. పార్టీలు లేవు... కులమతాల పట్టింపు లేదు. స్త్రీ,పురుష భేదాల్లేవు. నిర్ణీత విద్యార్హతలున్నవారిని గ్రామాల్లో అయితే ఎంపీడీఓ ఛైర్మన్‌గా, తహసీల్దారు, విస్తరణ అధికారి సభ్యులుగా ఓ కమిటీ నియమిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో అయితే మున్సిపల్ కమిషనర్ ఛైర్‌పర్సన్‌గా తహసీల్దారు, ప్రాజెక్టు అధికారి లేదా మెప్మా టౌన్ మిషన్ కో–ఆర్డినేటర్ సభ్యులుగా ఉన్న కమిటీ నియమిస్తోంది. ఈ కమిటీల్లో రాజకీయ నాయకుల ప్రమేయమే లేదు. పైపెచ్చు ఎప్పటికప్పుడు వచ్చే ఖాళీలను భర్తీ చేయటానికి స్థానికంగా ఉండే ఎంపీడీఓ లేదా కమిషనర్ నోటిఫికేషన్లు విడుదల చేస్తున్నారు. అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, ఇంటర్వ్యూలు నిర్వహించి, రిజర్వేషన్లు, రోస్టర్ ప్రకారం వాలంటీర్లను ఎంపిక చేస్తున్నారు.

ఏ పార్టీ వారైనా ఉండొచ్చు...

ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న వలంటీర్లలో తెలుగుదేశం, వైఎస్సార్ సీపీ, జనసేన అభిమానులు కూడా ఉండొచ్చు. ఎందుకంటే నియమించే ముందు వారి వయసు, విద్యార్హతలు, సేవాభావమే ప్రామాణికంగా తీసుకున్నారు తప్ప వారి రాజకీయ నేపథ్యాన్ని చూడలేదు. అందుకే ప్రస్తుతం పనిచేస్తున్న 2.61 లక్షల వలంటీర్లలో 74 శాతం మంది 20–30 ఏళ్ల మధ్య ఉన్నవారే. ఇంకా చెప్పాలంటే... 96 శాతం మంది 35 ఏళ్ల లోపువారే. అందుకే అత్యంత వేగంగా తమ బాధ్యతలు నిర్వర్తించగలుగుతున్నారు. పైపెచ్చు ఈ వలంటీర్లలో 55.12 శాతం మంది మహిళలే. గ్రామంలో గౌరవంతో పాటు కాస్త పారితోషికం... ఊరికి సేవ చేశామన్న తృప్తి ఉంటాయనే వీరంతా ఈ బాధ్యతల్లోకి వస్తున్నారు. మరి ఈ మహిళలకు సైతం పార్టీలు అంటగట్టి, వీళ్లందరినీ వైసీపీ వేగులుగా ముద్రవేస్తూ తప్పుడు రాతలు రాస్తున్న 'ఈనాడు'ను ఏం చేయాలి? దారుణమైన రాతలతో పచ్చి విషాన్ని కక్కుతున్న రామోజీరావును ఏం చేయాలి?

ఎన్నెన్ని బాధ్యతలో...

ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించటంలో వలంటీర్ల వ్యవస్థ ఎండావానలను లెక్క చేయక... చలికి భయపడక అహర్నిశలూ పనిచేస్తున్నదనేది కాదనలేని వాస్తవం. 2019 జూన్ నుంచి ఈ వ్యవస్థ ప్రతినెలా దాదాపు 62.5 లక్షల మందికి... రూ.1,600 కోట్ల చొప్పున పంపిణీ చేస్తోంది. కొత్త రైస్ కార్డులు మంజూరు చేయటంతో పాటు రైస్ కార్డులున్న వారందరికీ సేవలందిస్తోందీ వ్యవస్థ. ఇంకా వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కింద కొత్త కార్డులు మంజూరు చేయటం... ఆరోగ్య శ్రీని ఉపయోగించుకోవటంపై అవగాహన కల్పించటం చేస్తోంది. ఇవే కాదు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ కాపు నేస్తం, చేయూత, రైతు భరోసా, మత్స్యకార భరోసా, వైఎస్సార్ జలకళ, వాహనమిత్ర, నేతన్న నేస్తం, ఆసరా, వైఎస్సార్ బీమా, సంపూర్ణ పోషణ, ఉచిత పంటల బీమా, లా నేస్తం, రైతులకు సున్నా వడ్డీ, ఆరోగ్య ఆసరా, జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన, విదేశీ విద్యా దీవెన, విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, జగనన్న తోడు, రజకులు.. టైలర్లు... నాయీ బ్రాహ్మణుల కోసం జగనన్న చేదోడు, జీవ క్రాంతి, అమూల్ పాలవెల్లువ, కంటి వెలుగు, అమ్మ ఒడి... అర్చకులు, ఇమామ్‌లు, పాస్టర్లకు ఒకసారి అందించే ఆర్థిక సాయం, పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇళ్ల స్థలాల పట్టాల మంజూరు, ఈబీసీ నేస్తం వంటి పదుల కొద్దీ పథకాల ఫలాలను అర్హులకు చేరుస్తున్నారు.

ప్రభుత్వ విభాగాలకూ సహాయంగా...

ఇవికాక వివిధ ప్రభుత్వ విభాగాలు సైతం వలంటీర్ల సేవలు ఉపయోగించుకుంటున్నాయి. సొంతిళ్లున్న వారిని ఆస్తిపన్ను చెల్లించమని అభ్యర్థిస్తున్న వలంటీర్లు... స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే, మనం మన పరిశుభ్రత, ఫ్రైడే–డ్రైడే, చెత్త పన్ను వసూలు... ఇలాంటి అంశాలన్నిటా వినియోగదార్లకు అవగాహన కల్పిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి విభాగానికి, పంచాయతీ రాజ్– గ్రామీణాభివృద్ధి విభాగానికి సహకరిస్తున్నారు.

- కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల్లో అర్హత ప్రమాణాలను విచారించడంలో వీఆర్వోలకు సహకరిస్తున్నారు.
- వైద్య, ఆరోగ్య శాఖ చేపట్టే వ్యాక్సినేషన్ డ్రైవ్‌లకు, ఫీవర్ సర్వేలు, ఆరోగ్య సర్వేలకు వలంటీర్లే ఆధారం.
- వలంటీర్ల సాయం లేకుంటే ఆర్‌బీకే సిబ్బంది ఈ–క్రాప్ బుకింగ్‌కు రైతులను గుర్తించడం అంత తేలిక కాదు.
- ప్రత్యేక వాహనాల్లో రేషన్ బియ్యాన్ని ఇళ్ల వద్దకు తీసుకెళ్లి అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లకు పూర్తి సహకారం వలంటీర్లదే.
- ఇక తుపానులు, భారీ ప్రమాదాలు జరిగినపుడు చాలా మంది వలంటీర్లు స్వచ్ఛందంగా కదనరంగంలోని సైనికుల్లా సేవలందిస్తున్నారు. నిన్నగాక మొన్న వచ్చిన కోనసీమ వరదల్లో వలంటీర్ల సాయాన్ని అక్కడి ఏ వ్యక్తి నడిగినా చెప్పకమానడు.

మరి ఇన్ని బాధ్యతలు నిర్వర్తిస్తున్న వలంటీర్లపై రామోజీరావు వైసీపీ ముద్ర ఎందుకు వేస్తున్నారు? ఏదో ఒకరకంగా వాళ్లను తమ విధులకు దూరం చేద్దామనా? ఈ రాష్ట్రంలో అర్హులకు పథకాలు అందకుండా చేసి... ప్రభుత్వానికి ఆ మకిలిని అంటిద్దామనా? ఇంతకన్నా ఘోరమైన కుట్రేదైనా ఉంటుందా రామోజీ?

కోవిడ్ సమయంలో ప్రపంచమే జేజేలు కొట్టింది...

2020 తొలినాళ్లలో ప్రపంచాన్ని కోవిడ్ మహమ్మారి వణికిస్తున్నపుడు... దేశం యావత్తూ భయాందోళనలు నిండి, ఆసుపత్రులలో బెడ్‌లు సైతం దొరక్క విలవిలలాడినపుడు అందరికీ ఒక దిక్సూచిలా కనిపించింది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే. పక్క రాష్ట్రాల నుంచి కోవిడ్ రోగులు సైతం నిబంధనలకు గాలికొదిలేసి మరీ ఏపీకి వచ్చారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇక్కడకు వస్తే... ఇక భయం లేదని ప్రతి ఒక్కరూ భరోసా ఫీలయ్యారంటే... అది ఈ ప్రభుత్వం సృష్టించిన వలంటీర్ల వ్యవస్థ వల్లే సాధ్యమైందని వేరే చెప్పక్కర్లేదు. ఎందుకంటే కోవిడ్ మహమ్మారికి భయపడి జనం ఇళ్లలోంచి బయటకు రావటానికే భయపడుతున్న సమయంలో... బయట తిరిగితే ప్రమాదమని తెలిసి కూడా వీరే సైన్యంగా పని చేశారు. ఇళ్లకు రోజువారీ సరుకులతో పాటు మందులు అందించటంతో పాటు 16 కోట్ల మాస్కుల్ని జనానికి అందజేశారు. పేదలకు ప్రత్యేక సాయంగా రూ.వెయ్యి చొప్పున అందించటంతో పాటు వ్యాక్సిన్లు త్వరగా అందేలా చూశారు. క్వారంటైన్ సెంటర్లలో సేవలందించటంతో పాటు రికార్డు స్థాయిలో 46 సార్లు ఫీవర్ సర్వే చేశారు. అన్నిటికన్నా ప్రధానం... కోవిడ్ మృతుల భౌతికకాయాలను దహనం చేయటంలోనూ సాయపడ్డారు. అలాంటి సేవలకు యావత్తు దేశం జైకొట్టగా... రామోజీరావు మాత్రం రాజకీయాలు అంటగడుతూ చెలరేగిపోతుండటం ఈ రాష్ట్రం చేసుకున్న దౌర్భాగ్యం తప్ప మరొకటి కాదనే చెప్పాలి.

కులమతాలకు అతీతంగా...

చంద్రబాబు మదిలోంచి పుట్టిన జన్మభూమి కమిటీలన్నీ కులం కంపు కొట్టేవని వేరే చెప్పక్కర్లేదు. ఏ గ్రామాల్లోనైనా అక్కడ పెత్తనం చెలాయించే వారే కమిటీల్లో ఉండేవారు. కానీ వలంటీర్ల వ్యవస్థలో ఒక కులం, మతం వాళ్లే కొనసాగడం లేదు. వాలంటీర్లుగా ఉన్న వారిలో 14 శాతం మంది మాత్రమే ఓసీలు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు 68 శాతం. మరో 18 శాతం మంది ఇతరులున్నారు. అసలు 55 శాతం మంది మహిళలున్నప్పుడు 'ఈనాడు' రాసేసినట్లుగా వాళ్లు వేగులుగా పనిచేయటం సాధ్యమా? 68 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉండగా వాళ్లంతా ఒక పార్టీకే పనిచేస్తున్నారనడంలో అర్థం ఉందా?

ఈ సవాళ్లకు సిద్ధమా రామోజీ?


- చేతిలో పత్రిక ఉంది కదా అని అడ్డగోలుగా ఆరోపణలు చేసే రామోజీరావు సూటిగా సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు కొన్ని ఉన్నాయి. వాటిలో అన్నిటికన్నా ముఖ్యమైనది... ఈ వలంటీర్ల వ్యవస్థను ప్రభుత్వం ఎప్పుడైనా తనవి కాని కార్యక్రమాలకు వాడిందా?
- ఎందుకంటే ప్రభుత్వ పథకాలను స్థానికులకు అందించటం... వారికి ఆయా పథకాలపై అవగాహన కల్పించటమే వీరి విధి. ఇది తప్ప ఇతర కార్యక్రమాలకు వీరిని ఎన్నడైనా వాడారా? చెప్పండి రామోజీ?
- ఓ సర్వేలో రాజకీయ ఆసక్తిని అడిగారంటూ మీరు చెబుతున్నవన్నీ పచ్చి అబద్ధాలు. ఎందుకంటే ప్రభుత్వం చేపట్టిన ఏ సర్వేలోనూ ఇప్పటి దాకా పౌరుల రాజకీయ ఆసక్తిని అడిగింది లేదు.
- వలంటీర్లు ఎన్నడైనా ఏ రాజకీయ కార్యకలాపాల్లోనైనా పాల్గొన్నారా? అలా పాల్గొంటే వారిపై చర్యలు తీసుకోకుండా వదిలేశారా? తెలిస్తే చెప్పండి రామోజీ? నిజానికి ఏ వలంటీరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వారిపై 'స్పందన' కార్యక్రమంలో సంబంధిత అధికారికి ఫిర్యాదు చేయొచ్చు. వారు విచారణ జరిపి చర్యలు తీసుకుంటారు. ఇప్పటిదాకా 24,704 ఫిర్యాదులు రాగా వాటిలో 24,643 పరిష్కారమయ్యాయి. ఆరోపణలు రుజువు కావటంతో ఇప్పటికే 20 మంది వలంటీర్లను తొలగించారు కూడా. ఇలాంటి వాస్తవాలు చెప్పటం కూడా అలవాటు చేసుకోండి రామోజీరావు గారూ!!.

రామోజీ దుర్మార్గపు రాతల ప్రకారం చూస్తే...

వాళ్లంతా ఒకే పార్టీకి పనిచేస్తుండాలి. అలా చేస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో వాళ్లపై ప్రత్యర్థి పార్టీల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చి ఉండాలి కదా? కానీ వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటైన రెండున్నర సంవత్సరాల తర్వాత 2021 జనవరిలో జరిగిన గ్రామ పంచాయితీ ఎన్నికల సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కేవలం ఆరుగురు వలంటీర్లపై మాత్రమే రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదులందాయి. మరి ఆ జిల్లాలో వేల సంఖ్యలో వలంటీర్లున్నారు కదా? రామోజీ చేసిన మరో దుర్మార్గపు ఆరోపణ ఏంటంటే వలంటీర్ల వల్ల ప్రభుత్వానికి వందల కోట్లు ఖర్చవుతోందని!!. నిజానికి రాష్ట్ర ప్రభుత్వం 33 సంక్షేమ పథకాల ద్వారా ఈ మూడున్నరేళ్లలో సుమారు రూ.3.60 లక్షల కోట్లు ప్రజలకు ఆర్థికంగా సాయం చేసింది. పైసా అవినీతికి తావు లేకుండా ఈ మొత్తాన్ని లబ్ధిదారులకు చేర్చటంలో వలంటీర్ల పాత్ర అత్యద్భుతం. ప్రతి పథకానికీ ఎంపిక చేసే ముందు లబ్ధిదారుడి వద్దకు వెళ్లి బయోమెట్రిక్ తీసుకొని, అమలు చేశాక అతనికి అందిందని ధ్రువపరచుకునేందుకు మరో సారి బయోమెట్రిక్ తీసుకుంటారు. ఇలా చేయటం వల్ల అడ్డుకట్ట పడిన అవినీతితో పోలిస్తే వీరికి చెల్లించిన మొత్తం ఎక్కువని అనుకోగలమా? ఈమాత్రం జ్ఞానం కూడా 'ఈనాడు'కు లేకపోతే ఎలా?

అంతా నిజమే జెప్త... అబద్ధాలస్సల్ జెప్ప!

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

ఆంధ్రప్రదేస్ బోక శానొద్దులైంది. ఒకపారి గా రాస్ట్రం బోయొస్తె బాగుంటదని నారదుడు తంబూర దీస్కుండు. ఒకపారి టింగ్ టింగ్ మన్నడు. చిర్తలు గొట్టుకుంట, నారాయన నారాయన అనుకుంట మొగులు మీద్కెల్లి ఎల్లిండు. నర్కం దిక్కుబోతున్న యముని దున్నపోతు ఎదురుబడ్డది.

''యాడ్కి బోతున్నవ్ నారదా!'' అని అడిగింది.

''ఆంధ్రప్రదేస్ బోతున్న''

''పుజాల్ల ఎందుకు బోతవ్?''

''నేను బోకుంటె గాడి సంగతులన్ని ఎట్లెర్కైతయి?''

''గా రాస్ట్రంల ఏమైతున్నదో నేను జెప్త గద.''

''గట్లయితె మంచిదే. నాకు బోయే బాద దప్పుతది'' అని నారదుడన్నడు.

''అన్ని నిజాలే జెప్త. అబద్ధాలస్సల్ జెప్ప అని గీనడ్మ చెంద్రబాబు అంటున్నడు'' అని దున్నపోతు ఇంకేమొ జెప్పబోతుంటె అడ్డం దల్గి–

''గాయిన సంగతి ఎవ్వలికెర్కలేదు. అస్కిని బుష్కిని జేసుడే గాకుంట అబద్ధంను నిజమని నమ్మిచ్చెతండ్కు, గాయిన ఒకతీర్గ తన్లాడ్తడు'' అని నారదుడన్నడు.

''అబద్ధంను ఊకూకె జెప్తె గది నిజమై గూసుంటది. చెంద్రబాబు హైటెక్ సిటీనే గాకుంట మహబూబాద్‌ను గుడ్క గట్టిపిచ్చిన్నని అంటున్నడు. ముంజాత గాదాని పేరు మా 'బాబూ' బాద్‌ట. మా బాబూబాద్ మెల్లమెల్లగా మహబూబాబాద్ అయ్యిందట. గదే తీర్గ మా బాబూనగర్ మహబూబ్ నగరైందని గాయిన ఒక్కతీర్గ జెప్తున్నడు.

ఎన్కట చెంద్రబాబు గిరిని గాయినే గట్టిపిచ్చిండట. గా చెంద్రబాబు గిరినే గీ జమానల అందరు చంద్రగిరని అంటున్న రట. నాకు ఆక్రి మోక ఇయ్యండ్రి. మల్లొకపారి ముక్యమంత్రిని జెయ్యండ్రి. గట్ల జేస్తిరా అంటె కొత్త చరిత్ర రాయిస్త. గిసువంటి నిజాలు జెనంకు ఎర్కయ్యేటట్లు జేస్త అని చెంద్రబాబు అనబట్టిండు''.

''చెంద్రబాబు ఇంకేం జెప్పిండు?''

''మా టిడిపి సర్కారుండంగ జన్మభూమి, శ్రమదానం అసుంటి పద్కాలు బెట్టినం. జన్మభూమి కింద చెట్లు నాటేటోల్లు. శ్రమదానం కింద నాటిన చెట్లను పీకెటోల్లం. గీ పద్కాలు జెయ్యబట్కె ఎందరికో పని దొర్కింది. గిప్పుడు మాసరకు గిసువంటి ఒక్క పద్కమన్న ఉన్నదా? నా జమానల రైతులు ఎరువులు, ఇత్తుల కోసం తిప్పలుబడెటోల్లు గాదు. ఎరువులు, ఇత్తులు గావాలంటె కంప్యూటర్ల డవున్‌లోడ్ జేస్కునేటోల్లు. అన్కుంట చెంద్రబాబు పల్ల పల్ల ఏడ్సిండు'' అని దున్నపోతు జెప్పింది.

''అంత బాగున్నది గని ఎందుకేడ్సిండు?'' అని నారదుడు అడిగిండు.

''ముక్యమంత్రి కుర్సి యాదికొచ్చి'' అని దున్నపోతు జెప్పింది.

''బాబు జెప్పుడేనా? చేసుడేమన్న ఉన్నదా?''

''పవన్ కల్యాన్‌ను గల్సినంక కూసమిడిచిన పాము తీర్గ బాబు ఆగుతలేడు. గిదేం కర్మ రాస్ట్రంకు పోగ్రాం కింద రొండు గోదావరి జిల్లలల్ల దిరుక్కుంట మీటింగ్లు బెట్టిండు'' అన్కుంట దున్నపోతు జెప్తుంటె మల్ల నారదుడు అడ్డం దల్గి – ''గిదేం కర్మరా బాబూ! అని అనుకోబట్కెనే ఆంధ్ర జెనాలు చెంద్రబాబును ముక్యమంత్రి కుర్సి మీదకెల్లి దించిండ్రు. రాజకీయాలల్ల వజీప దీస్కోని మన్మనితోని ఆడుకోమన్నరు'' అని అన్నడు.

''గాయిన వజీప దీస్కుంటె పాపం లోకేశ్‌ను ఎవలు గాన్తరు. సైకిల్ల గాలిబోయింది. రొండు పయ్య లూసిపోయినయి. హైండిల్ ఇర్గిపోయింది. ఫిర్నిల్ పనిజేస్తలేదు. పైడిల్లు పతా లేకుంట బోయినయి. ఇగ దాంతోని లోకేశ్ సైకిల్ జోడో యాత్ర జేస్తనంటున్నడు. గిదేం కర్మ రాస్ట్రానికి ప్రోగ్రాం కింద నిడదవోలుల చెంద్రబాబు మీటింగ్ బెట్టిండు. నా ముక్యమంత్రి కుర్సి నాగ్గాకుంట బోంగనే మన రాస్ట్రంకు శని బట్టింది. అంగట్ల అన్ని ఉన్నా అల్లుని నోట్లె శని అంటె గిదే అని అన్నడు'' అని దున్నపోతు జెప్పింది.

''అంగట్ల అన్ని ఉన్నయి. అల్లుడు శని గూడ ఉన్నడు అంటె బాగుంటది'' అని నారదుడన్నడు.

''గిదేం కర్మ రాస్ట్రంకు ప్రోగ్రాం కింద తెలుగుదేసం తాడేపల్లిగూడెంల మీటింగ్ బెట్టింది. బుక్కా గులాల్లెక్క గా మీటింగ్ల తెలుగుదేసమోల్లు ఒగల మీద ఒగలు పస్పు జల్లుకున్నరు. టిడిపి జిందాబాద్, గిదేం కర్మ రాస్ట్రంకు అని తెలుగుదేసమోల్లు లాసిగ ఒల్లుతుండంగ చెంద్రబాబు మైకు ముంగట్కి వొచ్చిండు. రొండేల్లు సూబెట్టిండు. పోలవరం నా పానం. మా సర్కారుండంగ పతొక్క సోమారంను పోలవారం అనుకున్నం. అనుకోని గా దాని గురించే మాట్లాడుకునేటోల్లం. నెలకొక్కపారి నేను పోలవరం ప్రాజెక్టు చూసొచ్చేటోన్ని. సంటరే గీ ప్రాజెక్టు గటిపిచ్చేదుంటె కమీషన్ల కోసం నేను గాదాన్ని గట్టిచ్చుడు షురువు జేసిన్నని నన్ను బద్నాం జేసిండ్రు. నాకు ఆక్రి మోక ఇయ్యండ్రి'' అన్కుంట చెంద్రబాబు స్పీచ్ గొట్టిండు. మల్ల గలుస్త అన్కుంట దున్నపోతు నర్కం దిక్కు బోయింది. ఫీచేముడ్ అన్కుంట నారదుడు వైకుంటం బోయిండు.

తోక: పొద్దుమీకింది. ఎప్పటి తీర్గనే పాన్ డబ్బ కాడ్కి బోయిన. గాడ పాన్లు దినుకుంట, సిగిలేట్లు దాక్కుంట మా దోస్తులు ముచ్చట బెడుతున్నరు.

''ఢిల్లిల జి–20 మీద ప్రతాని మోదీ మీటింగ్ బెట్టిండు. అన్ని రాస్ట్రాల ముక్యమంత్రులను, పార్టీల ప్రెసిడెంట్లను బిల్సిండు. గప్పుడు చెంద్రబాబును జూసి శాన బక్కగైండ్రు అని మోదీ అంటె గీ నడ్మ రాస్ట్రంల బగ్గ దిర్గుతున్న అని బాబు జెప్పిండు''అని యాద్గిరి అన్నడు. ''చెంద్రబాబు తిరుగుడు తోని బక్కగ గాలేదు. ముక్యమంత్రి కుర్సి మీద ఫికర్‌తోని బక్కగైండు'' అని సత్నారి జెప్పిండు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ | 99591 50491


బాపట్ల జిల్లా పోతార్లంకలో సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున


పార్వతీపురం మన్యం జిల్లా గుణానపురంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

మన ప్రభుత్వం


అల్లూరి సీతారామరాజు జిల్లా గొందెలి గ్రామంలో పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి


కర్నూలు జిల్లా ఆగవేళిలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

కర్నూలులో రాష్ట్రస్థాయి క్యాన్సర్ ఆస్పత్రి



శరవేగంగా పూర్తి చేసిన రాష్ట్ర ప్రభుత్వం

- రాష్ట్రం విడిపోయాక రాష్ట్ర స్థాయి క్యాన్సర్ ఆస్పత్రే లేదు
- 2017లోనే కేంద్రం మంజూరు చేసినా పట్టించుకోని చంద్రబాబు
- సీఎం జగన్ రాగానే ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు
- రూ.120 కోట్లతో ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తి
- తొలి దశలో పరికరాలు, ఫర్నీచర్‌లకు రూ.53.60 కోట్లు వ్యయం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో తొలి రాష్ట్ర స్థాయి క్యాన్సర్ ఆస్పత్రి త్వరలో కర్నూలులో అందుబాటులోకి రానుంది. రూ.120 కోట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఈ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నిర్మించారు. ప్రభుత్వ రంగంలో వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి క్యాన్సర్ చికిత్సలపైన కూడా దృష్టి సారించారు. ఇందులో భాగంగానే కర్నూలు ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా రాష్ట్ర స్థాయి క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణాన్ని శర వేగంగా పూర్తి చేశారు. మిగతా వసతులన్నీ కల్పించి ఆరు నెలల్లో దీనిని వినియోగంలోకి తెచ్చేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది.

ఈ ఆస్పత్రిని కేంద్ర ప్రభుత్వం 2017లోనే మంజూరు చేసింది. అయితే అప్పటి చంద్రబాబు ప్రభుత్వం దీని నిర్మాణాన్ని గాలికి వదిలేసింది. రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో ప్రభుత్వ రంగంలో రాష్ట్రస్థాయి క్యాన్సర్ ఆస్పత్రి ఒక్కటి కూడా లేదు. ఈ విషయాన్ని చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోలేదు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఆస్పత్రిపై కూడా పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే దీని నిర్మాణాన్ని చేపట్టి వేగంగా పూర్తి చేసింది. క్యాన్సర్ చికిత్సలకు అవసరమైన అత్యాధునిక వైద్య పరికరాలను సమకూర్చేందుకు చర్యలు చేపడుతోంది. తొలి దశలో రూ.53.60 కోట్లతో పరికరాలను ఏర్పాటు చేస్తోంది. హై ఎండ్ రేడియేషన్ అంకాలజీ, మెడికల్ అంకాలజీ, సర్జరీ అంకాలజీ విభాగాలను అందుబాటులోకి తెస్తోంది. రూ.30 కోట్ల వ్యయంతో హై ఎండ్ డ్యూయల్ ఎనర్జీ లీనియర్ యాక్సిలరేటర్‌ను ఏర్పాటు చేస్తోంది. ఎక్విప్‌మెంట్స్‌ను వీలైనంత త్వరగా సమకూర్చాలని వైద్య విద్యా సంచాలకులు ఏపీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించారు.

తొలి దశలో ఏర్పాటు చేసే పరికరాలు

కేటగిరి	వ్యయం (రూపాయల్లో)
రేడియేషన్ అంకాలజీ స్థాయి-1	47,00,00,000
రేడియేషన్ అంకాలజీ ఫర్నీచర్ స్థాయి-1	62,91,000
రేడియాలజీ స్థాయి-1	1,40,00,000
డెంటల్ ఎక్విప్‌మెంట్ స్థాయి-1	18,30,000
డయాగ్నోస్టిక్స్ స్థాయి-1	1,71,00,000
మెడికల్ అంకాలజీ స్థాయి-1	24,00,000
సర్జికల్ అంకాలజీ స్థాయి-1	2,43,97,000
మొత్తం	53,60,18,000

ఆరు నెలల్లోగా అందుబాటులోకి

కర్నూలు ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా రాష్ట్ర స్థాయి క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ భవనాల నిర్మాణం పూర్తయింది. ఇప్పుడు అత్యాధునిక క్యాన్సర్ చికిత్స పరికరాలను సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వాటిని వీలైనంత త్వరగా ఏర్పాటు చేసి ఆరు నెలల్లోపే క్యాన్సర్ చికిత్సలు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలు, సూచనల మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలన్నింటిలో ప్రత్యేకంగా క్యాన్సర్ చికిత్సల విభాగాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్. శ్రీనివాసన్, రాష్ట్ర క్యాన్సర్ విభాగం నోడల్ అధికారి

మూడు రాజధానులే రాష్ట్ర ప్రజలందరి అజెండా

- 804వ రోజు రిలే నిరాహార దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు



తాడికొండ: రాష్ట్ర ప్రజలందరి అజెండా మూడు రాజధానులే అని బహుజన పరిరక్షణ సమితి నాయకులు చెప్పారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 804వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో భూములు కొనుగోలు చేసిన కులవాదులు, పెత్తందారులకు పదిరెట్లు లాభం చేకూర్చేందుకు అమరావతి పేరుతో జరుగుతున్న పెయిడ్ ఉద్యమాన్ని ప్రజలు నమ్మరన్నారు. రాజధాని పేరుతో చంద్రబాబు చేసిన గారడీ వల్ల ఈ ప్రాంతంలో ఉన్న దళితులు, బహుజనులు నేటికీ నానా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. మూడు పంటలు పండే భూములను సర్వనాశనం చేయడంతో ఉపాధి కోసం ఊళ్లు వదిలి ఆటోల్లో ఇతర ప్రాంతాలకు పరుగులు పెట్టడానికి చంద్రబాబే కారణమని మండిపడ్డారు.

క్లుప్తంగా...

13న రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు విడుదల



తిరుమల: తిరుమలలో ఈ నెల 16, 31వ తేదీల్లో రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల ఆన్‌లైన్ కోటాను ఈ నెల 13న ఉదయం 9 గంటలకు టీటీడీ వెబ్‌సైట్‌లో విడుదల చేయనుంది. భక్తులు ఈ విషయాన్ని గమనించి టికెట్లను బుక్ చేసుకోవాలని టీటీడీ కోరింది.

శ్రీవారి దర్శనానికి 30 గంటలు: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కంపార్ట్‌మెంట్లు 15 నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 57,581 మంది స్వామిని దర్శించుకోగా, 27,021 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి భక్తులు హుండీ కానుకల రూపంలో రూ.3.12 కోట్లు సమర్పించారు. శ్రీవారి దర్శన టోకెన్లు లేని భక్తులకు 30 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటల సమయం పడుతోంది.

మల్లన్న సేవలో తెలంగాణ మంత్రి హరీశ్‌రావు


ఆలయ ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామిని శనివారం తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు దర్శించుకున్నారు. వీరికి ఈవో లవన్న, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి ఆశీర్వచన మండపంలో స్వామివార్ల శేష వస్త్రాలు, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.


తెలంగాణ గవర్నర్‌కు శారదాపీఠం వార్షికోత్సవ ఆహ్వానం


తమిళిసైకి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి

సింహాచలం: జనవరి 27 నుంచి 31వ తేదీ వరకు జరిగే విశాఖ శ్రీశారదా పీఠం వార్షికోత్సవాల్లో పాల్గొనాలని తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ని పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో శనివారం ఆమెని కలిసిన స్వాత్మానందేంద్ర సరస్వతి వార్షికోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే రాజశ్యామల యాగంలో పాల్గొని అమ్మవారి అనుగ్రహం, పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆశీస్సులు పొందాలని తమిళిసైని కోరారు.

గ్రామీణ బ్యాంకులపై కేంద్రం వివక్ష

- ప్రాంతీయ, గ్రామీణ బ్యాంకుల ఉద్యోగుల సంఘం



మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి, కామేశ్వరరావు, శోభ తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): గ్రామీణ బ్యాంకుల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తోందని ప్రాంతీయ, గ్రామీణ బ్యాంకుల ఉద్యోగుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. శనివారం గుంటూరులో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఐదు గ్రామీణ బ్యాంకుల మహిళా ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. జాతీయ బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులకు ఒకే నియామక విధానమున్నా.. సర్వీసు రూల్స్, వేతనాలు వేర్వేరుగా ఉన్నాయని చెప్పారు. 40 కోట్ల మంది ఖాతాదారులతో రూ.9 లక్షల కోట్ల టర్నోవర్ కలిగి ఉన్న బ్యాంకుల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపించడం తగదన్నారు. గ్రామీణ బ్యాంకులన్నింటినీ కలిపి జాతీయ గ్రామీణ బ్యాంకు ఏర్పాటు చేసి బలోపేతం చేయాలని కోరారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా నియామకాలు చేపట్టాలని, వాణిజ్య బ్యాంకు ఉద్యోగులతో సమానంగా వేతనాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ టి.కామేశ్వరరావు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ వై.శోభ, సీజీజీబీ అధికారుల సంఘం మహిళా ప్రతినిధులు బీవీ రమణరావు, బి.రవికాంత్, నీతహోర్, మాధవి, అలేఖ్య, ప్రసూన, ప్రత్యూష, వెంకటలక్ష్మి, ఎండీ మజీద్, కె.కోటేశ్వరరావు, డి.పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐర్లాండ్‌లో ఉన్నత విద్యపై ఏయూలో అవగాహన

ఏయూ క్యాంపస్ (విశాఖ తూర్పు): భారతీయ విద్యార్థులకు ఐర్లాండ్ దేశంలో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలపై శనివారం ఆంధ్ర యూనివర్సిటీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏయూ, ఐ 20 ఫీవర్ సంస్థ సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమాన్ని ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి ప్రారంభించారు. ఐర్లాండ్‌కు చెందిన 12 యూనివర్సిటీలతోపాటు అమెరికా, ఫ్రాన్స్‌కు చెందిన ఒక్కో యూనివర్సిటీ ప్రతినిధులు ఏర్పాటుచేసిన స్టాళ్లను ఆయన పరిశీలించారు. క్యూఎస్ ర్యాంకింగ్, అంతర్జాతీయ ర్యాంకింగ్‌లలో ముందున్న ఐర్లాండ్ వర్సిటీలతో కలసి పనిచేయాలని ఏయూ అధికారులకు ఆచార్య కె.హేమచంద్రారెడ్డి సూచించారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఏయూలో అమెరికన్ కార్నర్ తరహాలో ఐర్లాండ్ కార్నర్‌ను ఏర్పాటుచేయాలని ప్రతిపాదన చేశామన్నారు. ఐర్లాండ్‌కు చెందిన సీనియర్ కన్సల్టెంట్ డేవిడ్ ఫాలెన్ మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల విద్యార్థులు పెద్దసంఖ్యలో ఐర్లాండ్‌లో ఉన్నత విద్య అభ్యసిస్తున్నారని తెలిపారు. తమ దేశంలో ఉద్యోగ కల్పన కోసం ఫార్మసీ, ఐటీ సంస్థలు పెద్దసంఖ్యలో ఉన్నాయని, ఐదేళ్లలోనే ఐర్లాండ్ పౌరసత్వం పొందే అవకాశం ఉందని చెప్పారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్స్ పేరి శ్రీనివాసరావు, ఎస్‌కే భట్టి, టి.శోభశ్రీ, ఐర్లాండ్ ప్రతినిధి డేవిస్ ఫాలెన్, అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఎం.జేమ్స్ స్టీఫెన్, ఐ20 ఫీవర్ సంస్థ బ్రాంచ్ మేనేజర్ సాంబమూర్తి పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీలో గ్రంథాలయం ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఆధునికీకరించిన గ్రంథాలయాన్ని శనివారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ సూచనల మేరకు డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తిచేసిన వారికి వెంటనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా ఉన్నత విద్యావ్యవస్థలో మార్పులు తీసుకువస్తున్నట్లు తెలిపారు. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, పాలక మండలి సభ్యులు కె.స్వప్నవాహిని, బి.రాజేష్, డి.పద్మాజీ పాల్గొన్నారు.

టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- ఐటీపీఐ, ఏపీ టూరిజం కాన్ఫరెన్స్‌లో మంత్రి ఆర్కే రోజా


సౌత్ జోన్ కాన్ఫరెన్స్‌లో మంత్రి ఆర్.కె.రోజా

తిరుపతి అలిపిరి/తిరుచానూరు: రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఇండియా, ఏపీ టూరిజం అథారిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న సమీకృత సుస్థిర పర్యాటక ప్రణాళిక, అభివృద్ధి సౌత్‌జోన్ కాన్ఫరెన్స్ శనివారం తిరుపతిలోని ఓ హోటల్లో నిర్వహించారు. మంత్రి ఆర్కే రోజా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మన సంస్కృతిలో పర్యాటకుడిని దేవుడిగా పరిగణిస్తారన్నారు. రాష్ట్ర ప్రస్తుత పర్యాటక విధానం (2020–25) పర్యాటక పరిశ్రమ అభివృద్ధి, పెంపుదలకు ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో పర్యాటక ఆధారిత వ్యాపార సంస్థల నమోదుకు టూరిజం శాఖ కసరత్తు చేపట్టిందని, టూరిజం ట్రేడ్ (రిజిస్ట్రేషన్–ఫెసిలిటేషన్)–2020 ప్రారంభం ద్వారా పర్యాటక సేవా ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. అనంతరం ఐటీపీఐ అధ్యక్షుడు మేత్రం, డైరెక్టర్ కొండ రమేష్ ఆధ్వర్యంలో పలు సెషన్లు కొనసాగాయి. కార్యక్రమంలో ఐటీపీఐ సెక్రటరీ జనరల్ ప్రదీప్ కుమార్, టూరిజం డిప్యూటీ సీఈవో రాముడు, రీజినల్ డైరెక్టర్ ఏపీటీడీసీ రమణ ప్రసాద్, జిల్లా టూరిజం అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి, టూరిజం డీవీఎం గిరిధర్ రెడ్డి, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కంట్రీ టౌన్ ప్లానింగ్, టూరిజం శాఖల ప్రతినిధులు హాజరయ్యారు.

అది వారాహి కాదు నారాహి: మంత్రి రోజా

పవన్‌కళ్యాణ్ తయారు చేయించుకున్న వాహనం వారాహి కాదు అని 'నారా'హి అని మంత్రి ఆర్కే రోజా ఎద్దేవా చేశారు. యుద్ధం చేస్తున్నానంటూ పిచ్చి పిచ్చి ట్వీట్లు చేస్తున్న పవన్‌కు, ఆ యుద్ధంపై స్పష్టత ఉందా? అని ప్రశ్నించారు. తిరుపతిలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. పవన్ పూసుకునేది పసుపురంగేనని ప్రజలకు తెలుసన్నారు. పార్టీ అధ్యక్షుడిగా రెండుచోట్ల పరాజయం పాలైన వ్యక్తిని చూసి భయపడాలా? అని నాదెండ్ల మనోహర్‌ను ప్రశ్నించారు. దమ్మున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, తన జెండా అజెండాలతో 151 సీట్లు గెలుచుకొని ప్రజలకు సుస్థిర పాలన అందిస్తున్నారన్నారు. పవన్‌కి నిజంగా దమ్ముంటే 175 స్థానాల్లో వాళ్ల పార్టీ అభ్యర్థులను నిలబెట్టాలని చాలెంజ్ విసిరారు.

రూ.కోటితో 3డీ డిజిటల్ మెమోగ్రామ్

- జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఏర్పాటు
- 12న మంత్రి రజిని చేతుల మీదుగా ప్రారంభం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న యడ్లపాటి అశోక్‌కుమార్, పక్కన డాక్టర్ ప్రభావతి

గుంటూరు మెడికల్: రాష్ట్రంలో మొదటిసారిగా రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించేందుకు అవసరమైన అత్యాధునిక 3 డీ డిజిటల్ మెమోగ్రామ్ వైద్య పరికరాన్ని గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఏర్పాటు చేశామని నాట్కో సెంటర్ కోఆర్డినేటర్ యడ్లపాటి అశోక్‌కుమార్ చెప్పారు. శనివారం ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అమృతలూరుకు చెందిన గడ్డిపాటి కస్తూరిదేవి, రామ్మోహన్‌రావు, నాట్కో ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో మెమోగ్రామ్ వైద్య పరికరం సమకూర్చినట్లు తెలిపారు. నాట్కో ట్రస్టు రూ. 40 కోట్లతో క్యాన్సర్ రోగులకు కార్పొరేట్ వైద్య సేవలు అందించేందుకు వందపడకలతో జీజీహెచ్‌లో నూతన క్యాన్సర్ సెంటర్ నిర్మించిందని వివరించారు. నాట్కో ట్రస్టు ఆధ్వర్యంలో క్యాన్సర్ ఆపరేషన్లు చేసేందుకు ప్రత్యేక ఆపరేషన్ థియేటర్ నిర్మాణం చేశామన్నారు. సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చేతుల మీదుగా డిజిటల్ మెమోగ్రామ్ వైద్య పరికరం ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి పాల్గొన్నారు.

తిరుమల నుంచి శ్రీశైలం చేరుకున్న జగ్గిరెడ్డి పాదయాత్ర



శ్రీశైలం టెంపుల్: వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ కోనసీమ జిల్లా కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తిరుమల నుంచి శ్రీశైలానికి చేపట్టిన మహాపాదయాత్ర శనివారం మధ్యాహ్నం ముగిసింది. శ్రీశైలం చేరుకున్న ఎమ్మెల్యే.. భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అతిథి గృహం వద్ద మీడియాతో మాట్లాడుతూ మూడున్నరేళ్లలో ఇచ్చిన హామీలు 98 శాతం నెరవేర్చి సుపరిపాలన అందిస్తున్న జగన్ ప్రభుత్వం.. మళ్లీ రావాలని పాదయాత్ర చేపట్టినట్టు చెప్పారు. సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజా సంకల్పంతో పాటు దైవం తోడుగా ఉన్నందున 2024లో జరిగే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు సీఎం అవుతారని జగ్గిరెడ్డి స్పష్టం చేశారు.

87 మంది హోంగార్డులు తొలగింపు

నకిలీ పత్రాలతో చిత్తూరు పోలీసుశాఖలో ఉద్యోగాలు

- నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో భారీగా చేరికలు
- దాదాపు రూ.5 కోట్ల వరకు వసూళ్లు
- అప్పటి జిల్లా తెలుగు తమ్ముళ్ల ప్రోద్బలంతో నియామకాలు
- అధికారులు, తమ్ముళ్ల అరెస్టుకు సమాలోచనలు



చిత్తూరు అర్బన్: అందరి తప్పొప్పుల్ని సరిదిద్దే పోలీసు శాఖలోకే తప్పుడు పత్రాలతో ప్రవేశిస్తే.. ఇలా దాదాపు ఎనిమిదేళ్లుగా నెలనెలా జీతాలు తీసుకుంటూ విధులు నిర్వర్తిస్తే.. అవును, చిత్తూరు పోలీసు జిల్లాలో అక్షరాలా ఇదే జరిగింది. ఇందుకు ప్రధాన బాధ్యులు టీడీపీ నేతలు.. వారి మాటను కాదనలేకపోయిన అప్పటి పోలీసు ఉన్నతాధికారులు. ఈ ఘటనలో 87 మంది హోంగార్డులను తొలగిస్తూ శనివారం అనంతపురం రేంజ్ డీఐజీ రవిప్రకాష్ ఉత్తర్వులు జారీచేశారు. చిత్తూరు జిల్లా పోలీసు శాఖను కుదిపేస్తున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలివీ..

బయటపడింది ఇలా..

హోంగార్డుల్లో రెండు కేటగిరీలు ఉంటాయి. ఒకటి పోలీసు శాఖలోని స్టేషన్లలో పనిచేయడం. వీళ్లకు ప్రభుత్వం నుంచే వేతనాలు అందుతాయి. రెండోది.. ఆన్–పేమెంట్. అగ్నిమాపక, టీటీడీ, ఆర్టీసీ, రవాణా శాఖ, ఎఫ్‌సీఐ లాంటి సంస్థల్లో విధులు నిర్వర్తిస్తుంటారు. వీళ్లకు ఆయా శాఖల నుంచి ప్రతీనెలా వేతనాలు అందుతాయి. ఈ సంస్థల్లో పనిలేనప్పుడు వీరిని పోలీసుశాఖకు అప్పగిస్తారు. ఆ సమయంలో వాళ్లకు వేతనాలు చెల్లించరు. పని ఉంటేనే వేతనాలు చెల్లిస్తారు. ఇటీవల ఇలాంటి హోంగార్డులకు డ్యూటీలు కేటాయించేటపుడు చిత్తూరు ఆర్ఐ మురళీధర్ ఉండాల్సిన వాళ్లకంటే కొందరు ఎక్కువగా ఉండటంతో విషయాన్ని ఎస్పీ రిషాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే, మూణ్నెల్ల క్రితం వన్‌టౌన్‌లో ఆర్ఐ మురళీధర్ ఈ విషయమై ఫిర్యాదు చేయగా, కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. తొలుత మణికంఠ అనే హోంగార్డును విచారించగా.. చిత్తూరుకు చెందిన టీడీపీ నేతల ఆదేశాలతో తాను, యువరాజ్, జయకుమార్, కిరణ్ తదితరులు ఒక్కో పోస్టుకు రూ.3 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు డబ్బులు వసూలుచేసి, అప్పటి అధికారులకు లంచంగా ఇచ్చి హోంగార్డు ఉద్యోగాలు పొందినట్లు అంగీకరించాడు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తునకు ఆదేశించిన ఎస్పీ మరిన్ని వివరాలు రాబట్టారు.

అరెస్టులకు న్యాయపరమైన సలహాలు

హోంగార్డులకు డ్యూటీలు కేటాయించేపుడు పాస్‌పోర్టు, డీఓ (డ్యూటీ ఆర్డర్)ను అధికారులు ఇస్తుంటారు. ఇలా ఇచ్చేటపుడు నిజమైన హోంగార్డును పుత్తూరు అగ్నిమాపక శాఖలో విధులు కేటాయిస్తున్నట్లు టైపుచేసి, ఇతనితో పాటు అదనంగా మరో ఐదుగురు నకిలీ హోంగార్డుల పేర్లను టైపుచేసి డీఓ ఇస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంటారు. ఇలా ఏకంగా 87 మందిని పలు సంస్థల్లో నియమించేశారు. ఇందులో కీలకపాత్ర పోషించింది టీడీపీ హయాంలో చినబాబుకు కుడిభుజంగా మెలగిన చిత్తూరు జిల్లా పార్టీ నేతగా తెలుస్తోంది. ఇతను ఆడమన్నట్లు ఆడిన అప్పటి చిత్తూరు పోలీసు బాసు, ఓ ప్రత్యేక డీఎస్పీ సైతం ఈ కుంభకోణంలో చిక్కుకున్నారు. మరోవైపు.. చిత్తూరు, గంగాధర నెల్లూరు, పూతలపట్టు, పలమనేరుకు చెందిన టీడీపీ ముఖ్య నేతలు కొందరు దాదాపు రూ.5 కోట్ల వరకు వసూలుచేసిన మొత్తంలో కొంత ఉన్నతాధికారులకు ఇచ్చి మిగిలిన సొమ్ము చిన్నబాబుకు అందజేశారని పెద్దఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. దీంతో అప్పటి ఐపీఎస్ అధికారి, డీఎస్పీలు, ఆర్ఐలతో పాటు టీడీపీ నేతలను అరెస్టుచేయడానికి పోలీసులు న్యాయపరమైన సలహాలు తీసుకుంటున్నట్లు సమాచారం.

తమ్ముళ్లలో వణుకు..

నిజానికి.. పోలీసుశాఖలో అంతర్లీనమైన హోంగార్డులు విధుల్లోకి చేరాలంటే నోటిఫికేషన్, శారీరక దేహదారుఢ్య పరీక్షలు, తుదిగా రాత పరీక్షల్లో ప్రతిభ చూపించడం తప్పనిసరి. అయితే, ఇవేమీ లేకుండా 2014–2019 మధ్య కాలంలో చిత్తూరు జిల్లా పోలీసు శాఖలోకి దాదాపు 87 మంది హోంగార్డులు చేరిపోయారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ నకిలీ హోమ్‌గార్డులు నెలనెలా వేతనాలు తీసుకుంటున్నారు. ఇప్పటికే హోంగార్డుల తొలగింపు విషయం సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంతో చిత్తూరుకు చెందిన తెలుగు తమ్ముళ్లు వణికిపోతున్నారు.

ఏ ఒక్కర్నీ వదలం



ఇది చాలా పెద్ద నేరం. అసలు ఎలాంటి పరీక్షలు, శిక్షణ లేకుండా పోలీసుశాఖలో చేరిపోవడం అంటే తమాషా కాదు. ప్రాథమికంగా 87 మంది హోంగార్డులను డీఐజీ తొలగించారు. దీనిపై దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. ఉద్దేశ్యపూర్వకంగా తప్పు అని తేలితే ఆ హోంగార్డులను సైతం అరెస్టుచేస్తాం. ఈ కుట్రలో పాలు పంచుకున్న వాళ్లు ఎంతటివారైనా వదిలే ప్రసక్తేలేదు.

– వై. రిషాంత్‌రెడ్డి, ఎస్పీ, చిత్తూరు.

మళ్లీ సొంతగూటికి కాంగ్రెస్ కౌన్సిలర్లు

ఆప్‌లో చేరిన గంటల్లోనే వెనక్కు

న్యూఢిల్లీ: ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(ఎంసీడీ) ఫలితాలు వెలువడగానే కాంగ్రెస్‌ను వీడి ఆప్‌లో చేరిన కౌన్సిలర్లు కొద్దిగంటల్లోనే మళ్లీ సొంత పార్టీ కాంగ్రెస్‌లోకి తిరిగొచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ ఉపాధ్యక్షుడు అలీ మెహదీ, పార్టీ నుంచి కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు సబిలా బేగం, నాజియా ఖాటూన్ శుక్రవారం ఆమ్ ఆద్మీ పార్టీలో చేరిన విషయం తెల్సిందే. దీంతో సబిలా గెలిచిన ముస్తఫాబాద్‌లో స్థానికులు ఆందోళనకు దిగి దిష్టిబొమ్మ దగ్ధంచేశారు. మరోవైపు, తమ పార్టీ కౌన్సిలర్లను మభ్యపెట్టి చేర్చుకుంటోందని ఆప్‌పై ఢిల్లీ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ముదిత్ అగర్వాల్ ఆరోపించారు. దీంతో మెహదీ, సబిలా, నాజియాలు తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. శనివారం కాంగ్రెస్‌లోకి తిరిగొచ్చాక మెహదీ పార్టీకి క్షమాపణలు చెబుతూ ఒక వీడియో పోస్ట్‌చేశారు.

క్లుప్తంగా...

శ్రమించి సాధించాం: కేజ్రీవాల్

- బీజేపీ కుట్రలన్నింటినీ తట్టుకున్నాం
- నూతన కౌన్సిలర్ల భేటీలో వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ మునుపెన్నడూ లేనంత స్థాయిలో ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) ఎన్నికల్లో అత్యంత విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటూ విజయతీరాలకు చేరిందని పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అభిప్రాయపడ్డారు. తమ కౌన్సిలర్లకు తలో రూ.20 లక్షలను ఎరగా వేస్తూ బీజేపీ ఇప్పటికే కుట్రకు తెరతీసిందని ఆరోపించారు. ఆప్ కొత్త కౌన్సిలర్లతో భేటీ సందర్భంగా బీజేపీపై ఆయన దుమ్మెత్తిపోశారు. ''ఆప్ ఆవిర్భావం తర్వాత ఎదుర్కొన్న అత్యంత కఠిన ఎన్నికలివే. జైల్లో ఉన్న మా మంత్రి సత్యేంద్ర జైన్‌పై విషప్రచారం చేసి ఎన్నికల్లో లబ్ధిపొందాలనుకుంది'' అన్నారు. ''మీలో కొందరికి బీజేపీ నుంచి ఫోన్లు వచ్చాయి. వారి బెదిరింపుల, కొనుగోలు సంస్కృతిని బయటపెడదాం. ప్రతి ఫోన్‌కాల్ రికార్డ్ చేయండి'' అని ఆప్ కౌన్సిలర్లకు సూచించారు.

మహిళలకు కండోమ్స్ ఫ్రీ

లైంగిక వ్యాధుల దెబ్బకు ఫ్రాన్స్ నిర్ణయం

పారిస్: లైంగిక వ్యాధుల బాధితుల సంఖ్య విపరీతంగా పెరగడంతో ఫ్రాన్స్ ప్రభుత్వం కొత్త ఆలోచన చేసింది. లైంగిక సాంక్రమిక వ్యాధుల (ఎస్‌టీడీ) నియంత్రణకు దేశంలో 25 ఏళ్లు, అంతకంటే తక్కువ వయసు వారికి 2023 జనవరి నుంచి ఉచితంగా కండోమ్స్ అందిస్తామని అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ శుక్రవారం ప్రకటించారు. వాటిని ఏ ఫార్మసీలోనైనా పొందొచ్చని చెప్పారు. పురుషులకు మాత్రం వాటిని ఉచితంగా ఇవ్వబోరు. ఫ్రాన్స్‌లో అదుపులోలేని ద్రవ్యోల్బణం కారణంగా ఖర్చులు పెరిగిపోయిన ఈ తరుణంలో అవాంఛిత గర్భం దాలిస్తే, అమ్మాయిలు, మహిళల ఆర్థిక కష్టాలు మరింత ఎక్కువయ్యే అవకాశముందని, అందుకే వారికే వీటిని ఉచితంగా అందివ్వనున్నారని తెలుస్తోంది. హెచ్‌ఐవీ, ఇతర లైంగిక వ్యాధుల నిర్ధారణ పరీక్షలు విస్తృత స్థాయిలో చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫ్రాన్స్‌లో 2020, 2021 ఏడాదిలో లైంగిక సాంక్రమిక వ్యాధు(ఎస్‌టీడీ)లు ఏకంగా 30 శాతం పెరిగాయి. 2018లో ఫ్రాన్స్ ఒక పథకం తెచ్చింది. పౌరులు కండోమ్స్ కొనుగోలు చేస్తే వాటికయిన ఖర్చును ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది. ఈ ఏడాది తొలినాళ్లలో 26 ఏళ్లలోపు మహిళలకు గర్భనిరోధకాలు ఉచితంగా పంపిణీచేసింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే 26 ఏళ్లలోపు మహిళలకు ఉచితంగా లైంగికవ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తారు. ఫ్రాన్స్‌లో అబార్షన్ ఉచితంగా చేస్తారు.

ఓటరు జాబితాలో 56 కోట్ల మంది ఆధార్ లింకేజీ : ఈసీ

న్యూఢిల్లీ: దేశంలో దాదాపుగా 56 కోట్ల మంది ఓటర్లు తమ ఎన్నికల గుర్తింపు కార్డుకి ఆధార్‌ని అనుసంధానం చేశారని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. దేశవ్యాప్తంగా 95 కోట్ల మంది రిజిస్టర్డ్ ఓటర్లు ఉంటే వారిలో 55 నుంచి 56 కోట్ల మంది ఓటరు జాబితాలో అనుసంధానానికి ఎన్నికల అధికారులకు ఆధార్ వివరాలను సమర్పించారని తెలిపింది. గత ఏడాది డిసెంబర్‌లో సవరించిన ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం ఓటరు జాబితాకు ఆధార్ లింకేజీ ఐచ్ఛికం. ఓటర్లకు ఇష్టమైతేనే వివరాలు సమర్పించవచ్చు. అయితే ఈ ఏడాది కేంద్ర న్యాయ శాఖ కొత్తగా ప్రవేశపెట్టిన ఫార్మ్–6బీని ఆధార్ వివరాలతో నింపి ఎన్నికల అధికారులకు సమర్పించాలంటూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆగస్టు 1 నుంచి ఓటర్ల ఆధార్ వివరాలు సేకరిస్తూ ఉంటే ఇప్పటివరకు 56 కోట్ల మంది ఇచ్చినట్టుగా ఈసీ అధికారులు వివరించారు.




అమెరికాలో వేలంపాటలో ఏకంగా రూ.94 లక్షలు పలికిన మైనింగ్ కార్మికుల జత జీన్ ప్యాంట్లు ఇవి. ఉత్తర కరోలినాలో ఓ నౌక శిథిలాల నుంచి 1857లో వీటిని సేకరించారు. వేలంలో అమ్ముడుపోయిన అత్యంత పాత లెవీ స్ట్రాస్ ప్యాంట్లు ఇవేనని భావిస్తున్నారు.

నేడే ఓరియాన్ రాక

ల్యాండయ్యేదాకా ఆద్యంతం హై రిస్కే నాసా సైంటిస్టుల్లో తీవ్ర ఉత్కంఠ

వాషింగ్టన్: చంద్రునిపైకి అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా ఆర్టెమిస్ 1 ద్వారా దాదాపు నెల క్రితం ప్రయోగించిన ఓరియాన్ స్పేస్‌క్రాఫ్ట్ విజయవంతంగా పని పూర్తి చేసుకుని తిరిగి రానుంది. ఏకంగా 13 లక్షల కిలోమీటర్ల ప్రయాణం అనంతరం ఎట్టకేలకు భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి భూమిని చేరనుంది. అయితే ఇది ఆద్యంతం హై రిస్కుతో కూడుకున్న తిరుగు ప్రయాణమని నాసా చెబుతోంది. ఎందుకంటే భూ వాతావరణంలోకి ప్రవేశించాక ఓరియాన్ ఏకంగా గంటకు పాతిక వేల మైళ్ల వేగంతో దూసుకురానుంది. ఈ క్రమంలో ఏర్పడే ఘర్షణ వల్ల ఏకంగా 2,760 డిగ్రీల వేడి కూడా పుట్టుకొస్తుంది. అంటే సూర్యునిపై ఉండే వేడిలో సగం! అంతటి వేగాన్ని, వేడిని తట్టుకుంటూ ఆర్టెమిస్ పసిఫిక్ మహాసముద్రంలో కాలిఫోర్నియాలోని శాన్ డియాగో వద్ద తీరానికి దాదాపు 50 మైళ్ల దూరంలో క్షేమంగా దిగాల్సి ఉంటుంది. ఇది పెను సవాలేనని నాసా సైంటిస్టులంటున్నారు. అందుకే వారిలో ఇప్పట్నుంచే తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పైగా ఓరియాన్ ల్యాండింగ్ కోసం నాసా తొలిసారిగా 'స్కిప్ ఎంట్రీ' టెక్నిక్‌ను వాడుతుండటం ఉత్కంఠను మరింత పెంచుతోంది. దీనిప్రకారం నీళ్లలోకి విసిరిన రాయి మాదిరిగా ఓరియాన్ భూ వాతావరణం తాలూకు పై పొరలోకి ఒక్కసారిగా వచ్చి పడుతుంది. తద్వారా దాని అపార వేగం చాలావరకు తగ్గడమే గాక వేడి కూడా అన్నివైపులకూ చెదిరిపోతుందట. అంతిమంగా ఓరియాన్ వేగాన్ని గంటకు 20 మైళ్లకు తగ్గించాలన్నది లక్ష్యం. ఇందుకోసం 11 భిన్నమైన పారాచూట్లను వాడనున్నారు. అయితే వేగం అదుపులోకి వచ్చేలోపు 2,760 డిగ్రీల వేడిని ఓరియాన్ ఏ మేరకు తట్టుకుంటుందన్నది అత్యంత కీలకం. ''దీనికి ప్రస్తుతానికి మా దగ్గర కూడా స్పష్టమైన సమాధానం లేదు. అందుకే, ఏం జరుగుతుందా అని ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాం'' అని నాసా సైంటిస్టు ఒకరు చెప్పుకొచ్చారు. ఆ అపార వేడిని సమర్థంగా తట్టుకునేందుకు రక్షణ పరికరాల ఉత్పత్తి దిగ్గజం లాక్‌హీడ్–మార్టిన్ తయారు చేసిన అత్యంత మందమైన హీట్ షీల్డ్‌ను ఓరియాన్‌కు అమర్చారు.





ఆ ఏడు నిమిషాలే కీలకం...: ఓరియాన్ భూ వాతావరణంలోకి ప్రవేశించాక తొలి ఏడు నిమిషాలను అత్యంత కీలకమైనవిగా నాసా అభివర్ణిస్తోంది. ఆ సందర్భంగా కనీసం 10 నిమిషాల పాటు స్పేస్‌క్రాఫ్ట్‌తో అన్నిరకాల సమాచార సంబంధాలూ తెగిపోతాయని చెబుతోంది.

రేపే భూపేంద్రకు పట్టం

- బీజేఎల్పీ నేతగా ఎన్నిక
- సీఎంగా రెండోసారి ప్రమాణం



గవర్నర్‌తో భూపేంద్ర పటేల్

గాంధీనగర్: గుజరాత్ ముఖ్యమంత్రిగా భూపేంద్ర పటేల్ (60) వరుసగా రెండోసారి ప్రమాణస్వీకారం చేయనున్నారు. శనివారం జరిగిన సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యేలంతా ఆయన్ను పార్టీ శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యాలయం 'కమలం'లో జరిగిన ఈ భేటీకి పార్టీ కేంద్ర పరిశీలకులుగా సీనియర్ నేతలు రాజ్‌నాథ్‌సింగ్, యడ్యూరప్ప, అర్జున్ ముండా హాజరయ్యారు. అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది ముందు 2021లో విజయ్ రూపానీ స్థానంలో సీఎంగా భూపేంద్ర పగ్గాలు చేపట్టారు. గురువారం వెలువడ్డ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో 182 స్థానాలకు గాను ఏకంగా 156 సీట్లను కొల్లగొట్టి బీజేపీ రికార్డు విజయం సొంతం చేసుకోవడం తెలిసిందే. కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు వీలుగా మంత్రివర్గంతో పాటుగా భూపేంద్ర శుక్రవారం రాజీనామా చేశారు. శనివారం ఎల్పీ నేతగా ఎన్నికయ్యాక గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు సంసిద్ధత తెలిపారు. సోమవారం ఆయన రాష్ట్ర 18వ సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. గాంధీనగర్‌లోని హెలిప్యాడ్ మైదానంలో జరిగే కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో పాటు బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు హాజరవుతారు.

హిమాచల్ సీఎంగా సుఖు

- డిప్యూటీగా ముకేశ్ అగ్నిహోత్రి
- నేడే ప్రమాణస్వీకారం

సిమ్లా/కలబుర్గి (కర్ణాటక): హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రిగా సుఖ్విందర్‌సింగ్ సుఖును కాంగ్రెస్ అధిష్టానం ఎంపిక చేసింది. గత అసెంబ్లీలో విపక్ష నేతగా కొనసాగిన ముకేశ్ అగ్నిహోత్రి (60) ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. తీవ్ర మల్లగుల్లాలు, గత 24 గంటల్లో ఏకంగా రెండుసార్లు కాంగ్రెస్ శాసనసభా పక్ష భేటీ తదితరాల అనంతరం అధిష్టానం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. పార్టీ కేంద్ర పరిశీలకునిగా వచ్చిన ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ భగెల్, భూపీందర్‌సింగ్ హుడా, రాజీవ్ శుక్లా శనివారం సీఎల్పీ తాజా భేటీ అనంతరం మీడియాకు ఈ మేరకు వెల్లడించారు. అనంతరం కాంగ్రెస్ నేతలు రాజ్‌భవన్‌లో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు సంసిద్ధత వెలిబుచ్చారు. ఆదివారం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. ఆయనతో పాటు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా తదితరులు ప్రమాణ స్వీకారంలో పాల్గొంటారు.

తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 68 స్థానాలకు గాను కాంగ్రెస్ 40 సీట్లు గెలిచి స్పష్టమైన మెజారిటీ సాధించడం తెలిసిందే. గురువారం ఫలితాలు వెలువడ్డప్పటి నుంచే సీఎం పదవి కోసం కాంగ్రెస్ నేతల్లో తీవ్ర పోరు నెలకొంది. మాజీ సీఎం వీరభద్రసింగ్ భార్య, పీసీసీ చీఫ్ ప్రతిభా సింగ్ తదితర ఆశావహులంతా విఫలయత్నం చేశారు. 58 ఏళ్ల సుఖు తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రచార కమిటీకి సారథ్యం వహించారు. దిగువ హిమాచల్ ప్రాంతం నుంచి సీఎం అవుతున్న తొలి కాంగ్రెస్ నేత ఆయనే. సుఖ్విందర్ సీఎం కానున్నట్టు తెలియగానే హమీర్పూర్ జిల్లాలోని సొంతూరు నదౌన్‌లో, అక్కడి ఆయన నివాసంలో సంబరాలు మొదలయ్యాయి.

కౌన్సిలర్ నుంచి సీఎం వరకు..

అంచెలంచెలుగా ఎదిగిన పోరాట యోధుడు



కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఎన్‌ఎస్‌యూఐ నాయకుడి నుంచి ముఖ్యమంత్రి వరకు సుఖ్విందర్ సుఖు అంచెలంచెలుగా ఎదిగారు. సిమ్లాలో వార్డు కౌన్సిలర్, యువజన విభాగం అధ్యక్షుడు, హమీర్పూర్ జిల్లా నాదౌన్ ఎమ్మెల్యే, తర్వాత పీసీసీ అధ్యక్షుడు, ఇప్పుడు సీఎం.. ఇలా అన్ని స్థాయిల్లో పదవుల్ని చేపట్టారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో అత్యంత చరిష్మా ఉన్న దివంగత సీఎం వీరభద్రసింగ్ ప్రత్యర్థిగా ఉంటూనే పార్టీలో స్వయంశక్తితో ఎదిగారు. ఈ ఎన్నికల్లో పార్టీ ప్రచార కమిటీకి నేతృత్వం వహించి విజయతీరాలకు చేర్చారు. నాదౌన్ నుంచి బీజేపీ అభ్యర్థి విజయ్ అగ్నిహోత్రికి మద్దతుగా ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా వంటి హేమాహేమీల ప్రచారాన్ని తట్టుకుని మరీ గెలిచారు.

1964 మార్చి 27న నాదౌన్‌లో సాధారణ కుటుంబంలో సుఖు జన్మించారు. తండ్రి రసీల్ సింగ్ రాష్ట్ర రవాణా కార్పొరేషన్‌లో డ్రైవర్. విద్యార్థిగా ఫీజుల కోసం సిమ్లాలో పాలమ్మేవారు. న్యాయశాస్త్రంలో డిగ్రీ చేశాక కాంగ్రెస్‌లో చేరారు. 1989 నుంచి ఆరేళ్ల పాటు విద్యార్థి నేతగా చురుగ్గా ఉన్నారు. 1998 నుంచి పదేళ్లు ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర చీఫ్‌గా చేశారు. 1992, 1997ల్లో సిమ్లా కార్పొరేషన్లో కౌన్సిలర్‌గా నెగ్గారు. 2003లో నాదౌన్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. వరసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. పార్టీపై ఆయనకున్న పట్టు, కార్యక్రమాల నిర్వహణ సామర్థ్యాన్ని గుర్తించిన అధిష్టానం 2013లో పీసీసీ పగ్గాలు అప్పగించింది. ఆరేళ్లపాటు పీసీసీ చీఫ్‌గా ముఠా సంస్కృతిని ప్రోత్సహించకుండా కార్యకర్తలతో, నేతలతో సన్నిహిత సంబంధాలు కొనసాగించారు. రాహుల్‌గాంధీకి అత్యంత సన్నిహితుడని పేరుంతివే ఆయన్ను సీఎం పీఠానికి దగ్గర చేశాయి. వీరభద్రసింగ్ భార్య ప్రతిభా సింగ్‌ను కాదని మరీ 25 మంది ఎమ్మెల్యేలు సుఖుకే మద్దతు పలికారంటే ఆయనకున్న మంచిపేరే కారణం. అందుకే అధిష్టానం సుఖు నాయకత్వ సామర్థ్యానికే ఓటేసింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

హిమాచలే ఆదర్శం: ఖర్గే

కలబుర్గి: హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికల ఫలితాలను వచ్చే ఏడాది కర్నాటకలో పునరావృతం చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ శ్రేణులకు ఖర్గే పిలుపునిచ్చారు. 10 సూత్రాల ప్రణాళిక ద్వారా మనం హిమాచల్‌లో మంచి మెజారిటీతో నెగ్గామని చెప్పుకొచ్చారు.

ఆ తీర్మానంతో ఉగ్ర సంస్థలకు లబ్ధి

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో ఓటింగ్‌కు దూరంగా భారత్

ఐక్యరాజ్యసమితి: ఐక్యరాజ్య సమితి విధించిన ఆంక్షల చట్రం నుంచి మానవతా దృక్పథంతో చేసే సహాయాలను మినహాయించాలని భద్రతా మండలిలో ప్రవేశపెట్టిన తీర్మానంపై ఓటింగ్‌కు భారత్ దూరంగా ఉంది. మానవతా దృక్పథంతో సాయం చేస్తే పాకిస్తాన్ వంటి దేశాల్లో ఉగ్రవాద సంస్థలు లాభపడతాయని పేర్కొంది. యూఎన్ అందించే ఆర్థిక సాయంతో ఆ ఉగ్ర సంస్థలు నిధుల సేకరణ, ఉగ్రవాదుల నియామకం చేస్తాయని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా, ఐర్లాండ్‌లు సంయుక్తంగా శుక్రవారం ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. 15 సభ్య దేశాలున్న భద్రతా మండలిలో 14 దేశాలు తీర్మానానికి అనుకూలంగా ఓటెయ్యగా భారత్ దూరంగా ఉంది. భద్రతా మండలికి భారత్ అధ్యక్షత వహిస్తుండటం తెలిసిందే. మండలి అధ్యక్షురాలు, యూఎన్‌లో భారత్ శాశ్వత సభ్యురాలు రుచిరా కాంబోజ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, ''మానవతా దృక్పథంతో చేసే సాయం నిధులు దుర్వినియోగమవడం, వాటితో ఉగ్ర సంస్థలు లబ్ధి పొందడం గతంలో చాలా చూశాం. పాకిస్తాన్‌లో కొన్ని ఉగ్ర సంస్థలు మానవతా సంస్థల ముసుగులో వాటిని సేకరించాయి'' అన్నారు.



బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో శనివారం ప్రభుత్వ వ్యతిరేక ర్యాలీలో భారీ సంఖ్యలో పాల్గొన్న ఆందోళనకారులు. షేక్ హసీనా ప్రభుత్వం దిగిపోవాలని, సార్వత్రిక ఎన్నికలయ్యే దాకా తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడాలని విపక్ష పార్టీలకు చెందిన ఈ నిరసనకారులు డిమాండ్ చేశారు.

మహారాష్ట్ర, కర్నాటక సీఎంలతో... త్వరలో అమిత్ షా భేటీ

కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు సమస్య పరిష్కారానికి రంగంలోకి కేంద్రం

బెంగళూరు: మహారాష్ట్ర, కర్ణాటక మధ్య సరిహద్దు వివాద పరిష్కారానికి కేంద్రం రంగంలోకి దిగింది. ఇరు రాష్ట్రాల సీఎంలతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా వచ్చే వారం భేటీ కానున్నారు. కర్ణాటక సీఎం బసవరాజ్ బొమ్మై శనివారం మీడియాకు ఈ విషయం చెప్పారు. ''వివాదంపై తమ ప్రభుత్వ వైఖరి, వాస్తవాలను షాకు ఫోన్‌లో వివరించా. దీనిపై అఖిలపక్షం కూడా నిర్వహిస్తాం'' అన్నారు. మహారాష్ట్రలో విపక్ష కూటమి మహావికాస్ అగాడీ ఎంపీలు అమిత్ షాను కలవడం తెలిసిందే. ''కర్నాటక బీజేపీ ఎంపీలు సోమవారం అమిత్ షాను కలవనున్నారు. నేనూ ఆయనతో మాట్లాడా. ఇరువురు సీఎంలతో సమావేశం నిర్వహిస్తానని షా చెప్పారు. డిసెంబర్ 14, లేదా 15 తేదీల్లో భేటీ ఉంటుంది'' అని బొమ్మై వివరించారు.

చిన్నారులపై లైంగిక వేధింపులు... తీవ్రమైన సమస్య: సీజేఐ

- నిందితుడు కుటుంబీకుడైనా సరే ఫిర్యాదు చేయాల్సిందే
- కుటుంబాలను చైతన్యపరచాలి



న్యూఢిల్లీ: చిన్నారులపై కొనసాగుతున్న లైంగిక వేధింపులపై సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆవేదన వ్యక్తంచేశారు. చిన్నారులపై లైంగిక నేరాల నిరోధక చట్టం(పోక్సో)పై ఢిల్లీలో రెండు రోజుల జాతీయ సదస్సులో శనివారం పాల్గొన్న సందర్భంగా సీజేఐ చంద్రచూడ్ ప్రసంగించారు. 'పిల్లలపై లైంగిక అకృత్యాల అంశం సమాజంలో పెనుసమస్యగా తయారైంది. చిన్నారి లైంగిక హింసకు గురైనప్పుడు ఆ విషయాన్ని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయకుండా బాధిత కుటుంబం మౌనంగా ఉంటున్న సందర్భాలే ఎక్కువ. ఈ సంస్కృతి మారాలి. నిందితుడు సొంత కుటుంబసభ్యుడైనా సరే ఫిర్యాదు చేసేలా బాధిత కుటుంబాల్లో ధైర్యం, చైతన్యం, అవగాహన పెరగాలి. అందుకు రాష్ట్ర ప్రభుత్వాలే ముందుకు రావాలి. బాధిత చిన్నారుల వేదన వెంటనే తీర్చలేని స్థితిలో, తక్షణ న్యాయం చేకూర్చలేని స్థితిలో మన నేర శిక్షాస్మృతి ఉందనేది వాస్తవం. ఆ చిన్నారులకు సత్వర న్యాయం సాధ్యపడాలన్నా, ఇలాంటి ఘటనలు పునరావృతంకాకుండా అడ్డుకట్ట వేయాలన్నా న్యాయవ్యవస్థతో కార్యనిర్వాహక వ్యవస్థలు చేతులు కలిపాల్సిందే. చిన్నారులు లైంగిక వేధింపుల బారిన పడకుండా ముందుగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం అత్యంత ముఖ్యం. పిల్లలను ఎవరైనా తాకినప్పుడు అందులో తప్పుడు ఉద్దేశం ఉందా లేదా అనేది కనిపెట్టే 'తెలివి'ని పిల్లలకు బోధించాలి. లైంగిక వేధింపుల బారిన పడిన చిన్నారుల తల్లిదండ్రులు.. కుటుంబపరువు పోతుందని మౌనంగా ఉంటున్నారు. ఇలా మౌనంవహిస్తే బాధిత చిన్నారి వర్ణనాతీత వేదన తీరేదెలా? చిన్నారికి న్యాయం దక్కేదెలా ? ఆ తల్లిదండ్రులు ఫిర్యాదు చేసే స్థాయికి వారిలో ధైర్యం, అవగాహన పెంచాలి. ఇది రాష్ట్రాలు, సమాజంలో సంబంధిత వర్గాల సమిష్టి బాధ్యత' అని అన్నారు. ' కొన్ని రకాల కేసులు న్యాయస్థానాల్లో చూస్తుంటాం. మైనర్లు సమ్మతితో లైంగిక చర్యకు పాల్పడినా.. పోక్సో చట్టంలోని 18 ఏళ్లలోపు వయసు పరిమితి కారణంగా అది నేరమే. 16 ఏళ్లు.. 18 ఏళ్లు.. అనే దానిపై ఎలా తీర్పు ఇవ్వాలనే అంశంలో జడ్జీలు ఒక స్పష్టమైన నిర్ణయానికి రాలేని పరిస్థితి ప్రతిరోజూ ఎన్నో కోర్టుల్లో తలెత్తుతోంది. దీనికి పార్లమెంట్‌లో చట్ట సవరణ ద్వారా ప్రభుత్వమే సమస్యకు పరిష్కారం కనుగొనాలి' అని ఆయన అన్నారు.

ఎన్నికల 'చిత్రం'

- వచ్చే సార్వత్రిక ఎన్నికలపై ప్రభావం ఎలా ఉంటుంది?
- మోదీని ఎదుర్కొనే నేత కేజ్రీవాలా? రాహులా?
- గుజరాత్, హిమాచల్ ఫలితాలు ఏం చెబుతున్నాయి?

ఒక రాష్ట్రంలో మోదీ మేనియాతో ఊగిపోయే ప్రజలు
మరో రాష్ట్రంలో స్థానిక సమస్యలే ముఖ్యమని ఎలుగెత్తి చాటిన ఓటర్లు ..
ఒకే రోజు రెండు రాష్ట్రాల్లో రెండు విభిన్నమైన తీర్పులు.
ఈ రెండు రాష్ట్రాల ఫలితాలు వచ్చే సార్వత్రిక ఎన్నికల్ని ఎలా ప్రభావితం చేస్తాయి ?
ప్రధాని మోదీ బ్రాండ్ ఇమేజ్ చెక్కు చెదరకుండా ఉంటుందా ?
మోదీని ఢీ కొట్టే నాయకుడు కేజ్రీవాలా ? రాహులా ?
గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ ఫలితాలు చెబుతున్నదేంటి ?

గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ ఫలితాలు సార్వత్రిక ఎన్నికలపై ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తాయన్న చర్చ మొదలైంది. విపక్షాలను నిర్వీర్యం చేసి అధికారాన్ని గుప్పిట్లో పెట్టుకోవాలని, హిందుత్వ–జాతీయవాదాన్ని జనంలోకి బాగా తీసుకువెళ్లాలని, ఉచితాలకు బదులుగా అభివృద్ధి బాట పడితేనే దేశానికి మేలు జరుగుతుందన్న బీజేపీ ఎజెండాకు గుజరాత్ ఫలితాలు ఆమోద ముద్ర వేశాయి. లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇదే ఫార్ములా పని చేస్తుందన్న ధీమాను నింపాయి. అదే సమయంలో స్థానిక సమస్యలపై గట్టి పోరాటం చేస్తే బీజేపీని, మోదీ బ్రాండ్ ఇమేజ్‌ను ఎదుర్కోవడం కష్టం కాదన్న ఆశ కూడా ప్రతిపక్ష పార్టీల్లో చిగురించింది.

బ్రాండ్ మోదీ ప్రభావం

మోదీ ఇమేజ్ చెక్కు చెదరకపోయినప్పటికీ బలమైన స్థానికాంశాలుంటే రాష్ట్రాల్లో గెలుపుకు విపక్షాలకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఈ ఫలితాలు చెబుతున్నాయి. హిమాచల్‌లో పాత పెన్షన్ పునరుద్ధరిస్తామన్న ఒకే ఒక్క హామీ కాంగ్రెస్‌ని అధికార పీఠానికి చేర్చింది. సోలన్ ప్రాంతంలో మోదీ ర్యాలీలకు జనం పోటెత్తినా అక్కడి 5 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ ఒక్కటీ నెగ్గలేకపోయింది! కానీ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో హిందుత్వ, జాతీయవాదమే కీలకపాత్ర పోషించేలా కనిపిస్తున్నాయి. హిమాచల్‌లో కాంగ్రెస్, బీజేపీ మధ్య ఓట్ల శాతంలో తేడా ఒక్క శాతమే! ''లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఢీ కొట్టడం సులభం కాదు. హిమాచల్‌లో మాదిరిగా స్థానికాంశాలు లోక్‌సభ ఎన్నికల్లో పని చేయవు'' అని జేఎన్‌యూ పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ మణీంద్రనాథ్ ఠాకూర్ అభిప్రాయపడ్డారు. హిమాచల్ ఓటమితో ఇమేజ్‌కు వచ్చిన ధోకా ఏమీలేదన్నారు.

కాంగ్రెస్ పక్కలో బల్లెం ఆప్

బీజేపీతో తలపడడానికి, హిందుత్వ ఎజెండాతో ఓటర్లను ఏకీకృతం చేస్తున్న కమలనాథుల కు చెక్ పెట్టడానికి ప్రయత్నిస్తున్న కాంగ్రెస్‌కు ఆప్ రూపంలో కొత్త శత్రువు ఎదురైంది. గుజరాత్‌లో ఆప్ ప్రధానంగా కాంగ్రెస్ ఓటు బ్యాంకునే కొల్లగొట్టడంతో 17 స్థానాలకే పరిమితమవాల్సి వచ్చింది. కాంగ్రెస్ ఓట్లు 41% నుంచి 27శాతానికి పడిపోతే, ఆప్ 13% ఓట్లు సాధించిందంటే కాంగ్రెస్ ఓట్లకు గండికొట్టినట్టయింది. ''వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి కాంగ్రెస్‌కు అసలు సిసలు శత్రువు ఆప్ అంటే అతిశయోక్తి కాదు. విపక్షాల మధ్య ఓట్లు చీలిపోతుంటే బీజేపీ సేఫ్ గేమ్ ఆడుతోంది. ఆప్‌ను ఎదుర్కొనే బలమైన వ్యూహాన్ని కాంగ్రెస్ తక్షణమే రచించాలి.'' అని ఎన్నికల విశ్లేషకుడు ఠాకూర్ హెచ్చరించారు. హిమాచల్ ప్రదేశ్‌పై ఆమ్ ఆద్మీ పార్టీ పెద్దగా దృష్టి కేంద్రీకరించకపోవడం వల్ల కేవలం ఒక్క శాతం ఓట్లు మాత్రమే సాధించింది. అది కాంగ్రెస్‌కి కలిసొచ్చింది. అదే ఆప్ కూడా విస్తృతంగా ప్రచారం చేసి ఉంటే కాంగ్రెస్ పని అయిపోయి ఉండేదని ఆ పార్టీ మాజీ నాయకుడు సంజయ్ ఝా అన్నారు. అయితే హిమాచల్‌లో విజయం సాధించడం వల్ల కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలు మూడుకి చేరడంతో పార్టీ శ్రేణుల్లో నైతిక స్థైర్యాన్ని పెంచినట్టయింది. ఇప్పటికే రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

సెమీ ఫైనల్స్ ఫలితాలే కీలకం

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్‌కు ఉందా లేదా అనేది వచ్చే ఏడాది నాలుగు రాష్ట్రాల్లో జరిగే సెమీఫైనల్స్ వంటి ఎన్నికల ఫలితాలే కీలకం కానున్నాయి. కర్ణాటక, రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ తో పాటు ఈశాన్య రాష్ట్రాల్లో కూడా ఎన్నికలు జరగనున్నాయి. జాతీయ పార్టీ హోదా లభించిన ఉత్సాహంతో ఆమ్ ఆద్మీ పార్టీ అన్ని రాష్ట్రాల్లోనూ పోటీ చేయడానికి సిద్ధమవుతోంది. దీంతో కాంగ్రెస్ అటు బీజేపీ, ఇటు ఆప్‌ను సమర్థంగా ఎదుర్కోవాల్సి పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నాలుగు రాష్ట్రాల ఫలితాలతో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మోదీని ఎదుర్కొనే నాయకుడు కేజ్రీవాలా? రాహులా? అన్నది తేలిపోతుంది.



స్వీడన్‌లోని స్టాక్‌హోంలో శనివారం నోబెల్ అవార్డుల ప్రదాన కార్యక్రమంలో 2022 నోబెల్ విజేతలు. వీరంతా శాంతి, సాహిత్యం, ఆర్థిక, రసాయన, భౌతిక, వైద్య రంగాల్లో అవార్డులు అందుకున్నారు.

పోలీస్‌స్టేషన్‌పైకి గ్రెనేడ్

పంజాబ్ సరిహద్దుల్లో కలకలం

తరన్ తారన్ (పంజాబ్): పోలీస్ స్టేషన్‌పైకి రాకెట్ ప్రొపెల్డ్ గ్రెనేడ్ (ఆర్పీజీ) ప్రయోగం పంజాబ్ సరిహద్దుల్లో కలకలం రేపింది. తరన్ తారన్ జిల్లాలో అమృత్‌సర్–భటిండా హైవేపై ఉన్న సర్హలీ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. దాడిలో ప్రాణ నష్టమేమీ జరగలేదని, సమీప భవనం మాత్రం పాక్షికంగా దెబ్బ తిందని డీజీపీ గౌరవ్ యాదవ్ తెలిపారు. ''ఈ పిరికిపంద దాడి పాకిస్తాన్ పనే అయ్యుండొచ్చు. అది సైన్యం వాడే గ్రెనేడేనని విచారణలో తేలింది. దీనిపై బీఎస్ఎఫ్‌తో కలిసి విచారణ జరుపుతాం'' అని చెప్పారు. పంజాబ్‌లో గత ఏడు నెలల్లో ఈ తరహా దాడి జరగడం ఇది రెండోసారి. మేలో మొహాలీలోని పంజాబ్‌పోలీస్ నిఘా విభాగం ప్రధాన కార్యాలయంపై గుర్తు తెలియని వ్యక్తులు ఇలాగే ఆర్పీజీ ప్రయోగించారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
ఆదివారం । 11 । డిసెంబర్ । 2022

హిట్ పెయిర్

హిట్-2 సినిమా హీరో, హీరోయిన్లు అడవి శేష్, మీనాక్షిచౌదరి శనివారం విజయవాడలో సందడి చేశారు. సినిమా ప్రచారంలో భాగంగా వచ్చిన వారు ఓ హోటల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. తమ సినిమా విశేషాలను ఈ సందర్భంగా పంచుకున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



న్యూస్‌రీల్

జాతీయ పతకం సాధించాలి

విజయవాడ స్పోర్ట్స్: జాతీయ క్రీడా వేదికపై రాణించి రాష్ట్ర, జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు రాష్ట్ర కబడ్డీ జట్టుకు సూచించారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు జార్ఖండ్‌లో జరిగే జాతీయ సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టు విజయవాడలోని రైల్వే స్టేడియంలో కొన్ని రోజులుగా శిక్షణ తీసుకుంటోంది. ఈ శిక్షణ శిబిరాన్ని కలెక్టర్ శనివారం సాయంత్రం పరిశీలించారు. ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ ఉచితంగా అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి పతకంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్న రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి శ్రీకాంత్‌ను కలెక్టర్ ఢిల్లీరావు అభినందించారు.

చీర ఆర్డర్ చేస్తే చిరిగిన ప్యాంటొచ్చింది



పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): సోదరికి కానుక ఇద్దామని చీర ఆర్డర్ చేస్తే సగానికి చిరిగిన పాత ప్యాంటు డెలివరీ అయిన ఘటన పెనుగంచిప్రోలులో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన యువకుడు పండుగకు తన సోదరికి చీర కొనిద్దామనుకున్నాడు. ఓ ఆన్‌లైన్ యాప్‌లో రూ.550 విలువ గల చీర బుక్ చేశాడు. శనివారం ఆర్డర్ అందింది. డెలివరీ బాయ్‌కు డబ్బు చెల్లించి, కవర్‌ను తెరిచి చూడగా దానిలో చీరకు బదులు చిరిగిన పాత ప్యాంట్ అదీ ఒక కాలు వరకు మాత్రమే ఉండటంతో అవాక్కయ్యారు. ఇదేమని డెలివరీ బాయ్‌ను ప్రశ్నించగా తమకేం తెలియదని, రిటన్ ఆప్షన్ ఉంటుంది చేసుకోమంటూ సలహా ఇచ్చాడు. జరిగిన దానికి తానేమీ చేయలేనని, ఆన్‌లైన్ వ్యాపారంతో జాగ్రత్తగా ఉండాలని చెప్పిమరీ వెళ్లాడు.

నేడు బ్రిటన్ డెప్యూటీ హై కమిషనర్ రాక



కంచికచర్ల(నందిగామ): రాష్ట్రంలో వినూత్నరీతిలో జరుగుతున్న వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలను అధ్యయనం చేసేందుకు బ్రిటన్ ప్రభుత్వ డెప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ ఈ నెల 11వ తేదీన కంచికచర్ల రానున్నారని సహాయ వ్యవసాయ సంచాలకుడు ధర్మపురి రమణమూర్తి శనివారం తెలిపారు. రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం నందిగామలోని వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌ను సందర్శిస్తారని పేర్కొన్నారు. ఆర్‌బీకేలో వ్యవసాయ అనుబంధ విభాగాల ద్వారా అందిస్తున్న సేవలను, పంట ఉత్పత్తుల కొనుగోలు కేంద్రాలను పరిశీలించనున్నారని వివరించారు. వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రం, వైఎస్సార్ పశు సంచార ఆరోగ్య సేవా రథాన్ని కూడా పరిశీలించిన తర్వాత ఉత్పత్తిదారులు వ్యవసాయ సలహా మండలి సభ్యులతో సమావేశం అవుతారని ధర్మపురి తెలిపారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం





చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా కోర్టులోని పోక్సో, మత్తు పదార్థాల (ఎన్‌డీపీఎస్) చట్టానికి సంబంధించిన కేసులను వాదించేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ముంజులూరు వెంకట మహేష్‌కుమార్, ఎన్‌డీపీఎస్ చట్టం అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మోచర్ల రాధాకృష్ణను నియమించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని)కి వెంకటమహేష్‌కుమార్, రాధాకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

19 నుంచి తిరుపతమ్మ మాలధారణ

పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ అమ్మవారి మండల దీక్షలు ఈ నెల 19వ తేదీన ప్రారంభంకానున్నాయి. ఆ రోజు వేకువజామున ఆలయంలో మాలధారణ మొదలవుతుంది. ఈ దీక్షలను 1990లో మొదటి సారిగా ప్రారంభించారు. తొలుత 46 మందితో తిరుపతమ్మ దీక్షలు ప్రారంభమయ్యాయి. ఏడాదికేడాది పెరుగుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి ప్రస్తుతం ఏటా 25 వేల మందికి పైగా మాల స్వీకరిస్తున్నారు. మొదట గ్రామపెద్దలు, ఆలయ అధికారులు, వామకుంట్ల పీఠాధిపతి రామడుగు నరసింహాచార్యులు సమక్షంలో ఆలయ అర్చకుడు మర్రెబోయిన రామదాసు అమ్మవారి సన్నిధిలో తిరుపతమ్మ మాల స్వీకరించారు. గతంలో పెనుగంచిప్రోలు అమ్మవారి సన్నిధిలోనే స్వాములు మాల ధరించి మండల దీక్షలు ఆచరించేవారు. అయితే ఇప్పుడు గురుస్వాములు తమ గ్రామాల్లోనే భక్తులకు మాలలు వేస్తున్నారు. దీక్షలు ముగిసిన అనంతరం తిరుముడి సమర్పణకు మాత్రం పెనుగంచిప్రోలులోని అమ్మవారి సన్నిధికి తప్పక వస్తారు.



గత ఏడాది మాల ధారణకు వచ్చిన భక్తులు(ఫైల్)

దీక్షల షెడ్యూల్ ఇలా ఉంది...

- ఆలయంలో మాలధారణ ప్రారంభం: **19-12-2022**
- మాలధారణ ముగింపు తేదీ: **24-12-2022**
- దీక్ష విరమణ, తిరుముడి సమర్పణ: **05-02-2023**

మాలధారులు పెరుగుతున్నారు



మొదట అమ్మవారి మండల దీక్షలు 46 మందితో ప్రారంభమయ్యాయి. మాలధారుల సంఖ్య ఏటా పెరుగుతోంది. ప్రస్తుతం 25 వేల మంది వరకూ దీక్షలు ఆచరిస్తున్నారు. మన రాష్ట్రంలోనేకాక తెలంగాణాలోనూ వేల సంఖ్యలో అమ్మ వారి దీక్షలు తీసుకుంటున్నారు. అమ్మవారు భక్తులు అందరినీ చల్లగా చూస్తారు.

–మర్రెబోయిన వెంకటరమణ,
తిరుపతమ్మ ఆలయ ప్రధానార్చకుడు

వీఎంసీలో డిజిటల్ పేమెంట్స్

- పన్నుల వసూలుకు ఈ-పోస్ యంత్రాలను తీసుకొస్తున్న వీఎంసీ
- వార్డు సచివాలయ సెక్రటరీల ద్వారా డిజిటల్ పేమెంట్ల స్వీకరణ
- డెబిట్/క్రెడిట్ కార్డులతోనూ నగదు చెల్లింపులకు అవకాశం





ఈ-పోస్ యంత్రాలతో చెల్లింపులు చేస్తున్న వీఎంసీ వార్డు సెక్రటరీలు (ఇన్‌సెట్) రసీదు జనరేట్ చేస్తున్న ఈ-పోస్ యంత్రం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర ప్రజలు ఆస్తి, డ్రెయినేజీ, నీటి, ఖాళీస్థలాలు ఇతర పన్నులను ఇక తమ ఇంటి నుంచే చెల్లించేలా నగర పాలక సంస్థ (వీఎంసీ) చర్యలు చేపట్టింది. ఈ -పోస్ (ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్స్) యంత్రాల ద్వారా డిజిటల్ పద్ధతిలో పన్నులు వసూలు చేసుకునేందుకు ఇప్పటికే ఒక దఫా బ్యాంకర్లతో చర్చలు జరిపింది. డెబిట్/క్రెడిట్ కార్డుల ద్వారా ప్రజలు పన్నులు చెల్లించేందుకు వీలు కల్పించింది. అతి త్వరలోనే డిజిటల్ పేమెంట్ విధానం అమలుకు చర్యలు తీసుకుంటోంది.

డిజిటల్ దిశగా అడుగులు

పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్న వీఎంసీ మరో స్మార్ట్ ఆలోచనతో ముందుకెళ్తోంది. ఇప్పటికే నగరపాలక సంస్థ వాహనాలకు జీపీఎస్ (గ్లోబల్ పొజిషన్ సిస్టమ్) అమర్చింది. ఈ సాంకేతిక పరిజ్ఞానంతో డంపర్ బిన్‌లను పర్యవేక్షిస్తోంది. రిజర్వాయర్లలో నీటి నిల్వలు, పంపిణీ వంటి తదితర అంశాలను స్కాడా (సూపర్‌వైజరీ కంట్రోల్ అండ్ డేటా అక్విజేషన్) ద్వారా ఎప్పటికప్పుడు నీటి సరఫరా వివరాలను పర్యవేక్షిస్తోంది. ఇటీవల నగరంలోని సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించేందుకు సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ట్విట్టర్‌తోపాటు వాట్సాప్, టెలిగ్రాంను అనుసరిస్తోంది. ఈ నేపథ్యంలో పన్నులను కూడా డిజిటల్ విధానంలో వసూలు చేసేందుకు చర్యలు చేపట్టింది. డిజిటల్ విధానంలో పన్నులు వసూలు చేయడం ద్వారా ఆడిట్ సక్రమంగా ఉంటుందని, అవినీతి తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు.

ఈ–పోస్ ఎలా పనిచేస్తుందంటే..

వీఎంసీ పరిధిలో ఉన్న ఆస్తులు, నీటి సరఫరా, డ్రెయినేజీ, ఖాళీ స్థలాల సమాచారాన్ని డివిజన్ల వారిగా ఈ–పోస్ యంత్రాల్లో నిక్షిప్తం చేస్తారు. ఈ సమాచారం ఆధారంగా వార్డు సచివాలయాల సెక్రటరీల ద్వారా సంబంధిత పన్నులు వసూలు చేస్తారు. చలానాలు, పన్నులు, చార్జీలు తదితర చెల్లింపులను డెబిట్, క్రెడిట్ కార్డులతోపాటు మొబైల్ పేమెంట్స్ ద్వారా కూడా స్వీకరిస్తారు. ఇప్పటి వరకు మీ–సేవ, ఆన్‌లైన్, ట్యాక్స్ కలెక్షన్ పాయింట్ల ద్వారా మాత్రమే ఆయా పన్నులు, చార్జీలు చెల్లింపులు జరిగాయి. అయితే కొన్ని రకాల సేవలు మాత్రమే ఇకపై మీ–సేవ ద్వారా చెల్లింపులకు ఆస్కారం ఉందని వీఎంసీ అధికారులు పేర్కొన్నారు. డిజిటల్ పేమెంట్లకు సంబంధించి ఆయా వార్డు సచివాలయ కార్యదర్శులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. వార్డు వలంటీర్ల ద్వారా ప్రతి 50 ఇళ్ల పూర్తిస్థాయి సమాచారాన్ని (డోర్‌నంబర్, అసెస్‌మెంట్ నంబరు తదితర వివరాలు) ఈ–పోస్ యంత్రాల్లో నమోదు చేశారు. చెల్లింపుదారులకు సంబంధించిన పూర్తివివరాలు ఈ–పోస్ యంత్రాల్లో ఉండటంతో క్షణాల్లో చెల్లింపులు జరుగుతాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ట్రయల్ రన్ నిర్వహించారు. ట్రయిల్ రన్ సందర్భంగా కొన్ని డివిజన్లలో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తాయి. శివారు, కొండప్రాంతాల్లో సిగ్నల్స్ సరిగ్గా ఉండకపోవటం, ఈ–పోస్ యంత్రాల బ్యాటరీ బ్యాకప్ చాలకపోవటం తదితర సమస్యలు తలెత్తాయి. ఈ సమస్యలను పూర్తిస్థాయిలో అధిగమించి నగరవ్యాప్తంగా త్వరలోనే డిజిటల్ పేమెంట్లు అమలు చేయటానికి వీఎంసీ ప్రణాళిక సిద్ధం చేసింది.

ఇక పక్కాగా ఆడిట్



పన్నులు, ఇతర యూజర్ చార్జీలను డిజిటల్ విధానంలో వసూలు చేయడం ద్వారా ప్రతి పైసాకు ఆడిట్ సక్రమంగా ఉంటుంది. సిబ్బంది పనితీరు మెరుగుపడుతుంది. క్షేత్రస్థాయిలో జరిగే అవినీతి కొంత వరకు తగ్గుతుంది. ఇప్పటికే కొన్ని డివిజన్లలో ట్రయల్ రన్ నిర్వహించాం. త్వరలో నగరవ్యాప్తంగా అన్ని డివిజన్లలో పూర్తిస్థాయిలో అమలు చేస్తాం.

– స్వప్నిల్ దినకర్ పుండ్కర్,
కమిషనర్, వీఎంసీ

దీక్షల విరమణకు పటిష్ట ఏర్పాట్లు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీ దీక్షల విరమణకు వచ్చే భక్తుల కోసం పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో భవానీ దీక్షల విరమణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై దేవదాయ, పోలీస్, నగరపాలక సంస్థ అధికారులతో కలెక్టర్ శనివారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు భవానీ భక్తులు దీక్షలు విరమిస్తారని తెలిపారు. రోజుకు 50 వేల నుంచి లక్ష మంది భవానీలు దీక్షలు విరమించి అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉందన్నారు. ఈ నెల 16వ తేదీ శుక్రవారం, 18వ తేదీ ఆదివారం కావడంతో ఆ రెండు రోజుల్లో భక్తుల సంఖ్య లక్షకు పైగా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆలయ ఈఓ భ్రమరాంబ మాట్లాడుతూ.. భవానీ భక్తులను అమ్మవారి దర్శనానికి ఉచితంగా అనుమతిస్తామని తెలిపారు. రూ.100, రూ.300, రూ.500 టిక్కెట్ల జారీకి కార్పొరేషన్ కార్యాలయం, వినాయకుడి గుడి, మోడల్ గెస్ట్ హౌస్ ఎదురుగా ఉన్న మసీదు వద్ద ప్రత్యేక కౌంటర్లు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో కె.మోహన్ కుమార్, అడిషినల్ డీసీపీ సర్కార్, ఏసీపీ హనుమంతరావు, ఆలయ ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమాదేవి, నగరపాలక సంస్థ ఈఈ నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమ్మోహనం.. భారతీయ నృత్యోత్సవం




ఒడిస్సీ నృత్యం ప్రదర్శిస్తున్న షారోన్ లోవెన్



సంబల్‌పురి ట్రైబల్ గ్రూప్ జానపద నృత్య ప్రదర్శన

విజయవాడ కల్చరల్: భారతీయ నృత్యరీతులు కనువిందు చేశాయి. విఖ్యాత కళాకారులు వివిధ నృత్యాంశాలను మనోహరంగా ప్రదర్శించారు. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగే ఇండియన్ డ్యాన్స్ ఫెస్టివల్ మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రాంగణంలో శనివారం ప్రారంభమైంది. స్వర్ణ కమలం సినిమా ఫేమ్, అమెరికాకు చెందిన కళాకారిణి షారోన్ లోవెన్ ఒడిస్సీ సంప్రదాయంలో ప్రదర్శించిన అంశాలు అలరించాయి. గీతా నారాయణ్ పరిపూర్ణ ముద్రతో, చక్కని అభినయంతో కూచిపూడి నృత్యాంశాలు ప్రదర్శించి ప్రేక్షకులను మైమరపింపజేశారు. కర్నాటకకు చెందిన రేఖారాజు గ్రూప్ మోహినీ అట్టం, సంబల్‌పురి ట్రైబల్ గ్రూప్ కళాకారుల జానపద నృత్యాలు అద్భుతంగా సాగి ప్రేక్షకుల కరతాళ ధ్వనులు అందుకున్నాయి. అనంతరం షారోన్ లోవెన్‌కు అమరావతి జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతీయ నృత్యరీతులు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. తాను నటించిన స్వర్ణకమలం చిత్రం విజయవంతం కావడంతో భారత దేశంలోని అనేక ప్రాంతాలను సందర్శించే అవకాశం లభించిందన్నారు. జీవిత సాఫల్య పురస్కారం అందుకోవడం జీవితంలో మరచిపోని సంఘటనగా మిగిలిపోతుందన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు బత్తిన విజయకుమార్ గౌడ్ మాట్లాడుతూ ఏడేళ్లుగా విజయవాడలో నృత్యోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలిరోజు కార్యక్రమాలను సమాచార హక్కు చట్టం కమిషనర్ ఐలాపురం రాజా ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు 'భారతీయ నృత్యరీతులు – యువత పాత్ర' అంశంగా ప్రసంగించారు. ఏపీ డైరెక్టర్ జనరల్ డ్రగ్స్ అండ్ కాపీ రైట్స్ రవిశంకర్ నారాయణన్, సమాచార కమిషనర్లు ఆర్.మొహబూబ్ బాషా, యు.హరిప్రసాద్, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ జామ్‌రుజాటం



రెండో శనివారం సెలవు రోజు కావడంతో విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసిన కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలి వచ్చారు. ఘాట్ రోడ్డులోని టోల్‌గేట్ రాజగోపురం మలుపు వద్ద ఉదయం 10.30 గంటల సమయంలో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. కొందరు రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, మరి కొందరు నోఎంట్రీలోకి చొరబడటంతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

లారీని ఢీకొట్టిన కారు

మహిళ మృతి, కుమారుడికి గాయాలు



సంపూర్ణ మృతదేహం



ఘటనా స్థలంలో లారీని ఢీకొట్టిన కారు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడంతో ఓ మహిళ దుర్మరణం చెందగా మరో వ్యక్తి గాయాలపాలయ్యాడు. ఈ ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి గ్రామానికి చెందిన గోగినేని సంపూర్ణ (45) ఆదే గ్రామంలో తన కుటుంబసభ్యులతో కలిసి వస్త్రాల వ్యాపారం నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ నుంచి బట్టలు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఆమె తన కుమారుడు విష్ణుతో కలిసి వారి కారులో హైదరాబాద్ వెళ్లారు. అక్కడ వారిద్దరూ వస్త్రాలు కొనుగోలు చేసి రాత్రి 10 గంటల సమయంలో స్వగ్రామానికి బయలుదేరారు. శనివారం తెల్లవారు జామున జాతీయ రహదారి గుండా బస్టాండ్ దాటి బెంజిసర్కిల్ వైపు వెళ్తున్నారు. బందరు లాకుల సమీపానికి రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే పార్కింగ్ చేసి సిమెంట్ లోడుతో ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. కారులో ఎడమ వైపు కూర్చున్న సంపూర్ణ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. కారును డ్రైవింగ్ చేస్తున్న ఆమె కుమారుడు విష్ణు స్వల్పంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. చికిత్స నిమిత్తం విష్ణును ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం సంపూర్ణ మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జాతీయ రహదారిపై కారు బీభత్సం



ప్రమాదానికి కారణమైన కారు

ఉయ్యూరు: జాతీయ రహదారిపై కారు బీభత్సం సృష్టించిన ఘటన ఆకునూరు ఫ్లై ఓవర్ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడ వైపు నుంచి అతివేగంగా ఉయ్యూరు వస్తున్న కారు ఫ్లై ఓవర్ దిగువున ఉయ్యూరు వైపే వెళ్తున్న వాహనాలను ఓవర్‌టేక్ చేస్తుంది. ఈ క్రమంలో ఒక ఆటోను ఢీకొట్టి, ఆ ముందు ఉన్న మరో కారును, రెండు సైకిళ్లను సైతం ఢీకొట్టి రోడ్డు మార్గం వెంబడి ఉన్న పంట బోదెలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న కానూరుకు చెందిన బొర్రా సాల్వి (18) తీవ్రంగా గాయపడింది. ఆ యువతిని ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందింది. చలివేంద్రపాలెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవరు సాంబయ్య, దావులూరుకు చెందిన సైకిలిస్ట్ చోరగుడి నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులకు మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రొద్దుటూరుకు చెందిన మరో సైక్లిస్ట్ చాట్ల సముద్రుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణికులు ఎవరూ లేక పోవటంతో పెనుప్రమాదం తప్పినట్లయింది. కారు ప్రమాదం ప్రత్యక్షంగా వీక్షించిన ప్రయాణికులు, స్థానికులు భీతిల్లారు. ఘటనపై ఉయ్యూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ వీరప్రసాద్ తెలిపారు.

ప్రమాదంలో యువకుడి మృతి

కంచికచర్ల: ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి వస్తున్న బైక్ ఢీ కొనగా బైక్ పై ప్రయాణిస్తున్న యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు.. చందర్లపాడు మండలం తోటరావులపాడు గ్రామానికి చెందిన వేల్పుల నాగార్జున (20) అనే యువకుడు విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. వారానికి ఒకసారి ఇంటికి వస్తూ వెళుతుంటాడు. ఆదివారం సెలవు కావటంతో శనివారం ఇంటికి బైక్‌పై విజయవాడ నుంచి వస్తున్నాడు. పరిటాల సమీపంలోకి రాగానే ముందు వెళుతున్న లారీని వెనుకనుంచి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda — బ్యాంక్ ఆఫ్ బరోడా

ROSAR బ్రాంచి : రీజనల్ ఆఫీస్, 10-1-44/10 & 11. పీజెయస్ ప్లాజా, 4వ అంతస్తు, విఐపి రోడ్డు, హోటల్ టైకూన్ ఎదురుగా, విశాఖపట్టణం - 530 003

స్థిరాస్తుల విక్రయం కొరకు అమ్మకం నోటీసు

అనుబంధం -IV-ఎ (రూల్ 8 (2) & 8 (6) చూడవలెను)

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8 (2) & 8(6)లోని నిబంధనలతో చదువుతూ సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

అందుమూలముగా సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత (లు), తనఖాదారు (లు) మరియు హామీదారు (లు)కు తెలియజేయునది ఏమనగా ఈ దిగువ వివరించబడిన స్థిరాస్తి సెక్యూర్డ్ క్రెడిటర్ గారికి తనఖా / చార్జ్ చేయబడి బ్యాంక్ ఆఫ్ బరోడా యొక్క అధీకృత అధికారిచే (సెక్యూర్డ్ క్రెడిటర్) స్వాధీనము చేసుకొనబడి ఈ దిగువ చెప్పబడిన ఖాతా(లు) యొక్క మొత్తములు వసూలు చేసుకొనుటకు సదరు స్థిరాస్తులు "ఎక్కడ ఏమి వున్నదో అదే" "అక్కడ ఏమి ఉన్నదో అదే" మరియు "ఏదైతే ఉన్నదో అదే" ప్రాతిపదికన అమ్మకం జరుపబడును. ఋణగ్రహీత (లు)/ తనఖాదారు (లు)/హామీదారు (లు)/ సెక్యూర్డ్ అసెట్స్/బకాయిలు/రిజర్వు ధర/ఇ-వేలం తేదీ & సమయం, ధరావతు మరియు బిడ్ పెంపుదల మొత్తం వివరాలు ఈ దిగువ పేర్కొనబడినవి.

ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారుల పేర్లు మరియు చిరునామా	స్థిరాస్తుల వివరములు	బకాయి మొత్తము
1) మెస్సర్స్ శ్రీ వెంకటేశ్వర ఇన్‌ఫ్రావెంచర్స్, పార్ట్‌నర్స్: డీ.నెం. 4-26-20/2, ఐ.వి. నారాయణ వీధి, భీమునవారిపేట, విజయవాడ (యు), కృష్ణా జిల్లా, ఏపీ-520 001. 2) మిస్. జగుపిల్ల సాయి సిరి లాస్య, తండ్రి: జగుపిల్ల వెంకటేశ్వరరావు, డోర్ నెం. 4-26-20/2, ఐ.వి. నారాయణ రావు వీధి, భీమునవారి పేట, విజయవాడ (యు), కృష్ణా జిల్లా, ఏపీ-520 001. 3) మిస్. జగుపిల్ల దూండీ ప్రియ, తండ్రి: జగుపిల్ల వెంకటేశ్వరరావు, డోర్ నెం. 4-26-20/2, ఐ.వి. నారాయణ రావు వీధి, భీమున్నవారి పేట, విజయవాడ (యు), కృష్ణా జిల్లా, ఏపీ-520 001. 4) శ్రీ జగుపిల్ల వెంకటేశ్వరరావు, తండ్రి: పోతన్న, డోర్ నెం. 4-26-20/2, ఐ.వి. నారాయణ రావు వీధి, భీమున్నవారి పేట, విజయవాడ (యు), కృష్ణా జిల్లా, ఏపీ-520 001. 5) మిస్ జగుపిల్ల యమున హేత్వరి, తండ్రి: జగుపిల్ల వెంకటేశ్వరరావు, డోర్ నెం. 4-26-20/2, ఐ.వి. నారాయణ రావు వీధి, భీమున్నవారి పేట, విజయవాడ (యు), కృష్ణా జిల్లా, ఏపీ-520 001. 6) శ్రీ పిల్లా సింహాచలం, తండ్రి: పిల్లా రాంబాబు, డీ.నెం. 9-68-22, కాటన్ ఫ్యాక్టరీ, విజయవాడ (యు), కొత్తపేట, విజయవాడ (యు), ఏపీ-520 001. 7) శ్రీమతి పిల్లా సత్యవతి, భర్త: పిల్లా సింహాచలం, డీ.నెం. 9-68-22, కాటన్ ఫ్యాక్టరీ, విజయవాడ (యు), కొత్తపేట, విజయవాడ (యు), ఏపీ-520 001. 8) శ్రీ సోమనాథ్ నాగొండి, తండ్రి: వెంకటేశ్వరరావు, డీ.నెం. 6-21-24, బి.టి. రోడ్డు, వైలర్‌పేట, విజయవాడ (యు), కృష్ణా జిల్లా, ఏపీ-520009. 9) శ్రీ నాగొండి అశోక్‌కుమార్, తండ్రి: లేటు శ్రీ రామమూర్తి, 15-7-37/ఎ, ఇస్మాయిల్ వీధి, రామకృష్ణాపేట, కాకినాడ రూరల్, తూర్పు గోదావరి, ఏపీ-533001. 10) శ్రీ నాగొండి వెంకట నాగేశ్వరరావు, తండ్రి: నాగొండి అంజనేయ దాస్, డీ.నెం. 1-3-26-11ఎ, పార్థసారధి వీధి, విద్యాధరపురం, కామకోటి నగర్, విజయవాడ (యు), ఏపీ-520012. 11) శ్రీ నాగొండి సీతారామాంజనేయులు, తండ్రి: నాగ వరసింహారావు, డీ.నెం. 11-148/1, బ్రాహ్మణ శక్తి నగర్, శారదాపీఠం ఎదురు, చిన్న ముసల్వాడ, వార్డు నెం. 70, పెందుర్తి, సుజాత నగర్, విశాఖపట్నం, ఏపీ-531173. 12) శ్రీ నాగొండి పాండురంగారావు, తండ్రి: నాగొండి అంజనేయదాస్, డీ.నెం. 9-3-30, బ్రాహ్మణ వీధి, కొత్తపేట, విజయవాడ (యు), ఏపీ-520001	1) 1) మిస్. జగుపిల్ల దూండీ ప్రియ మరియు 2) మిస్. జగుపిల్ల సాయి సిరి లాస్య గార్ల పేరిట కృష్ణా జిల్లా, డి.ఆర్.ఓ. విజయవాడ, విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా, విద్యాధరపురం గ్రామ పోర్షన్, లంబాడీపేట, అసెస్‌మెంట్ నెం. 3845బి మరియు 3846సి, కొత్త అసెస్‌మెంట్ నెం. 40857 మరియు 40858, ఎన్.టి.ఎస్. నెం. 29, రెవిన్యూ వార్డు నెం. 13, ఆర్.ఎస్.నెం. 40ఎ/1బి, బ్లాక్ నెం. 16, మున్సిపల్ వార్డు నెం. 5/కె, డి.నెం. 4-1-133 వద్ద 484.00 చ॥గజాల విస్తీర్ణంలోని ఖాళీ నివాస స్థలము మరియు దానికి చెందిన అన్ని సౌలభ్య హక్కులు, సాకల్యాలతో సహా. హద్దులు : తూర్పు : లింగంపల్లి రామకృష్ణ గారి ఆస్తి, దక్షిణం : మున్సిపల్ రోడ్డు, పడమర : అన్నే రామస్వామి గారి ఆస్తి, ఉత్తరం : 30 అ॥ వెడల్పు గల రోడ్డు.	ది. 31-03-2021 నాటికి రూ. 3,56,87,042/- (అక్షరాలా మూడు కోట్ల యాభై ఆరు లక్షల ఎనభై ఏడు వేల నలభై రెండు రూపాయలు మాత్రమే) + 01-04-2021 నుండి వడ్డీ మరియు చెల్లించని ఇతర ఖర్చులు మొ॥
	రిజర్వుధర : రూ. 2,01,59,000/- ధరావత్తు : రూ. 20,15,900/-	ఇ-వేలం తేదీ & సమయం : ది. 28-12-2022 మ॥ 2.00 గం॥ల నుండి సా॥ 6.00 గం॥ల వరకు
	2) 1) శ్రీ నాగొండి అశోక్ కుమార్ మరియు 2) శ్రీ నాగొండి సోమనాథ్ గార్ల పేరిట కృష్ణా జిల్లా, విజయవాడ డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ ఏరియా, విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా, విద్యాధరపురం, కె.టి. రోడ్డు దగ్గర, డోర్ డి.నెం. 5-6-60, పాత ఆర్.ఎస్.నెం. 142/2, కొత్త ఆర్.ఎస్.నెం. 142/2బి వద్ద 265.01 చ॥గజాల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము మరియు దానికి చెందిన అన్ని సౌలభ్య హక్కులు, సాకల్యాలతో సహా. హద్దులు : తూర్పు : శ్రీ ఆంజనేయస్వామి వారి గుడి దారి - 45.6 అ॥, దక్షిణం : శ్రీ ఆంజనేయ స్వామి గుడి - 51.3 అ॥, పడమర : కె.టి. రోడ్డు - 44.00 అ॥, ఉత్తరం : మున్సిపల్ బజారు రోడ్డు - 51.3 అ॥	బిడ్ పెంపుదల : రూ. 50,000/-
	రిజర్వుధర : రూ. 1,25,63,000/- ధరావత్తు : రూ. 12,56,300/-	స్వాధీనం యొక్క స్వభావము సింబాలిక్/భౌతికం సింబాలిక్
	3) 1) శ్రీ నాగొండి వెంకట నాగేశ్వరరావు 2) శ్రీ నాగొండి పాండురంగారావు మరియు 3) శ్రీ నాగొండి సీతారామాంజనేయులు గార్ల పేరిట కృష్ణా జిల్లా, విజయవాడ, విద్యాధరపురం, కె.టి. రోడ్డు దగ్గర, డోర్ డి.నెం. 5-6-60, పాత ఆర్.ఎస్.నెం. 142/2, కొత్త ఆర్.ఎస్.నెం. 142/2-బి వద్ద 382.43 చ॥గజాల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము హద్దులు : తూర్పు : ఇతరులకు చెందిన ఆస్తి, దక్షిణం : ప్రసాద్ థియేటర్ కి చెందిన ఆస్తి, పడమర : కె.టి. రోడ్డు, ఉత్తరం : శ్రీ ఆంజనేయ స్వామి వారి గుడికి చెందిన ఆస్తి	ఆస్తి తనిఖీ యొక్క తేదీ & సమయం తేది :15-12-2022 ఉ॥ 11.00 లకు
	రిజర్వుధర : రూ. 1,86,57,000/- ధరావత్తు : రూ. 18,65,700/-	మరిన్ని వివరాలకు క్యూ ఆర్ కోడ్‌ని స్కాన్ చేయండి.

అమ్మకం యొక్క పూర్తి నిబంధనలు మరియు షరతుల కొరకు మా వెబ్‌సైట్ https://www.bankofbaroda.in/e-auction.htm నందలి మాచే ఇవ్వబడిన లింకును చూడండి. మరియు https://ibapi.in కూడా చూడవచ్చును. అర్హత గల బిడ్డర్లు అధీకృత అధికారి యొక్క మొబైల్ నెం. 79955 65212 నందు సంప్రదించవచ్చును.

ప్రదేశం : విశాఖపట్టణం, తేది : 10-12-2022 — చీఫ్ మేనేజర్ & అధీకృత ఆఫీసర్, బ్యాంక్ ఆఫ్ బరోడా

అమ్మదయే... ఆదరువు

- కుండల తయారీనే నమ్ముకున్న వృత్తిదారులు
- ఉపాధి పొందుతున్న 50 కుటుంబాలు
- తిరుపతమ్మవారి క్రతువుల్లో మట్టి కుండల పాత్ర ఘనం



తయారు చేసిన కుండలను ఆరబెడుతున్న దృశ్యం

పెనుగంచిప్రోలు: నేటి రోజుల్లో మట్టి కుండలకు ఆదరణ కరువవ్వడంతో ఎంతోమంది కులవృత్తికి దూరమవుతున్నారు. స్టీల్, ప్లాస్టిక్, వంటి ఇతర వస్తువుల వినియోగం అధికం కావటంతో ఎంతో కళా నైపుణ్యంతో కూడుకున్న కుండలు మరుగునపడిపోతున్నాయి. కానీ ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండల కేంద్రంలోని తిరుపతమ్మవారి ఆలయంలో మట్టి కుండలకు అత్యధిక ప్రాధాన్యం ఉంటుంది. ఆలయ ఉత్సవాలు, పలు సందార్భల్లో నిర్వహించే క్రతువుల్లో కుండలు తప్పనిసరిగా వినియోగిస్తారు. అలాగే నిత్యం వేలాది మంది భక్తులు పలు రాష్ట్రాల నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చి కుండల్లో పాలు పొంగించి పొంగళ్లు తయారు చేసి బోనాలు సమరిస్తారు. కుండల్లో పొంగళ్లు అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకోవటం ఆనవాయితీగా వస్తోంది. ఎంతటి వారైనా సరే మట్టి కుండను కొనుగోలు చేసి పొంగళ్లు చేయటం ఎంతో సెంటిమెంట్‌గా భావిస్తారు.

ఏడాదికి రూ.లక్ష ఆదాయం...

గ్రామంలో తాత ముత్తాతల నుంచి దశాబ్దాలుగా కొందరు కుండలను తయారు చేయటమే తమ వృత్తిగా భావించి ఉపాధి పొందుతున్నారు. గతంలో వందల కుటుంబాలు ఉండగా నేడు మారుతున్న కాలానికి అనుగుణంగా 50 కుటుంబాలు మాత్రమే ఈ వృత్తిని సాగిస్తున్నాయి. అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తుల ఆదరణ వల్లనే తాము ఈ వృత్తి సాగిస్తున్నామని చెబుతున్నారు. ఒక్కో కుటుంబానికి ఏడాది రూ.1లక్షకు పైగా ఆదాయం అమ్మదయతో సమకూరుతుందని అంటున్నారు. కుండలు తయారీకి కావాల్సిన బంకమట్టి పక్కనే ఉన్న చెరువు నుంచి తీసుకొస్తున్నారు. పచ్చి కుండలను కాల్చేందుకు కట్టెలు, పొట్టు సమకూర్చుకుని ఆవంలో కాలుస్తారు.

వివిధ సైజుల్లో కుండలు....



కాల్చిన కుండలను ట్రాక్టర్‌కు ఎత్తుతున్న కూలీలు

కుండలు సైజులను బట్టి ధరలు నిర్ణయిస్తారు. ముఖ్యంగా రూ.30, రూ.50, రూ.100 ఉన్న కుండలను ఆలయం వద్ద కాంట్రాక్టు తీసుకున్న వ్యక్తికి శాలివాహనులు విక్రయిస్తారు. కాంట్రాక్టర్లు వాటిని ఆలయం వద్ద భక్తులకు విక్రయిస్తారు. మునేరు అవతల భక్తులు విశ్రాంతికి ఉండే తోటల్లో తయారు చేసిన కుండలను భక్తులకు స్వయంగా విక్రయిస్తారు.

ఏ ఉత్సవం జరిగినా...

అమ్మవారికి ఫిబ్రవరిలో నిర్వహించే కల్యాణానికి గరిగ ముంత గ్రామంలోని శాలివాహనులే సమకూరుస్తారు. కల్యాణం అనంతరం ఘనంగా జరిగే జలబిందెల మహోత్సవంలో ఐదు వంశాల వారు మునేరు నుంచి కుండల్లో నీటిని తీసుకువస్తారు. అమ్మవారికి ఏఉత్సవం జరిగినా ముందుగా కుండలో అన్నం వండి కుంభం పోసి దిష్టి తీయటం అనాదిగా సాగుతోంది. ఇక ప్రతిరోజూ అమ్మవారికి పాలు, పొంగళ్లు భక్తులు కుండల్లో చేసి అమ్మవారికి చూపించిన అనంతరం కుండలను వారి పొలాల్లో పాతుకుంటారంటే ఎంతటి ప్రాధాన్యత ఉందో అర్థమవుతుంది.



అమ్మవారికి కుండల్లో పొంగళ్లు తెస్తున్న భక్తులు

ఉపాధి దొరుకుతుంది



అన్ని ప్రాంతాల్లో తమ కులవృత్తి అంతమైపోతున్నా పెనుగంచిప్రోలు అమ్మవారి ఆలయం వద్ద పొంగళ్లు పొంగించుకునేందుకు, ఇతర ఆలయ ఆచారాల్లో కుండలు అవసరమై ఉంది. దీంతో ఇక్కడ మా కుటుంబాలకు ఉపాధి దొరుకుతుంది.

–కొత్తపల్లి వెంకటేశ్వరరావు

హాయిగా ఉంటున్నాం



కుండలు తయారు చేసి విక్రయించటం ద్వారా ఏడాదికి రూ.1లక్షకు పైగా ఆదాయం సమకూరుతోంది. 50 కుటుంబాల వరకు దీనిపై ఆధారపడ్డాం. సైజులను బట్టి కుండలు విక్రయిస్తాం. కుటుంబాలను ఉన్నతంగా ఉంచుకుంటున్నాం. కుండలు తయారీకి అవసరమైన మట్టి పక్కనే చెరువు నుంచి తీసుకొస్తాం. అమ్మ దయతో హాయిగా ఉంటున్నాం.

బాడిశ చిన్నమీరయ్య, సముద్రాల నరసింహారావు

మాతృత్వపు మధురిమలేవీ ?

- దంపతుల్లో పెరుగుతున్న సంతానలేమి సమస్య
- జీవనశైలి మార్చుకుంటే మేలంటున్న వైద్యులు
- పదుల సంఖ్యలో పుట్టుకొస్తున్న సంతాన సాఫల్య కేంద్రాలు



పునరుత్పత్తి కేంద్రంలో సౌకర్యాలు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని (ఫైల్)

లబ్బీపేట(విజయవాడతూర్పు):మాతృత్వం అనేది ప్రతి మహిళకు ఒక వరం లాంటిది. ఆ మధురిమల కోసం ఎంతో మంది దంపతులు తహతహలాడుతున్నారు. కానీ నేడు అనేక కారణాలతో దంపతులు పిల్లలు లేని సమస్యతో సతమతమవుతూ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న సమస్య కారణంగా పదుల సంఖ్యలో సంతాన సాఫల్య కేంద్రాలు వెలుస్తున్నాయి. ప్రస్తుతం విజయవాడలో 18 ఏఆర్‌టీ క్లినిక్‌లు (సంతాన సాఫల్య కేంద్రాలు), 6 ఏఆర్‌టీ బ్యాంక్‌లు, 6 సరోగసి కేంద్రాలు రిజిస్టర్ అయి ఉన్నాయి. వాటిలో నిత్యం వందలాది మంది దంపతులు పరీక్షలు చేయించుకుంటున్నారు. ఒకప్పుడు సంతానలేమి సమస్య ఏడు శాతం మంది దంపతుల్లో ఉండగా, ఇప్పుడు 20 శాతానికి పెరిగినట్లు అంచనా. జీవనశైలి కారణంగా టీనేజ్‌లోనే యువతులు పీసీఓడీ (అండాశయంలో నీటి బుడగలు) సమస్యలతో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

సంతానలేమికి కారణాలు

- సంతానలేమి దంపతుల్లో పురుషుల్లోనే ఎక్కువ లోపం ఉంటుంది.
- లైఫ్‌స్టైల్ మార్పులు, జంక్‌ఫుడ్ ఎక్కువగా తినడం, ఒబెసిటీ, ఓవర్‌నైట్ వర్క్ (నిద్రలేకుండా పనిచేయడం) కారణాలుగా ఉన్నాయి.
- దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, రక్తపోటు సంతానలేమికి దారితీస్తుంది.
- స్మోకింగ్, డ్రగ్స్‌కు అలవాటు పడటం, అల్కాహాల్, కొన్ని రకాల మందులు వాడటమూ ఓ కారణమే.
- చిన్నప్పుడు గవద బిళ్లలు వచ్చినా, టెస్టికల్స్‌కు గాయాలైన వారిలో సంతాన లేమి సమస్య ఉంటుంది.

మహిళల్లో

- జీవనశైలి (లైఫ్‌స్టైల్), ఒబెసిటీ, బరువు తక్కువగా ఉండటం (ఎనీమియా) కారణాలే.
- మధుమేహం, బీపీ, పీసీఓడీ సమస్యలు (అండాశయంలో నీటి బుడగలు), నెలసరి సక్రమంగా రాకపోవడం.
- ఆలస్య వివాహం (35 ఏళ్ల తర్వాత పెళ్లి చేసుకోవడం), అనారోగ్య సమస్యలు, ఫైబ్రాయిడ్స్, అరినోమయాసిస్, ఒవేరియన్‌సిస్టులు, ఎండోమెట్రియాసిస్ వంటివి.
- ఆలస్యంగా రజస్వల అయిన వారిలో కూడా సంతానలేమి సమస్య తలెత్తుతుంది.

పరిష్కార మార్గాలివే

- సంతానలేమి వారు తమ జీవనశైలిని మార్చుకోవాలి.
- సమతుల్య ఆహారం తీసుకుంటూ, వ్యాయామం చేయాలి.
- లోపం ఎవరిలో ఉందో గుర్తించి, దానిని అధిగమించేందుకు ప్రయత్నించాలి.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి



సంతాన సాఫల్య కేంద్రాలు, ఏఆర్‌టీ బ్యాంకులు, సరోగసి కేంద్రాలు నిర్వహించే వారు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలి. ఆయా కేంద్రాల్లో ప్రభుత్వం సూచించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. వాటిని పరీక్షించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీ ఏర్పాటుచేశాం. తనతో పాటు, రేడియాలజిస్ట్, పాథాలజిస్, ఒక ఎన్‌జీఓ, గైనకాలజిస్టు ఉంటారు. రిజిస్టర్ చేసుకున్న కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనేది నిర్ధారిస్తాం. బాధితులకు అందించే ప్రతి చికిత్సను నమోదు చేయాలి. నిబంధనలు పాటించని కేంద్రాలపై చర్యలు తీసుకుంటాం.

డాక్టర్ మాచర్ల సుహాసిని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

సంతానలేమి సమస్య పెరిగింది



ప్రస్తుతం సంతానలేమి సమస్యను 20 శాతం మంది దంపతులు ఎదుర్కొంటున్నారు. వారిలో 13 శాతం మంది పురుషుల్లో సమస్య ఉంటుండగా, 7 శాతం మహిళల్లో ఉంటుంది. కొందరు లైఫ్‌స్టైల్ మార్పు చేసుకుంటే సమస్యను అధిగమించవచ్చు. ట్యూబ్స్ బ్లాక్స్ ఉన్న వారు, ఎండోమెట్రియాసిస్ గ్రేడ్ 4 ఉన్న వారు ఐవీఎఫ్ చికిత్స పొందాలి. పెళ్లయిన ఏడాదిలోపు పిల్లలు పుట్టకుంటే వైద్యులను సంప్రదించాలి. ఆలస్య వివాహం చేసుకున్న వారు ఆరు నెలల్లో గర్భం దాల్చకుంటే వైద్య పరీక్షలు చేయించుకోవాలి. వయస్సు 40 ఏళ్లలోపు వారికి సంతాన సాఫల్య చికిత్స మంచి ఫలితాలు ఇస్తాయి.

డాక్టర పల్లీ కొడాలి, ఫెర్టిలిటీ నిపుణురాలు

అరుదైన జబ్బులకు అద్భుత వైద్యం

- విజయవాడ ప్రభుత్వాస్పత్రి న్యూరాలజీ విభాగంలో అరుదైన చికిత్సలెన్నో...
- రూ.10 లక్షలు ఖర్చయ్యే చికిత్సలు ఉచితమే
- ప్రైవేటు ఆస్పత్రులు చేతులెత్తేసిన రోగులకు పునర్జన్మ
- స్ట్రోక్ యూనిట్‌తో మెరుగైన సేవలు
- ఐదు పీజీ సీట్ల రాకతో భవిష్యత్‌లో మరిన్ని సేవలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నెల రోజుల కిందట నగరానికి చెందిన 15 ఏళ్ల బాలిక ఫిట్స్ వస్తున్నాయంటూ ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. ఆమెను వైద్యులు పరీక్షించగా అత్యంత అరుదుగా సోకే ఫేనిల్ కెటోన్యూరియా (మెటబాలిక్ ప్రాబ్లమ్)గా గుర్తించి చికిత్స చేశారు. ఆమె పూర్తిగా కోలుకుని ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయింది. ప్రైవేటులో అయితే ఆ బాలిక వైద్యానికి రూ. 20 లక్షల వరకూ ఖర్చవుతుందంటున్నారు వైద్యులు.

- ప్రకాశం జిల్లా సంతనూతలపాడుకు చెందిన సుబ్బమ్మకు (83) పక్షవాతం (హెమరైజ్డ్ స్ట్రోక్) రావడంతో చికిత్స కోసం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అక్కడ రూ.5 లక్షలు ఖర్చు చేశారు. ఇకలాభం లేదు తీసుకెళ్లిపోవాలని వైద్యులు చెప్పారు. కానీ కుటుంబసభ్యులు మాత్రం ఆమెను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. ఆమెను గత నెల 19న న్యూరాలజీ ఐసీయూలో చేర్చి చికిత్స ప్రారంభించారు. ప్రస్తుతం సుబ్బమ్మ మాట్లాడుతుంది. ఆహారం తీసుకుంటూ డిశ్చార్జికి సిద్ధంగా ఉంది.
- విజయవాడ నగరానికి చెందిన 12 ఏళ్ల బాలుడికి 20 రోజుల కిందట డయేరియా సోకింది. అది తగ్గిన తర్వాత కాళ్లు చచ్చుబడి నడవలేని స్థితికి చేరుకున్నాడు. దీంతో ప్రభుత్వాస్పత్రికి తీసుకు రాగా, పరీక్షించిన వైద్యులు గిరియన్ బ్యారీ సింద్రోమ్ (జీబీ సిండ్రోమ్)కు గురైనట్లు గుర్తించి చికిత్స ప్రారంభించారు. ప్రస్తుతం బాలుడు కోలుకున్నాడు. ప్రైవేటు ఆస్పత్రిల్లో ఈ వ్యాధికి రూ. 10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు.



న్యూరో ఐసీయూలో రోగికి చికిత్స అందిస్తున్న డాక్టర్లు, సిబ్బంది

ఇలా ఈ ముగ్గురే కాదు నిత్యం అనేక మంది పక్షవాతం, పార్కిన్‌సన్, న్యూరోపతి వంటి అనేక జబ్బులతో ప్రభుత్వాస్పత్రి న్యూరాలజీ విభాగానికి వస్తున్నారు. వారికి సత్వర వైద్య సేవలు అందిస్తూ స్వస్థత చేకూరుస్తున్నారు ఇక్కడి వైద్యులు. వచ్చే ఏడాది నుంచి ఐదుగురు పీజీలు రానుండటంతో ఈ సేవలు మరింత మెరుగయ్యే అవకాశం ఉంది.

వారంలో వెయ్యి మందికి పరీక్షలు..

విజయవాడ ప్రభుత్వాస్పత్రిలోని సూపర్‌స్పెషాలిటీ బ్లాక్‌లో వారంలో మంగళ, గురు, శనివారాల్లో న్యూరాలజీ ఓపీ సేవలు అందిస్తున్నారు. ఆయా రోజుల్లో రోజుకు 300 నుంచి 325 మంది వస్తుంటారు. ఇలా వారానికి వెయ్యి మందికి పరీక్షలు చేస్తారు. వారిలో 300 మంది వరకూ బ్రెయిన్ స్ట్రోక్ రోగులు ఉంటున్నారు. అత్యవసర కేసులకు 24 గంటల్లో ఎప్పుడైనా చేర్చుకుంటారు. రోజూ 8 నుంచి 10 మంది వరకూ అడ్మిట్ అవుతారు. ఇలా నెలలో 250 మంది రోగులకు ఇన్ పేషెంట్లుగా సేవలు అందిస్తున్నారు.



పూర్తి స్థాయి సిబ్బంది, సౌకర్యాలు..

న్యూరాలజీ విభాగంలో ఒక అసోసియేట్ ప్రొఫెసర్‌తో పాటు, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు ఉన్నారు. న్యూరో టెక్నీషియన్స్ కూడా ఉన్నారు. బ్రెయిన్‌స్ట్రోక్‌తో వచ్చిన వారికి తొలుత సీటీ స్కాన్ చేస్తారు. అందుకోసం రెండు సిటీ మెషిన్‌లు ఉన్నాయి. అవసరమైన వారికి ఎంఆర్‌ఐ స్కానింగ్ చేస్తారు. ఫిట్స్‌తో వచ్చే వారిని పరీక్షించేందుకు ఇఇజీ పరికరం అందుబాటులో ఉంది. నర్వ్ కండక్షన్ స్టడీ(ఎన్‌సీఎస్), కండరాల పటుత్వం తెలుసుకునే (ఇఎస్‌ఎంజీ) పరికరాలు అందుబాటులో ఉన్నాయి. అందుకోసం న్యూరోల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ ఇక్కడ 20 మందికి పరీక్షలు చేస్తుంటారు.

ఖరీదైన మందులు..

న్యూరాలజీ విభాగానికి అత్యంత అరుదైన గిరియన్ బ్యారీ సింద్రోమ్, ఫెనిల్ కెటోన్యూరియా, లఫోరా బాడీ సింద్రోమ్ వంటి వ్యాధులతో రోగులు వస్తుండటంతో వారికి ఖరీదైన మందులను వాడుతున్నారు. జీబీ సింద్రోమ్ వారికి వాడే హ్యూమన్ నార్మల్ ఇమ్యునోగ్లోబలిన్ ఇంజక్షన్ రూ.16,298 ఉంది. ఒక్కో రోగి బరువు, అవసరాన్ని బట్టి వీటిని వాడాల్సి ఉంటుంది. రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకూ ఇంజక్షన్స్ ఖర్చు అవుతుంటాయి. వీటితో పాటు థ్రోంబలైసిస్ ఇంజక్షన్స్, ఒక్కో ఇంజక్షన్ రూ.50 వేలు విలువ కలిగినవి కూడా వాడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.



పేషెంట్‌కు ఈఈజీ టెస్ట్ చేస్తున్న టెక్నీషియన్

ప్రతి రోగికి నాణ్యమైన సేవలు



న్యూరాలజీ విభాగంలో అత్యాధునిక పరికరాలు, మందులు అందుబాటులో ఉండటంతో ప్రతిరోగికి మెరుగైన సేవలు అందించగలుగుతున్నాం. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి, తగ్గని వారు కూడా మా వద్దకు వస్తున్నారు. అలాంటి వారికి స్వస్థత చేకూరుస్తున్నాము. అరుదైన ఫెనిల్ కెటోన్యూరియా, లఫోరా బాడీ డిసీజ్‌లకు గురైన వారు వస్తున్నారు. వారంలో వెయ్యి మంది ఓపీ రోగులను చూస్తున్నాం.

– డాక్టర్ దారా వెంకటరమణ, న్యూరాలజీ విభాగాధిపతి

అరుదైన కేసులు చూస్తున్నాం



మా వద్దకు అరుదైన కేసులు కూడా వస్తున్నాయి. వారికి వ్యాధి నిర్ధారణ చేసి అద్భుత వైద్యం అందిస్తున్నాం. పక్షవాతం రోగులు స్ట్రోక్‌కు గురైన మూడున్నర గంటల్లోగా ఆస్పత్రికి చేరుకోగలిగితే వారికి మెరుగైన వైద్యం అందిస్తాం. సిటీ స్కాన్ చేసి ఇస్కిమిక్ స్ట్రోక్ అయితే థ్రోంబలైజ్ ఇంజక్షన్ ఇస్తున్నాం. ఆ ఇంజక్షన్ ద్వారా త్వరగా కోలుకుంటారు. స్ట్రోక్ యూనిట్ కూడా అందుబాటులోకి వచ్చింది.

– డాక్టర్ మాధవి, అసిస్టెంట్ ప్రొఫెసర్, న్యూరాలజీ

మా అమ్మను బతికించారు




మా అమ్మకు పక్షవాతం రావడంతో చికిత్సకోసం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చి రూ.5 లక్షల వరకూ ఖర్చు చేశాం. ఇక లాభం లేదు తగ్గదని చెప్పడంతో, హోప్ లెస్ అనుకుని ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. కానీ ఇక్కడి వైద్యులు మా అమ్మకు పునర్జన్మను ప్రసాదించారు. అపస్మారక స్థితిలో ఉండగా తీసుకు రాగా, ఇప్పుడు మాట్లాడటమే కాకుండా ఆహారం కూడా తీసుకుంటుంది. ఇక్కడ వైద్యులు దేవుళ్లలాగా మా అమ్మను కాపాడారు.

– సుకన్య, సంతనూతలపాడు, ప్రకాశంజిల్లా

ముగ్గులోకి దింపి ముంచుతున్నారు !

- అమాయకులపై సైబర్ నేరగాళ్ల పంజా
- ప్రముఖ కంపెనీల పేరుతో సైబర్ వల
- ఇంట్లోనే కూర్చొని రూ.లక్షలు సంపాదన అంటూ ఆశ చూపిస్తున్న వైనం
- విజయవాడలో పెరుగుతున్న బాధితులు



విజయవాడ స్పోర్ట్స్:ఆన్‌లైన్ ట్రేడింగ్ వ్యాపారంలో పెట్టుబడి పెట్టి ఇంట్లోనే కూర్చుని నెలకు లక్షలు సంపాదించే అవకాశం అంటూ విజయవాడ మాచవరానికి చెందిన ఓ వివాహిత ఫోన్‌కు రెండు నెలల క్రితం మెసేజ్ వచ్చింది. ఆశతో మెసేజ్ కింద ఉన్న వెబ్‌లింక్‌ను క్లిక్ చేసింది. వెంటనే ఓ ప్రముఖ కంపెనీ వెబ్‌సైట్ ఓపెన్ అయింది. కంపెనీలో పెట్టుబడిదారులకు లాభాలు పంచుతాం అని పేర్కొనడంతో ముందుగా రూ.వెయ్యి పెట్టుబడి పెట్టింది. మరుసటి రోజు రూ. 15 వేలు లాభం చూపిస్తూ ఆమె కంపెనీ వాలెట్‌లో ఈ నగదును జమ చేశారు. వాలెట్‌లోని నగదు విత్‌డ్రా చేయాలంటే మరో రూ.5 వేలు పెట్టుబడి పెట్టాలి అంటూ మెసేజ్ వచ్చింది. రూ.15 వేలు వస్తాయని.. రూ.5 వేలను పెట్టుబడి పెట్టింది. ఇలా ప్రతి రోజూ వాలెట్‌లోని నగదు పెరగడం..., షరతుల నేపథ్యంలో మళ్లీ నగదు జమ చేస్తూ వచ్చింది. నెల రోజుల వ్యవధిలోనే ఆమె వాలెట్‌లో ఒక కోటి 13 లక్షల 42 వేల 181 రూపాయలు చేరాయి. ఈ నగదు తీసుకునేందుకు విడతల వారీగా రూ. 9 లక్షలను సమర్పించాక మోసపోయానని గ్రహించి సైబర్ పోలీసులను ఆశ్రయించింది. ఈమెకు ఇద్దరు ఆడపిల్లలు. భర్త చనిపోవడంతో టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తుంది. డబ్బులు వస్తే పిల్లల చదువుకు ఉపయోగపడతాయనే ఆశతో ఇంట్లోని బంగారాన్ని అమ్మేసి మరీ... సైబర్ ఉచ్చులో చిక్కుకుంది.

ఫోన్‌తోనే గడుపుతున్న వారే లక్ష్యంగా...

జీవన విధానం, మానసిక స్థితిగతులు, అలవాట్లు, అభిరుచులు, అవసరాలు, ఇష్టాయిష్టాలు, ఆశ, అత్యాశలకు అనుగుణంగా నేటి తరం ప్రజలపై సైబర్ నేరగాళ్లు పంజా విసురుతున్నారు. కరోనా సృష్టించిన ఆర్థిక విధ్వంసంతో వ్యాపారాలు మూతపడటంలో ఎంతో మంది కొన్నాళ్ల పాటు ఇళ్లకే పరిమితమయిన విషయం తెలిసిందే. ఈ విపత్కర పరిస్థితులను సైబర్ నేరగాళ్లు సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్కువ సమయం ఫోన్‌తోనే గడుపుతున్న వ్యక్తులను టార్గెట్ చేసుకుని, ఆన్‌లైన్ ట్రేడింగ్ వ్యాపారమంటూ ముగ్గులోకి దించి ముంచుతున్నారు. విజయవాడ నగరంలో సగటున నెలకు 10 ఇదే తరహా ఘటనలు వెలుగులోకి వస్తున్నట్లు సైబర్ పోలీసులు వెల్లడిస్తున్నారు.

చిన్న మెసేజ్‌తో ఆకర్షించి.....

వాట్సాప్/ఫేస్‌బుక్/ఇన్‌స్టా/టెలిగ్రాం/టెక్ట్స్ మెసేజ్‌ను ఫోన్‌కు పంపుతారు. అమెజాన్/ఇబే/లవ్‌లైఫ్/క్రిప్టో/స్నాప్‌డీల్/ఫ్లిప్‌కార్ట్/ఓలా తదితర బడా కంపెనీల్లో పెట్టుబడి పెడితే వచ్చిన లాభాలను పంచుతామంటూ ఆకర్షిస్తారు. ఇంట్లోనే కూర్చుని నెలకు లక్షలు సంపాదించవచ్చంటూ మెసేజ్‌ల ద్వారా ఉచిత సలహా ఇస్తారు. నమ్మకం కుదరకపోతే లక్షలు సంపాదించిన వారి వీడియోలు చూడంటంటూ.. వారే తయారు చేసిన కొన్ని వీడియోల యూట్యూబ్/ఫేస్‌బుక్/ఇన్‌స్టాగాం లింక్‌లను పంపుతారు. మొత్తం ఆన్‌లైన్ అయిపోయిందని, భవిష్యత్తు వ్యాపారం పూర్తిగా ఆన్‌లైన్ వేదికగానే జరుగుతుందంటూ ముగ్గులోకి దించుతారు. ముందుగా రూ.100 పెట్టుబడి పెట్టి పరీక్షించుకోండంటూ బంపర్ ఆఫర్ ఇస్తారు. వారు పంపిన వెబ్‌లింక్ క్లిక్ చేయగానే వారే రూపొందించిన ఆయా కంపెనీల నకిలీ వెబ్‌సైట్‌లోకి తీసుకెళ్తారు. తరువాత ఒక యాప్‌ను డౌన్‌లోడ్, ఇన్‌స్టాల్ చేయిస్తారు. అక్కడ మన కోసం ఫ్రీగా ఒక వాలెట్‌ను వారు రూపొందించి పెట్టుబడులను పలు రకాలైన ఆఫర్లతో ఆకర్షిస్తారు. రూ. 100 పెట్టుబడి పెట్టిన 24 గంటల్లోపే లాభం రూ. 1,500 కు పైగా వచ్చిందని వాలెట్‌లో చూపిస్తారు. ఈ నగదు మీ బ్యాంక్ ఖాతాకు చేరాలంటే మరో రూ.500 పెట్టుబడి పెట్టాలని షరతు విధిస్తారు. ఇదే విధంగా వాలెట్‌లో నగదు అంకెలను పెంచుకుంటూ పోతూ ఆశను పెంచేసి ఒక్కొక్కరి నుంచి రూ. లక్షలు గుంజుతున్నారు.

మెసేజ్ కింద ఉండే కొన్ని సైబర్ నేరాల వెబ్ లింక్‌లు

1.http://imma.fun/index/refirter/43750.htm

2. http://ebay955/#/mine.com

3. http://befamaker.com

అప్రమత్తంగా ఉండాలి

క్యాష్ ఇన్వెస్ట్‌మెంట్ తరహా సైబర్ నేరాలు జరుగుతున్నాయి. వీటిపై కేసులు నమోదు చేసి సైబర్ నేరగాళ్లు ఉపయోగించిన బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేస్తున్నాం. ఈ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నాము. మోసపూరిత మెసేజ్‌లను నమ్మవద్దు. అవసరం లేని వెబ్‌లింక్‌ల జోలికి పోకూడదు. ఇంట్లో చిన్న పిల్లలకు స్మార్ట్‌ఫోన్‌లు ఇవ్వొద్దు. తెలియక పిల్లలు ఈ మెసేజ్‌ల కింద ఉన్న లింక్‌లను క్లిక్ చేసే అవకాశం ఉంది.

యేలేటి శ్రీరచన, ఎస్‌ఐ, సైబర్‌క్రైం, విజయవాడ

క్రైం థ్రిల్లర్, ప్రేమకథా-చిత్రం హిట్-2

ఆ చిత్ర హీరో అడవి శేష్



విజయ సింబల్‌ను చూపిస్తున్న చిత్రం యూనిట్ హీరో, హీరోయిన్, డైరెక్టర్, డిస్ట్రిబ్యూటర్



దుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో హీరో అడవి శేష్, హీరోయిన్ మీనాక్షి చౌదరి

లబ్బీపేట(విజయవాడతూర్పు): హిట్-2 సినిమాలో క్రైమ్ థ్రిల్లర్‌తో పాటు అందమైన ప్రేమ సన్నివేశాలు ఉంటాయని ఆ చిత్రహీరో అడవి శేష్ అన్నారు. హిట్ 2 విజయయాత్రలో భాగంగా హీరో అడవిశేష్, హీరోయిన్ మీనాక్షిచౌదరి శనివారం విజయవాడ నగరంలో సందడి చేశారు. ఈ సందర్భంగా ఓ హోటల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో అడవి శేష్ మాట్లాడారు. స్టార్ హీరో నాని నిర్మాతగా ఈ సినిమా తీయడం చాలా ఆనందంగా ఉందన్నారు. అగ్రహీరోలు తనను నమ్మి సినిమాలు తీయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతిసారీ పోలీస్ రోల్‌లో కనిపిస్తున్నా కథలు వేరేగా ఉన్నాయన్నారు. మిస్ వరల్డ్, మిస్ యూనివర్స్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న మీనాక్షి చౌదరి ఈ చిత్రంలో ఎంతో నాచురల్‌గా నటించిందన్నారు. హిట్-1లో విశ్వక్‌సేన్ నటించారని, హిట్-2లో తాను నటించడం ఆనందంగా ఉందన్నారు. హిట్ ద థర్డ్‌లో నేచురల్ స్టార్ నాని ప్రధాన పాత్రలో నటించనున్నారని, తాను కూడా కాసేపు కనిపించనున్నట్లు చెప్పారు. గూఢాచారి-2 చిత్రాన్ని కూడా త్వరలో ప్రారంభిస్తున్నామని, కథ సిద్ధం చేస్తానని పేర్కొన్నారు. హిట్-2 చిత్రాన్ని ప్రతి ఒక్కరూ తప్పక చూడాలని కోరారు. హీరోయిన్ మీనాక్షి చౌదరి మాట్లాడుతూ తాను నటించిన తెలుగులో రెండో చిత్రం హిట్-2 అన్నారు. ఈ సినిమాను విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. డైరెక్టర్ శైలేష్ కొలను మాట్లాడుతూ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీలను ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకంతోనే తాను చిత్రాలను తీస్తున్నట్లు తెలిపారు. మాది తెనాలి అని, విజయవాడ అంటే తనకెంతో ఇష్టమని, ఇక్కడ థియేటర్లలో సినిమాలు చూసి దర్శకుడిని అయ్యానన్నారు.

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను హిట్-2 చిత్ర బృందం శనివారం దర్శించుకుంది. హీరో అడవి శేష్, హీరోయిన్ మీనాక్షి చౌదరిలతో పాటు చిత్ర బృందం అమ్మవారి దర్శనానికి విచ్చేయగా, ఆలయ అధికారులు వారిని సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేశారు. ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను చిత్ర బృందానికి అందించారు.



మీటరున్నర రెండు పట్టాల నడుమ, 3, 4 కిలోమీటర్ల మధ్యే వారి విధులు.. చూసేందుకు తక్కువే అనిపిస్తున్నా.. వారి బాధ్యతలు మాత్రం అనన్య సామాన్యం. వారి సునిశిత పరిశీలనే ఆపట్టాలపై పయనించే వందల రైళ్లకు రక్ష.. వారి అప్రమత్తతే అందులో ఉన్న వేలకొలది ప్రయాణికులకు భద్రత. ఆ శాఖ ఉద్యోగులలో రైలు పట్టాలపై ప్రత్యక్ష పరిశీలన చేసే సిబ్బందే కీమెన్‌లు.. ప్రత్యక్షంగా రైలు పట్టాల భద్రత, పరోక్షంగా రైళ్ల భద్రతలో కీమెన్‌లు 'కీరోల్' పోషిస్తున్నారని చెప్పడంలో సందేహమే లేదు.

కీ మెన్‌దే రోల్

- రైలు పట్టాలపై ప్రత్యక్ష పరిశీలన
- అనుక్షణం అప్రమత్తతే రైలు ప్రయాణికులకు రక్ష
- కీమెన్, ట్రాక్‌మెన్‌ల కీలక విధులు

లక్ష్మీపురం: రైలు పట్టాలపై ఎలాంటి సమ్యలు లేకుండా నడిచేందుకు కీ మెన్, ట్రాక్‌మెన్‌ల పాత్ర కీలకం. పట్టాలపై పూర్తి నిఘా ఉంటేనే ప్రయాణికులు సురక్షితంగా పయనించగలరు. పట్టాలపై అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అడ్డంకులు లేకుండా చూస్తూ, సమస్యలను సకాలంలో గుర్తిస్తూ వాటిని అధికారులకు సకాలంలో చేరవేసే బాధ్యతను కీ మెన్, ట్రాక్‌మెన్‌లు చూస్తుంటారు. వీరు పర్మినెంట్ వే ఇన్స్‌పెక్టర్ (పీడబ్ల్యూఐ) అనే సూపర్‌వైజర్ పర్యవేక్షణలో విధులు నిర్వర్తిస్తుంటారు.

కీ మెన్ వద్ద ఉండే పరికరాలు ఇవే....

కీమెన్ బ్యాగ్‌లో చేతిలో స్పానర్, సుత్తి, బ్యాగ్‌లో ఎర్ర, పచ్చ జెండాలతో పాటు కొడవలి, చిన్న స్పానర్, డిటర్‌నేటర్, వాటర్ బాటిల్, రిఫ్లెక్టివ్ జాకెట్, 25 ఎంఎం క్లోజర్, డ్యూటీ బుక్ ఉంటుంది.

కీ మెన్ విధులు...



- రైలు పట్టాలపై ఉండే క్లిప్‌లు పరిశీలించాలి
- పట్టాలపై ఉండే జాయింట్ బోల్టులు బిగించి ఉన్నాయో లేదో పరిశీలించి వదులుగా ఉంటే తక్షణమే బిగించాలి.
- ఒక్కో కీ మెన్ 3,4 కి.మీలో మీటర్ల దూరంలో పట్టాలను పరిశీలించాల్సి ఉంటుంది.
- ప్రతి రోజు (ఎస్‌ఈజే) స్విచ్ ఎక్స్‌పెన్షన్ జాయింట్‌ను కీ మెన్ నిరంతరం పరిశీలిస్తూ ఉండాలి. ఈ ఎస్‌ఈజేకి మధ్యలో కొంత గ్యాప్ (ఖాళీ) ఉంటుంది. ఈ గ్యాప్ 40 నుంచి 80 ఎం.ఎం మధ్యలో ఉండాలి. ఎండవేడికి ఇవి కొంత దగ్గర అవ్వడం, చలి తీవ్రత ఎక్కువైన సమయంలో ఈ ఖాళీ దూరం అవడం జరుగుతుంది. అలాంటి సమయంలో 40 నుంచి 80 ఎం.ఎం కంటే ఎక్కువ దూరంగా ఉన్నట్లు అయితే సంబంధిత మేస్త్రీకి గాని సూపర్‌వైజర్‌కు సమాచారం అందించాలి. ఎస్‌ఈజేలో 15 రోజులకు ఒకసారి ఆయిల్, గ్రీజ్ పూస్తూ ఉండాలి.
- కేటాయించిన ప్రదేశంలో పట్టాలకు ఇరు వైపులా గడ్డి, పిచ్చి మొక్కలు అడ్డుగా ఉంటే వాటిని తొలిగించాలి.
- రైలు క్రాసింగ్ పట్టాలపై ఉండే టంగ్ రైలు బోల్టులు పరిశీలించి సరిగ్గా లేని పక్షంలో బిగించాలి
- పట్టాలపై ఎటువంటి అడ్డంకులు ఉన్నా, వాటిని తొలిగించాలి
- రైలు పట్టాలపై ఇరు వైపుల ఉండే క్లాంప్‌లు ఊడిపోయి ఉంటే వాటిని తక్షణమే చేతిలో ఉండే హ్యామర్, సుత్తి చేత సరి చేయాలి
- కీ మెన్ వద్ద కీ మెన్ బోర్డు ఉంటుంది. దాన్ని రైలులో ఉండే లోకో పైలెట్‌ను చూపించాలి.
- రైల్వే ట్రాక్‌మెన్ 24 గంటలపాటు అందుబాటులో ఉంటారు
- ఎలాంటి ప్రమాదం జరిగిన ఖచ్చితంగా అందుబాటులో ఉంటారు.
- డ్యూటీ సమయంలో వారివద్ద ఉండే టూల్ బాక్స్‌తో సంబంధిత అధికారి చెప్పిన ప్రదేశానికి వెళతారు.
- ట్రాక్‌మెన్‌లు, కీ మెన్, అక్కడనుంచి ముకదం (మేస్త్రి) వరకు పదోన్నతులు ఉంటాయి.

ఎయిమ్స్‌కు పెరిగిన రోగుల రాక

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ రోగుల పాలిట వరో వరం

మంగళగిరి: నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్) ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా మంగళగిరి ఎయిమ్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఆరోగ్యశ్రీని అందుబాటులోకి తేవడంతో ఆరోగ్యశ్రీ రోగుల పాలిట మరింత వరంగా మారింది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో పాటు అన్ని విభాగాలలో వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి రోగుల రద్దీ పెరిగింది.

రూ.1618కోట్లతో నిర్మాణం..

రూ 1618 కోట్లతో 2015 సంవత్సరంలో నిర్మాణం ప్రారంభించిన ఎయిమ్స్ అన్ని విభాగాల నిర్మాణాలు పూర్తి చేసుకుంది. అంతర్గత రోడ్లు, విద్యుత్ సౌకర్యంతో అన్ని రకాల మౌలికవసతులను అభివృద్ధి పరచారు. అత్యాధునిక ల్యాబ్‌లు, మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాలలతో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. నామమాత్రం ఫీజు రూ.10 తో సేవలందుతున్నాయి. పల్మనాలజీ, పల్మనరి మెడిసన్, ట్రాన్స్‌ఫ్యూజన్ విభాగ వైద్య సేవలు, డిజిటల్ ఎక్సరే, బయోగ్రఫీ, షుగర్, బ్లడ్, స్కానింగ్‌లు వంటి సేవలు తక్కువ ధరకే అందుతుండడంతో రోజు రోజుకు రోగుల సంఖ్య పెరిగుతోంది.



ఎయిమ్స్ ఓపీ విభాగం వద్ద రోగులు

ఆరోగ్యశ్రీ ఏర్పాటుతో పెరిగిన రద్దీ..

రోజుకు 2 వేల నుంచి 2500 మంది రోగులు రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి తరలివస్తున్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఏర్పాటుతో పలు రకాల రోగులు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలందుకుంటుండగా ఆరోగ్యశ్రీతో మరింత రోగులు పెరిగారని వైద్యులు తెలిపారు. ఒక్క కార్డియాలజీ తప్ప ఇన్‌పేషెంట్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అయితే అన్ని రకాల సేవలను అందుబాటులోకి తెచ్చిన యంత్రాంగం వాటిని ప్రజలకు అందించడంలో శ్రద్ధ చూపకపోవడంతో ఎయిమ్స్‌కు వచ్చిన రోగులు ఇబ్బందులు పడుతున్నారు. రక్తపరీక్షలు, స్కానింగ్ రిపోర్ట్‌ల కొరకు రోజుల తరబడి తిప్పుతుండడంతో రోగులతో వారి బంధువులు వేచి ఉండలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు.



కుటుంబం నుంచే అనుమానాలు.. అవమానాలు ప్రారంభం.. ఇంట్లో నువ్వొక్కతివే/డివే ఇలా ఉన్నావేంటి.. నీవల్ల మేం అవమానాలు భరించలేకపోతున్నాం.. ఎప్పుడు చస్తావు అంటూ ఈసడింపులు. బయటకెళితే అపహాస్యానికి కేంద్రబిందువులు.. సమాజంలో తేడా అంటూ చిన్నచూపు. వెరసి ట్రాన్స్‌జెండర్ల కష్టాలు అన్నిఇన్నీ కావు.. వారిని కదిలిస్తే గుండె గూటిలో దాచుకున్న జ్ఞాపకాలు కన్నీటి రూపంలో బయటికి వస్తాయి.. బయటకు చలాకీగా కనిపిస్తున్నా.. తమ అంతరంగంలో తీరనిబాధ అనే బడబాగ్ని దాచుకున్నారనే విషయం ప్రస్ఫుటమవుతుంది. రాష్ట్రప్రభుత్వం చొరవతో వీరి కష్టాల కరిమబ్బులు వీడి ఇంద్ర ధనస్సు (ఎల్‌జీబీటీ వర్గాల గుర్తు) వెల్లివిరుస్తుందని ఆశిద్దాం..

తమ ఇంటిముందు మాటామంతీ

ఇంద్రధనస్సు వెల్లివిరి సేనా!

- దుర్భర జీవితాల హక్కులకో రక్షణ
- రాష్ట్రంలో ట్రాన్స్‌జెండర్ల ప్రొటెక్షన్ సెల్
- త్వరలో అన్ని జిల్లాలకు విస్తరణ

తెనాలి: వనవాసం తర్వాత తిరిగొస్తున్న శ్రీరాముడికి, అడవి పొలిమేరల్లో 14 ఏళ్ల క్రితం తనకు వీడ్కోలు పలికిన వారిలో కొందరు నిరీక్షిస్తుండటాన్ని చూసి ఆశ్చర్యపోతాడు. మీ గ్రామాలకు వెళ్లకుండా ఎందుకు ఉండిపోయారు...ఎవరు మీరు? అని ప్రశ్నించిన రాముడితో, 'అయ్యా, మీరు స్త్రీలు, పురుషులు, పిల్లలను మాత్రమే వెళ్లిపొమ్మన్నారు....మేం స్త్రీలమూ, పురుషులమూ కాదు...అందుకే మీ ఆజ్ఞానుసారం పోలేదు' అని సమాధానమిచ్చారు.

అవమానాలు.. వివక్ష

పురాణాల్నుంచి ఉనికిలో ఉన్న ట్రాన్స్‌జెండర్లకు నేటి కాలంలో తగిన గౌరవం లేదు. కులం, మతం, లింగమూ, లైంగికతల పేరుతో హక్కులను నిరాకరిస్తున్న సమాజంలో వీరు దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ ట్రాన్స్‌జెండర్ల హక్కులపై చేసిన సర్వే ఈ వివక్షను కళ్లకు కట్టింది. 2011 జనాభా లెక్కల ప్రకారం వీరు దేశవ్యాప్తంగా 4.87,803 మంది ఉన్నారు. 30 వేల మంది ఎన్నికల కమిషనులో రిజిస్టరు చేసుకున్నారు. వాస్తవానికి వీరి సంఖ్య 50 లక్షలపైనే ఉంటుందని అంచనా. వీరికి ఇంట్లో, పాఠశాలలో, పని చేసేచోటా వివక్ష, వేధింపులు అనివార్యం. భౌతికహింస, మానసిక వేధింపులే కాదు, సామూహిక అత్యాచారాలకు గురవుతున్నారు. ఇంతటి తీవ్రమైన కేసుల్లోనూ వీరు పోలీసులను ఆశ్రయించటం లేదు. విధిలేని పరిస్థితుల్లో ఎక్కువమంది యాచన, చిరు వ్యాపారాలు, కూలిపనులు, సెక్స్‌వర్కర్లుగా జీవిస్తున్నారు. కేవలం రెండు శాతం మంది మాత్రమే ఇంటి దగ్గర తలిదండ్రులతో కలిసి ఉంటున్నారు. వీరిలో 92 శాతం మందికి తగిన అర్హతలున్నా ఉపాధి లేదు. కనీసం ఉండేందుకు అద్దెకు ఇల్లు దొరకని పరిస్థితి.

సాంత్వననిచ్చే జమాత్

దీనితో ట్రాన్స్‌జెండర్లు నగరాలు/పట్టణాల్లోని తమ సమూహాలకేసి చూస్తున్నారు. అక్కడి గురు-చేలా సంప్రదాయంలోకి వెళుతున్నారు. తమ హక్కులను కాపాడుకుంటూ, తమను తాము నియంత్రణలో ఉంచుకొనేందుకు తమదైన ఒక సంస్కృతిని దేశవ్యాప్తంగా అలవరచుకోవటం గొప్ప విషయం. వీరికి హక్కుల గురించి తెలియజెప్పి, కొంత సాంత్వన ఇచ్చే వేదిక 'జమాత్'. కుల మతవర్గ వివక్ష లేకున్నా, ఆయా తెగల్లోని నియమాలు వేధిస్తుంటాయి. వృత్తిలో పోటీతోనూ ఘర్షణలు/ వేధింపులూ అనివార్యం.

వీరి వాక్కు శక్తిమంతం

నగరాల్లోని వారికి 'డోలీ బదాయి' ఒక సంపాదన మార్గం. 'పెళ్లిళ్లకు వెళ్లి నాట్యం చేస్తారు.. పాటలు పాడతారు. వధూవరులను ఆశీర్వదిస్తారు. పసి పిల్లలు జన్మించిన ఇంటికి ముందుగా కబురుచేసి వెళతారు... పిల్లలను దీవిస్తారు. వ్యాపారాల ప్రారంభంలోనూ సందడి చేస్తుంటారు. అన్నిచోట్లా ప్రతి శుక్రవారం దుకాణాల వెంట వెళ్లి, చప్పట్లు కొట్టగానే ఆ వ్యాపారి డబ్బులు చేతిలో పెడతారు. 'ట్రాన్స్‌జెండర్ల వాక్కు శక్తివంతమైంది...ఏం పలికినా నిజమవుతుంది' అనే నమ్మకం ఎక్కువ. వనవాసం నుంచి తిరిగొచ్చాక అక్కడే వేచివున్న ట్రాన్స్‌జెండర్లను చూసి చలించిన శ్రీరాముడు, 'మీ పలుకు ఎల్లప్పుడూ సత్యమవుగాక' అని వరమిచ్చిన ఫలితం అంటారు. వీరిలో కేవలం ఒక శాతం మందికి నెలవారీ సంపాదన రూ.25 వేల వరకు ఉండగా, 26.35 శాతం మందికి రూ.10-15వేలకు మించటం లేదు. ట్రాన్స్‌జెండర్లలో చాలామంది లింగ మార్పిడిని ఆశ్రయిస్తున్నారు. గతంలో ముంబయి, తమిళనాడులో జరిగే ఇలాంటి ఆపరేషన్లు ఇప్పుడు విజయవాడలోనూ అందుబాటులోకి వచ్చాయి. 1986లో ఒక్కో ఆపరేషనుకు రూ.2500 ఛార్జి చేస్తే, ప్రస్తుతం రూ.2 లక్షలకు పైగా వసూలుచేస్తున్నట్లు సమాచారం. వీరిలో 57 శాతం మందికి లింగమార్పిడి ఆశలున్నా, ఆర్థికస్తోమత లేని ఎందరో నిరాసక్తతతో ఉండిపోతున్నారు.

సుప్రీం తీర్పుపై హర్షం

దశాబ్దాల వివక్షపై ట్రాన్స్‌జెండర్లు ఇటీవలే గొంతు సవరిస్తున్నారు. చదువు, ఉద్యోగాలు, వ్యాపారాల్లోనూ మెల్లమెల్లగా రాణిస్తున్నారు. 'సమాజంలో ఎల్‌జీబీటీక్యూ (లెస్బియన్, గే, బై సెక్సువల్, ట్రాన్స్‌జెండర్, క్వీర్)లు దేశంలోని మిగిలిన పౌరుల్లాగే అన్ని రాజ్యాంగబద్ధమైన హక్కులను పొందవచ్చు'నంటూ సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన 2018 సెప్టెంబరు 6వ తేదీని, రెండో స్వాతంత్ర్య దినోత్సవంగా ఆయా వర్గాలకు చెందినవారు స్వాగతించారు. బ్రిటిష్ కాలంలో 158 ఏళ్ల నాటి ఐపీసీ సెక్షన్ 377 లోని నిబంధన సరైంది కాదంటూ, సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం తేల్చిచెప్పింది. దేశంలో ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల హక్కుల పరిరక్షణ చట్టం, 2019లోని నిబంధనలు 2020 జనవరి 10 నుంచి అమల్లోకి వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవలే ట్రాన్స్‌జెండర్ల రక్షణ విభాగాన్ని ప్రారంభించింది. త్వరంలోనే అన్ని జిల్లాల్లోనూ ప్రారంభిస్తామని ప్రకటించి, వారి హృదయాల్లో ఆశాదీపం వెలిగించింది.

హక్కుల రక్షణ సెల్ ఏర్పాటు మంచిదే...



సొంతూరు కర్నూలు. అయిదేళ్లగా తెనాలిలో నివాసం. లింగమార్పిడి శస్త్రచికిత్స చేయించి, వివాహం చేసుకున్నా. శస్త్రచికిత్స ధ్రువపత్రం సమర్పించినా పింఛను మంజూరు కాలేదు. కేంద్ర ప్రభుత్వ పథకాలు తెలియవు. మా హక్కుల రక్షణకు సెల్ ఏర్పాటు మంచిది. సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి.

– హాసిని, కర్నూలు

పని కల్పిస్తే యాచన మానేస్తాం



లింగమార్పిడి శస్త్రచికిత్స చేయించుకుని ధ్రువపత్రం ఉన్న మాకు పింఛను మంజూరు చేయాలి. మాకు ఆధార్ కార్డులున్నాయి. రేషను కార్డు కొందరికే ఉంది. ఎక్కువమంది ప్రభుత్వ పింఛను అందటం లేదు. పని కల్పిస్తే యాచన మానేస్తాం. హక్కుల రక్షణకు సెల్ ఏర్పాటు ఓ ముందడుగు.

– షాలిని, తెనాలి

పని అడిగితే హేళన చేస్తున్నారు



నేను రూ.3 లక్షలు ఖర్చు చేసి శస్త్రచికిత్స చేయించాను. పింఛను ఇవ్వటం లేదు. ఏదైనా పనికోసం తిరిగితే మగవాళ్ల పనులు, ఆడవాళ్ల పనులు అని ఉంటాయి... మీరే పని చేస్తారు? అంటూ హేళన చేస్తున్నారు. సమాజంలో మాకు గౌరవం, విలువ లేవు. స్వతంత్రంగా పని చేసుకునే అవకాశం కల్పిస్తే మా జీవితాలు బాగు పడతాయి.

– శ్రావణి, తెనాలి

ట్రైథ్లాన్.. ఐఐటీయన్!

- ట్రైథ్లాన్‌లో రాణిస్తున్న నిహాల్ అహ్మద్ బేగ్
- ఐరన్ మ్యాన్ 70.3 ప్రపంచ పోటీలకు ఎంపిక
- ఐఐటీలో చదివి ఉన్నతోద్యోగం చేస్తూనే రాణింపు
- ఇప్పటికే అంతర్జాతీయ పోటీల్లో సత్తా చూపిన వైనం

సహజంగా క్రీడాకారులు తామెంచుకున్న ఆటలో ప్రతిభ చూపుతుంటారు.. అయితే మూడు క్రీడల్లో సత్తా చాటుతూ అందులో ఉన్నతస్థానానికి చేరుకోవడమంటే మాటలు కాదు.. దానికెంతో కఠోర సాధన, ఏకాగ్రత, పట్టుదల అవసరం. స్విమ్మింగ్, సైక్లింగ్, రన్నింగ్ మూడు కలగలిసిన క్రీడే ట్రైథ్లాన్. క్లిష్టతరమైన ఈ ఆటలో సత్తా చాటుతూ మన దేశ పతాకను విదేశాల్లో రెపరెపలాడిస్తున్నాడు మన గుంటూరు యువకుడు.. ఐఐటీలో చదివి ఉన్నతోద్యోగం చేస్తూనే ఈ ఆటలో రాణిస్తుండడం విశేషం..

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఉన్నత శిఖరాలకు చేరుకున్నా ఇంకా ఏదో సాధించాలనే తపన కొందరికి ఉంటుంది. వృత్తితోపాటు ప్రవృత్తిని కూడా సంతృప్తి పరచాలనే కోరిక తీవ్రంగా ఉంటుంది. దీని కోసం కఠోర శ్రమ చేస్తారు. సాధించే క్రమంలో ఎన్నో సంతోషాలను సైతం దూరం చేసుకుంటారు. చివరకు అనుకున్నది సాధిస్తారు. అటువంటి కోవలోకే వస్తారు గుంటూరుకు చెందిన నిహాల్ అహ్మద్ బేగ్. గత నెల నవంబర్‌లో గోవాలో జరిగిన 'ఐరన్ మ్యాన్ ట్రైథ్లాన్ 70.03 గోవా' పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాడు. ఇదొక అంతర్జాతీయ ఈవెంట్. తండ్రి సుబేదార్ మేజర్ అహ్మద్ బేగ్ భారత సైన్యంలో 30 ఏళ్లు సేవలందించారు. తనలాగే తన కుమారులు కూడా దేశానికి ఏదోరూపంలో సేవ చేయాలనే భావనతో ఉండేవారు. తన ముగ్గురు కుమారుల్ని ఉన్నత వ్యక్తిత్వం ఉన్నవారిగా తీర్చిదిద్దారు.

ముంబై ఐఐటీలో విద్యాభ్యాసం



సైక్లింగ్‌లో పోటీపడుతున్న నిహాల్

నిహాల్ ముంబై ఐఐటీలో బీటెక్‌తోపాటు ఎంటెక్ ఏరోస్పేస్ ఇంజినీరింగ్ అత్యుత్తమ మార్కులతో పూర్తి చేశారు. దీంతో మంచి జీతంతో చదువుకున్న ఊళ్లోనే ఉద్యోగం లభించింది. అయినా తన తపన ఆపలేదు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే తండ్రి మాటలతో పాటు దేశానికి ప్రాతినిధ్యం వహించే ఏ అవకాశాన్ని వదులుకోకూడదనే సంకల్పం నిహాల్‌లో ఎక్కువగా ఉండేది. దీంతో క్రీడలవైపు తన దృష్టి సారించాడు.

ట్రైథ్లాన్‌లో అత్యుత్తమం

ట్రైథ్లాన్ అంటే స్విమ్మింగ్ (1.9 కిమీ), సైక్లింగ్ (90 కిమీ), రన్నింగ్ (21 కిమీ). ఈ మూడు క్రీడల్లోనూ అత్యుత్తమ ప్రదర్శనను చూసి విజేతలను ప్రకటిస్తారు. ఏ ఒక్క దాన్లో గతి తప్పినా ఆ ప్రభావం మిగతా వాటిపై పడుతుంది. అంతే కాకుండా పోటీ సమయం కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. గోవాలో జరిగిన ఐరన్ మ్యాన్ ట్రైథ్లాన్ 70.03 అంతర్జాతీయ పోటీల్లో మొత్తం 20 దేశాల నుంచి 1450 మంది పేరొందిన అథ్లెట్స్ పాల్గొన్నారు. దీంట్లో నిహాల్‌కు ప్రథమ స్థానం దక్కింది. దీంతో వచ్చే ఏడాది ఆగస్టులో ఫిన్లాండ్‌లో జరగనున్న ఐరన్ మ్యాన్ ట్రైథ్లాన్ 70.3 ప్రపంచ చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యాడు. మారథాన్‌లో కూడా అద్భుత ప్రదర్శన చేస్తున్నాడు. ఉద్యోగం చేస్తూనే రోజుకు ఐదు గంటల సాధన చేస్తుంటాడు.

సాధించిన విజయాలు

- 2018 బహ్రెయిన్‌లో ఐరన్ మ్యాన్ ట్రైథ్లాన్ 70.03 అంతర్జాతీయ పోటీల్లో ఐదో స్థానం
- 2019లో శ్రీలంకలోని కొలంబోలో జరిగిన పోటీల్లో తృతీయ స్థానం
- అదేఏడాది ఫ్రాన్స్‌లో జరిగిన ట్రైథ్లాన్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో ప్రథమ స్థానం.
- గోవాలో జరిగిన ఐరన్ మ్యాన్ ట్రైథ్లాన్ 70.03 అంతర్జాతీయ పోటీల్లో ద్వితీయ స్థానం. ఈ ఏడాది ప్రథమ స్థానాలతో పాటు జాతీయ స్థాయి పోటీల్లో పలు పతకాలు సాధించారు. మారథాన్‌లో కూడా నిహాల్‌కు అత్యుత్తమ రికార్డులున్నాయి.



గోవాలో జరిగిన ఐరన్ మ్యాన్ పోటీల్లో విజేతగా నిలిచిన నిహాల్

ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యం




2024లో ట్రైథ్లాన్‌లో ఒలింపిక్స్‌లో దేశానికి పతకం సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాను. దీంతో పాటు అంతర్జాతీయంగా గొప్ప అథ్లెట్‌గా పేరు తెచ్చుకోవాలి. ఏ రంగంలో కృషి చేసినా దాన్లో ఉత్తమంగా రాణించాలనే నా తండ్రి మాటలను నెరవేర్చాలి.

– నిహాల్ అహ్మద్ బేగ్, ట్రైథ్లాన్ క్రీడాకారుడు

పీసీఓడీ.. ఇలా ఎదుర్కోండి

- పెరుగుతున్న బాధితులు
- యువతులనూ పట్టిపీడిస్తున్న సమస్య
- జాగ్రత్తలు, సమతుల ఆహారం, విటమిన్ డితో చెక్ పెట్టవచ్చంటున్న వైద్యులు



గుంటూరు మెడికల్: ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్ల నేడు యువతుల్లో ఎక్కువగా పీసీఓడీ సమస్యలు కనిపిస్తున్నాయి. గతంలో 16 ఏళ్ల నుంచి 20 ఏళ్ల మధ్య వయస్సువారిలో 10 శాతం పీసీఓడీ సమస్యలు ఉండేవి. నేడు వీరి సంఖ్య 40శాతానికి పెరిగిపోవటంపై గైనకాలజిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహిళల్లో సంతానలేమికి కారణం అయ్యే సమస్యల్లో పీసీఓడీ నేడు ప్రధానంగా కనిపిస్తుంది. అండాశయాల్లో బుడగలు ఉండటాన్ని పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్‌గా పిలుస్తారు. పీసీఓడీ వల్ల సంతాన సమస్యలు ఎక్కువ అవ్వటంపై వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా పీసీఓడీ బారిన పడకుండా ఉండొచ్చని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

లక్షణాలు

ఈ వ్యాధి సోకిన వారిలో నెలసరి సక్రమంగా రాదు. నెలసరి ఆలస్యంగా వస్తుంది. నెలసరి సమయంలో కొన్నిసార్లు అధికంగా రక్తం కారటం, కొన్ని సార్లు చాలా తక్కువగా రక్తం కారటం జరుగుతుంది. అండం సరిగా విడుదల కాకపోవటం వల్ల రక్తం కారటం ప్రారంభమవుతుంది. అండం సక్రమంగా విడుదల అవ్వకపోవటంతో పిల్లలు పుట్టడానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. బరువు పెరుగుతారు. శరీరంలోని వివిధ భాగాల్లో అనవసర వెంట్రుకలు పెరిగి ఇబ్బంది కలిగిస్తాయి. ఓవరీస్ సైజ్ పెరిగి వాటిల్లో నీటి బుడగలు ఏర్పడతాయి.

బాధితులు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 250 మంది గైనకాలజిస్టులు వైద్యసేవలను అందిస్తున్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు ప్రతినెలా 40 నుంచి 60 మంది పీసీఓడీ సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. రాష్ట్ర జనాభాలో పదిశాతం మంది మహిళలు ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు.

కారణాలు


అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పోషకాహార లోపం, ధూమపానం, మద్యపానం, మానసిక ఒత్తిడి, ఆందోళన, జన్యుపరమైన తేడాలు, వ్యాయామం చేయకపోవటం, శారీరక శ్రమ లేకపోవటం, ఊబకాయం, పాశ్చాత్య జీవన విధానం, రాత్రిళ్లు ఎక్కువ సమయం సెల్‌ఫోన్స్, టీవీలు చూస్తూ సరిపడా నిద్ర పోకపోవటం వల్ల హార్మోన్స్‌లో అసమానతలు ఈ వ్యాధికి కారణాలు అవుతున్నాయి. కొన్నిసార్లు తల్లికి ఉంటే వారి బిడ్డలకు సైతం వారసత్వంగా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది.

నివారణ చర్యలు



జంక్, ఫ్యాటీ ఫుడ్స్ ఎంత తగ్గించుకుంటే అంత మంచిది. మంచినీరు ఎక్కువగా తాగాలి. పండ్లు, కూరగాయలు తీసుకోవాలి. ప్రతిరోజూ తప్పనిసరిగా వ్యాయామం చేయాలి. వాకింగ్, రన్నింగ్, యోగా, ఏరోబిక్స్ చేయటం ఉత్తమం. ఆహారంలో ప్రొటీన్లు, విటమిన్లు అవసరమైన మేరకు ఉండేలా చూసుకోవాలి. హార్మోన్స్‌ను సమతుల్యం చేసుకోవటం ద్వారా వ్యాధిని నయం చేసుకోవచ్చు. ఆహారంలో విటమిన్ డి అధికంగా ఉండేలా చూసుకోవాలి.

ముందస్తుగా వైద్యపరీక్షలు చేయించుకోవాలి



ఆధునిక జీవనశైలి వల్ల నేడు చాలా మంది యువతులు ముఖ్యంగా కళాశాలలకు వెళ్లే యువతులు ఈ వ్యాధి బారిన పడుతున్నారు. వ్యాధి లక్షణాలు గురించి తెలుసుకుని ప్రాథమిక దశలోనే వైద్యులను సంప్రదిస్తే త్వరగా నయం చేయవచ్చు. ప్రతి ఒక్కరు ఈ వ్యాధిపై అవగాహన కల్గి ఉండాలి. వైద్యరంగంలో వచ్చిన ఆధునిక వైద్య విధానాల వల్ల నేడు మందులతోనే నయం చేయవచ్చు. వ్యాధి లక్షణాలు కనిపించిన వారు కంగారు పడిపోయి మనోవేదనకు గురికాకుండా వైద్యులను త్వరగా సంప్రదిస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయి.

– డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి, స్త్రీ, ప్రసూతి, సంతాన సాఫల్య వైద్య నిపుణురాలు, గుంటూరు.

క్లుప్తంగా

ఎకో టూరిజంపై రేపు స్మారకోపన్యాసం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు నగరంలోని నోవాటెల్ హోటల్‌లో దివంగత యార్లగడ్డ శ్రీరాములు 19వ స్మారకోపన్యాసం నిర్వహిస్తున్నామని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఆంధ్రప్రదేశ్ శాఖ ప్రధాన కార్యదర్శి సీవీ శ్రీరామ్ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ధర్మవనమ్ నేచర్ పార్క్ సహ వ్యవస్థాపకుడు ఫెడరిక్ విలయం ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరై బయోడైవర్సిటీ కన్జర్వేషన్ అండ్ ఎకో టూరిజం అంశంపై మాట్లాడతారని పేర్కొన్నారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ సభ్యుడిగా యార్లగడ్డ శ్రీరాములు చేసిన సేవలను గాను ప్రతి ఏటా ఈ స్మారకోపన్యాసం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ చైర్మన్ కె.హేమ చంద్రారెడ్డితో పాటుగా మా లక్ష్మీ గ్రూప్ వ్యవస్థాపకుడు యార్లగడ్డ హరిచంద్రప్రసాద్ పాల్గొంటారని వివరించారు.

చెట్ల కొమ్మల తొలగింపు



మధురానగర్(విజయవాడసెంట్రల్): 32వ డివిజన్‌లో ప్రజలకు ఇబ్బందికరంగా మారిన చెట్ల కొమ్మలను శనివారం నగరపాలక సంస్థ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో తొలగించారు. రైల్వే ట్రాక్ సమీపంలో చెట్ల కొమ్మలు విపరీతంగా పెరిగిపోవడంతో క్రిమికీటకాలతో పాటు విద్యుత్ తీగలకు అడ్డంకిగా మారాయి. దీంతో స్థానికుల విజ్ఞప్తి మేరకు వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్‌పాల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మల్లాది విష్ణు అధికారులతో మాట్లాడి ప్రజలకు ఇబ్బంది లేకుండా చెట్లకొమ్మలను తొలగించాలని ఆదేశించారు. దీంతో చెట్ల కొమ్మలను తొలగించారు.

చురుగ్గా యూజీడీ సంపు పనులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ ఆచంట వెంకటరత్నంనాయుడు సర్కిల్‌లో యూజీడీ సంపు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. వేగంగా అభివృద్ధి చెందుతున్న గద్దే వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయనగర్ ప్రాంతాలలో యూజీడీ పనుల కోసం ఇప్పటికే పైపులైన్ పనులు పూర్తి చేశారు. మెయిన్ రోడ్డులో కొంత మేర పైపులైన్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి. యూజీడీ పనులలో భాగంగా సంపు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సాధ్యమైనంత త్వరగా యూజీడీ సంపు పనులు పూర్తిచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

● అలరించిన నృత్యోత్సవం





నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించే ఇండియన్ డ్యాన్స్ ఫెస్టివల్ కార్యక్రమాలు మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాలలో శనివారం ప్రారంభమయ్యాయి. స్వర్ణకమలం సినిమాలో నటించిన షారన్‌లోవెన్ యూఎస్‌ఏ ఒడిస్సీ సంప్రదాయంలో ప్రదర్శించిన అంశాలు మనోహరంగా సాగాయి. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవంలో అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు, సమాచార కమిషనర్లు మహబూబ్ బాషా ఐలాపురం రాజా చెన్నారెడ్డి, నృత్య నిర్వాహకుడు బత్తిన విక్రమ్‌కుమార్, నృత్య కళాకారులు షారోన్, ఐలాపురం సుష్మ తదితరులు పాల్గొన్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

అడ్వొకేట్స్ క్రికెట్ రాష్ట్ర కెప్టెన్‌గా క్రాంతి



విజయవాడ స్పోర్ట్స్ : న్యాయవాదుల క్రికెట్ ఆంధ్రప్రదేశ్ జట్టు కెప్టెన్‌గా విజయవాడ చిట్టినగర్‌కు చెందిన దూబా క్రాంతికుమార్ ఎంపికయ్యా డు. కాంత్రికుమార్ గతంలో జాతీయ న్యాయవాదుల క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించారు. ఈ నెల 22 నుంచి 28 వరకు చత్తీస్‌ఘడ్‌లోని రాయపూర్‌లో జరిగే 34వ ఆల్ ఇండియా అడ్వొకేట్స్ క్రికెట్ టోర్నీకి ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టుకు క్రాంతికుమార్ సా రథ్యం వహించనున్నారు. జట్టు కెప్టెన్‌గా ఎంపికైన క్రాంతికుమార్‌ను ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు పొన్నూరు సతీష్‌కుమార్ అభినందించారు.

మానవ హక్కులు విశ్వమానవీయతకు ప్రతీకలు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సమరం

లబ్బీపేట/పటమట (విజయవాడతూర్పు): ఐక్యరాజ్య సమతి పేర్కొన్న మానవ హక్కులు విశ్వమానవీయతకు ప్రతీకలని నాస్తికకేంద్రం చైర్మన్ డాక్టర్ సమరం అన్నారు. దేశాలపరంగా, ప్రభుత్వపరంగా నేడు జరుగుతున్న మానవహక్కుల హరణం మానుషమని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా బెంజిసర్కిల్ సమీపంలోని వాసవ్య మహిళా మండలిలో శనివారం సభ నిర్వహించారు. ఈ సభలో డాక్టర్ సమరం మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 1948 డిసెంబరు 10న యూఎస్ జనరల్ అసెంబ్లీలో 30 మానవ హక్కులను ఏకగ్రీవంగా ఆమోదించి, అన్ని దేశాల చట్టాలు, విధులు వీటికి అనుగుణంగా ఉండాలని పేర్కొన్నట్లు తెలిపారు. ఐక్యరాజ్యసమితి 30 మానవ హక్కులలో మొదటిది మానవులంతా ఒకటేనని చాటిందన్నారు. జాతి, రంగు, మతం, కులం, ప్రాంతం, దేశం ఇలా ఎలాంటి వివక్షత తగదని, ప్రతి వ్యక్తికీ జీవించే హక్కు, ప్రాణరక్షణకు హక్కు పేర్కొన్నట్లు తెలిపారు. ఎవరు ఎవరికీ బానిసలు కాదని, బానిసలుగా మానవ విక్రయాలు పనికిరావని, బాధించడం, అమానవీయ ప్రవర్తన పనికిరాదని స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిపారు. న్యాయం ముందు అందరూ సమానమే అని, అందరికీ ఒకటే న్యాయమని , ఎవరినీ అన్యాయంగా బాధించకూడదన్నారు. నేరం రుజువయ్యే వరకూ ఎవరినీ నేరస్తుడిగా పేర్కొనకూడదని చెప్పినట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో జర్నలిస్టు శ్యామ్ సుందర్ సంఘ సేవకులు అజామ్, డాక్టర్ మారు, హరిసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మానవ హక్కులను కాపాడేందుకు కృషి

భవానీపురం(విజయవాడపశ్చిమ): సమాజంలో మానవ హక్కులు, విలువలను కాపాడేందుకు నేషనల్ సోషల్ జస్టిస్ అండ్ హ్యూమన్ రైట్స్ కమిషన్ కృషి చేస్తోందని సంస్థ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ గుప్తా తెలిపారు. దీనిపై ఏడాదిపాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించినట్లు పేర్కొన్నారు. మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని సంస్థ రాష్ట్ర కార్యాలయంలో శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ గుప్తా, సంస్థ ఉపాధ్యక్షుడు కిషోర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలతోపాటు విద్యా పరంగా ఎదురవుతున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా తామందరం కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ హ్యూమన్ రైట్స్ కమిటీ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే సుభాష్, అడ్వైజర్ ఖాదర్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న చంద్రశేఖర్ గుప్త, కిషోర్

హక్కులు, చట్టాలను కాపాడుకోవాలి

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఉద్యమాలు, పోరాటాలతో సాధించుకున్న హక్కులు, చట్టాలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి మహిళపై ఉందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా)వజ్రోత్సవాలను పురస్కరించుకుని ఐద్వా రాష్ట్ర నాయకురాలు వి.జ్యోతి, శ్రామిక మహిళా నాయకురాలు ఆర్.వి.లక్ష్మీ అధ్యక్షతన శనివారం అత్యాచారాల నివారణ-సమానత్వ సాధన అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ మహిళా ఉద్యమం ఏర్పడి 75 సంవత్సరాలైన చారిత్రక నేపథ్యంలో వజ్రోత్సవాలను జరుపుకుంటున్నామన్నారు. ఆనాడు స్వాతంత్రోద్యమంలో పాల్గొనేందుకు మహిళలను గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, సుందరయ్య లాంటి మహానాయకులు మహిళలను ప్రోత్సహించారన్నారు. అందులో భాగంగా స్త్రీ పురుష సమానత్వం, మహిళా హక్కుల సాధన కోసం మహిళా సంఘం ఏర్పడి పనిచేసిందన్నారు. అనాటి నుంచి మహిళా సంఘాల నిరంతరం పోరాటాల ఫలితంగా అనేక హక్కులు సాధించుకున్నామన్నారు. విద్య, ఉద్యోగాలు, సమానవేతనం అందుబాటులో లేకుండా సమానత్వం అసాధ్యమన్నారు. మహిళలకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా మగవారితో పాటు సమాన అవకాశాలు కల్పించినప్పుడే అణచివేత అంతమవుతుందన్నారు. శ్రామిక మహిళా రాష్ట్ర కార్యదర్శి కె.స్వరూపరాణి మాట్లాడుతూ మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేసేందుకు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ప్రయత్నించడం లేదన్నారు. ఇప్పటికీ మహిళలకు 33శాతం రిజర్వేషన్లు నోచుకోలేదన్నారు.ఏమహిళా సమైక్య రాష్ట్ర కార్యదర్శి దుర్గాభవాని మాట్లాడుతూ మహిళా ఉద్యమానికి ఘన చరిత్ర ఉందన్నారు.ఎన్నెన్నో త్యాగాలు, బలిదానాలు, పోరాటాలు గుర్తు చేసుకుని మహిళా హక్కుల సాధన కోసం అందరం కలిసి ముందుకు వెళ్దామని పిలుపునిచ్చారు.

దేవతామూర్తుల విగ్రహాల బహూకరణ

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వామివారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శ్రీచెన్నకేశవ స్వామివారు, దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను గ్రామానికి చెందిన చెక్క కేశవరావు, రాజేశ్వరి, తోటకూర కాశీవిశ్వేరరావు, శేషకుమారి, కోడే లక్ష్మణరావు, శ్వేత దంపతులు బహూకరించారు. గరుడ వాహనాన్ని గంటా శ్రీధర్‌కుమార్, మంజుల, స్వామివారి కిరీటాలు సబ్బినేని రాజారావు, లక్ష్మి, కూచిపూడి లోకేష్, స్వాతి, తోటకూర కాశీవిశ్వేశ్వర రావు, శేషకుమారి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామివార్లను గరుడ వాహనంపై ఊరేగించారు.

కుట్టు మిషన్ వితరణ



గురిందపల్లి రవికి కుట్టుమిషన్‌ను అందజేస్తున్న దేవినేని అవినాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): తూర్పు నియోజకవర్గంలోని ఫిటింగులపేటకు చెందిన గురివిందపల్లి రవికి జీవనోపాధి నిమిత్తం వైఎన్నార్ చారిటబుల్ ట్రస్టు రూ.50 వేల విలువగల కుట్టుమిషన్‌ను వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చేతుల మీదగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం అనుభవజ్ఞుడని చంద్రబాబుకు అధికారం ఇస్తే, రాష్ట్రాన్ని అన్ని విధాల దోచుకున్నాడని విమర్శించారు. చంద్రబాబు అరాచక పాలనతో ప్రజలు విసుగు చెందడంతో వైఎస్సార్ సీపీకి చారిత్రాత్మక విజయాన్ని అందించారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తుంటే ఓర్వలేక టీడీపీ నాయకులకు ఇదేం కర్మ అంటూ రోడ్డున పడ్డారని ఎద్దేవా చేశారు. దేవినేని నెహ్రూ స్ఫూర్తితో వైఎన్నార్ చారిటీస్ ఆధ్వర్యంలో పేదల జీవనోపాధి కల్పించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఎనిమిదివ డివిజన్ ఇన్‌చార్జి యలమంచిలి జయప్రకాష్, పొట్లూరి రవి, కొల్లి రవి, ధనశేఖర్, జాన్సీ, పాల్వాయి రవి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలపై కూడా ఆసక్తి చూపాలి



ఆకట్టుకున్న విద్యార్థుల విన్యాసాలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): చదువుతో పాటుగా క్రీడలపైనే విద్యార్థులు ఆసక్తి చూపాలని శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఈఓ డి.భ్రమరాంబ చెప్పారు. వీరమాచనేని పద్దయ్య సిద్దార్థ పబ్లిక్ స్కూల్ 40వ క్రీడాదినోత్సవ వేడుకలు శనివారం సాయంత్రం స్కూల్ మైదానంలో ఉత్సాహ పూరిత వాతవరణంలో జరిగాయి. భ్రమరాంబ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడా జ్యోతిని వెలిగించి మాట్లాడుతూ క్రీడలు ఆడటంతో శారీరక శ్రమ జరిగి సంపూర్ణ ఆరోగ్యంతో పాటుగా ఒత్తిడి తగ్గుతుందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన యోగా, జిమ్నాస్టిక్స్ ప్రదర్శనలను ఆమె తిలకించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సీతారామయ్య మాట్లాడుతూ 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించిన వార్షిక క్రీడా నివేదికను చదివి వినిపించారు. సిద్దార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ పి .నాగేశ్వర రావు మాట్లాడుతూ క్రీడల్లో గెలవడంతో ఆత్మ విశ్వాసం పెరుగుతుందన్నారు. వివిధ ఆటల పోటీల్లో విజేతలైన వారికి అతిథులు బహుమతులను అందజేశారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అతిథులు సత్కరించారు. సిద్దార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, ఉప కార్యదర్శి ఎన్.లలిత్ ప్రసాద్, పాఠశాల కన్వీనర్ సూరెడ్డి విష్ణు పాల్గొన్నారు.

• ఆకట్టుకున్న క్రిస్మస్ ట్రీ



బందరు రోడ్డులోని ఓ ప్రముఖ వస్త్ర దుకాణంలో క్రిస్మస్ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ ఆకట్టుకుంటోంది. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పోలీసు సేవలను ధైర్యంగా వినియోగించుకోవాలి



ఏసీపీ రాజశేఖర రాజు సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు, లయోలా కళాశాల ప్రతినిధులు

గుణదల(విజయాడ తూర్పు): ప్రతి ఒక్క పౌరుడు పోలీసుల సేవలను ధైర్యంగా వినియోగించుకోవాలని కమాండ్ కంట్రోల్ ఏసీపీ ఎస్.ఆర్.రాజశేఖర రాజు చెప్పారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం లయోలా కళాశాల ఆవరణలోని పీజీ సెమినార్ హాలులో కమ్యూనిటీ ఫర్ సోషల్ రెస్పాన్సిబులిటి అండ్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ క్లబ్, హెచ్ఆర్‌సీ ప్రొటక్షన్ సంయుక్తంగా మానవ హక్కుల దినోత్సవ వేడుకలను నిర్వహించాయి. అతిథిగా హాజరైన రాజశేఖర రాజు మాట్లాడుతూ పోలీసు శాఖ ఉన్నది పౌరులకు రక్షణగా ఉండటానికేనని చెప్పారు. పౌరులు ఎటువంటి భయం లేకుండా ఏవిధమైన సమస్యను అయినా పోలీసులకు తెలియజేసి వారి సేవలను పొందాలన్నారు.

పౌరులు 100 నంబరుతో పాటుగా దిశ యాప్‌ను కూడా ఉపయోగించుకోవా లన్నారు. సమాజంలో జరిగే అన్యాయాన్ని ఎదు ర్కొని ఆపే బాధ్యత పోలీసులతో పాటుగా ప్రతి పౌరుడి పైన ఉందన్నారు. న్యాయవాది జీవీఎస్ఆర్ఎస్ఎస్ వరప్రసాద్ మాట్లాడుతూ కులం, మతం, ప్రాంతాలు చూడకుండా తోటి మనిషికి సాయం చేసుకుంటూనే హక్కులను కాపాడుకోవాలన్నారు. హెచ్ఆర్‌సీ-ప్రొటెక్షన్ సభ్యులు అబ్దుల్, రాజ్ అయ్యార్, ఏపీ శ్రీలక్ష్మి., లయోలా కళాశాల పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి జాన్ పాల్గొన్నారు.

మానవత్వం పరిమళించే..

ఆఖరి మజిలీలో అండగా కాలేషా

అద్దె ఇళ్లలో నివసించే వారిలో ఎవరైనా చనిపోతే వారిని కనీసం వారి ఇంటి ఛాయల్లోకి కూడా రానివ్వరు. ఆస్పత్రిలో చనిపోతే అటునుంచి అటే మరుభూమికి తరలించేయాల్సిన పరిస్థితి. ఇలాంటి సమయంలో మాట సాయం చేసినా కొండంత అండగా ఉంటుంది. అలాంటిది మృతదేహాన్ని తీసుకొచ్చి తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన గదిలో ఉంచి సంప్రదాయబద్ధంగా అన్ని కార్యక్రమాలు పూర్తిచేయించి, అనంతరం తన సొంత వాహనంలో శ్మశానానికి తరలించి అంత్యక్రియలు పూర్తయ్యేలా చూడటం అంటే ఈ రోజులలో అసాధ్యమే. అయితే మధురానగర్‌కు చెందిన షేక్ కాలేషా మాత్రం ఇవన్నీ కష్టం కావంటూ అఖరి మజిలీలో అండగా నిలుస్తూ మానవత్వం చాటుకుంటున్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): సాధారణ కుటుంబానికి చెందిన కాలేషా (బచ్చామేస్త్రి) అసాధారణ సేవలు అందిస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు. ఆర్థికంగా గొప్ప వాడు కాకపోయినా, సేవాగుణంలో మాత్రం ధనికుడేనని నిరూపిస్తున్నారు. పాత దుస్తులు, మాసిన గడ్డం, కాళ్లకు రబ్బరు చెప్పులతో సాధారణంగా ఉండే షేక్ కాలేషాను బచ్చామేస్త్రి అంటూ స్థానికులు అప్యాయంగా పిలుస్తుంటారు. నగరంలోని మధురానగర్‌లో ఉంటూ చెక్క సెంట్రింగ్ పని చేస్తూ, భవన నిర్మాణ సామగ్రిని అద్దెకు ఇస్తూ జీవనం గడుపుతున్నారు. కొన్నేళ్ల కిందట అద్దె ఇంటిలో ఉండే ఓ పెద్దావిడ మృతి చెందితే అక్కడ ఉంచవద్దంటూ యజమానులు అనడం కాలేషాను కదిలించింది. దీంతో వెంటనే ఆయన తన ఇంటిముందు గదిలోని వారిని ఖాళీ చేయించి మృతదేహాలను అక్కడ ఉంచేందుకు ఏర్పాట్లు చేశారు. రూ.లక్షా 80 వేలు పెట్టి టాటాఏస్‌ను కొనుగోలు చేశారు. మృతదేహాలను ఉంచేందుకు రూ.1.50 లక్షలతో మూడు ఫ్రీజర్ బాక్సులను తయారు చేయించారు. అద్దె ఇళ్లలో ఉండే ఎవరికైనా ఇలాంటి కష్టం వస్తే నన్ను సంప్రదించండి అంటూ తన చిరునామా, ఫోన్ నంబర్‌ను తెలిసిన వారందరికీ ఇచ్చారు. మృత దేహానికి స్నానం చేయించడం దగ్గర నుంచి బాధితులు స్నానం ఆచరించడం కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఎవరైనా చనిపోయారనే సమాచారం అందితే అక్కడకు వెళ్లి వారు అడగక ముందే సాయం అందిస్తున్నారు. మృతదేహాన్ని బాక్సులో ఉంచి తన టాటాఏస్‌లో శ్మశాన వాటిక వరకు తరలిస్తారు. ఇందుకు గానూ ఆయన ఎవరి వద్ద నుంచి ఒక్క పైసా కూడా తీసుకోరు. ఇదేంటి మేస్త్రి అని అంటే కూలి తీసుకునే సమయమా ఇది అంటూ నవ్వేసారేస్తారు. బాధలో ఉన్న వారి వద్ద ఒక్క రూపాయి తీసుకున్నా నా మనస్సు చచ్చిపోతుందని ఆవేదనతో చెబుతారు.

తన వద్ద పదిమంది పనిచేస్తున్నా ఇందుకుగానూ సేవలను మాత్రం తనే స్వయంగా అందజేస్తున్నారు. బచ్చామేస్త్రి తన ఇంటివద్ద చేస్తున్న పనులను స్థానికులు వ్యతిరేకించినప్పటికీ ధైర్యంగా ముందుకు సాగుతున్నారు. ఇందుకుగానూ భార్య షేక్ మిస్కిల్, కుమారుడు సుభానీ, ఇద్దరు కుమార్తెలు సైతం కాలేషాకు మద్దతుగా నిలుస్తున్నారు.

తానే స్వయంగా చేయాలంటూ..



మృతదేహాన్ని తరలిస్తున్న టాటాఏస్ వాహనంతో బచ్చామేస్త్రి

● కులమతాలకు అతీతంగా సేవలు

బచ్చామేస్త్రి కులమతాలకు అతీతంగా సేవలు అందిస్తున్నారు. అలాగే మధురానగర్ పరిసర ప్రాంతాలలో అన్ని దేవాలయాలలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలలో సైతం చురుకైన పాత్రను పోషిస్తున్నారు.

● మహా అయితే లీటర్ పెట్రోల్

అనాథ నిరుపేద శవాలు ఎక్కడ ఉన్నా వెంటనే వెళ్లి సేవలు అందిస్తున్నావు ఎంతో ఖర్చవుతుంది కదా అని ఎవరైనా ప్రశ్నిస్తే మహా అయితే లీటర్ పెట్రోల్ అవుతుంది అంతే కదా అని అంటున్నారు.

నాన్న స్ఫూర్తితో..



చిన్నతనంలో తండ్రి అబ్దుల్ ఖాదర్ తోటి వారికి సాయం చేయాలని చెప్పిన మాటలు, అద్దె ఇంట్లో ఉండేవారు పడుతున్న అవస్థలను చూసి నేను ఈ కార్యక్రమాలు చేపట్టాను. బచ్చామేస్త్రి చనిపోయాడంటే మధురానగర్ జనాలు వచ్చి నాలుగు పువ్వులేస్తే చాలు. నా జీవితం సార్థకమైనట్లే. మానవ జీవితం గొప్పది. మన కోసం బతికితే అర్థమేముంది. కనీసం కొంతైనా ఇతరుల సాయానికి వెచ్చించాలి కదా. ప్రస్తుతం నా వద్ద మూడు ఫ్రీజర్ బాక్సులు మాత్రమే ఉన్నాయి. మరో రెండు బాక్సులు ఉంటే బాగుటుందని చెబుతున్నారు. కష్టంలో ఎవరున్నా ఆదుకోండయ్యా అంటూ చిన్నప్పుడు నా తండ్రి షేక్ అబ్దుల్ ఖాదర్ చెప్పిన మాటే నేటికీ వేదంగా సాగుతున్నా.

– షేక్ కాలేషా

తెలంగాణ

నవీన్‌రెడ్డి దారుణంగా హింసించాడు

- కిడ్నాప్‌కు గురయిన హైదరాబాద్ వైద్య విద్యార్థిని వైశాలి వెల్లడి
- అతడితో నా పెళ్లి జరగలేదు.. ఫొటోలు మార్ఫింగ్ చేశాడు
- కిడ్నాప్ కేసులో 32 మంది అరెస్టు
- పరారీలో నవీన్‌రెడ్డి

తుర్కయంజాల్ (రంగారెడ్డి జిల్లా)/ఇబ్రహీంపట్నం రూరల్: తనను నవీన్‌రెడ్డి కొట్టడంతోపాటు దారుణంగా హింసించాడని కిడ్నాప్‌నకు గురై పోలీసులు రక్షించడంతో బయటపడ్డ వైద్య విద్యార్థిని వైశాలి తెలిపింది. నవీన్‌రెడ్డి వేధింపులకు గురిచేస్తున్నాడని మూడు నెలల క్రితమే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించింది. శనివారం రంగారెడ్డి జిల్లా ఆదిభట్లలోని తన నివాసంలో తల్లిదండ్రులతో కలిసి వైశాలి మీడియాతో మాట్లాడింది. 'శుక్రవారం నవీన్‌రెడ్డి గ్యాంగ్ మా ఇంటికి వచ్చి నన్ను బలవంతంగా లాక్కెళ్లి కారులో పడేసింది. అడ్డొచ్చిన మా అమ్మ, నాన్నతోపాటు ఇతరులపై దాడి చేశారు. కారులో చిన్న చిన్న గ్రామాల మీదుగా తిప్పుతూ అరిస్తే నన్ను, ఇంటి వద్ద ఉన్న మా నాన్నను చంపేస్తామని బెదిరించారు. కారులో నవీన్‌రెడ్డి, మరో ఆరుగురు ఉన్నారు. కారు డోర్ ఓపెన్ చేయడానికి ప్రయత్నిస్తే నా చేతి వేలిని నలిపేశారు. సాయంత్రం 4గంటల వరకు కారులోనే తిప్పుతూ కొడుతూ హింసించారు. చివరకు యాచారం దగ్గర వదిలిపెట్టడంతో మా నాన్నకు ఫోన్ చేశా' అని వైశాలి వివరించింది. 'కరోనా సమయంలో కొంగర కలాన్‌లో బ్యాడ్మింటన్ ఆడటానికి వెళ్లేదాన్ని. అక్కడ ప్రేమ పేరుతో నవీన్ నా వెంట పడినా ఇష్టం లేదని చెప్పా. నా పేరుతో ఇన్‌స్టాగామ్‌లో నకిలీ ఖాతా తెరిచి మా స్నేహితురాళ్లతో దిగిన ఫొటోలను మార్ఫింగ్ చేసి అప్‌లోడ్ చేశాడు. ఆ సమయంలో పోలీసులకు ఫిర్యాదు చేశా. ఇంటి ముందే ఒక నిర్మాణాన్ని చేపట్టి వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేశా.' అని వైశాలి చెప్పింది. 'నాకు నవీన్‌తో పెళ్లి జరగలేదు. అతడు నాకు పెళ్లి జరిగినట్లు చెబుతున్న రోజు నేను ఆర్మీ కళాశాలకు డెంటల్ వైద్యం చేయించుకునేందుకు వెళ్లా' అని తెలిపింది. మరోవైపు తన కుమారుడు నవీన్‌రెడ్డి, వైశాలి ప్రేమించుకున్నారని, రెండేళ్లపాటు కలిసి తిరిగారని నవీన్ తల్లి నారాయణమ్మ తెలిపారు. వైశాలిని పెళ్లి చేసుకున్నట్లు తనకు చెప్పాడని వెల్లడించారు.

చర్లపల్లి జైలుకు నిందితులు

వైశాలి కిడ్నాప్ ఘటనలో మొత్తం 36 మంది ప్రమేయం ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. వారిలో 32 మందిని అరెస్టు చేశారు. నవీన్‌రెడ్డి సహా నలుగురు పరారీలో ఉన్నారు. నిందితులను ఇబ్రహీంపట్నం 15వ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, జ్యుడిషియల్ రిమాండ్‌కు ఆదేశించడంతో చర్లపల్లి జైలుకు తరలించారు.



హలో..హలో.. వినిపిస్తోందా!



వినియోగదారులను వేధిస్తున్న 'కాల్ డ్రాప్' సమస్య

- డయల్ చేస్తే ఎంతకీ కనెక్షన్ దొరకని పరిస్థితి
- డేటా, వైఫై కాల్స్‌పై ఆధారపడుతున్న యూజర్లు
- గతంతో పోలిస్తే తగ్గిపోయిన సిగ్నలింగ్ లెవల్ పరిధి
- సిగ్నల్ అందక బ్యాటరీ వేగంగా అయిపోతుంది.. ఫోనూ పాడవుతుంది.. ఇలానే కొనసాగితే వినియోగదారులు 5జీకి వెళ్లలేరంటున్న నిపుణులు
- ఈ సమస్యలపై అధ్యయనం, పరిష్కారానికి ట్రాయ్ యాప్

శ్రీముఖి తన తల్లితో మాట్లాడాలని ఫోన్ చేసింది. తల్లి పార్వతమ్మ లిఫ్ట్ చేసింది. హలో.. హలో.. అన్నా, అవతలి నుంచి సమాధానం లేదు. హలో వినిపిస్తుందా అని శ్రీముఖి అడుగుతోందే తప్ప అవతలి నుంచి శబ్దం రాదు. ఆ కాసేపటికే కాల్ కట్ అయింది.

వెంకటేశ్వర్లు తన తమ్ముడితో అత్యవసరంగా మాట్లాడాలని తన మొబైల్ నుంచి ఫోన్ చేశాడు. ఒకసారి, రెండుసార్లు.. మూడు సార్లు.. ఇలా చాలా సార్లు కాల్ చేస్తే ఒక్క కాల్ కలిసింది.

- సాక్షి, అమరావతి

ఇవి ప్రస్తుతం దేశంలో ఫోన్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు. ఫోన్ చేస్తే కాల్ కలవదు. ఒకవేళ కలిసినా వెంటనే కట్ అవుతుంది. కాల్‌లో ఉండగానే వాయిస్ బ్రేకింగ్.. ఒక్క కాల్ మాట్లాడటానికి మూడు, నాలుగుసార్లు డయల్ చేయాలి. సిగ్నల్స్ ఉన్నా ఒక్కోసారి ఫోన్‌ను ఫ్లైట్ మోడ్/స్విచ్ ఆఫ్ చేసి ఆన్ చేస్తేగాని కాల్ వెళ్లని పరిస్థితి. ప్రస్తుతం టెలికాం రంగంలో 'కాల్ డ్రాప్', 'కాల్ కనెక్షన్' పెద్ద సమస్యగా మారింది. మిగతా దేశాలతో పోలిస్తే దేశంలోనే కాల్ డ్రాప్ రేటు ఎక్కువగా ఉంది. సాంకేతికత 2జీ నుంచి 4జీకి వచ్చినప్పటికీ సిగ్నల్ లెవల్స్ పరిధి తగ్గుతోంది. గతంతో పోలిస్తే ఒక టవర్ సిగ్నల్ పరిధి 10వ వంతుకు తగ్గిపోవడం ఇందుకు కారణంగా తెలుస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 5.50 లక్షల మొబైల్ నెట్‌వర్క్ టవర్లు ఉన్నాయి. అయినా సమస్య పరిష్కారమవలేదు. కొత్త సాంకేతికతతో పాటు మరో లక్ష టవర్లు అందుబాటులోకి వస్తే తప్ప నెట్‌వర్క్ నాణ్యత మెరుగుపడదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలోనే వినియోగదారులు కాల్ డ్రాప్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలాగే కొనసాగితే వినియోగదారులు ప్రస్తుతం ఉన్న టారిఫ్‌లకే పరిమితమవుతారని, ఎక్కువ వెచ్చించి 5జీ వంటి కొత్త టారిఫ్‌లకు వెళ్లేందుకు ఇష్టపడరని నిపుణులు చెబుతున్నారు.

బ్యాటరీ త్వరగా అయిపోతుంది

భారత టెలికాం మార్కెట్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మార్కెట్. ప్రస్తుతం దేశంలో 1.1 బిలియన్ మొబైల్ కనెక్షన్లు ఉన్నాయి. టెలికాం కంపెనీలు ట్రాయ్ నిర్దేశించిన బెంచ్‌మార్క్‌ను అందుకోలేకపోవడంతోనే అధిక కాల్ డ్రాప్స్ తలెత్తుతున్నాయి. సిగ్నలింగ్ కవరేజీ క్షీణించడం వల్ల హ్యాండ్‌సెట్ అధిక శక్తితో పని చేయాల్సి ఉంటుంది. ఫలితంగా బ్యాటరీ వేగంగా అయిపోవడంతోపాటు ఫోన్ కూడా త్వరగా పాడవుతుంది. ఈ నేపథ్యంలోనే కాల్ డ్రాప్ సమస్యపై వినియోగదారుల నుంచి కచ్చితమైన అభిప్రాయ సేకరణకు.. టెలికాం అథారిటీ ఆఫ్ ఇండియా 'ట్రాయ్‌మై కాల్' వాయిస్ కాల్ క్వాలిటీ మానిటరింగ్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. వినియోగదారులు కాల్ పూర్తి చేసిన తర్వాత తమ అభిప్రాయాన్ని అందించడానికి ఇది ఉపయోగపడుతుంది. ఈ సమాచారంతో టెలికాం సర్కిల్ నెట్‌వర్క్ సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించేందుకు వీలవుతుంది.

పెరిగిన డేటా, వైఫై కాల్స్

ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం లోకల్ సర్కిల్స్ దేశంలో 339 జిల్లాల్లో చేసిన సర్వే ప్రకారం 91 శాతం మంది కాల్ డ్రాప్ సమస్యను ఎదుర్కొంటున్నట్టు తేలింది. ఇందులో 56 శాతం మంది తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. దీనిని అధిగమించేందుకు వినియోగదారులు డేటా, వైఫై ఆధారిత కాల్స్‌కు వెళ్తున్నారు. ఈ తరహా కాల్స్ 2019లో 75 శాతం ఉంటే ఇప్పుడు 82 శాతానికి పెరిగాయి. దేశంలో 0 నుంచి 3 సెకన్లలోపు కాల్ డ్రాపింగ్ శాతం పెరిగింది. నిమిషంలోపు డ్రాపింగ్ శాతం తగ్గింది.

5జీపై అనాసక్తత



సాంకేతికతలో ఎంత మార్పులు వచ్చినప్పటికీ కాల్ డ్రాప్ సమస్యలు తగ్గకపోవడంతో మొబైల్ నెట్‌వర్క్ యూజర్లు కొత్త సాంకేతికత వైపు వెళ్లడానికి అంతగా ఇష్టపడటంలేదు. 5జీ వంటి హై స్పీడ్ నెట్‌వర్క్ తేవడానికి ముందుగా నెట్‌వర్క్ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. అందుకే ప్రస్తుత టారిఫ్‌లతోనే సరిపెట్టుకొంటామని, ఎక్కువ చార్జీలు పెట్టి కొత్త టారిఫ్‌లు తీసుకోబోమని చెబుతున్నారు. ఇటీవలి సర్వేలో 43 శాతం మంది ప్రస్తుత టారిఫ్‌కంటే ఎక్కువ చెల్లించడానికి సిద్ధంగా లేమని కరాఖండిగా చెప్పడమే దీనికి నిదర్శనం. మరో 43 శాతం మంది 10 శాతం ఎక్కువ చెల్లించగలమని చెప్పారు. 10 శాతం మంది మాత్రం 10 నుంచి 25 శాతం వరకు ఎక్కువ చెల్లించేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ

తెలంగాణ పీసీసీ కమిటీల్లో భారీ మార్పులు

- కొత్తగా ఎగ్జిక్యూటివ్ కమిటీ
- వర్కింగ్ ప్రెసిడెంట్ హోదా నుంచి గీతారెడ్డి, పీఏసీ కన్వీనర్‌గా షబ్బీర్‌అలీ ఔట్

సాక్షి,హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీల్లో ఏఐసీసీ భారీ మార్పులు చేసింది. పీఏసీని మార్చింది. కొత్తగా ఎగ్జిక్యూటివ్ కమిటీ ఏర్పాటు చేసింది. 24 మంది ఉపాధ్యక్షులను నియమించింది. ఏకంగా 84 మందికి ప్రధాన కార్యదర్శి హోదా కట్టబెట్టింది. ఆరు జిల్లాల పార్టీ అధ్యక్షులను మార్చింది. శనివారం విడుదల చేసిన పీఏసీ, పీఈసీ, పీసీసీ కమిటీల్లో 170 మందికి స్థానం కల్పించడం విశేషం. రాష్ట్ర పార్టీ వ్యవహారాల్లో కీలకమైన రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ)లో గతంలో 14 మంది సభ్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్లు, కమిటీల చైర్మన్లు, ఇన్‌చార్జి ఏఐసీసీ కార్యదర్శులు, తెలంగాణకు చెందిన ఏఐసీసీ కార్యదర్శులు ఉండేవారు. ఇప్పుడు సభ్యుల సంఖ్యను 18కి పెంచారు. గతంలో పీఏసీ సభ్యులుగా ఉన్న ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యేలు పొదెం వీరయ్య, సీతక్కలను తొలగించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ల జాబితా నుంచి గీతారెడ్డిని తొలగించి సభ్యుల జాబితాలో చేర్చారు. ఈ కమిటీకి చైర్మన్‌గా రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్‌ను కొనసాగించగా, గతంలో షబ్బీర్‌అలీకి ఇచ్చిన కన్వీనర్ హోదాను తొలగించారు. 40 మందితో కొత్తగా ఎగ్జిక్యూటివ్ కమిటీని ఏర్పాటు చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వర్గంగా గుర్తింపు పొందినవారికి సీనియారిటీతో సంబంధం లేకుండా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల పదవులు లభించాయి. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నేతలు ఐదుగురికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శులుగా చాన్స్ ఇచ్చారు.

నేడు సీబీఐ ముందుకు ఎమ్మెల్సీ కవిత

ఉదయం 11 గంటలకు విచారణ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: లిక్కర్ స్కామ్‌కు సంబంధించి ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాపై నమోదు చేసిన కేసులో.. ఆదివారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సీబీఐ విచారించనుంది. ఈ నెల 11న విచారణకు తన నివాసంలో అందుబాటులో ఉంటానని కవిత తెలియజేయగా, సీబీఐ కూడా అందుకు అంగీకరించిన సంగతి తెలిసిందే. సీబీఐ నోటీసుల నేపథ్యంలో కవిత ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు వరుసగా మూడురోజుల పాటు బీఆర్ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్‌తో భేటీ అయ్యారు. న్యాయ నిపుణులతోనూ సంప్రదింపులు జరిపారు. ఆదివారం జరిగే విచారణ సందర్భంగా కూడా ఆమె న్యాయ నిపుణుల సాయాన్ని తీసుకునే అవకాశమున్నట్లు సమాచారం.

పచ్చ పత్రికలు రాయడం.. బాబు మాట్లాడటం సిగ్గు చేటు!

- వ్యవసాయం దండగని రైతుల గురించి మాట్లాడటం సిగ్గుచేటు
- వ్యవసాయశాఖ మంత్రి గోవర్ధన్‌రెడ్డి



నెల్లూరు (సెంట్రల్) : రాష్ట్ర ప్రభుత్వంపై పనిగట్టుకుని పచ్చ పత్రికలు అసత్య కథనాలు రాస్తుండడం, వాటిపై చంద్రబాబు సిగ్గు లేకుండా మాట్లాడుతూ.. ట్వీట్‌లు చేస్తున్నారని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడుతూ వ్యవసాయం దండగ, ఉచిత కరెంట్ ఇస్తే కరెంట్ తీగలపై దుస్తులు ఆరేసుకోవాల్సిందే.. రిజర్వాయర్లు కట్టడం అనవసరం.. అంటూ మాట్లాడిన చంద్రబాబుకు ఇప్పుడు రైతులు గుర్తుకొచ్చారా.. అంటూ ప్రశ్నించారు. ప్రస్తుతం గతంలో కంటే ఏటా 14 లక్షల క్వింటాళ్ల ధాన్యం అదనంగా ఉత్పత్తి జరుగుతోందని గుర్తు చేశారు. రైతుల పేరు చెప్పి నాబార్డు వద్ద రుణం తీసుకొచ్చి పసుపు కుంకుమ పథకానికి మళ్లించి సివిల్ సప్లయీస్ కార్పొరేషన్‌ను దివాలా తీయించిన ఘనుడు చంద్రబాబని ధ్వజమెత్తారు. బాబు తీరుతో అనేక వ్యవస్థలు కుప్పకూలాయన్నారు. చంద్రబాబు పాలన 2014-2019 కాలంలో అనావృష్టి, అతివృష్టి తప్ప రైతులకు ఏనాడైనా సాగుకు నీరు వచ్చిందా అని ప్రశ్నించారు. తన ఐదేళ్ల పాలనలో ఏటా 300కరువు మండలాలను ప్రకటించిన ఘనత చంద్రబాబుది కాదా.. అని ప్రశ్నించారు. పంట నష్టపోతే రైతులకు పరిహారం అందిస్తామని గతంలో రైతుల నుంచి దాదాపుగా రూ.716 కోట్లు కట్టించుకుని.. నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వని చంద్రబాబు నేడు రైతులపై ప్రేమ ఒలకబోయడం సిగ్గుచేటన్నారు. ప్రస్తుతం రైతులు కట్టాల్సిన బీమా మొత్తం వంద శాతం ప్రభుత్వమే భరిస్తుందనే విషయాన్ని చంద్రబాబు గుర్తు పెట్టుకోవాలన్నారు. 2014లో అధికారంలోకి రావడానికి రైతులకు లేనిపోని హామీలిచ్చారని, అందులో భాగంగా రూ. 87,612 కోట్ల పంట రుణాలు మాఫీ చేస్తానని రైతులను మోసం చేయలేదా అని కాకాణి ప్రశ్నించారు. 2014-2019 వరకు కరువుతో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, అలా ఆత్మహత్య చేసుకున్న రైతులకు ఇవ్వాల్సిన రూ.23.70 కోట్ల నగదు కూడా ఇవ్వకుండా, పరిహారం కోసమే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని నీచంగా మాట్లాడిన ఘనుడు చంద్రబాబని మండిపడ్డారు. సీఎం జగన్ వచ్చాక పరిహారాన్ని పెంచి ఆత్మహత్య చేసుకున్న రైతులను ఆదుకున్న విషయాన్ని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గుర్తు చేశారు.

క్రీడల్లో ప్రావీణ్యం పెంపొందించుకోవాలి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు
- ఘనంగా ముగిసిన క్రికెట్, కబడ్డీ టోర్నమెంట్



విజేతలతో జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు విద్యకే పరిమితం కాకుండా క్రీడలలో కూడా ప్రావీణ్యం పెంపొందించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సూచించారు. స్థానిక రైల్వే గ్రౌండ్‌లో విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన జరిగిన క్రికెట్, కబడ్డీ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన శనివారం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన క్రికెట్, కబడ్డీ పోటీలు ఏర్పాటు చేయటం అభినందనీయమని, హాకీ పోటీలు కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. సభలో గౌరవ అతిథులు ప్రముఖ క్రికెట్ కామెంటేటర్ డి.కళ్యాణ్ కృష్ణ, ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, చైర్మన్ వాసా ఆదినారాయణ (బాబు), అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు దేవినేని కిషోర్, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మిర్యాల వెంకటేశ్వరరావు, కార్యదర్శి అనుమాటి చెన్నయ్య, కోశాధికారి జి.స్లీవా, పి.ఆర్.ఓ. షేక్ ఇమామ్, కోచైర్మన్ ఎం. శ్రీహరిరావు మాట్లాడారు. అనంతరం మూడు రోజుల పాటు నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. పోటీలలో 40 పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలి

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సొంత ఖర్చుతో ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు
- ప్రారంభించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ టి.కె.రాణా



మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, వేదికపై పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్ తదితరులు

నందిగామ టౌన్: నిరుద్యోగ యువత లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకనుగుణంగా ముందుకు సాగితే విజయం సాధించవచ్చని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, పోలీస్ కమిషనర్ టి.కె.రాణా అన్నారు. నందిగామ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ తమ సొంత ఖర్చుతో స్థానిక ఎన్‌సీఆర్‌సీ క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కోచింగ్ సెంటర్‌ను శనివారం వారు ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 నుంచి 25 ఏళ్ల వయసులో ఎవరైతే మూడేళ్ల పాటు 10 వేల గంటలకు పైగా కష్టపడి చదువుతారో, వారు అత్యున్నత స్థాయికి ఎదగటం ఖాయమన్నారు. క్రమపద్ధతిలో ప్రణాళికాబద్ధంగా నిర్దేశించుకున్న లక్ష్యాన్ని ఛేదించేవరకు సెల్‌ఫోన్‌లు, టీవీలు తదితర వినోద భరిత కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు. యుక్త వయసులో కష్టపడితే మిగిలిన జీవితంలో ఎటువంటి ఒడుదొడుకులు లేకుండా సాఫీగా గడపవచ్చని తెలిపారు. చిన్నచిన్న సాకులు చెప్పి సాధన పట్ల అలసత్వం వహిస్తే జీవితాంతం మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. పేద వర్గాలకు కూడా అత్యున్నత స్థాయికి చేరేందుకు ఎక్కడా లేని విధంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్ ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయటం అభినందనీయమని తెలిపారు. భవిష్యత్తులో ఈ కోచింగ్ సెంటర్ నుంచి ఎక్కువ మంది ఉద్యోగాలు సాధించి విజయోత్సవ కార్యక్రమం నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.

నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

వ్యవసాయాధారిత ప్రాంతమైన నియోజకవర్గంలోని విద్యార్థులు ఎక్కువ శాతం మంది వ్యవసాయం, వ్యవసాయ కూలి పనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, వారంతా వేలకు వేలు ఫీజులు కట్టి కోచింగ్‌లకు వెళ్లి ఉద్యోగాలు సాధించే పరిస్థితి లేదని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు తమ వంతు సహకారం అందించాలనే సత్సంకల్పంతో ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు.

ఉద్యోగావకాశాలు కల్పించేందుకే : ఎమ్మెల్సీ

నియోజకవర్గ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకే ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని భావించి విద్యను అందుబాటులోకి తీసుకువచ్చి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డీవో రవీందర్, డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, పీజేఆర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు, ఎంపీపీలు అరిగెల సుందరమ్మ, కోటేరు లక్ష్మి, మలక్ బషీర్, వేల్పుల ఏశమ్మ, జెడ్పీటీసీ సభ్యులు గాదెల వెంకటేశ్వరరావు, వేల్పుల ప్రశాంతి, అమర్లపూడి కీర్తి సౌజన్య, విద్యాసంస్థల అధినేతలు జీవీ ప్రసాదరావు, అమరనేని రమేష్, ఆళ్ల రాంబాబు, కాపా రవీంద్ర, కాసరగడ్డ కిరణ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అవధానం తెలుగు వారి ఆత్మ



అష్టావధానం నిర్వహిస్తున్న ఆముదాల మురళి, వేదికపై పృచ్ఛకులు మల్లా ప్రగడ, బాలకృష్ణ తదితరులు

విజయవాడ కల్చరల్: అవధానం తెలుగు వారి ఆత్మ అని ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి అన్నారు. తెలుగు, సంస్కృత అకాడమీ, శుభోదయం గ్రూప్, కొలరాడో సాహిత్యవేదిక ఆధ్వర్యంలో విజయవాడ దుర్గాపురంలోని సంగీత కళాశాలలో శనివారం ఆముదాల మురళి అష్టావధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అవధానాన్ని ప్రారంభించిన మల్లాప్రగడ మాట్లాడుతూ తెలుగు వారికి మాత్రమే సొంతమైన సాహిత్య ప్రక్రియ అవధానమని, ఎందరో మహనీయులు అవధానాన్ని విశ్వవ్యాప్తం చేశారన్నారు. రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నక్కల ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ తెలుగు వారి సాహిత్య ప్రక్రియలో అష్టావధానం ఉన్నతమైనదన్నారు. తెలుగు, సంస్కృత అకాడమీ సభ్యుడు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ అవధాన విశిష్టతను వివరించారు.

భాషా వైభవాన్ని చాటిన అష్టావధానం

అవధానంలో నిషిద్ధాక్షరి అంశాన్ని కంది శంకరయ్య, సమస్య మరుమాల దత్తాత్రేయ శర్మ, దత్తపది డాక్టర్ గుమ్మా సాంబశివరావు, వర్ణన అంశాన్ని డాక్టర్ కావూరి సత్యవతి, న్యస్తాక్షరి నల్లాన్ చక్రవర్తుల చక్రవర్తి, పురాణపఠనం డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణ, ఆశువు డాక్టర్ గానుగుల యుగంధరాచార్య, అప్రస్తుత ప్రసంగం బంకుపల్లి రమేష్ నిర్వహించారు. పృచ్ఛకులు సంధించిన అనేక అంశాలకు అవధాని ఆముదాల మురళి దీటుగా సమాధానమిచ్చారు. కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఆంధ్రా హాస్పిటల్స్ చైర్మన్ వీరభద్రరావుకు ఘన నివాళి



పాతూరి వీరభద్రరావు(ఫైల్)

లబ్బీపేట(విజయవాడ తూర్పు): ఆంధ్రా హాస్పిటల్స్ చైర్మన్ పాతూరి వీరభద్రరావు శుక్రవారం రాత్రి కన్నుమూశారు. ఆయన వయస్సు 82 సంవత్సరాలు. విజయవాడ కరెన్సీ నగర్‌లోని ఆయన నివాసం వద్ద భౌతికకాయాన్ని ఉంచగా నగరంలోని పలువురు రాజకీయ నాయకులు, వైద్యులు, ప్రముఖులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. పాతూరి వీరభద్రరావు రైల్వేలో డివిజనల్ కమర్షియల్ మేనేజర్‌గా పనిచేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు డాక్టర్ పీవీ రమణమూర్తి సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ కాగా ఆంధ్రా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. రెండో కుమారుడు డాక్టర్ పీవీ రామారావు పిల్లల వైద్య నిపుణుడు, కుమార్తె డాక్టర్ పద్మ ఫీటల్ మెడిసిన్ స్పెషలిస్టుగా ఆంధ్రా హాస్పిటల్‌లోనే ఉన్నారు. వీరభద్రరావు ఉద్యోగ విరమణ అనంతరం ఆంధ్రా హాస్పిటల్ చైర్మన్‌గా ఉంటూ, ఉద్యోగుల యోగక్షేమాలు చూసుకునే వారని, తమకు ఎలాంటి ఇబ్బంది ఉన్నా ముందుండి పరిష్కరించేవారని పలువురు ఉద్యోగులు తెలిపారు.

ఉత్తరాభిముఖ శ్రీవారి దర్శనం మంగళప్రదం

త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార్ జీయర్ స్వామి



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార్ జీయర్ స్వామి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఉత్తర ముఖంగా నిర్మించిన ఆలయంలో ఉత్తరాభిముఖ శ్రీవారిని దర్శించుకోవడం సర్వమంగళదాయకమని అష్టాక్షరీ ఆశ్రమ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార్ జీయర్ స్వామి తెలిపారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని వాసవి ఫార్మా మార్కెట్ కాంప్లెక్స్ ఆవరణలో నిర్మిస్తున్న దేవాలయంలో జనవరి 28న శ్రీవేంకటేశ్వర స్వామి, గరుత్మంత, జీవధ్వజ, విమాన శిఖర ప్రతిష్ఠా మహాకుంభాభిషేక మహోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో దీనికి సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధన కారకుడయిన వేంకటేశ్వరునికి ఉత్తర దిక్కున ఉండే కుబేరునికి నిత్య సంబంధం ఉందని తెలిపారు. వారిద్దరి అనుగ్రహం లభించేలా ఆలయాన్ని నిర్మించటం కాంప్లెక్స్‌లోని వ్యాపారులకు శుభపరిణామమని అన్నారు. ఆధ్యాత్మిక జీవితంలో ఆలయ నిర్మాణం చేయడం ద్వారా వంశవృద్ధి కలుగుతుందన్నారు. దేవాలయ నిర్వహణ సామాన్యమైనది కాదని, ఆగమ శాస్త్రం ప్రకారం స్వామి వారికి జరపాల్సిన బ్రహ్మోత్సవాలు, పవిత్రోత్సవాలు, ఇతర సేవలు తప్పనిసరిగా నిర్వహించాల్సి ఉంటుందన్నారు. వైదిక ధర్మం ప్రకారం నిత్య దీపారాధన, నైవేద్యం సమర్పించటంలో సమయపాలన పాటించాలన్నారు. తొలుత నిర్మాణంలో ఉన్న శ్రీవారి ఆలయాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆలయ కమిటీ కార్యదర్శి దేవతి నాగేశ్వరరావు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో శ్రీవారి ఆలయాన్ని ప్రారంభించుకోవడంతో పాటు భక్తులు స్వామివారిని ఉత్తర ముఖంగా దర్శించుకునేలా ఏర్పాటు చేయటం సంతోషంగా ఉందన్నారు. ఉత్తర ద్వార దర్శనం ముక్తి ప్రదాయకమన్నారు. కార్యక్రమంలో వాసవీ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నీలి వెంకట యుగంధర్ సతీష్‌కుమార్, అధ్యక్ష, కార్యదర్శులు జొన్నలగడ్డ శివప్రసాద్, దేవతి నాగేశ్వరరావు, కోశాధికారి నీలిశెట్టి చెన్నకేశవులు, వైస్ ప్రెసిడెంట్ అత్యం వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ ఎం.సత్య శ్రీహరి, సభ్యులు కె.సత్యనారాయణ, డి.శివాజీ, కె.బాల వెంకట సత్యనారాయణ, యు.శ్రీనివాస గుప్త, జీవీఎస్ రంగనాయకులు, బీఎస్‌వీ సుబ్బారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మంచుపల్లకి కవితా సంపుటి ఆవిష్కరణ



మంచుపల్లకి కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న మంత్రి రోజా, వేదికపై జయప్రకాష్, ప్రభాకర్,ప్రసాద్

విజయవాడ కల్చరల్: తిరుపతిలో పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి ఆర్‌కే రోజా తన కార్యాలయంలో శనివారం 'మంచు పల్లకి' కవితా సంపుటిని ఆవిష్కరించినట్లు పుస్తక రచయిత డాక్టర్ ఎం.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన డాక్టర్ ప్రభాకర్ ప్రస్తుతం ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కోఆర్డినేటర్ ఫర్ లెజిస్లేచర్ అఫైర్స్ ఏపీ అసెంబ్లీలో ఓఎస్‌డీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయనకు గతంలో వేదిక్ కల్చరల్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈయన గతంలో నోమోర్ టియర్స్, జననం జీవనం-మరణం, వాయిలీన విద్వాంసుడు పెద్ద జమలప్ప జీవిత సంగ్రహం, అభివృద్ధి-సంక్షేమం, శ్రీ కృష్ణదేవరాయలు 500 సంవత్సరాల జీవిత చరిత్ర పుస్తకాలను రచించారు. ఆవిష్కరణ కార్యక్రమంలో పుత్తూరు మున్సిపల్ వైస్ చైర్మన్, జయప్రకాష్, కేఎంఆర్ గ్రూప్ ఆఫ్ కాలేజెస్ డైరెక్టర్ కేటీ ప్రసాద్ పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న దేవదాయ శాఖ మంత్రి



మంత్రికి ఆశీర్వచనం అందజేస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను శనివారం దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మంత్రికి ఆలయ ఈవో భ్రమరాంబ సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న తర్వాత వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో భ్రమరాంబ అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం దుర్గగుడి మాస్టర్ ప్లాన్‌పై మంత్రి మీడియాతో మాట్లాడారు. మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని, త్వరలోనే సీఎం ఆమోదం అయిన పిమ్మట పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
ఆదివారం ॥ 11-12-2022

క్షణక్షణం రక్షణగా...

ఉమెన్ సేఫ్టీ



ఏ ఆపద ఎప్పుడు ముంచుకొస్తుందో తెలియదు. అందుకే మన జాగ్రత్తలో మనం ఉండాలి. ఉమెన్ సేఫ్టీని దృష్టిలో పెట్టుకొని రూపొందించిన స్టైలిష్ గ్యాడ్జెట్స్ ఎన్నో ఉన్నాయి. 'ఎథీనా'ను స్టైలిష్‌గా షర్ట్‌కు తగిలించుకోవచ్చు. అత్యవసర సమయంలో దీన్ని ప్రెస్ చేస్తే చాలు మనం ఎంపిక చేసుకున్న కాంటాక్ట్స్‌ను అప్రమత్తం చేస్తుంది. 'సేఫర్ ప్రో' అనేది పేరుకి రిస్ట్‌బ్యాండేగానీ, అనుకోని పరిస్థితి ఎదురైనప్పుడు వాయిస్‌ను రికార్డ్ చేయడంతో పాటు కాంటాక్ట్‌కు 'డేంజర్' సిగ్నల్ పంపుతుంది. 'సైరన్'ను స్టైల్‌గా వేలికి పెట్టుకోవచ్చు. ఎవరైనా దాడికి పాల్పడినప్పుడుగానీ, అనుమానాస్పద వ్యక్తులు ఎదురైనప్పుడుగానీ రింగ్‌ను ఎడమవైపుకు ట్విస్ట్ చేస్తే చాలు పెద్ద శబ్దం చేసి, ఎదుటి వారిని భయపెడుతుంది.

సముద్రం సాక్షిగా...

మౌనంగా కనిపించే సముద్రం ఒక మహా విద్యాలయం. అక్కడ ప్రతి కెరటం ఒక పాఠం నేర్పుతుంది. ఒక ప్రాజెక్ట్ కోసం పనిచేస్తున్న క్రమంలో దేవ్‌లీనా భట్టాచార్జీ మత్స్యకారుల జీవితాలను దగ్గరి నుంచి చూసింది. సముద్రం సాక్షిగా మత్స్యకారులకు ఉపయోగపడే స్టార్టప్ గురించి ఆలోచించింది. 'న్యూమర్8' రూపంలో ఆమె కల సాకారం అయింది...



దేవ్‌లీనా భట్టాచార్జీ, నందిని కార్తికేయన్

యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఇఎస్‌ఎ)లో ఒక ప్రాజెక్ట్‌లో భాగంగా పనిచేస్తున్నప్పుడు దేవ్‌లీనా భట్టాచార్జీకి మత్స్యకారుల జీవన విధానం గురించి క్షుణ్ణంగా తెలుసుకునే అవకాశం వచ్చింది. మత్స్యకారుల సంక్షేమం కోసం డాటాసైన్స్‌ను ఎలా ఉపయోగించవచ్చు... అనే కోణంలో మేధోమథనం చేస్తున్నప్పుడు ఒక ఆలోచన వచ్చింది. అది 'న్యూమర్8' పేరుతో స్టార్టప్‌కు శ్రీకారం చుట్టడానికి కారణం అయింది.

వాతావరణ సూచనల నుంచి మార్కెట్ సూచనల వరకు ఎన్నోరకాలుగా మత్స్యకారులకు ఉపయోగపడే స్టార్టప్ ఇది.

బెంగళూర్ యూనివర్శిటీలో ఎంసీఏ చేసినా లీనాకు రకరకాల సమస్యలకు సంబంధించి సృజనాత్మక పరిష్కారాల గురించి ఆలోచించడం అంటే ఇష్టం. ఎవరి సహాయం లేకుండానే తన పొదుపు మొత్తాలతో 'న్యూమర్ 8'ను మొదలుపెట్టింది. డాటా సైంటిస్ట్‌లు, జియోగ్రాఫిక్ ఇన్ఫర్‌మేషన్ సిస్టం (జిఐఎస్) నిపుణులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకుంది. ప్రతిభావంతురాలైన నందిని కార్తికేయన్‌ను సీటీవోగా నియమించింది.

> బెంగళూర్ యూనివర్శిటీలో ఎంసీఏ చేసిన లీనాకు రకరకాల సమస్యలకు సంబంధించి సృజనాత్మక పరిష్కారాల గురించి ఆలోచించడం అంటే ఇష్టం. ఎవరి సహాయం లేకుండానే తన పొదుపు మొత్తాలతో 'న్యూమర్ 8'ను మొదలు పెట్టింది.

సీఈవోగా లీనా స్టార్టప్‌కు సంబంధించిన రోజువారి వ్యాపార వ్యవహారాలను పర్యవేక్షిస్తే, సీటీవోగా నందిని సాంకేతిక విషయాల బాధ్యతలను చూస్తుంది. 'న్యూమర్ 8'లోని 'వోఫిష్' యాప్‌లో అడ్వైజరీ, మార్కెట్ లింకేజి, ఇన్సూరెన్స్, ఫైనాన్స్ విషయాలలో మత్స్యకారులకు ఉపయోగపడే ఫీచర్‌లు ఉన్నాయి. 'వోఫిష్' శాటిలైట్ ఇమేజ్ డాటా ఎనాలసిస్ అనేది మత్స్యకారులకు చేపల వేటలో ఉపయోగపడుతుంది. వేటకు ఎక్కువ సమయం తీసుకోకపోవడమే కాదు, ఇంధనాన్ని పొదుపు చేయడంలో ఉపయోగపడుతుంది. 'వోఫిష్'లోని మార్కెట్ లింకేజ్ ఫీచర్‌తో మత్స్యకారులకు అవసరమైన వలలు, కోల్డ్ స్టోరేజ్ సౌకర్యాల ఏర్పాటుకు వీలవుతుంది. దీంతోపాటు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా మత్స్యకారులు తమ ఉత్పత్తులను ఆన్‌లైన్ డిస్ట్రిబ్యూటర్‌లకు అమ్ముకోవచ్చు.

'న్యూమర్8' తాజాగా సముద్రపు నాచుపై దృష్టి పెట్టింది. ఔషధ, ఆహార, రసాయనిక పరిశ్రమలలో ప్రపంచవ్యాప్తంగా సముద్రపు నాచుకు డిమాండ్ పెరుగుతున్న విషయం తెలిసిందే. దీన్ని దృష్టిలో పెట్టుకొని మహారాష్ట్రలోని 'మహిళా ఆర్థిక్ వికాస్ మహామండల్' అనే స్వచ్ఛందసంస్థ భాగస్వామ్యంతో మత్స్యకారుల కుటుంబాలకు చెందిన మహిళలకు సముద్రపు నాచు ఉత్పత్తుల ద్వారా ఉపాధి కల్పించే ప్రణాళికను న్యూమర్ 8 సిద్ధం చేసింది.

కెరీర్‌లో విజయం సాధించిన మహిళలు కుటుంబంపై దృష్టి పెట్టలేరని చాలామంది అనుకుంటారు. అలాగే, మహిళలు కుటుంబాన్ని జాగ్రత్తగా చూసుకున్నా, తమ కోసం తాము టైమ్‌ను కేటాయించుకోరు అనీ అంటుంటారు. అయితే ఈ ఊహలన్నీ తప్పని హిమజ అప్పరాశ్వెరువు రుజువు చేస్తోంది. మన శక్తి ఏంటో మనకే తెలుసు అని తన పనుల ద్వారా చూపుతోంది.

మన శక్తి ఏంటో మనకే తెలుసు...



హిమజ



తమ కుటుంబం, కెరీర్, అభిరుచులను బ్యాలెన్స్ చేసుకోవాలనేది నేటి మహిళల టాస్క్!

అనంతపురం వాసి అయిన హిమజ అప్పరాశ్చెరువు బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. ఓ వైపు విధులు నిర్వర్తిస్తూనే జుంబా ఇన్‌స్ట్రక్టర్‌గా, మారథాన్ రన్నర్‌గా సత్తా చాటుతోంది. ఇద్దరు పిల్లలకు తల్లిగా కుటుంబ బాధ్యతలతోనూ మల్టిపుల్ వర్క్స్‌తో రాణిస్తోంది. చిన్న పట్టణంలో పెరిగిన హిమజ పెద్ద కలలు కనడమే కాకుండా వాటిని సాకారం చేసుకుంటోంది. తన కెరీర్‌తో పాటు ఇద్దరు పిల్లల బాధ్యతనూ నిర్వహిస్తోంది. దీనితో పాటు, తన స్వంత అభిరుచినీ నెరవేర్చుకుంటోంది.

సున్నా నుంచి మొదలు

'నా జీవన ప్రయాణం సున్నాతో మొదలుపెట్టి ఈ రోజు చేరుకున్న చోటికి రావడం అంత తేలిక కాలేదు. ఐఐటీ రూర్కీలో ఇంజనీరింగ్ చేశాను. కాలేజీలో చేరేసరికి నాకు ఇంగ్లీషు సరిగా రాదు, హిందీలోనూ సరిగా మాట్లాడలేను. కానీ సంకల్పంతో, నేను ప్రతి సవాల్‌ను అధిగమిస్తూ, జీవితంలో చాలా నేర్చుకుంటూ విజయం వైపు పయనిస్తూనే ఉన్నాను.

రానిదంటూ లేదని..

ఇంజనీరింగ్ తర్వాత ఐఐఎం అహ్మదాబాద్‌లో ఎంబీఏ పూర్తి చేశాను. ఆస్ట్రేలియన్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి బిఎఎమ్ పట్టా అందుకున్నాను. 2017లో అమెజాన్ కంపెనీలో సప్లై చైన్ ఎగ్జిక్యూషన్ టీమ్ పోస్ట్‌పై సీనియర్ ప్రొడక్ట్ మేనేజర్‌గా చేరాను. నేటి కాలంలో విద్యార్థులైనా, పనిచేసే వృత్తి నిపుణులైనా వారికి ఇంగ్లీషు తెలుసుకోవడం ఎంత ముఖ్యమో నాకు కూడా అర్థమైంది. ఈ అవసరాన్ని స్వయంగా గ్రహించి, నేను అమెజాన్ అలెక్సాలో ఇంటరాక్టివ్ సెషన్స్ చేర్చాను. ఈ నైపుణ్యంతో ఏ వయసు వారైనా ఇంగ్లీష్ మాట్లాడటం నేర్చుకోవచ్చు.

కుటుంబంపై పూర్తి శ్రద్ధ

నా కెరీర్‌తో పాటు కుటుంబంపై పూర్తి శ్రద్ధ పెట్టాను. నా కెరీర్‌లో ముందుకు వెళుతున్న సమయంలోనే రెండుసార్లు తల్లిని అయ్యాను. ఈ సమయంలో కొత్తగా చాలా ఇబ్బందులు ఎదురయ్యాయి. కానీ నా భర్త ఎల్లప్పుడూ నాకు మద్దతుగా నిలిచాడు. కెరీర్ మాత్రమే ముఖ్యం కాదు, నా పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడమూ ముఖ్యమే. అందుకే, హోమ్‌వర్క్ చేయించడం, వారితో ఆడుకోవడం, వారిని పరీక్షలకు సిద్ధం చేయడం, వారితో సరదాగా గడపడం వంటి ప్రతి అవసరాన్ని తీరుస్తాను.

సమతుల్యత అవసరం..

నా దినచర్యలో అడుగడుగునా నా భర్త సపోర్ట్ ఉంది. తన తల్లిదండ్రుల పూర్తి బాధ్యతనూ తీసుకుంటాడు. మేము మా పిల్లలను వ్యక్తిగతంగా చూసుకోవడం, వారితో సమయం గడపడం మంచిదని నమ్ముతాము. బయటి పని, ఇంటి పని ఈ రెండింటి మధ్య సమానమైన సమతుల్యతను పాటిస్తాను. నా పిల్లలతో నాణ్యమైన సమయాన్ని గడపడం, కొత్త పనులు చేయడం నాకు ఇష్టం. మల్టిపుల్ టాస్కింగ్ మనల్ని మరింత ఉత్సాహవంతులను చేస్తుంది. ఇందులో భాగంగానే రెండేళ్ల క్రితం జుంబా ఇన్‌స్ట్రక్టర్‌గా మారాను. ఆన్‌లైన్–ఆఫ్‌లైన్ క్లాసులతోనూ సేవలు అందిస్తుంటాను. మారథాన్ రన్నర్‌గానూ, నా ఇతర అభిరుచుల వైపుగా సాగుతుంటాను' అని వివరిస్తారు ఈ మల్టీ టాలెంటెడ్ ఉమన్.



బ్యూటిప్

ముఖంపై మచ్చలా?





ముఖం మీద మచ్చలు ఎక్కువగా ఉన్నప్పుడు క్యారెట్ ముక్కలు కొన్ని, క్యాబేజీ ముక్కలు కొన్ని, స్పూను ఓట్స్ కలిపి మిక్సీలో గ్రైండ్ చేసుకోవాలి. ఈ మిశ్రమంలోకి అర స్పూన్ పాల మీగడ, అర స్పూన్ తేనె, మూడు స్పూన్ల నిమ్మరసం కలిపి ముఖానికి రాసుకోవాలి. ఇరవై నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో ముఖం కడుక్కోవాలి. ఇలా చేయడం వల్ల ముఖంపై ఉన్న మచ్చలు తగ్గుతాయి.

హెల్త్

మెడి–ఫేషియల్స్ అనే మాటకు అర్థం... మెడికల్ ఫేషియల్స్ అని. సాధారణంగా ఫేషియల్స్ వంటి సౌందర్య ప్రక్రియల్ని మామూలు బ్యూటీ సెలూన్స్‌లో బ్యూటీషియన్స్ నిర్వహిస్తుంటారు. వీటిని కొంత శిక్షణ తీసుకున్న సాధారణ వ్యక్తులెవరైనా నిర్వహించవచ్చు. వీరు వైద్యప్రక్రియల జోలికి వెళ్లరు... వెళ్లకూడదు కూడా. కానీ... కొన్ని రకాల అడ్వాన్స్‌డ్ థెరపీలు కేవలం అర్హులైన వైద్యులు, అందునా డర్మటాలజీలో స్పెషలైజేషన్ చేసినవారు మాత్రమే నిర్వహించాలి. వాటిల్లో వైద్య ప్రక్రియలు ఉన్నందున, లేదంటే ప్రతికూల ఫలితాలు వచ్చే అవకాశాలున్నందున కేవలం క్వాలిఫైడ్ డాక్టర్లు మాత్రమే చేయాలి. ఇలాంటి ప్రక్రియలకే 'మెడి–ఫేషియల్స్' అని పేరు. ఈ ప్రక్రియలేమిటో, వాటితో ఎలాంటి ప్రయోజనాలు పొందవచ్చో తెలిపే కథనమిది.



మెడి ఫేషియల్స్!

మెడి–ఫేషియల్స్‌లో కొన్ని సంక్లిష్ట వైద్యప్రక్రియలు, ఔషధాలు, వైద్య ఉపకరణాలు, సాధనాలుంటాయి. విపరీతంగా మొటిమలొచ్చి ముఖం నల్లబడటం, ఇతర నల్లమచ్చలు, ముఖం డీ–హైడ్రేషన్‌కు గురికావడం, వయసు పెరగడంతో సాగిన చర్మం బిగుతయ్యేలా చూడటంలాంటి వయసు తక్కువ కనబడేలా చేసే (యాంటీ ఏజింగ్) ప్రక్రియలన్నీ ఈ 'మెడి–ఫేషియల్స్' విభాగంలోకి వస్తాయి. వీటిని ఓ క్రమపద్ధతిలో... ఒకటి తర్వాత మరొకటిగా అనుసరించాలి. ఆ సీక్వెన్స్ ఎలా ఉంటుందంటే...

- **స్కిన్ అనాలసిస్ :** మొదట చికిత్స తీసుకునే వ్యక్తిది ఏ తరహా చర్మమనే విశ్లేషణ చేయాలి. పొడి లేదా జిడ్డు చర్మమా, మధ్యరకమా అనే దాన్నిబట్టి చికిత్స ఆధారపడి ఉంటుంది.
- **క్లెన్సింగ్ :** ముఖంపై మరింత లోతుగా క్లెన్సింగ్ జరగాలంటే నాణ్యమైన, శక్తిమంతమైన మందుల్ని వాడాల్సి రావచ్చు. అదే సమయంలో చర్మపు సహజ తేమ, దాని స్వాభావిక లిపిడ్స్‌ను కోల్పోనివ్వకుండా జాగ్రత్తలూ తీసుకోవాలి.
- **ఎక్స్‌ఫోలియేషన్ :** చర్మం పైపొరల్ని తొలగిపోయేలా చేసి, కింద కొత్తకణాలతో కూడిన చర్మాన్ని మంచి నిగారింపుతో పైకి వచ్చేలా చేయడమే 'ఎక్స్‌ఫోలియేషన్'. ఇందుకోసం 'మైక్రోడెర్మాబ్రేషన్ క్రిస్టల్స్' ఉపయోగించవచ్చు లేదా నిపుణులే చేతితో ఈ ప్రక్రియ నిర్వహించనూవచ్చు. దీన్ని లేజర్‌తోనూ చేయవచ్చు. అయితే మొటిమలు నల్లమచ్చలుగా (బ్లాక్‌హెడ్స్‌గా) మారి మిగిలిన చోట కొంత అదనపు చికిత్స అవసరం.
- **టోనింగ్ అండ్ హైడ్రేషన్ :** ముఖం పాలిపోయినట్లుగా ఉండవచ్చు. నీరింకినట్లు అనిపించవచ్చు. అప్పుడు చర్మం తీరును బట్టి ముఖానికి అవసరమైన తేమ (పీహెచ్) అందేలా చేయాలి. దీనికి కొన్ని మాయిశ్చరైజర్స్, సీరమ్స్ వాడాలి. ఇది ఫేషియల్‌ను తలపించవచ్చు. కానీ ఇందులో మెడి–ఫేషియల్ ప్రక్రియలవసరమవుతాయి.

ఈ వైద్యప్రక్రియలెలా ఉంటాయంటే...

- **మీసోథెరపీ :** ఇందులో చర్మం పై–పొర తర్వాత ఉండే... డెర్మిస్‌లోకి కొన్ని విటమిన్లు ఇంజెక్ట్ చేస్తారు. దీన్ని 'డెర్మాపెన్' అనే ఉపకరణంతో చేస్తారు. ముఖంలో కాంతి తెచ్చేందుకు ఇది ఉపయోగపడుతుంది.
- **మైక్రో–నీడిలింగ్ :** ఇందులో చికిత్సార్థుల రక్తంలోంచి సేకరించిన ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మాను... సన్నటి సూదులతో చర్మంలోకి చేరుస్తారు. కొన్నిసార్లు లైట్ ఎమిటింగ్ డయోడ్ (ఎల్‌ఈడీ) వెలుగుతో చేసే ఫోటాన్ చికిత్స కూడా ఉంటుంది. ఇంకొన్నిసార్లు లాక్టిక్ యాసిడ్, గ్లైకాలిక్ యాసిడ్, ఫెర్యులిక్ యాసిడ్‌తోనూ ఫేషియల్ చికిత్స చేస్తారు. ఇది ఎక్స్‌ఫోలియేషన్ ఎఫెక్ట్‌ను తీసుకొచ్చి ముఖాన్ని కాంతిమంతం చేస్తుంది.
- **క్యూ స్విచ్‌డ్ లేజర్ / లేజర్ టోనింగ్ :** దీన్నే స్పెక్ట్రా కార్బన్ చికిత్స అంటారు. ఇదీ ముఖాన్ని కాంతిమంతం చేయడానికే. తక్షణ ప్రభావం కనిపించే ప్రక్రియ ఇది.
- **ఐపీఎల్ డివైజ్ :** ఇంటెన్స్ పల్స్ లైట్ అనే దానికి సంక్షిప్త రూపమే ఈ 'ఐపీఎల్'. సాధారణ వ్యవహారంలో దీన్ని 'ఫొటో ఫేషియల్' అని కూడా అంటారు.
- **రేడియో ఫ్రీక్వెన్సీ :** దీని సహాయంతో చర్మాన్ని బిగుతుగా ఉంచే 'కొలాజెన్' ఉత్పత్తి అయ్యేలా చేస్తారు. దాంతో ముఖం మునపటికంటే లేతగా ఉంటుంది.
- **మైక్రోడెర్మాబ్రేషన్ :** ముఖ చర్మపు పైపొరలు తొలగించి, కొత్త కణాలతో కూడిన చర్మాన్ని బయటికొచ్చేలా చేసే అధునాతనమైన చికిత్స ఇది. దీంతో మొటిమల వల్ల ఏర్పడ్డ బ్లాక్‌హెడ్స్, వైట్‌హెడ్స్ తొలగిపోతాయి.
- **ఎలక్ట్రోపోరేషన్ :** ఇందులో ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ శక్తిని ఉపయోగిస్తారు. సీరమ్‌లు చర్మంలోకి మరింత లోతుల్లోకి ఇంకేలా/వెళ్లేలా చూసి, మెరుగైన ఫలితాలు సాధిస్తారు.
- **ఎల్‌ఈడీ (లైట్ ఎమిటింగ్ డయోడ్) థెరపీ :** ఇందులో హైఫ్రీక్వెన్సీ కాంతితరంగాలతో చికిత్స చేస్తారు. దీనిలో కొత్త జీవకణాలు బయటకొచ్చి, స్కిన్‌టోన్ మెరుగుపడుతుంది.
- **అల్ట్రాసౌండ్ టెక్నాలజీ :** ఇందులో అల్ట్రాసౌండ్ తరంగాలనుపయోగించి చర్మాన్ని బిగుతుగా ఉంచే కొలాజెన్ కణాలను పెరిగేలా చేసి, వయసు తగ్గినట్లుగా కనిపించేలా చూస్తారు.
- **మైక్రో కరెంట్ ఫేషియల్ / ఫొటోఫేషియల్ :** ఇందులో రెండు విద్యుత్ ధ్రువాలుంటాయి. అవి విద్యుత్తులోని ప్లస్, మైనస్ ఛార్జ్‌ల్ని వేర్వేరుగా వెలువరించే కేంద్రాలుగా ఉంటాయి. రెండు డయోడ్ల సహాయంతో ఎలక్ట్రిసిటీని మైక్రో కరెంటుగా వెలువరించడం ద్వారా చికిత్స చేస్తారు.

పోస్ట్ ట్రీట్‌మెంట్ కేర్ : చికిత్స తర్వాత డాక్టర్లు సూచించిన కొన్ని జాగ్రత్తల్ని తప్పక తీసుకోవాల్సి ఉంటుంది.

ముఖ్య గమనిక

ఈ ప్రక్రియలు కొందరి చర్మాలకు ఇవి సరిపడక ప్రతికూల ఫలితాలనూ ఇచ్చే ప్రమాదమూ లేకపోలేదు. అందుకే ఇవి ఉన్నత విద్యార్హతలున్న డర్మటాలజిస్టుల నేతృత్వంలోనే నిర్వహించాల్సినవని తెలుసుకోండి. అలర్జీలున్నవారు, ఇతరత్రా మందులు వాడుతున్నవారు, సున్నితమైన చర్మం (స్కిన్ సెన్సిటివిటీ) ఉన్న ఇలాంటివారంతా ఆ విషయాన్ని ముందుగా డాక్టర్‌కు చెప్పాలి. కొన్ని మందుల్ని వాడుతున్నవారు డాక్టర్ సూచన మేరకు వాటిని కనీసం వారం ముందుగానే ఆపాల్సి ఉంటుంది.

ప్రయోజనాలు

- ఎండిపోయినట్లుగా / నీరింకిపోయినట్లుగా ఉండే ముఖంలోకి తేమను తీసుకురావచ్చు.
- మొటిమలు బాగా వచ్చి మిగిలిపోయే బ్లాక్‌హెడ్స్‌ను తేలిగ్గా తొలగించవచ్చు.
- జిడ్డు చర్మం ఉన్న ముఖాలను తేటగా ఉండేలా చేయవచ్చు.
- కొన్ని చర్మాలకు కొన్ని రకాల రసాయనాలు సరిపడవు. అలాంటి వాటిని గుర్తించి, వారికి దుష్ప్రభావాలు (సైడ్‌ఎఫెక్ట్స్) రాని చికిత్స పద్ధతిని ఎంపిక చేసి, అవసరమైన ఫలితాలు రాబట్టవచ్చు.
- ఎండలో తిరగడం వల్ల నల్లబడ్డ (సన్ పిగ్మెంటేషన్), విపరీతంగా నల్లబారిన (హైపర్ పిగ్మెంటేషన్)వారితో పాటు, ముఖంపై గులాబి రంగు మచ్చలు (రోజేసీ) ఉన్న వారికి... ముఖంలో మునపటి కాంతి, మిలమిల వచ్చేలా చేయవచ్చు.
- ముఖంపై ఉన్న అదనపు మెలనిన్ పిగ్మెంట్ తొలగిపోయేలా చేసి, ముఖాన్ని కొంతవరకు తేటగా చేయవచ్చు.



డాక్టర్ స్వప్నప్రియ
సీనియర్ కన్సల్టెంట్ డర్మటాలజిస్ట్

చర్మం మీద మార్పులు - క్యాన్సర్ సూచన కావచ్చు!

చాలామంది ఒంటిపై మచ్చలు, గడ్డలు, పులిపిరి కాయలు, స్కిన్‌ట్యాగ్స్ కనిపించగానే క్యాన్సరేమోనని ఉలిక్కిపడుతుంటారు. అందుకే స్కిన్ క్యాన్సర్‌పై అవగాహన పెంపొందిచడానికి ఈ వివరాలు మీకోసం.

టీనేజీలో, అటు తర్వాత... హార్మోన్ల అసమతౌల్యత వల్ల చర్మంలోని నూనె గ్రంథులు (సెబేషియస్ గ్లాండ్స్) 'సీబమ్'ను ఎక్కువగా ఉత్పత్తి చేయడం వల్ల జిడ్డుతనం ఎక్కువై మొటిమల వంటి సమస్యలు వేధిస్తుంటాయి. అవి తీవ్రంగా ఉన్నప్పుడు మచ్చలు, గుంటలు ఏర్పడుతూ ఉంటాయి. హెచ్‌పీవీ వైరస్ వల్ల ఒక వ్యక్తి నుంచి ఇంకో వ్యక్తికి వ్యాపించే పులిపిరికాయలు ఏర్పడుతూ ఉంటాయి. ఇవి కొంతమందిలో వాటంతట అవే రాలిపోయినా, మరి కొంతమందిలో శాశ్వతంగా ఉండిపోయి, మరింతగా వ్యాప్తి చెందుతూ ఉంటాయి. పులిపిరికాయలను కలిగించే హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) క్యాన్సర్ కారకం కాదు. సెక్సువల్ కాంటాక్ట్ వల్ల మర్మావయవాల వద్ద వచ్చే పులిపిరికాయలు కూడా క్యాన్సర్‌కు దారితీయవు. అయితే హెచ్‌పీవీ 16, 18 మొదలైన వైరస్ రకాలను అంకోవైరస్‌లుగా పేర్కొనవచ్చు. ఇవి ఎలాంటి పులిపిరులను కలగజేయవు. కానీ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు దారితీసే అవకాశం ఎక్కువ.



ప్రతీకాత్మక చిత్రం

అధికబరువు వల్లనో, జన్యుపరమైన కారణాల వల్లనో ఏ వయసులో వారికైనా కనిపించే స్కిన్ ట్యాగ్స్ వల్ల సాధారణంగా ఎటువంటి ఇబ్బందీ ఉండకపోవచ్చు. అయితే అవి పెద్దసైజులో ఉండి, బయటకు కనిపించే భాగాల్లో ఉంటే తీసివేయించుకోవడమే మంచిది. మామూలుగా పెసరగింజంత ఉండే ఈ స్కిన్‌ట్యాగ్స్ ఒక్కోసారి గోల్ఫ్‌బాల్ సైజుకూ పెరగవచ్చు. చాలా అరుదుగా వీటి రంగులో మార్పు, రక్తం కారడం వంటి లక్షణాలు కనిపించి, స్కిన్‌క్యాన్సర్‌కు దారితీయవచ్చు. పుట్టుకతో వచ్చే మచ్చలు కాకుండా... 20 ఏళ్ల తర్వాత మచ్చలు వచ్చి, అవి సరైన ఆకారంలో లేకుండా, రంగుమారుతూ, రక్తం స్రవిస్తూ, ఉబ్బెత్తుగా ఉంటే... క్యాన్సరేమోనని అనుమానించాల్సి ఉంటుంది.

శరీరంలో అనేక ప్రాంతాలలో సాఫ్ట్‌టిష్యూలతో ఏర్పడే కొవ్వు గడ్డలనే లైపోమా అంటారు. ఎడిపోజ్ టిష్యూలతో ఏర్పడే ప్రమాదకరం కాని ఈ గడ్డలు... శరీరం లోపలి భాగాల్లో కూడా ఏర్పడితే జాగ్రత్తగా గమనించాలి. చర్మం కిందగానీ, రొమ్ముల్లోగానీ, గడ్డలు మెత్తగా కదులుతూ, కొద్దివారాలుగా ఎలాంటి మార్పు లేకుండా ఉంటే భయపడాల్సిన అవసరం లేదు. కానీ... మనం చేతితో తాకినప్పుడు గట్టిగా రాయిలాగా ఉండటం, గడ్డలో ఏవైనా మార్పులు గమనిస్తూ ఉంటే మాత్రం తప్పనిసరిగా వాటిని అనుమానించాలి.

గడ్డ అయినా, పుట్టుమచ్చ అయినా మార్పులకు గురవుతూ, రంగు మారుతూ, గట్టిగా ఉండి, రక్తస్రావం కనిపిస్తే... నిర్లక్ష్యం చేయకూడదు.

లైపోమాలు ఎటువంటి నొప్పినీ కలగజేయవు. క్యాన్సర్ కణుతులు కూడా తొలిదశలో అస్సలు నొప్పి ఉండవు. కానీ పెరిగేకొద్దీ నరాలు, ఇతర వ్యవస్థల మీద ప్రభావం చూపించడం వల్ల తీవ్రమైన నొప్పిని కలగజేయటంతో పాటు చికిత్సకు అంత తొందరగా లొంగవు.

మన దేశాలలోని ప్రజల శరీరాలలో మెలనిన్ ఉత్పత్తి ఎక్కువగా ఉండటం వల్ల స్కిన్‌క్యాన్సర్ వచ్చే ప్రమాదం చాలా తక్కువని చెప్పవచ్చు. పూర్తిగా నయం చేయదగిన ఈ క్యాన్సర్ ప్రధానంగా 'బేసల్ సెల్ కార్సినోమా', 'స్క్వామస్ సెల్ కార్సినోమా' అని రెండు రకాలుగా ఉంటుంది. దాదాపు 90 శాతం బేసల్ సెల్ కార్సినోమా రకానికి చెందినవే ఉంటాయి. మనదేశంలో కూడా 'నాన్ మెలనోమాస్కిన్ క్యాన్సర్' పెరుగుతున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. యాభై ఏళ్లు పైబడ్డాక కనిపించే ఈ క్యాన్సర్స్... అల్ట్రావయొలెట్ కిరణాలు (యూవీ రేస్) ఎక్కువగా ఉన్న పాశ్చాత్యదేశాలలో శరీరాన్ని ట్యాన్ చేయడానికి ఉపయోగించే ట్యాన్ బూత్స్‌వల్ల, బాగా తెల్లగా ఉన్నవారిలో, నీలం రంగు కళ్లు ఉన్నవారిలో, పురుషుల్లో ఎక్కువగా వస్తుంటాయి. శరీరం మీద ఎక్కడైనా...అంటే... ముఖ్యంగా ఎండకు ఎక్స్‌పోజ్ అయ్యే శరీరభాగాల్లో చర్మం రంగుమార్పుతో పాటు మాననిపుండు, స్కిన్‌ప్యాచ్‌లా ఉండి రక్తస్రావం అవుతూ ఉంటే పరీక్షలు చేయంచుకోవడం మంచిది.

స్కిన్‌క్యాన్సర్స్ చాలావరకు 100% నయమవుతాయి. క్యాన్సర్ వచ్చిన ప్రదేశాన్ని శస్త్రచికిత్స ద్వారా పూర్తిగా తొలగించడమే కాకుండా మిలిగి ఉన్న క్యాన్సర్ కణాలనూ చంపివేయడానికి క్రయోవిధానంలో లేదా లేజర్‌తో చికిత్సలు చేస్తుంటారు. రేడియేషన్, కీమోథెరపీలను అవసరాన్ని బట్టి చేయడం జరుగుతుంది. క్యాన్సర్ వచ్చిన భాగంలో మాత్రమే ఆయింట్‌మెంట్ రూపంలో పూత మందుగా కీమోథెరపీనీ ఇస్తారు. సర్జరీ చేసి... చర్మాన్ని చాలా ఎక్కువగా తొలగించాల్సి వచ్చినప్పుడు ఇతర భాగాలనుంచి చర్మాన్ని సేకరించి, తొలగించిన చోట గ్రాఫ్టింగ్ చేస్తారు.

ఎండ నేరుగా తగిలే భాగాల్లో పైపూతగా సన్‌స్క్రీన్ లోషన్ రాసుకోవడం, శరీరాన్ని బాగా కప్పి ఉంచే దుస్తులు ధరించడం, ఎండకు వెళ్లేటప్పుడు లేత రంగు దుస్తులు ధరించడం, గొడుగు, చలువ కళ్లద్దాలు, టోపీలు ధరించడం, వీలైనంతవరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఉండే ఎండలో బయటకు తిరగకుండా ఉండటంవంటి జాగ్రత్తలు పాటిస్తే స్కిన్‌క్యాన్సర్‌ను కొంతవరకు దూరంగా ఉంచగలిగినవాళ్లం అవుతాం. కేవలం క్యాన్సర్ నివారణ కోసం మాత్రమే కాకుండా సాధారణ చర్మ సంరక్షణకు ఈ జాగ్రత్తలు ఉపయోగపడతాయి.



డా. సీహెచ్. మోహన వంశీ
చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్,
ఒమెగా హాస్పిటల్స్, హైదరాబాద్
ఫోన్ నంబరు 9849022121

మ్యాచ్ కవర్ చేస్తూ 'సాకర్' జర్నలిస్ట్ హఠాన్మరణం

అమెరికాకు చెందిన ప్రముఖ క్రీడా పాత్రికేయుడు గ్రాంట్ వాల్ ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ ఆకస్మికంగా చనిపోయాడు. ఫుట్‌బాల్ స్పెషలిస్ట్ జర్నలిస్ట్ అయిన గ్రాంట్ ప్రస్తుతం ఖతర్‌లో జరుగుతున్న ప్రపంచకప్ విశేషాలను అందిస్తున్నాడు. అర్జెంటీనా, నెదర్లాండ్స్ మధ్య జరుగుతున్న మ్యాచ్‌ను కవర్ చేస్తున్న అతను తన సీట్‌లోనే కుప్పకూలిపోయాడు. అత్యవసర వైద్య సేవలు అందించినా అతను అప్పటికే చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. బుధవారమే తన 49వ పుట్టిన రోజు జరుపుకున్న గ్రాంట్ తీవ్ర అలసట, ఒత్తిడి కారణంగా అనారోగ్యంబారిన పడినట్లు సమాచారం. పలు ప్రతిష్టాత్మక మీడియా సంస్థల్లో పని చేసిన అతనికి జర్నలిస్ట్‌గా ఇది ఎనిమిదో ప్రపంచ కప్. టోర్నీ ఆరంభంలో హోమోసెక్సువాలిటీకి మద్దతుగా ఇంద్రధనుస్సు రంగులతో కూడిన జెర్సీతో అతను రాగా, ఖతర్ నిబంధనల ప్రకారం అధికారులు అభ్యంతరం చెప్పారు. 'ఫిఫా' ప్రత్యేకంగా సన్మానించిన జర్నలిస్ట్‌లలో అతను ఒకడు.



'ద్వి'షాన్ కిషన్

వన్డే జట్టులో రెగ్యులర్ కాదు... వికెట్ కీపర్ల మధ్య పోటీలో తన స్థానంపై అనిశ్చితి... ఇటీవల న్యూజిలాండ్‌తో సిరీస్‌లో చోటే దక్కలేదు... బంగ్లాదేశ్‌తో కూడా రెండు మ్యాచ్‌లలో బెంచీకే పరిమితం... ఇక ఆడే అవకాశం రాదనిపించింది. కానీ అనూహ్యంగా రోహిత్ శర్మ గాయపడటంతో చాన్స్ దక్కింది. గతంలో ఓపెనర్‌గా ఆడిన ఏకైక వన్డేలోనూ విఫలమే! అయితేనేం... అరుదుగా వచ్చే బంగారు అవకాశాన్ని రెండు చేతులతో ఎలా ఒడిసి పట్టుకోవాలో ఇషాన్ కిషన్ చూపించాడు. ఓపెనర్‌గా దిగి విధ్వంసక ఇన్నింగ్స్‌తో అందరి దృష్టినీ తన వైపు తిప్పుకున్నాడు. రోహిత్ శర్మ, సచిన్ టెండూల్కర్, వీరేంద్ర సెహ్వాగ్ తర్వాత వన్డేల్లో డబుల్ సెంచరీ సాధించిన నాలుగో భారతీయుడిగా నిలిచాడు. ఫోర్లు, సిక్సర్లతోనే 156 పరుగులు సాధించిన ఈ 'జార్ఖండ్ పాకెట్ డైనమైట్' ఆట ముందు బంగ్లాదేశ్ బౌలర్లు చేతులెత్తేశారు. మరో ఎండ్‌లో కోహ్లి అంతటివాడు కూడా ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యాడు. కోహ్లి కూడా శతకం సాధించినా, కెరీర్ తొలి సెంచరీనే డబుల్ సెంచరీగా మలిచిన తొలి క్రికెటర్‌గా ఘనత వహించిన ఇషానే ఈనాటి హీరో... అనంతరం తమ వల్ల ఛేదన కాదన్నట్లుగా బంగ్లాదేశ్ ఓటమిని ఆహ్వానించింది. ఇషాన్ సాధించిన స్కోరుకంటే కూడా 28 పరుగులు తక్కువగా చేసి ఆ ఒక్కడి చేతిలోనే బంగ్లా ఓడిపోయింది!

- 131 బంతుల్లో 24 ఫోర్లు, 10 సిక్సర్లతో 210
- డబుల్ సెంచరీతో చెలరేగిన ఇషాన్ కిషన్
- కోహ్లి శతకం
- చివరి వన్డేలో భారత్ ఘన విజయం
- 227 పరుగులతో బంగ్లాదేశ్ చిత్తు


ఇషాన్ కిషన్

చిట్టోగ్రామ్: బంగ్లాదేశ్ చేతిలో వన్డే సిరీస్‌ను కోల్పోయినా... చివరకు భారత్ ఘనంగా ముగించింది. శనివారం జరిగిన మూడో వన్డేలో టీమిండియా 227 పరుగుల భారీ ఆధిక్యంతో బంగ్లాదేశ్‌ను చిత్తుగా ఓడించి తమ స్థాయిని చూపించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 409 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఇషాన్ కిషన్ (131 బంతుల్లో 210; 24 ఫోర్లు, 10 సిక్స్‌లు) డబుల్ సెంచరీతో చెలరేగాడు. మరోవైపు విరాట్ కోహ్లి (91 బంతుల్లో 113; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా శతకం బాదాడు. వీరిద్దరు రెండో వికెట్‌కు 31.4 ఓవర్లలో 290 పరుగులు జోడించడం విశేషం. ఇందులో ఇషాన్ వాటా 199 పరుగులు కాగా, కోహ్లి 85 పరుగులు సాధించాడు. అనంతరం బంగ్లాదేశ్ 34 ఓవర్లలో 182 పరుగులకే కుప్పకూలింది. షకీబ్ అల్ హసన్ (43) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అయితే తొలి రెండు మ్యాచ్‌లు నెగ్గిన బంగ్లాదేశ్ 2–1తో వన్డే సిరీస్‌ను సొంతం చేసుకుంది. ఇరు జట్ల మధ్య తొలి టెస్టు బుధవారం నుంచి ఇదే మైదానంలో జరుగుతుంది.


కోహ్లి

రాహుల్ విఫలం...

శిఖర్ ధావన్ (3) వరుసగా మూడో వన్డేలోనూ విఫలం కాగా... మూడో స్థానంలో కోహ్లి తనదైన శైలిలో చెలరేగాడు. వ్యక్తిగత స్కోరు '1' వద్ద లిటన్ దాస్ సునాయాస క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన కోహ్లి ఆ తర్వాత జాగ్రత్త పడ్డాడు. పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 45 పరుగులకు చేరింది. ఈ దశలో ఇషాన్‌కు సహకారం అందించడంపైనే దృష్టి పెట్టిన కోహ్లి అర్ధ సెంచరీకి 54 బంతులు తీసుకోగా, ఇందులో 4 ఫోర్లే ఉన్నాయి. ఆ తర్వాత మాత్రం అతను కొన్ని చక్కటి షాట్లతో ఆకట్టుకున్నాడు. ఇషాన్ వెనుదిరిగిన తర్వాత అతను చకచకా శతకం వైపు దూసుకుపోయాడు. ఇబాదత్ బౌలింగ్‌లో షార్ట్ ఫైన్‌లెగ్ దిశగా సిక్స్ కొట్టి 85 బంతుల్లో తన వన్డే కెరీర్లో 44వ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆగస్టు 2019 తర్వాత వన్డేల్లో అతనికి ఇదే తొలి సెంచరీ. మరోవైపు శ్రేయస్ (3), రాహుల్ (8) విఫలం కాగా, వాషింగ్టన్ సుందర్ (27 బంతుల్లో 37; 4 ఫోర్లు, 1 సిక్స్) ధాటితో స్కోరు 400 దాటింది. భారత్‌కు వన్డేల్లో ఇది నాలుగో అత్యధిక స్కోరు.

బౌండరీల వర్షం...



ముస్తఫిజుర్, తస్కీన్ ఓవర్లలో రెండేసి ఫోర్లతో బౌండరీల జోరు మొదలు పెట్టిన ఇషాన్‌ను నిలువరించడం బంగ్లా బౌలర్ల తరం కాలేదు. ఇబాదత్ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ బాదిన అతను 49 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అనంతరం మరికొన్ని మెరుపు షాట్లతో ఈ యువ బ్యాటర్ దూసుకుపోయాడు. అఫీఫ్ బౌలింగ్‌లో స్వీప్ షాట్‌తో ఫోర్ కొట్టడంతో 85 బంతుల్లోనే ఇషాన్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. ఈ క్రమంలో అప్పటి వరకు 2 సిక్సర్లే బాదిన అతను శతకం తర్వాత మరింత చెలరేగిపోయాడు. ఇబాదత్, షకీబ్ వేసిన వరుస ఓవర్లలో ఇషాన్ రెండేసి సిక్సర్లు బాదాడు. 100 నుంచి 150కి చేరేందుకు ఇషాన్‌కు 18 బంతులే సరిపోయాయి. మెహదీ బౌలింగ్‌లో సిక్సర్‌తోనే అతను ఈ మైలురాయిని అందుకున్నాడు. అనంతరం మెహదీ ఓవర్లోనే 6, 4, 4తో భారత బ్యాటర్ చెలరేగాడు. తస్కీన్ ఓవర్లో 2 ఫోర్లతో 197కు చేరుకున్న ఇషాన్... ముస్తఫిజుర్ బౌలింగ్‌లో పాయింట్ దిశగా సింగిల్ తీసి కొత్త చరిత్ర సృష్టించాడు. డబుల్ సెంచరీ మార్క్‌ను అందుకున్న క్షణం గర్జిస్తూ సంబరాలు చేసుకున్నాడు.

300 కొట్టేవాడా..!

35వ ఓవర్ చివరి బంతికి ఇషాన్ ద్విశతకం పూర్తయింది. సెంచరీ తర్వాత 41 బంతుల్లోనే డబుల్ సెంచరీ వచ్చింది. ఇన్నింగ్స్‌లో మరో 90 బంతులు మిగిలి ఉన్నాయి. ఆ సమయంలో అతని ఆట చూస్తే సగం బంతులు ఆడినా రోహిత్ శర్మ (264) స్కోరును దాటడంతోపాటు 300 కూడా కొట్టగలడేమో అనిపించింది. అయితే చివరకు దాస్ క్యాచ్‌తో ఈ దూకుడుకు బ్రేక్ పడింది. తస్కీన్ బౌలింగ్‌లో మరో భారీ షాట్‌కు ప్రయత్నించగా, బంతి గాల్లోకి బాగా ఎత్తుకు లేచింది. బౌండరీ వద్ద బంతిని సరిగ్గా అంచనా వేసిన దాస్ పరుగెడుతూ చక్కటి క్యాచ్ అందుకున్నాడు. ఇషాన్ ఇన్నింగ్స్‌లో 156 పరుగులు బౌండరీల ద్వారానే రావడం విశేషం.

ఇషాన్ కిషన్ రికార్డులు...

వన్డేల్లో వేగవంతమైన డబుల్ సెంచరీ (126 బంతులు; పాత రికార్డు క్రిస్ గేల్ (138 బంతులు; 2015లో జింబాబ్వేపై), పిన్న వయసులో డబుల్ సెంచరీ (24 ఏళ్ల 145 రోజులు; పాత రికార్డు రోహిత్ శర్మ (26 ఏళ్ల 186 రోజులు; 2013లో ఆస్ట్రేలియాపై), భారత్ తరఫున అతి తక్కువ (103) బంతుల్లో 150 పరుగుల మార్క్ (పాత రికార్డు సెహ్వాగ్ 112 బంతుల్లో; 2011లో వెస్టిండీస్‌పై)... ఈ ఘనతలన్నీ ఇషాన్ ఖాతాలో చేరాయి.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ధావన్ (ఎల్బీ) (బి) మెహదీ 3; ఇషాన్ కిషన్ (సి) దాస్ (బి) తస్కీన్ 210; కోహ్లి (సి) మెహదీ (బి) షకీబ్ 113; శ్రేయస్ (సి) దాస్ (బి) ఇబాదత్ 3; కేఎల్ రాహుల్ (బి) ఇబాదత్ 8; సుందర్ (బి) షకీబ్ 37; అక్షర్ (బి) తస్కీన్ 20; శార్దుల్ (సి) దాస్ (బి) ముస్తఫిజుర్ 3; కుల్దీప్ యాదవ్ (నాటౌట్) 3; సిరాజ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 409.** **వికెట్ల పతనం:** 1–15, 2–305, 3–320, 4–344, 5–344, 6–390, 7–405, 8–409. **బౌలింగ్:** ముస్తఫిజుర్ 10–0–66–1, తస్కీన్ 9–1–89–2, మెహదీ హసన్ మిరాజ్ 10–0–76–1, ఇబాదత్ 9–0–80–2, షకీబ్ 10–0–68–2, అఫీఫ్ 1–0–14–0, మహ్మదుల్లా 1–0–11–0.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: అనాముల్ (సి) సిరాజ్ (బి) అక్షర్ 8; దాస్ (సి) శార్దుల్ (బి) సిరాజ్ 29; షకీబ్ (బి) కుల్దీప్ 43; ముష్ఫికర్ (బి) అక్షర్ 7; యాసిర్ (ఎల్బీ) (బి) ఉమ్రాన్ 25; మహ్మదుల్లా (ఎల్బీ) (బి) సుందర్ 20; అఫీఫ్ (సి) ఉమ్రాన్ (బి) శార్దుల్ 8; మెహదీ హసన్ మిరాజ్ (సి) సిరాజ్ (బి) శార్దుల్ 3; తస్కీన్ (నాటౌట్) 17; ఇబాదత్ (ఎల్బీ) (బి) శార్దుల్ 0; ముస్తఫిజుర్ (బి) ఉమ్రాన్ 13; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (34 ఓవర్లలో ఆలౌట్) 182.** **వికెట్ల పతనం:** 1–33, 2–47, 3–73, 4–107, 5–124, 6–143, 7–145, 8–148, 9–149, 10–182. **బౌలింగ్:** సిరాజ్ 5–0–27–1, శార్దుల్ 5–0–30–3, అక్షర్ 5–0–22–2, ఉమ్రాన్ 8–0–43–2, కుల్దీప్ 10–1–53–1, సుందర్ 1–0–2–1.

72 అంతర్జాతీయ క్రికెట్‌లో కోహ్లి సెంచరీలు. రికీ పాంటింగ్ (71)ను అతను అధిగమించాడు. సచిన్ (100) తొలి ర్యాంక్‌లో ఉన్నాడు.

7 వన్డేల్లో డబుల్ సెంచరీ చేసిన ఏడో క్రికెటర్ ఇషాన్ కిషన్. రోహిత్ శర్మ మూడు డబుల్ సెంచరీలు చేయగా... సచిన్, సెహ్వాగ్ (భారత్), గేల్ (వెస్టిండీస్), గప్టిల్ (న్యూజిలాండ్), ఫఖర్ జమాన్ (పాకిస్తాన్) ఒక్కో డబుల్ సెంచరీ సాధించారు.

6 వన్డేల్లో 400 అంతకంటే ఎక్కువ స్కోరు చేయడం భారత జట్టుకిది ఆరోసారి. దక్షిణాఫ్రికా (6 సార్లు)తో భారత్ సమఉజ్జీగా నిలిచింది. తర్వాతి స్థానాల్లో ఇంగ్లండ్ (5 సార్లు), ఆస్ట్రేలియా, శ్రీలంక (2 సార్లు), న్యూజిలాండ్ (1 సారి) ఉన్నాయి.

"పిచ్ బ్యాటింగ్‌కు బాగా అనుకూలంగా ఉంది. దాంతో నేనేం చేయాలో స్పష్టంగా తెలిసింది. దిగ్గజాల సరసన నా పేరు చేరడం అదృష్టం. అందుకే బంతిని బాదడంపైనే దృష్టి పెట్టా. నాకు అన్నీ అనుకూలించాయి. 15 ఓవర్లు మిగిలి ఉన్నప్పుడు అవుటయ్యాను. 300 కూడా చేసేవాడినేమో. ఏ బౌలర్లను లక్ష్యంగా చేయాలో విరాట్ చెబుతూ వచ్చాడు. 95 వద్ద సిక్స్‌తో సెంచరీ చేయాలనుకున్నా. ఇది తొలి సెంచరీ కాబట్టి జాగ్రత్తగా ఆడమని అతను వారించాడు. ప్రస్తుత స్థితిలో ఎప్పుడు అవకాశం దక్కినా దానిని సమర్థంగా వాడుకోవడం ముఖ్యం." –ఇషాన్ కిషన్

టపటపా...

తొలి రెండు వన్డేల్లో చూపిన స్ఫూర్తిదాయక ప్రదర్శనను బంగ్లా చివరి మ్యాచ్‌లో చూపించలేకపోయింది. కొండంత లక్ష్యం కనిపిస్తుండగా ముందే ఓటమికి జట్టు సిద్ధమైనట్లు అనిపించింది. ఏ ఒక్కరూ చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయలేకపోగా... కనీసం ఒక అర్ధసెంచరీ భాగస్వామ్యం కూడా లేక జట్టు వేగంగా ఓటమి దిశగా సాగింది. భారత బౌలర్ల ధాటికి 16 ఓవర్ల ముందే జట్టు ఆట ముగిసింది.

మొ'రాకింగ్'

- పోర్చుగల్, క్రిస్టియానో రొనాల్డోను ఓడించిన మొరాకో
- ప్రపంచకప్‌లో సెమీఫైనల్ చేరిన తొలి ఆఫ్రికా జట్టుగా రికార్డు


మొరాకో గోల్ స్కోరర్ యూసుఫ్ ఎన్ నెసిరి

ఇప్పటి వరకు 92 ఏళ్ల ఫుట్‌బాల్ ప్రపంచకప్ టోర్నీలో ఆఫ్రికా ఖండానికి చెందిన 13 దేశాలు 48 సార్లు బరిలోకి దిగాయి. మూడు దేశాలు కామెరూన్, ఘనా, సెనెగల్ ఒక్కోసారి క్వార్టర్ ఫైనల్ చేరి అక్కడి నుంచే ఇంటిదారి పట్టాయి. ఎట్టకేలకు 49వ ప్రయత్నంలో మొరాకో రూపంలో ఓ ఆఫ్రికా జట్టు క్వార్టర్ ఫైనల్ అడ్డంకిని దాటి ఈ మెగా ఈవెంట్‌లో తొలిసారి సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఏమాత్రం అంచనాలు లేకుండా ఖతర్‌కు వచ్చిన మొరాకో జట్టు క్వార్టర్ ఫైనల్లో పటిష్టమైన పోర్చుగల్ జట్టును ఓడించి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. డిఫెండింగ్ చాంపియన్ ఫ్రాన్స్, ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగే చివరి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ విజేతతో సెమీఫైనల్లో మొరాకో తలపడుతుంది.

దోహా: లీగ్ దశలో ప్రపంచ రెండో ర్యాంకర్ బెల్జియం జట్టుపై తాము సాధించిన విజయం... గత రన్నరప్ క్రొయేషియాను 0–0తో నిలువరించడం... గాలివాటమేమీ కాదని ప్రపంచ 22వ ర్యాంకర్ మొరాకో నిరూపించింది. ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో ఆరోసారి పోటీపడిన మొరాకో ఈసారి సంచలన ప్రదర్శనతో సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. ప్రపంచ 9వ ర్యాంకర్ పోర్చుగల్ జట్టుతో శనివారం జరిగిన మూడో క్వార్టర్ ఫైనల్లో మొరాకో 1–0 గోల్ తేడాతో గెలిచింది. తద్వారా ఫుట్‌బాల్ ప్రపంచకప్ టోర్నీలో సెమీఫైనల్ చేరిన తొలి ఆఫ్రికా జట్టుగా, తొలి అరబ్ దేశంగా రికార్డు నెలకొల్పింది. ఆట 42వ నిమిషంలో ఎడమ వైపు నుంచి అతియత్ అలా అందించిన పాస్‌ను 'డి' ఏరియాలో యూసుఫ్ ఎన్ నెసిరి అమాంతం గాల్లోకి ఎగురుతూ 'హెడర్' షాట్‌తో బంతిని గోల్‌పోస్ట్‌లోనికి పంపించాడు. దాంతో మొరాకో తొలి అర్ధభాగాన్ని 1–0తో ముగించింది. విఖ్యాత ప్లేయర్, కెప్టెన్ క్రిస్టియానో రొనాల్డోను టీమ్ మేనేజ్‌మెంట్ ఈ మ్యాచ్‌లోనూ ఆరంభంలో ఆడించలేదు. 37 ఏళ్ల రొనాల్డోను 51వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్ ప్లేయర్‌గా బరిలోకి దించారు. ప్రిక్వార్టర్ ఫైనల్లో స్విట్జర్లాండ్‌పై హ్యాట్రిక్ చేసిన గొన్సాలో రామోస్ ఈ మ్యాచ్‌లో ఎలాంటి ప్రభావం చూపలేకపోయాడు. మొరాకో డిఫెన్స్ కూడా పటిష్టంగా ఉండటంతో పోర్చుగల్ జట్టు ఆటగాళ్లు గోల్‌పోస్ట్‌పై గురి చూసి కొట్టలేకపోయారు. చివరి 10 నిమిషాల్లో పోర్చుగల్‌కు గోల్ చేసేందుకు రెండుసార్లు అవకాశం వచ్చినా మొరాకో గోల్‌కీపర్ యాసిన్ బోనో వాటిని అడ్డుకున్నాడు. 90+1వ నిమిషంలో రొనాల్డో కొట్టిన షాట్‌ను యాసిన్ అద్భుతంగా నిలువరించాడు. ఇంజ్యూరీ టైమ్‌గా మ్యాచ్‌ను ఎనిమిది నిమిషాలు పొడిగించినా మొరాకో పట్టుదలతో ఆడి పోర్చుగల్‌కు గోల్ చేసే అవకాశం ఇవ్వలేదు. తన కెరీర్‌లో లోటుగా ఉన్న ప్రపంచకప్‌ను ఈసారైనా అందుకోవాలని ఆశించిన రొనాల్డో చివరకు కన్నీళ్లపర్యంతమవుతూ భారంగా మైదానాన్ని వీడాడు.


రొనాల్డో

గట్టెక్కిన అర్జెంటీనా

'షూటౌట్'లో నెదర్లాండ్స్‌పై 4–3తో విజయం • సెమీస్‌లో క్రొయేషియాతో 'ఢీ'



దోహా: తన కెరీర్‌లో లోటుగా ఉన్న ప్రపంచకప్‌ను ఈసారైనా దక్కించుకోవాలనే లక్ష్యంతో ఖతర్‌కు వచ్చిన లయనెల్ మెస్సీ తన అర్జెంటీనా జట్టును ఆ దిశగా మరో అడుగు వేయించాడు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంకర్ అర్జెంటీనా 'షూటౌట్'లో 4–3 గోల్స్ తేడాతో ఎనిమిదో ర్యాంకర్ నెదర్లాండ్స్ జట్టును ఓడించి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. అంతకుముందు నిర్ణీత సమయం వరకు రెండు జట్లు 2–2తో సమంగా నిలిచాయి. రెగ్యులర్ టైమ్‌లో అర్జెంటీనా తరఫున మొలీనా (35వ ని.లో), కెప్టెన్ మెస్సీ (73వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... నెదర్లాండ్స్ జట్టుకు వౌట్ వెహోర్స్ట్ (83వ ని.లో, 90+11వ ని.లో) రెండు గోల్స్ అందించాడు. స్కోరు సమంగా నిలవడంతో ఫలితం తేలడానికి అదనపు సమయం ఆడించారు. అదనపు సమయంలో రెండు జట్లు గోల్ చేయలేకపోయాయి. దాంతో విజేతను నిర్ణయించడానికి పెనాల్టీ షూటౌట్ అనివార్యమైంది.

షూటౌట్ సాగిందిలా...

నెదర్లాండ్స్		స్కోరు	అర్జెంటీనా	
వాన్ డిక్	✗	0-1	మెస్సీ	✓
బెర్హాస్	✗	0-2	పెరెడెస్	✓
కూప్‌మెనెర్స్	✓	1-3	మోంటీల్	✓
వెహోర్స్ట్	✓	2-3	ఎంజో	✗
ల్యూక్ జాంగ్	✓	3-4	లౌటారో	✓

భారీ ఆధిక్యంలో ఇంగ్లండ్

ముల్తాన్: పాకిస్తాన్‌తో జరుగుతున్న రెండో టెస్టులో రెండో ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ 5 వికెట్లకు 202 పరుగులు సాధించింది. బెన్ డకెట్ (79; 6 ఫోర్లు), హ్యారీ బ్రూక్ (74 బ్యాటింగ్; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు చేశారు. ఓవరాల్ ఆధిక్యాన్ని 281 పరుగులకు పెంచుకుంది .అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 107/2తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన పాక్ 202 పరుగుల వద్ద ఆలౌటైంది.

ఓటమి దిశగా విండీస్

అడిలైడ్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టెస్టులో 497 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన విండీస్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్లకు 38 పరుగులు చేసింది. విండీస్ గెలవాలంటే మరో 459 పరుగులు సాధించాలి. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో విండీస్ 214 పరుగులకు ఆలౌటైంది. 297 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం పొందిన అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆడిన ఆస్ట్రేలియా 6 వికెట్లకు 199 పరుగులు చేసి డిక్లేర్ చేసింది.



ఐఓఏ అధ్యక్షురాలిగా పీటీ ఉష

గగన్ నారంగ్‌కు ఉపాధ్యక్ష పదవి

న్యూఢిల్లీ: భారత అథ్లెటిక్స్ దిగ్గజం, పరుగుల రాణి పీటీ ఉష క్రీడా పరిపాలకురాలి హోదాలో కొత్త బాధ్యతలు చేపట్టింది. ప్రతిష్టాత్మక భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలిగా ఆమె ఎన్నికైంది. ఈ పదవికి మరో నామినేషన్ లేకపోవడంతో ఉష ఏకగ్రీవ ఎంపిక గతంలోనే ఖరారు కాగా... శనివారం దానికి అధికారికంగా ఆమోదముద్ర పడింది. ఐఓఏ అధ్యక్ష పదవికి ఎంపికైన తొలి మహిళగా 58 ఏళ్ల ఉష గుర్తింపు పొందింది. లండన్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, షూటర్ గగన్ నారంగ్ ఒక ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులలో డోలా బెనర్జీ (ఆర్చరీ), యోగేశ్వర్ దత్ (రెజ్లింగ్) ఉండగా... అథ్లెటిక్స్ కమిషన్ సభ్యులుగా మేరీకోమ్ (బాక్సింగ్), ఆచంట శరత్‌కమల్ (టేబుల్ టెన్నిస్) ఎంపికయ్యారు.

సినిమా

ఆయన అభిమానుల్లో నేనూ ఒకణ్ణి – వీవీ వినాయక్


• వినాయక్, కల్పన, సి. కల్యాణ్, ఎస్వీ కృష్ణారెడ్డి, సోహైల్, కె. అచ్చిరెడ్డి

''ఎస్వీ కృష్ణారెడ్డిగారి సినిమాలంటే తెలుగు ప్రేక్షకుల్లో ఒక క్రేజ్. ఆయనకున్న కోట్లాది మంది అభిమానుల్లో నేను కూడా ఒకణ్ణి. ఎంత పెద్ద సినిమా అయినా, ఎంతమంది కాంబినేషన్ అయినా సెట్‌లో కూల్‌గా ఎలా ఉండాలో ఆయన్ని చూసి నేర్చుకున్నాను. ఆయన గోల్డెన్ డేస్‌ని 'ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు' రిపీట్ చేస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు డైరెక్టర్ వీవీ వినాయక్. రాజేంద్ర ప్రసాద్, మీనా ప్రధాన పాత్రల్లో సోహైల్, మృణాళిని జంటగా నటించిన చిత్రం 'ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు'. ఎస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో కె. అచ్చిరెడ్డి సమర్పణలో కోనేరు కల్పన నిర్మించారు. ఎస్వీ కృష్ణారెడ్డి సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'అల్లసాని వారి అల్లిక..' అనే పాటని సి. కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా వినాయక్ విడుదల చేశారు. ఈ పాటని శ్రీమణి రచించగా, శ్రీకృష్ణ, హరిణి ఆలపించారు. ఈ సందర్భంగా కె. అచ్చిరెడ్డి మాట్లాడుతూ– ''కల్యాణ్‌గారి సహకారంతో ఆయన భార్య కోనేరు కల్పన నిర్మాతగా నా సమర్పణలో ఈ సినిమా నిర్మించే అవకాశం రావడం హ్యాపీ'' అన్నారు. సి. కల్యాణ్ మాట్లాడుతూ– ''ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు' అరిటాకులో వడ్డించిన అచ్చ తెలుగు భోజనం'' అన్నారు. ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ–''నా గత చిత్రాల్లోని అన్ని అంశాలను.. అంతకు మించి ఈ చిత్రంలో పొందుపరిచి ప్రేక్షకులను అలరించడానికి వస్తున్నాం'' అన్నారు.

ఎవరి సినిమానీ ఆపలేం – సురేష్‌బాబు



''నారప్ప, దృశ్యం 2' చిత్రాలు చాలా బాగున్నాయి. థియేటర్స్‌లో అయితే ఇంకా బాగా ఆడేవి. డబ్బు కూడా బాగా వచ్చేదేమో. అయితే కరోనా టైమ్‌లో ఓటీటీలో రిలీజ్ చేయడం సరైనదే. ఇక బర్త్ డే టైమ్‌లో ఆయా హీరోల అభిమానులు, ప్రేక్షకుల కోసం సినిమాలను రీ రిలీజ్ చేయడం మంచి పరిణామం. వెంకటేష్ బర్త్ డే సందర్భంగా ఈ నెల 13న 'నారప్ప'ని ఒకరోజు థియేటర్‌లో ప్రదర్శిస్తున్నాం. ఆ వసూళ్లను స్వచ్ఛంద సేవా సంస్థలకు ఇస్తాం'' అని నిర్మాత డి. సురేష్‌బాబు అన్నారు. వెంకటేష్ లీడ్ రోల్‌లో శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'నారప్ప'. డి. సురేష్‌బాబు, కలైపులి ఎస్. థాను, అమెజాన్ ప్రైమ్ నిర్మించిన ఈ సినిమా గత ఏడాది అమెజాన్ ఓటీటీలో విడుదలైంది. ఈ నెల 13న వెంకటేష్ బర్త్ డేకి ఈ చిత్రాన్ని థియేటర్స్‌లో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ– ''మధ్యతరగతి వారికి సినిమా అందుబాటులో ఉండాలి. 'అవతార్' సినిమాకి కొన్ని మల్టీప్లెక్స్‌లో టికెట్‌లను మూడు, ఐదు వేలకు అమ్ముతున్నారు. ఆ మధ్య మల్టీప్లెక్స్‌లో టికెట్ ధర రూ. 70 పెట్టినప్పుడు షోలు హౌస్‌ఫుల్ అయ్యాయి. దాన్ని అలాగే కంటిన్యూ చేస్తే రెవెన్యూ పెంచవచ్చు. ఇక సంక్రాంతి పండగ టైమ్‌లో ఎవరి సినిమానీ ఆపలేం. అన్ని సినిమాలు విడుదల కావాలి.. అందరికీ థియేటర్స్ ఇవ్వాలి. ఇక మంచి సినిమాకి మంచి థియేటర్లు దొరుకుతాయే కానీ ఒకరి సినిమాని మరొకరు ఆపే ప్రసక్తే ఉండదు'' అన్నారు.

వినోదం.. అపరిమితం

'బిగ్ బాస్' సీజన్ 5 విజేత వీజే సన్నీ, సప్తగిరి హీరోలుగా, నక్షత్ర, అక్సా ఖాన్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'అన్‌స్టాపబుల్'. 'అన్ లిమిటెడ్ ఫన్' అనేది ఉపశీర్షిక. రజిత్ రావు నిర్మించారు. ఈ సినిమా మోషన్ పోస్టర్‌ని నిర్మాత 'దిల్' రాజు విడుదల చేసి, మాట్లాడుతూ– ''టైటిల్ బాగుంది. సినిమా మంచి విజయం సాధించాలి'' అన్నారు. ''కుటుంబంతో సహా నవ్వుకునే చిత్రమిది'' అన్నారు డైమండ్ రత్నబాబు. ''సినిమాలపై ప్యాషన్‌తో ఇండస్ట్రీకి వచ్చాను'' అన్నారు రజిత్ రావు. ఈ చిత్రానికి సహనిర్మాతలు: షేక్ రఫీ, బిట్టు (నర్సయ్య న్యవనంది), రాము వురుగొండ, కెమెరా: వేణు మురళీధర్, సంగీతం: భీమ్స్.


• డైమండ్ రత్నబాబు, రజిత్, 'దిల్' రాజు, సన్నీ

మా ఇద్దరి బలం అదే

''రవితేజగారిని దృష్టిలో పెట్టుకొని రాసిన కథ 'ధమాకా'. ఆయన ఈ మధ్య సీరియస్ సినిమాలు చేశారు. రవితేజగారి బలం ఎంటర్‌టైన్‌మెంట్.. నా బలం కూడా అదే. ఇద్దరం కలసి మంచి ఎంటర్‌టైనర్ ఇవ్వాలని 'ధమాకా' చేశాం'' అని ప్రసన్నకుమార్ బెజవాడ అన్నారు. రవితేజ, శ్రీలీల జంటగా త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ధమాకా'. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న రిలీజవుతోంది. ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందించిన ప్రసన్నకుమార్ బెజవాడ మాట్లాడుతూ–''ఈ సినిమాలో రవితేజగారు పేద, ధనికుడు.. ఇలా రెండు పాత్రలు చేశారు. మా చిత్రం చిరంజీవిగారి 'రౌడీ అల్లుడి'కి మరో వెర్షన్ అనుకుంటున్నాను. నేను ఒక సీన్ చెబితే అవుట్‌పుట్ ఎలా ఉంటుందో త్రినాథరావుగారికి తెలుసు. అందుకే మా ఇద్దరికీ సింక్ కుదిరింది. ఈ చిత్రాన్ని హిందీలో 'బిగ్ ధమాకా' పేరుతో రిలీజ్ చేస్తున్నాం. ప్రస్తుతం నాగార్జునగారి కోసం ఒక కథ రాస్తున్నాను. మరో చిన్న సినిమా చేస్తున్నాను'' అన్నారు.


• ప్రసన్నకుమార్

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వలంటీర్లు వేగులు కాదు.. ప్రభుత్వ సేవకులు

ఈనాడు రాతలపై మంత్రి ఆదిమూలపు సురేష్ ధ్వజం

సాక్షి, అమరావతి: అబద్ధాన్ని, అవాస్తవాలను రంగరించి టీడీపీని అధికారంలోకి తీసుకురావాలని 'ఈనాడు' పత్రిక చూస్తోందని మునిసిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ధ్వజమెత్తారు. రామోజీరావు రాసినట్లుగా వలంటీర్లు వేగులు కాదని.. వారు ప్రభుత్వ సేవకులని స్పష్టంచేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆదిమూలపు సురేష్ మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా వలంటీర్లు వ్యవహరిస్తున్నారని గుర్తుచేశారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా కేవలం గౌరవ వేతనంతో పనిచేస్తున్న వారిపై ఇలాంటి దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. రామోజీరావు వాస్తవాలు తెలుసుకోకుండా చంద్రబాబుకు అనుకూలంగా వార్తలు రాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వలంటీర్ల విషయంలో కుట్రపూరితంగా ఎన్నో అవాస్తవాలు వండివార్చారని దుయ్యబట్టారు. చంద్రబాబు ఏర్పాటు చేసిన జన్మభూమి కమిటీలది దానవతావాదం కాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏర్పాటు చేసిన వలంటీర్లది మానవతావాదమని తెలిపారు. చంద్రబాబు బుర్ర తక్కువ పాలన రామోజీకి అమోఘం, అద్భుతంలా కనిపిస్తోందా అని నిలదీశారు. సేవే పరమావధిగా పనిచేస్తున్న వలంటీర్లపై ఇలా అడ్డగోలుగా దుష్ప్రచారం చేయడం రామోజీకి తగదని హితవు పలికారు. సెన్స్, కామన్ సెన్స్ లేకుండా వేగులంటూ రామోజీ పిచ్చి రాతలు రాసినా, వలంటీర్ల జోలికి వచ్చినా చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. వ్యవస్థలను, అధికార యంత్రాంగాన్ని పార్టీ కోసం వాడుకోవడంలో చంద్రబాబు దిట్ట అని.. ఇది అందరికీ తెలిసిన విషయమేనని చెప్పారు. కోవిడ్ సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసిన వలంటీర్లపై ఇలా ఇష్టానుసారం కథనాలు రాయడం దారుణమన్నారు. తమ పార్టీ క్షేత్ర స్థాయిలో బలంగా ఉందని.. పార్టీ కోసం వలంటీర్లను వాడుకోవాల్సిన అవసరం తమకు లేదని స్పష్టం చేశారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీల వల్ల ప్రజలు అనుభవించిన అవస్థలు అన్నీఇన్నీ కావని గుర్తు చేశారు. పథకానికో రేటు పెట్టి జన్మభూమి కమిటీలు దోచుకుతిన్నాయన్నారు. 'జన్మభూమిలో నేతల మేత' అని 2017 ఆగస్టు 11న 'ఈనాడు' ఫస్ట్ పేజీలో స్టోరీ ఇచ్చిన విషయం గుర్తులేకుంటే ఎలా? అని రామోజీరావుని నిలదీశారు. జన్మభూమి కమిటీలను భరించలేకే చంద్రబాబును ప్రజలు 2019 ఎన్నికల్లో మట్టి కరిపించారని తెలిపారు.

ఆక్వా రైతులకు.. మూడున్నరేళ్లుగా రూ. 1.50కే విద్యుత్

ఎన్నికలకు ఆర్నెల్ల ముందు రూ.2లకు సరఫరా చేస్తామని చంద్రబాబు ఉత్తర్వులు

- ఆచరణలో అట్టర్‌ఫ్లాప్.. పైగా 309.95 కోట్లు ఎగ్గొట్టిన టీడీపీ అధినేత
- బాబు బకాయిలతో సహా ఈ మూడున్నర ఏళ్లలో రూ.2,687.47 కోట్ల సబ్సిడీ చెల్లించిన జగన్ సర్కార్
- ఇప్పుడేమో యూనిట్ రూ.1.50కే ఇస్తామంటూ బాబు దొంగ హామీలు



నాడు: అధికారంలోకి రాగానే జోన్‌తో సంబంధం లేకుండా ఆక్వా రైతులందరికీ యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే అందిస్తామని 2018లో చంద్రబాబు హామీ.

నేడు: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆక్వా రైతులకు యూనిట్ రూ.1.50కే విద్యుత్ సరఫరా చేస్తున్నారు. చంద్రబాబు ఎగ్గొట్టిన బకాయిలతో సహా మూడున్నరేళ్లలో రూ.2,687.47కోట్ల విద్యుత్ సబ్సిడీని అందించారు. అలాగే, టీడీపీ హయాంలో 52,946 కనెక్షన్లు ఉండగా, వాటి సంఖ్య ప్రస్తుతం 61,682కు చేరింది. పైగా ప్రస్తుతం యూనిట్ విద్యుత్ ధర బయట రూ.6.89 ఉండగా, రూ.1.50కే సరఫరా చేస్తున్నారు.

సాక్షి, అమరావతి : ఇదీ టీడీపీ, వైఎస్సార్‌సీపీ పాలనలో ఆక్వా రైతుల అనుభవం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2018లో పశ్చిమ గోదావరి జిల్లాలో పాదయాత్ర చేస్తుండగా.. అధికారంలోకి వస్తే ఆక్వా సాగుచేసే రైతులకు యూనిట్ రూ.1.50కే విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో నాటి సీఎం చంద్రబాబు ఆదరాబాదరాగా ఎన్నికలకు ఆర్నెల్ల ముందు యూనిట్ రూ.2లకు తగ్గిస్తూ జీఓ జారీచేశారు. అయితే, ఆచరణలో మాత్రం అది నోచుకోలేదు. అంతేకాదు.. 2018–19లో 52,946 కనెక్షన్లకు సంబంధించి రూ.309.95 కోట్ల విద్యుత్ సబ్సిడీ బకాయిలూ చెల్లించకుండా ఎగ్గొట్టారు. రైతులు యూనిట్ రూ.3.86 చొప్పునే చెల్లించారు.

ఆక్వా, నాన్–ఆక్వా జోన్లుగా విడగొట్టింది బాబే..

ఇక ఆక్వా,, నాన్ ఆక్వా జోన్లుగా విడగొట్టింది కూడా చంద్రబాబు హయాంలోనే. నాన్ ఆక్వాజోన్‌లో గత ప్రభుత్వం యూనిట్ కరెంట్‌కు రూ.3.86 వసూలుచేస్తే పాదయాత్ర సమయంలో ఆ రైతులకు అండగా నిలిచేందుకు యూనిట్‌కు రూ.1.50లకే అందిస్తామని జగన్ హామీఇచ్చారు. ఈ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి యూనిట్ రూ.1.50కే సరఫరా చేస్తున్నారు. కానీ, చంద్రబాబు ఇప్పుడు జోన్‌తో సంబంధం లేకుండా యూనిట్ రూ.1.50కే విద్యుత్ సరఫరా చేస్తానంటూ దొంగ హామీలిస్తున్నారు.

చైల్డ్ పోర్నోగ్రఫీ కట్టడికి చర్యలు

- బాలలపై లైంగిక దాడులను ప్రేరేపించే వెబ్‌సైట్లపై కఠిన చర్యలు
- అమెరికాకు చెందిన 'ఎన్‌సీఎంఈ'తో ఎన్‌సీఆర్‌బీ ఎంవోయూ
- అన్ని రాష్ట్రాల సీఐడీ విభాగాలను ప్రత్యేక టిప్‌లైన్ వ్యవస్థ ద్వారా అనుసంధానం

సాక్షి, అమరావతి: చైల్డ్ పోర్నోగ్రఫీపై ఉక్కుపాదం మోపేందుకు కేంద్ర, రాష్ట్ర పోలీసు శాఖలు సంయుక్త కార్యాచరణకు ఉపక్రమించాయి. బాలలపై లైంగిక వేధింపులను ప్రేరేపించే చైల్డ్ పోర్నోగ్రఫీ వీడియోలు, కంటెంట్‌పై కఠిన చర్యలు తీసుకోనున్నాయి. ఇందుకోసం అమెరికాకు చెందిన 'నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్–ఎక్స్‌ప్లాయిటెడ్ చిల్డ్రన్(ఎన్‌సీఎంఈసీ)తో జాతీయ నేర గణాంకాల సంస్థ(ఎన్‌సీఆర్‌బీ) ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సీఐడీ విభాగాలను అనుసంధానిస్తూ ప్రత్యేక టిప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. బాలలపై లైంగిక దాడులను ప్రేరేపించే అశ్లీల వీడియోలను విదేశాల్లో నమోదైన వెబ్‌సైట్లు, యూట్యూబ్ చానళ్ల ద్వారా అప్‌లోడ్ చేస్తున్నారు. మన దేశంలో అటువంటి అశ్లీల వీడియోలను 2018లో 738 పోస్టు చేయగా.. 2021లో వాటిసంఖ్య 1,172కు పెరిగింది. ఇక అశ్లీల వీడియోలతో బాలలు, మహిళలను బ్లాక్ మెయిలింగ్ చేసే కేసులు కూడా దేశంలో పెరుగుతున్నాయి. కేవలం వేధించడం కోసమే 2018లో దేశవ్యాప్తంగా 113 వీడియోలను పోస్టు చేయగా.. 2021లో 200 వీడియోలు పోస్టు చేశారు. ఇటీవల వివిధ రాష్ట్రాల్లో చైల్డ్ పోర్నోగ్రఫీని ప్రోత్సహిస్తున్న ఆన్‌లైన్ సెంటర్లపై సీబీఐ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. మన రాష్ట్రంలో విజయవాడ, నెల్లూరులలో కూడా కొన్ని వెబ్‌సెంటర్లపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. ఎన్‌సీఆర్‌బీ దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సీఐడీ విభాగాలను అనుసంధానిస్తూ ఒక ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. మరోవైపు అమెరికాకు చెందిన ఎన్‌సీఎంఈ నిర్వహిస్తున్న కేంద్రీకృత రిపోర్టింగ్ వ్యవస్థతో ఎన్‌సీఆర్‌బీ పోర్టల్‌ను అనుసంధానించారు. అందుకోసం ప్రత్యేకంగా టిప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. చైల్డ్ పోర్నోగ్రఫీకి అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర సీఐడీ విభాగం నిరంతరం పటిష్ట పర్యవేక్షణను కొనసాగిస్తుంది. బాలలపై లైంగిక వేధింపులను ప్రేరేపించే వీడియోలు, అశ్లీల కంటెంట్లను అందించే వెబ్‌సైట్లు, యూట్యూబ్ చానళ్లను గుర్తిస్తే వెంటనే ఈ టిప్‌లైన్ వ్యవస్థ ద్వారా సమాచారం ఇస్తుంది. వెంటనే ఢిల్లీలోని ఎన్‌సీఆర్‌బీ, అమెరికాలోని ఎన్‌సీఎంఈలలోని సైబర్ క్రైమ్ నిరోధక వ్యవస్థలు అప్రమత్తం అవుతాయి. చైల్డ్ పోర్నోగ్రఫీని ప్రేరేపిస్తున్న వెబ్‌సైట్లు, యూట్యూబ్ చానళ్లను వెంటనే ఆన్‌లైన్ నుంచి తొలగిస్తాయి. ఈ మేరకు ఇంటర్‌నెట్ సర్వీస్ ప్రొవైడర్లను ఆదేశిస్తారు. అంతేకాదు అటువంటి వెబ్‌సైట్లు, యూట్యూబ్ చానళ్ల నిర్వాహకులపై రాష్ట్ర సీఐడీ విభాగం కేసు నమోదు చేస్తుంది. దేశంలో ఇతర ప్రాంతాల్లో ఉన్నవారిని కూడా గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను పంపి వారిని అరెస్ట్ చేస్తుంది.

కొత్త జిల్లాలకు మరింత చేరువగా విద్యుత్ వ్యవస్థ

- మూడు డిస్కంల పరిధిలో దాదాపు 23 వేల మంది ఉద్యోగులు
- కొత్త జిల్లాలకు త్వరలోనే అధికారులు, సిబ్బంది కేటాయింపు
- కసరత్తు పూర్తి చేసిన విద్యుత్ పంపిణీ సంస్థలు

సాక్షి, అమరావతి: విద్యుత్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు త్వరలోనే కొత్త జిల్లాలకు అధికారులు, సిబ్బంది రానున్నారు. కొత్త కార్యాలయాల్లో కార్యకలాపాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు డిస్కంలు చేపట్టిన కసరత్తు తుది దశకు చేరుకుంది. ప్రస్తుతం ఉన్న దాదాపు 23 వేల సిబ్బందినే జిల్లాల వారీగా కేటాయించే ప్రక్రియకు డిస్కంలు శ్రీకారం చుట్టాయి. ఉద్యోగుల నుంచి ఆప్షన్ల స్వీకరణ మొదలుపెట్టాయి.

కొత్త ఏడాదిలో కొత్త ప్లేస్

డిస్కంలకు ప్రస్తుతం ఉమ్మడి జిల్లాల్లో ప్రతి జిల్లాకూ ఒక ఆపరేషన్ సర్కిల్ కార్యాలయం ఉంది. వాటికి సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) జిల్లా అధికారిగా వ్యవహరిస్తున్నారు. వారిని ప్రస్తుతం ఉన్న జిల్లాల్లోనే అదే స్థానంలో కొనసాగిస్తున్నారు. కొత్తగా ఏర్పడ్డ 13 జిల్లాలకు ఎలక్ట్రికల్ ఇంజనీర్ (ఈఈ) స్థాయి అధికారులను నోడల్ ఆఫీసర్లు, ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. వీరి స్థానంలో ఎస్ఈలను నియమించాలి. వీరు కాకుండా రెవెన్యూ డివిజన్ల వారీగా డివిజన్ ఇంజనీర్ (డీఈ) కార్యాలయాలున్నాయి. ప్రతి డివిజన్‌లో దాదాపు నాలుగుకు తగ్గకుండా సెక్షన్ (ఏఈ) కార్యాలయాలు ఏర్పాటు చేశారు. వీటిలో కొత్త వారిని నియమించాల్సి ఉంది. ఇందుకోసం డిస్కంలు కసరత్తు మొదలుపెట్టాయి. కొత్త జిల్లాల్లో సర్కిల్, డివిజన్, ఏఈ కార్యాలయాల ఏర్పాటుతో పాటు వాటికి అధికా1రులను నియమించడంపై దృష్టి సారించాయి. ఈ మేరకు ఉద్యోగుల నుంచి డిస్కంల సీఎండీలు కె.సంతోషరావు, జె.పద్మాజనార్దనరెడ్డి ఆప్షన్లు ఆహ్వానించారు. ఏపీ సీపీడీసీఎల్‌లో ఇటీవలే దరఖాస్తుల (ఆప్షన్స్) స్వీకరణ పూర్తికాగా, ఏపీ ఈపీడీసీఎల్, ఏపీ ఎస్‌పీడీసీఎల్‌లో ఆప్షన్లు తీసుకుని, పరిశీలన అనంతరం కొత్త ఏడాదిలో బదిలీలను చేపట్టాలని భావిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి జిల్లాలకు ఉద్యోగుల సర్దుబాట్లు పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నట్టు సీఎండీలు వెల్లడించారు.

క్లుప్తంగా

సీఎస్‌తో బ్రిటన్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ భేటీ

సాక్షి, అమరావతి: బ్రిటన్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ వైన్ ఓవెన్ శనివారం విజయవాడలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డితో భేటీ అయ్యారు. తన రాష్ట్ర పర్యటనలో భాగంగా గారెత్ మర్యాదపూర్వకంగా సీఎస్‌ను కలిసి రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు.

జర్నలిస్టులకు పునఃశ్చరణ తరగతులు నిర్వహిస్తాం

- ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని



నక్కపల్లి (అనకాపల్లి జిల్లా): ప్రెస్ అకాడమీ ఆధ్వర్యాన త్వరలో జర్నలిస్టులకు పునఃశ్చరణ తరగతులు నిర్వహిస్తామని సీఆర్ ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఉత్తరాంధ్ర పర్యటనకు వచ్చిన ఆయనకు నక్కపల్లిలో ఏపీయూడబ్ల్యూజే (పాయకరావుపేట ప్రెస్‌క్లబ్) ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఉపమాక వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందించి సన్మానించారు. అనంతరం కొమ్మినేని శ్రీనివాసరావు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సమాజంలో పాత్రికేయుల పట్ల విశ్వసనీయత పెంచడం, ఏ వార్తలు ఎలా రాయాలన్న దానిపై అవగాహన కల్పించేందుకు జర్నలిస్టులకు తరగతులు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పాత్రికేయులు నిష్పక్షపాతంగా నిజాలను నిర్భయంగా వెల్లడిస్తూ వార్తలు రాసినప్పుడే ప్రజల్లో విశ్వసనీయత ఉంటుందన్నారు. పాత్రికేయుల హెల్త్ స్కీం, ప్రమాద బీమా, సంక్షేమ నిధి వంటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని పలువురు పాత్రికేయులు కోరారు. న్యాయబద్ధంగా ఉన్న పాత్రికేయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కొమ్మినేని తెలిపారు.



ఐటీ ఉద్యోగులకు డేంజర్ బెల్స్!

నెలకు భారీ వేతనాలు, వారంలో రెండు రోజుల సెలవులు అందిస్తూ యువతకు డ్రీమ్ డెస్టినేషన్స్‌గా మారాయి.. ఐటీ కంపెనీలు. వీటిలో ఉద్యోగం సాధిస్తే చాలు.. ఇక జీవితం పూలబాటే అనేలా సర్వత్రా అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మధ్య మధ్యలో ఐటీ రంగంలో కొంత ఒడిదుడుకులు ఎదురైనా.. కోవిడ్ సంక్షోభంలోనూ ఐటీ కంపెనీలు భారీగానే లాభాలు ఆర్జించాయి. ఉద్యోగాలు సైతం పెద్ద ఎత్తున కల్పించాయి. అయితే నాణేనికి రెండో వైపు అన్నట్టు కోవిడ్ అనంతర పరిస్థితులు, ఉక్రెయిన్-రష్యా యుద్ధ ప్రభావాలు, ఆర్థిక మాంద్యం సూచనలతో ఐటీ కంపెనీలు ప్రస్తుతం నష్టాలను తగ్గించుకునే పనిలో పడ్డాయి. లాభాలు అంతకంతకూ పడిపోతుండటంతో పొదుపు చర్యల్లో భాగంగా జాబ్స్ లేఆఫ్స్ (ఉద్యోగాల తొలగింపు) బాట పడుతున్నాయి. వీటిలో దిగ్గజ టెక్ కంపెనీలు సైతం ఉండటం అందరినీ కలవరపరుస్తోంది.

(ఎం.విశ్వనాథరెడ్డి, సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

2022లో 1,391 సార్లు తొలగింపులు ప్రకటించిన టెక్ కంపెనీలు

- డిసెంబర్ 9 వరకు తీసేసిన ఉద్యోగుల సంఖ్య 2,18,324
- అమెరికా కంపెనీల్లోనే తొలగింపులు
- కోవిడ్ అనంతర పరిస్థితుల్లో కంపెనీలు కుదేలు
- తీవ్ర ఒడిదుడుకుల్లో స్టార్టప్‌లు
- వీటిలోనూ భారీగానే ఉద్యోగాల కోత
- వచ్చే ఏడాది మన దేశంలో తొలగింపులు ఉండే అవకాశం
- ఆర్థిక వ్యవస్థకు మంచి శకునం కాదంటున్న నిపుణులు



ప్రస్తుతం మనదేశంలో పరిస్థితి బాగానే ఉన్నా టెక్ కంపెనీలకు కేంద్ర స్థానమైన అమెరికాలో భారీ ఎత్తున ఉద్యోగుల తొలగింపు జరుగుతోంది. 2022లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న టెక్ కంపెనీలు 1,391 సార్లు ఉద్యోగుల తొలగింపులు ప్రకటించాయని ప్రముఖ వెబ్‌సైట్.. ట్రూఅప్ బాంబుపేల్చింది. ఈ ఏడాది జనవరి 1 నుంచి డిసెంబర్ 9 వరకు ఏకంగా 2,18,324 మంది ఉద్యోగులను టెక్ కంపెనీలు తొలగించాయని పేర్కొంది. ట్రూఅప్‌ను టెక్ కంపెనీలు, ఉద్యోగులు విశ్వసనీయమైనదిగా పరిగణిస్తోన్న నేపథ్యంలో ఇప్పుడీ అంశం సర్వత్రా చర్చనీయాంశమైంది.

ఉద్యోగుల తొలగింపు ఎందుకు?

ఉద్యోగుల తొలగింపునకు ప్రధానంగా రెండు కారణాలు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అస్థిరత ఒక కారణమైతే.. ఉద్యోగుల పేలవమైన పనితీరు రెండో కారణమని టెక్ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, ఆర్థిక సేవల సంస్థ.. 'గోల్డ్‌మన్ శాక్స్ రీసెర్చ్' విశ్లేషణ ప్రకారం.. టెక్ రంగంలో ప్రతికూల పరిస్థితులకు ప్రధాన కారణాలు ఇవి..

- అస్థిర, కఠిన ఆర్థిక పరిస్థితులు, అధిక వడ్డీరేట్లు టెక్ రంగాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ప్రముఖ టెక్ కంపెనీల లాభాల మీద ఈ అంశాలు తీవ్ర ప్రతికూల ప్రభావం చూపిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ కఠిన పరిస్థితులు దీర్ఘకాలం ఉంటాయని అంచనా.
- ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని రంగాల్లో సంస్థల ప్రకటనల వ్యయం గణనీయంగా తగ్గిపోవడం, క్రిప్టో కరెన్సీ మార్కెట్ల బుడగ పేలిపోవడం కూడా టెక్ కంపెనీల కష్టాలకు కారణమేనని చెబుతున్నారు.

ఆర్థిక వ్యవస్థకు ఇస్తున్న సంకేతాలేమిటి?

[illegible]

2022లో ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగుల తొలగింపు ఇలా..

నెల	సంఖ్య
జనవరి	631
ఫిబ్రవరి	6,327
మార్చి	8,262
ఏప్రిల్	5,825
మే	22,707
జూన్	29,299
జూలై	21,731
ఆగస్టు	21,332
సెప్టెంబర్	10,718
అక్టోబర్	23,437
నవంబర్	59,785
డిసెంబర్ (9 వరకు)	8,270
మొత్తం:	2,18,324



భారీగా ఉద్యోగులను తొలగిస్తున్న కొన్ని ప్రముఖ సంస్థలు..

- **మెటా (ఫేస్‌బుక్):** ఫేస్‌బుక్.. 'టిక్‌టాక్' లాంటి సంస్థల నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటోంది. పోటీ సంస్థల ప్రవేశంతో ప్రకటనలపైన వచ్చే లాభాలు మెటాకు తగ్గిపోయాయి. మరోవైపు ఆర్థిక మాంద్యం పరిస్థితులు కూడా ఇందుకు కారణమయ్యాయి. మెటా ఆధ్వర్యంలోనే ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఉన్నాయి. ఆదాయాలు పడిపోవడంతో ఉద్యోగుల తొలగింపు తప్పలేదు. ఇది 'మెటా' బ్రాండ్ ఇమేజ్‌ని మసకబార్చేదేనని నిపుణులు చెబుతున్నారు. ఈ కంపెనీల్లో భారీ స్థాయిలో ఉద్యోగుల కోత ఇదే తొలిసారి.
- **ట్విట్టర్:** అపర కుబేరుడు ఎలాన్ మస్క్ ట్విట్టర్‌ను కొనుగోలు చేశాక భారీగా ఉద్యోగుల తొలగింపు ప్రక్రియను చేపట్టారు. దాదాపు 50 శాతం మంది ఉద్యోగులపై వేటేశారు. ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే మరోవైపు వేల మంది కంపెనీ కాంట్రాక్టర్లపైనా కోత విధించారు. ఇదంతా పూర్తయ్యేవరకు ఎంత మంది ఉద్యోగులు మిగులుతారనే విషయం అంతుచిక్కడం లేదు.
- **బైజూస్:** ఏర్పాటైన అతి తక్కువ కాలంలోనే యూనికార్న్ కంపెనీగా ఎదిగింది.. బైజూస్. కోవిడ్ సంక్షోభంలో ఎడ్యుటెక్ కంపెనీ అయిన బైజూస్‌కు భారీగా డిమాండ్ పెరిగింది. ఇప్పుడు స్కూళ్లు, కళాశాలలు యథావిధిగా నడుస్తుండటంతో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటోంది. దీంతో నష్టాలను తగ్గించుకోవడానికి అక్టోబర్‌లో 2,500 మంది ఉద్యోగులను తొలగించింది.
- **పెలొటన్:** హై ఎండ్ వర్కవుట్ పరికరాల తయారీ సంస్థ ఇది. కోవిడ్ సమయంలో ఈ కంపెనీ పరికరాల విక్రయాలు భారీగా పెరిగాయి. దీంతో అంతేస్థాయిలో లాభాలూ ఆర్జించింది. ఇప్పుడు విక్రయాలు తగ్గడంతో లాభాలను నిలబెట్టుకోవడం కోసం ఉద్యోగుల తొలగింపునకు పూనుకుంది.

మనదేశంలో పరిస్థితి ఏమిటి?

ఇక మన దేశంలో ప్రముఖ టెక్ కంపెనీల్లో పెద్దగా ఉద్యోగుల తొలగింపు లేదు. సాధారణ పరిస్థితుల్లో కొంత మందిని తొలగించడం సహజంగానే జరుగుతూ ఉంటుందని అంటున్నారు. అమెరికాలో భారీ సంఖ్యలో ఉద్యోగుల తొలగింపుతో భారత టెకీల్లో కొంత ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే ఇప్పటివరకు భారత్‌లో ఉద్యోగుల తొలగింపు ఆలోచన కంపెనీలకు లేదని నిపుణులు చెబుతుండటంతో భారత టెకీలు ఊరట చెందుతున్నారు. యాక్సెంచర్ కంపెనీ ఇటీవల 60 వేల మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన విషయాన్ని నిపుణులు గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఉద్యోగులను కాపాడుకోవడానికే టెక్ కంపెనీలు ప్రయత్నిస్తున్నాయని వివరిస్తున్నారు. టెకీల పరిభాషలో.. ఫాంగ్ (ఎఫ్ఏఏఎన్‌జీ) (ఫేస్‌బుక్, యాపిల్, అమెజాన్, నెట్‌ఫ్లిక్స్, గూగుల్) కంపెనీలు ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఇదే క్రమంలో విచ్ (డబ్ల్యూఐటీసీహెచ్) (విప్రో, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్) కంపెనీలు 2022లో లక్ష మందికిపైగా ఉద్యోగులను నియమించుకోవడాన్ని నిపుణులు ఉదాహరణగా చూపుతున్నారు.

వచ్చే ఏడాది కీలకం

ఈ ఏడాది భారత్‌లో టెక్ కంపెనీల్లో ఉద్యోగుల తొలగింపు లేకపోయినా.. వచ్చే ఏడాది (2023) అమెరికా దారిలోనే మన కంపెనీలు కూడా వ్యవహరించే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ దిశగా ఇప్పటికే సంకేతాలు ఇచ్చినట్లు పలు కంపెనీల హెచ్ఆర్ మేనేజర్లు 'సాక్షి'కి తెలిపారు. వచ్చే సంవత్సరం కీలకమని.. ఉద్యోగుల తొలగింపు అవసరం రాకుంటే సమీప భవిష్యత్‌లోనూ కోత ఉండకపోవచ్చని వివరించారు.

స్టార్టప్ కంపెనీల్లో సైతం..

కాగా గతంలో భారీ వేతన ప్యాకేజీలతో యువతను ఆకట్టుకున్న స్టార్టప్ కంపెనీలు సైతం ఈ ఏడాది ఒడిదుడుకులు ఎదుర్కొన్నాయి. ఎడ్యుకేషన్ టెక్నాలజీ, టెక్ రంగాలకు చెందిన 52 స్టార్టప్ కంపెనీలు 2022లో 17,604 మంది ఉద్యోగులను తొలగించినట్లు భారత్‌లో లేఆఫ్‌లను ట్రాక్ చేస్తున్న 'ఐఎన్‌సీ42' వెబ్‌సైట్ వెల్లడించింది. ఉద్యోగులను తొలగించిన కంపెనీల్లో.. బైజూస్, ఛార్జ్‌బీ, కార్స్24, లీడ్, ఓలా, మీషో, ఎంపీఎల్, ఇన్నోవేక్సర్, ఉడాన్, అన్‌అకాడమీ, వేదాంతు ఉన్నాయి. ఏడు ఎడ్‌టెక్ యూనికార్న్ కంపెనీల్లో నాలుగింటిలో 7,483 మంది ఉద్యోగులను తొలగించారు. అలాగే 15 స్టార్టప్ ఎడ్‌టెక్ కంపెనీల్లో ఐదు 2022లో మూతపడ్డాయి.

గోదావరి-కావేరి అనుసంధానమే అజెండా

- నదుల అనుసంధానంపై 13న ఢిల్లీలో ప్రత్యేక కమిటీ భేటీ
- కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి షెకావత్ అధ్యక్షతన సమావేశం
- రాష్ట్రాల జలవనరుల మంత్రులు, ఉన్నతాధికారులకు ఆహ్వానం



సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యతగా ప్రకటించిన గోదావరి-కృష్ణా-పెన్నా-కావేరి నదుల అనుసంధానంపై కసరత్తు ముమ్మరం చేసింది. ఈ విషయంలో రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం సాధించడమే అజెండాగా ఈ నెల 13న నదుల అనుసంధానంపై ఏర్పాటుచేసిన ప్రత్యేక కమిటీ సమావేశం కానుంది. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అధ్యక్షతన ఢిల్లీలో జరిగే ఈ సమావేశానికి హాజరుకావాలని అన్ని రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు, ఉన్నతాధికారులకు కేంద్రం ఆహ్వానం పంపింది. దేశంలో కెన్-బెట్వా, గోదావరి-కృష్ణా-పెన్నా-కావేరి, దామన్‌గంగా-పింజాల్, పర్-తాపి-నర్మదా నదుల అనుసంధానం పనులను ప్రాధాన్యతగా చేపట్టాలని జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ)ను కేంద్రం ఆదేశించింది. కెన్-బెట్వా నదుల అనుసంధానానికి ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు అంగీకరించి, అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడంతో రూ.44,605 కోట్ల అంచనా వ్యయంతో తొలి దశ పనులను ఎన్‌డబ్ల్యూడీఏ చేపట్టింది. ఈ వ్యయంలో 90శాతం కేంద్రం భరిస్తుంది. ఆయకట్టు ఆధారంగా దామాషా పద్ధతిలో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు పది శాతం ఖర్చును భరించనున్నాయి. కెన్-బెట్వా అనుసంధానం తొలి దశ పనులకు 2021-22 కేంద్ర బడ్జెట్‌లో రూ.4,300 కోట్లు కేటాయించడంతో ఎన్‌డబ్ల్యూడీఏ ఆ పనులను చేపట్టింది.

కుదరని ఏకాభిప్రాయం...

ఇచ్చంపల్లి నుంచి 247 టీఎంసీల గోదావరి జలాలను నాగార్జునసాగర్(కృష్ణా), సోమశిల(పెన్నా)లోకి ఎత్తిపోసి... అక్కడి నుంచి గ్రాండ్ ఆనకట్ట(కావేరి)కి తరలించేలా ఎన్‌డబ్ల్యూడీఏ తొలుత ప్రతిపాదించింది. ఆవిరి నష్టాలు పోనూ మూడు రాష్ట్రాలకు 80 టీఎంసీల చొప్పున ఇచ్చేలా ప్రతిపాదనలో పేర్కొంది. ఈ పనులకు రూ.85వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనావేసింది. ఈ ప్రతిపాదనపై ఛత్తీస్‌గఢ్, ఏపీ, తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశాయి. గోదావరిలో 75శాతం లభ్యత ఆధారంగా మిగులు జలాలే లేవని.. అలాంటప్పుడు నీటిని ఎలా తరలిస్తారని ఎన్‌డబ్ల్యూడీఏను నిలదీశాయి. దీంతో ఇచ్చంపల్లి నుంచి ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని 141 టీఎంసీల గోదావరి జలాలను తరలించి... ఏపీ, తెలంగాణ, కర్ణాటకకు 40 టీఎంసీల చొప్పున, కర్ణాటకకు 9.8 టీఎంసీలు ఇచ్చేలా ప్రత్యామ్నాయ ప్రతిపాదనను ఎన్‌డబ్ల్యూడీఏ చేసింది. ఈ పనులకు రూ.45 వేల కోట్ల వ్యయం అవుతుందని లెక్కకట్టింది. దీనిని కూడా బేసిన్ పరిధిలోని రాష్ట్రాలు వ్యతిరేకించాయి. గోదావరిలో నీటి లభ్యత శాస్త్రీయంగా తేల్చాకే గోదావరి-కావేరి అనుసంధానంపై సమగ్ర ప్రాజెక్టు నివేదికను రూపొందించాలని తేల్చి చెప్పాయి. ఈ నేపథ్యంలో 13న నదుల అనుసంధానంపై జరిగే ప్రత్యేక భేటీలో కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి షెకావత్ గోదావరి-కావేరి అనుసంధానంపై పరివాహక ప్రాంతంలోని రాష్ట్రాల మంత్రులు, అధికారులతో చర్చించనున్నారు.

గుజరాత్, మహారాష్ట్ర మధ్య ఏకాభిప్రాయం కోసం...

గుజరాత్, మహారాష్ట్రలో దుర్భిక్ష ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించడానికి ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించిన దామన్‌గంగా-పింజాల్ నదుల అనుసంధానం పనులు చేపట్టడానికి కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) సాంకేతిక సలహా మండలి ఇప్పటికే ఆమోదం తెలిపింది. ఈ అనుసంధానం ద్వారా మహారాష్ట్ర తన కోటాలోని 15.33 టీఎంసీలను గుజరాత్‌కు ఇస్తే.. దానికి ప్రతిఫలంగా పర్-తాపి-నర్మదా అనుసంధానంలో గుజరాత్ వాటాలోని 7.06 టీఎంసీలను మహారాష్ట్రకు ఇచ్చేలా ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించింది. దీనిపై గుజరాత్, మహారాష్ట్ర ప్రభుత్వాలు అసంతృప్తి వ్యక్తంచేశాయి. దీంతో గుజరాత్, మహారాష్ట్రల మధ్య ఏకాభిప్రాయం సాధించడంపై కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి షెకావత్ దృష్టి సారించనున్నారు.

పెరిగిన వేతనాలు చెల్లిస్తాం

ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నివాస్

సాక్షి, అమరావతి: ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ పెరిగిన వేతనాలు చెల్లించడానికి చర్యలు తీసుకున్నామని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, ఎన్‌హెచ్‌ఎం ఎండీ జె.నివాస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్, 104, 108 సర్వీసుల సిబ్బంది వేతనాలను ఆయా ప్రొవైడర్లే చెల్లిస్తారని, ఆమేరకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. వారికి చెల్లించాల్సిన ప్రోత్సాహకాలపై ఇటీవల జీవో నం.641 విడుదలైందని, సంబంధిత డీఎంహెచ్‌వోల నుంచి పనితీరు నివేదికలు అందిన వెంటనే అవికూడా చెల్లిస్తామని వెల్లడించారు. రెగ్యులర్ ఏఎన్‌ఎంలకు పెరిగిన వేతనాలను ఇప్పటికే ట్రెజరీ ద్వారా అందిస్తున్నామని, ద్వితీయ శ్రేణి ఏఎన్‌ఎంలకు ఈ వారం నుంచి ఎన్‌హెచ్‌ఎం నిధుల నుంచి వేతనాలు చెల్లిస్తామని పేర్కొన్నారు. ఎన్‌హెచ్‌ఎం సిబ్బందికి 22 శాతం వేతనాల పెంపునకు సంబంధించి ఇటీవలే ఆమోదం లభించిందని, వారికి నవంబర్ 22 నుంచి పెంచిన వేతనాలు అమలు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎం సిబ్బందికి ఆప్కాస్ ద్వారా ఆరోగ్య కార్డులు జారీ చేసిందని, ఇది అన్ని జిల్లాల్లోనూఅమలు చేస్తామని పేర్కొన్నారు.

మూతబడిన సుగర్ ఫ్యాక్టరీల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు

- ప్రభుత్వానికి మంత్రివర్గ సబ్ కమిటీ సిఫార్సు
- రాష్ట్ర మంత్రి అమర్‌నాథ్



ప్రయాణికురాలికి బోర్డింగ్ పాస్ అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్

చోడవరం(అనకాపల్లి జిల్లా)/గోపాలపట్నం(విశాఖ పశ్చిమ): రాష్ట్రంలో మూతబడిన సహకార చక్కెర కర్మాగారాలను ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రాలుగా మార్చాలని భావిస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. ఈ మేరకు మంత్రివర్గ సబ్ కమిటీ ప్రభుత్వానికి నివేదిక కూడా ఇచ్చిందన్నారు. ఆయన శనివారం అనకాపల్లి జిల్లా చోడవరంలో విలేకరులతో మాట్లాడుతూ విశాఖ, విజయనగరం జిల్లాల పరిధిలో నాలుగు మూతబడిన ఫ్యాక్టరీల్లో బెల్లం, ఇతర ఆహార ఉత్పత్తుల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేస్తే బాగుంటుందని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చామని చెప్పారు. రెగ్యులర్ క్రషింగ్ చేస్తూ నడుస్తున్న గోవాడ (చోడవరం) సుగర్ ఫ్యాక్టరీలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు సర్వం సిద్ధంచేశామని, అనుబంధ పరిశ్రమ ద్వారా ఆ ఫ్యాక్టరీ అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

ఆకాశ ఎయిర్‌లైన్స్‌ను ప్రారంభించిన మంత్రి

విశాఖ విమానాశ్రయంలో ఆకాశ ఎయిర్‌లైన్స్ విమాన సర్వీసులను శనివారం సాయంత్రం మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించి, తొలి బోర్డింగ్ పాస్‌ను ప్రయాణికురాలికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో విశాఖపట్నం మేజర్ నగరంగా రూపుదిద్దుకుంటున్న తరుణంలో మరిన్ని విమానాలు రావాలని, ఇందుకోసం ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. దేశంలో టాప్-10 నగరంగా ఉన్న విశాఖలో బేస్ డెస్టినేషన్ ఏర్పాటుచేయాలని కోరామన్నారు. బెంగళూరు నుంచి విశాఖకు రోజుకు రెండు సర్వీసులు నడపనున్నట్లు ఆకాశ ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు తెలిపారు. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎ.శ్రీనివాసరావు, విమానాశ్రయ సలహామండలి సభ్యులు కరణంరెడ్డి నర్సింగరావు, గంట్ల శ్రీనుబాబు, ఏఈ టూర్స్ అండ్ ట్రావెల్స్ రాష్ట్ర అధ్యక్షుడు విజయమోహన్ పాల్గొన్నారు.

విశాఖలో జీ-20 సమావేశాలు

విశాఖ వేదికగా జీ-20 సమావేశాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. ఈ సమావేశాలు 2023, ఫిబ్రవరి 2, 3, ఏప్రిల్ 24 తేదీల్లో నిర్వహిస్తారని వివరించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.